

'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 319

SUNDAY Special | ఆదివారం 9-2-2025

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సిరీస్ లక్ష్యంగా..

నేడు కటక్‌లో జరిగే మ్యాచ్‌లో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. ఈ పోరులో విజయం సాధిస్తే సిరీస్ భారత్ సొంతమవుతుంది. ఫిట్‌గా ఉన్న విరాట్ కోహ్లి బరిలోకి దిగుతాడు.

- వివరాలు 12లో



డిపోర్టేషన్.. పరేషాన్

అమెరికాలో చట్టాల ప్రకారం క్యాంపస్‌లోనే పార్ట్‌టైమ్ జాబ్స్ చేయాలి. అవి దొరకడం కష్టం. క్యాంపస్ బయట ఉద్యోగాలకు వెళితే డిపోర్టేషన్ ఖాయం. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

- వివరాలు 11లో

ఢిల్లీ కోట చిక్కింది!

27 ఏళ్ల తర్వాత హస్తినలో బీజేపీకి అధికారం

అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌పై ఘనవిజయం



ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత బీజేపీ కేంద్ర కార్యాలయం వద్ద మోదీ విజయోత్సాహం. చిత్రంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా

70	48	22
స్థానాలు	బీజేపీ	ఆప్

- ఓటమి పాలైన కేజ్రీవాల్, సిసోడియా
- కనాకష్టంగా గట్టెక్కిన సీఎం ఆతిశీ
- ముగ్గురు మినహా మంత్రులందరికీ ఓటమే
- వరుసగా మూడోసారీ సున్నా చుట్టిన కాంగ్రెస్
- అయినా ఆప్ కొంప ముంచిన హస్తం పార్టీ
- 14 చోట్ల బీజేపీ మెజారిటీ కంటే ఎక్కువ ఓట్లు
- ఆప్ ఓడింది కూడా సరిగ్గా 14 సీట్ల తేడాతోనే

న్యూఢిల్లీ: 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత హస్తిన అసెంబ్లీపై కాషాయ జెండా ఎగిరింది. దేశ రాజధానిలో పదేళ్లుగా కంట్లో నలుసుగా, కొరకరాని కొయ్యగా మారిన ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీ ఎట్టకేలకు చిత్తు చేసింది. ఆ పార్టీ చేతిలో రెండు వరుస పరాభవాల అనంతరం ముచ్చటగా మూడో ప్రయత్నంలో ఘనవిజయం సాధించింది. సరిగ్గా పోలింగ్‌కు ముందు మోదీ సర్కారు గురిచూసి సంధించిన ఆదాయపన్ను మినహాయింపు పరిమితి పెంపు అస్త్రం బీజేపీ పాలిట రామబాణంలా పని చేసింది. కేజ్రీవాల్‌పై అవినీతి మరకలు, పదేళ్ల పాలన నేపథ్యంలో ఆప్‌పై ప్రభుత్వ వ్యతిరేకత

మిగతా 2వ పేజీలో ▶



ఆపద నుంచి ప్రజలకు విముక్తి
- ఢిల్లీ ఎన్నికల్లో విజయం చరిత్రాత్మకం
- నగరంలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తాం... అవినీతి పరులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు: మోదీ

2 లో

బీజేపీ : ఐటీ ఊరటే... గేమ్ చేంజర్
ఆప్ : స్వయంకృతాపరాధమే
కాంగ్రెస్ : మూడోసారీ సున్నా

6 లో

ప్రజల నిర్ణయాన్ని ఎవరూ మార్చలేరు: కిషన్‌రెడ్డి
కేసీఆర్‌తో స్నేహం కేజ్రీ కొంపముంచింది: మహేశ్‌గౌడ్
బీజేపీని గెలిపించిన రాహుల్ గాంధీకి కంగ్రాట్స్: కేటీఆర్

- వివరాలు 2లో


ఢిల్లీలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపికను ఇస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

రూ.32,024 కోట్లు వెంటనే ఇవ్వండి

- వివిధ పథకాలు, గ్రాంట్ల కింద రాష్ట్రానికి ఈ నిధులు రావాల్సి ఉంది
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు భట్టి విక్రమార్క వినతిపత్రం
- ఏపీ నుంచి రావాల్సిన బకాయిలనూ ఇప్పించాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన రూ.32,024 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ నివాసంలో నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిధుల వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి వివిధ మార్గాల్లో రావాల్సిన నిధులకు సంబంధించి గతంలో రాసిన లేఖలను సైతం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం సహాయం చేసే పథకాలతోపాటు ప్రాయోజిత పథకాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గ్రాంటు, షెడ్యూల్ 9 క్రింద ఉన్న సంస్థల నిర్వహణ కోసం అయ్యే ఖర్చు, విద్యుత్ కొనుగోళ్ల కోసం ఖర్చు చేసిన నిధులు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఆర్టీసీ 'చలాన్' బకాయి రూ.కోటి



హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలో ప్రైవేట్ వాహనాలతో ఆర్టీసీ బస్సులు పోటీ పడుతున్నాయి. టీజీఎస్‌ఆర్టీసీ బస్సులపై ఏటా ట్రాఫిక్ పోలీసులు వేల సంఖ్యలో ఈ–చలాన్లు జారీ చేస్తున్నారు. 2022 నుంచి గత నెల 27 వరకు ఆర్టీసీ బస్సులకు 25,609 ఈ–చలాన్లు జారీ చేశారు. వీటికి సంబంధించి ఆర్టీసీ రూ.కోటికి పైగా చెల్లించాల్సి ఉంది.

- వివరాలు 14లో ▶

విద్యుత్ బకాయిలు రూ. 30,777 కోట్లు!



రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు విద్యుత్ వినియోగదారుల నుంచి రావాల్సిన విద్యుత్ బిల్లుల మొండి బకాయిలు గతేడాది సెప్టెంబర్ 30 నాటికి ఏకంగా రూ. 30,777 కోట్లకు ఎగబాకాయి. రూ. 50 వేలు, ఆపై కరెంట్ బిల్లులు బకాయిపడిన వినియోగదారుల నుంచి రావాల్సిన బకాయిలివి.

- వివరాలు 3లో ▶


అక్కడ కాన్పులు 'సాధారణం'!



ప్రైవేటుతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రసవాల కోసం కడుపు'కోత'లు (సిజేరియన్లు) పెరుగుతున్నప్పటికీ పలు మారుమూల గ్రామాల్లో మాత్రం నేటికీ సాధారణ ప్రసవాలే అత్యధికంగా జరుగుతున్నాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ శివారు గ్రామాల్లో నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

- వివరాలు 5లో ▶

ఇదండీ సంగతి



కాంగ్రెస్ నేతలు కనిపిస్తే.. జనం కొట్టేలా ఉన్నారు



- సెక్యూరిటీ లేకుండా సీఎం బయట తిరిగే అవకాశం లేదు: కేటీఆర్
- ఐరన్ లెగ్ సీఎం.. ఢిల్లీలో కాంగ్రెస్‌కు గుండు సున్నా తెచ్చారు
- రాహుల్ బీజేపీ, మోదీకి అతిపెద్ద కార్యకర్త
- మోసగాళ్లంతా బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోయి నికార్సు మిగిలింది

సాక్షి, హైదరాబాద్: ''రాష్ట్రం నలుమూలలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఆ పార్టీ నేతలు ప్రజల్లోకి వెళ్తే జనం కొట్టేలా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా పోలీసు సెక్యూరిటీ లేకుండా బయట తిరిగే అవకాశం లేదు. ప్రజలు తిడుతున్న తిట్లకు రేవంత్ కాకుండా మరొకరు ఆ స్థానంలో ఉంటే ఈ పాటికి ఆత్మహత్య చేసుకునే వారు..'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో శనివారం వేర్వేరుగా జరిగిన సిర్పూర్ కాగజ్‌నగర్,

మిగతా 3వ పేజీలో ▶

అన్ని సీట్లూ గెలవాలి

మూడు ఎమ్మెల్సీ స్థానాలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



- విజయమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాలి
- ప్రచారంలో కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై కిషన్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ ముఖ్యనేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం మూడు (రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్) సీట్లనూ గెలుచుకుని సత్తా చాటాలని బీజేపీ తీర్మానించింది. ఈ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఎన్నికల వ్యూహం, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకోసం వెంటనే రంగంలో దిగాలని నిర్ణయించింది. కేంద్రమంత్రులు, ఎంపీస్థాయి నేతలు మొదలుకుని కిందిస్థాయి కార్యకర్త వరకు పూర్తిగా ఈ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించి, అనుకున్న ఫలితాలను సాధించాలని రాష్ట్ర నాయకత్వం ఆదేశించింది. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను

మిగతా 3వ పేజీలో ▶

పంబన్ 2.0

తమిళనాడులో ప్రారంభానికి సిద్ధమైన కొత్త బ్రిడ్జి

- సముద్రంలో ఓడలు వస్తే నిలువుగా పైకి లేచే వంతెన
- దేశంలో మరో ఇంజనీరింగ్ అద్భుతం
- మండపం- రామేశ్వరాన్ని కలుపుతూ నిర్మాణం
- భారీ ఓడలు వెళ్లేందుకు వీలుగా నిర్మాణం
- త్వరలో జాతికి అంకితం చేయనున్న ప్రధాని

14 లో



సన్న.. అన్నిటికన్నా మిన్న!

రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 60 శాతం సన్న రకాల వరి సాగు

- సాధారణంగా ఖరీఫ్‌లో 50 శాతం వరకు.. యాసంగిలో 10–15 శాతమే సన్నాలు... నీటి లభ్యత పెరగడం, రూ.500 బోనస్ నేపథ్యంలో ఈసారి గణనీయంగా పెరుగుదల
- అన్ని రకాల వరి కలిపి ఇప్పటికే 49 లక్షల ఎకరాల్లో సాగు.. మరో 15 లక్షల ఎకరాలు పెరిగే చాన్స్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సన్న రకాల వరి సాగు రికార్డు సృష్టిస్తోంది. యాసంగిలో సాగవుతున్న వరిలో 60శాతానికిపైగా సన్న రకాలే ఉన్నట్టు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. అనుకూలమైన వాతావరణం, నీళ్ల అందుబాటులో ఉండట, సన్నాలకు ప్రభుత్వం బోనస్ ఇస్తుండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నాల సేద్యం జోరందుకుందని వెల్లడించాయి. ఫిబ్రవరి తొలివారానికల్లా రాష్ట్రంలో 49లక్షల ఎకరాలకుపైగా వరి సాగు మొదలైందని... ఇందులో 60శాతానికిపైగా అంటే 30 లక్షల ఎకరాల మేర సన్న రకాలే సాగవుతున్నట్టు అంచనా వేశాయి. రాష్ట్రంలో సాధారణంగా ఖరీఫ్‌లో సాగయ్యే వరిలో 50 శాతం వరకు, రబీలో 10–15 శాతం వరకు సన్న రకాలు ఉంటాయి. ఇప్పుడు రికార్డు స్థాయిలో, అదీ యాసంగిలో 60శాతం దాకా సన్నాలే సాగవడం గమనార్హం.

ఉత్తర తెలంగాణలో గణనీయంగా..

కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాలతోపాటు మెదక్, నిజామాబాద్‌లలోని కొన్ని ప్రాంతాల్లో యాసంగిలో సన్నాల సాగు చాలా ఏళ్లుగా

మిగతా 2వ పేజీలో ▶

కల్యాణం.. క'మనీ'యం!

వివాహ వేడుకల వ్యయాల్లో వెనక్కి తగ్గని జనం

రూ.32 లక్షలు దాటిపోయిన సగటు పెళ్లిళ్ల ఖర్చు

- ఏటా 14 శాతం మేర పెరిగిపోతున్న తీరు
- రూ.10.9 లక్షల కోట్లకు చేరిన వెడ్డింగ్ పరిశ్రమ
- దేశంలో ఫుడ్–గ్రోసరీ ఇండస్ట్రీ తర్వాత ఇదే అత్యధికం
- ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ జెఫరీస్ నివేదికలో వెల్లడి

14 లో

రుణాలూ బంగారంలా పెరిగాయ్!


అప్పల కోసం పుత్తడి తాకట్టు వైపు జనం మొగ్గు

- సురక్షిత సాధనంగా మారిన పసిడి
- బంగారంపై తీసుకునే రుణాల్లో దక్షిణాది రాష్ట్రాలదే సింహభాగం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నాటికి రూ.1,72,581 కోట్ల లోన్స్
- ఏడాదిలో 71.3 శాతం వృద్ధి చెందిన బంగారం రుణ మార్కెట్

బంగారం ధర ఒక్కటే కాదు.. బ్యాంకుల్లో పసిడి తాకట్టు రుణాలూ అదే స్థాయిలో పెరిగిపోతున్నాయి. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గణాంకాల ప్రకారం.. దేశవ్యాప్తంగా 2024 ఏప్రిల్‌లో రూ.1,01,552 కోట్లుగా ఉన్న బంగారు రుణాలు.. డిసెంబర్ నాటికి రూ.1,72,581 కోట్లకు చేరాయి.

5 లో







ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన ఆప్ కీలక నేతలు

అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సౌరభ్ భరద్వాజ్, సత్యేంద్ర జైన్, సోమ్‌నాథ్ భారతి (పైవరుస), దుర్గేశ్ పాఠక్, రాఖీ బిర్లా, ప్రీతి తోమర్, జితేందర్‌సింగ్ షంటీ, అవధ్ ఓఝా (ఎడమ నుంచి కుడి వరుసలో)

ఢిల్లీ కోట చిక్కింది!

▶ మొదటి పేజీ తరువాయి

అందుకు తోడయ్యాయి. దాంతో శనివారం వెల్లడైన ఫలితాల్లో బీజేపీ ఏకంగా మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. 70 అసెంబ్లీ స్థానాలకు గాను 48 స్థానాలను బీజేపీ కైవసం చేసుకోగా ఆప్ 22 సీట్లకు పరిమితమైంది. మెజారిటీ మార్కుకు 14 స్థానాల దూరంలో నిలిచి తన పురిటిగడ్డ అయిన ఢిల్లీలో తొలిసారి ఓటమిని రుచిచూసింది. కాంగ్రెస్‌తో పొత్తు వద్దనుకోవడం ఆప్ భాగ్యరేఖలనే పూర్తిగా తలకిందులు చేసింది. ఎందుకంటే 14 అసెంబ్లీ స్థానాల్లో ఆప్‌పై బీజేపీ అభ్యర్థులు సాధించిన మెజారిటీ కంటే కాంగ్రెస్ అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు రావడం విశేషం. స్వయానా ఆప్ సారథి కేజ్రీవాల్ కూడా న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానంలో పరాజయం పాలయ్యారు. ఆయన పరాభవానికీ కాంగ్రెసే కారణంగా నిలిచింది. అక్కడ బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ మెజారిటీ కంటే కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్‌కు ఎక్కువ ఓట్లొచ్చాయి. అలా కాంగ్రెస్‌తో కటీఫ్ నిర్ణయం కేజ్రీవాల్‌తో పాటు మొత్తంగా ఆప్ పుట్టినే ముంచేసింది. బీజేపీ హవాలో ఆప్ నేత, సీఎం ఆతిషి కనాకష్టంగా గట్టెక్కగా ముగ్గురు మినహా ఆప్ మంత్రులంతా ఓటమి బాట పట్టారు. ఆప్ దిగ్గజ నేత, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా కూడా ఓటమి చవిచూశారు. అయితే ఆప్‌కు కోలుకోలేని షాకివ్వడం మినహా కాంగ్రెస్ కూడా బావుకున్నదేమీ లేదు. ఢిల్లీలో వరుసగా మూడోసారి కూడా ఖాతాయే తెరవలేక చెత్త హ్యాట్రిక్‌ను మూటగట్టుకుంది. ఆ పార్టీ అభ్యర్థులు చాలాచోట్ల ఏకంగా డిపాజిట్లే కోల్పోయారు! బీజేపీకి 45.56 శాతం ఓట్లు రాగా ఆప్‌కు 43.57 శాతం వచ్చాయి. కాంగ్రెస్ 6.34 శాతం ఓట్లతో సరిపెట్టుకుంది. 2020 ఎన్నికల్లో ఆప్ 53.57 శాతం ఓట్లతో 62 సీట్లు కైవసం చేసుకోగా బీజేపీ 38.51 శాతం ఓట్లతో కేవలం 8 సీట్లతో సరిపెట్టుకుంది. 2015లో ఆప్ ఏకంగా 67, బీజేపీకి కేవలం 3 సీట్లొచ్చాయి. 2013లో ఆప్ తన తొలి ఎన్నికల్లోనే ఢిల్లీ అసెంబ్లీలో 28 సీట్లు నెగ్గి సత్తా చాటింది. బీజేపీ ఢిల్లీలో చివరగా 1993 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. కానీ ఐదేళ్లలోనే ముగ్గురు సీఎంలను మార్చి అప్రతిష్ట మూటగట్టుకుంది. దాంతో 1998లో కాంగ్రెస్ చేతిలో పరాజయం పాలైంది. అప్పట్నుంచి 2013 దాకా 15 ఏళ్లపాటు షీలా దీక్షిత్ సారథ్యంలో హస్తినలో సాగిన కాంగ్రెస్ హవాకు ఆప్ ఆవిర్భావంతో తెర పడింది.



న్యూఢిల్లీ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై పోటీ చేసి గెలిచిన పర్వేశ్ వర్మ విజయోత్సవం

పర్వేశే సీఎం!

బీజేపీ ఘనవిజయం నేపథ్యంలో ఢిల్లీకి కాబోయే సీఎం ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. అయితే కేజ్రీవాల్‌ను మట్టికరిపించిన జెయింట్ కిల్లర్‌గా మారిన పర్వేష్‌సింగ్ పేరే ఈ జాబితాలో ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన తండ్రి సాహెబ్‌సింగ్ వర్మ కూడా 1993–98 మధ్య ఢిల్లీ సీఎంగా చేయడం విశేషం. సీఎం ఎవరన్నది పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని పర్వేష్‌తో పాటు ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ కూడా చెప్పుకొచ్చారు.

ఆద్యంతం బీజేపీదే పైచేయి

అటు బీజేపీ, ఇటు ఆప్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోరు ఈసారి ఆద్యంతం హోరాహోరీగా సాగింది. ఫిబ్రవరి 5న పోలింగ్ జరిగింది. శనివారం ఫలితాలు వెల్లడయ్యాయి. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. కాసేపటికే ట్రెండ్స్ వెలువడ్డాయి. వాటిలో మొదటినుంచీ బీజేపీ హవాయే కొనసాగుతూ వచ్చింది. అడపాదడపా ఒకట్రెండు రౌండ్లలో మినహాయించి కేజ్రీవాల్ మొదటినుంచీ వెనుకంజలోనే కొనసాగుతూ వచ్చారు. మధ్యలో రెండు పార్టీల మధ్య అంతరం తగ్గినట్టు కన్పించినా చూస్తుండగానే బీజేపీ దూసుకెళ్లింది. దాంతో ఆ పార్టీ కార్యాలయంలో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. నేతలు, కార్యకర్తలు, అభిమానులు బాణసంచా పేలుళ్ల, వాయిద్యాల హోరుతో హోరెత్తించారు. ఆప్, కాంగ్రెస్ ప్రధాన కార్యాలయాలు బోసిపోయి కన్పించాయి. ఇటీవలే హరియాణాతో పాటు కీలకమైన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయంతో దూకుడు మీదున్న బీజేపీ అదే ఊపులో ఇప్పుడు ఢిల్లీనీ చేజిక్కించుకుంది. దాంతో దేశవ్యాప్తంగా కాషాయశ్రేణులు సంబరాల్లో మునిగిపోగా ఆప్, కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నీ డీలాపడ్డాయి. తాజా ఫలితాలతో విపక్ష ఇండియా కూటమి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. బీజేపీ విజయాన్ని చరిత్రాత్మకంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించగా ప్రజాతీర్పును అంగీకరిస్తున్నామని, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని కేజ్రీవాల్ ప్రకటించారు. గెలుపోటములతో నిమిత్తం లేకుండా ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని ఆతిషి పేర్కొన్నారు. ఈ ఎన్నికలు ఆప్‌కే అగ్నిపరీక్షగా నిలిచాయని తప్ప తమకు కాదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వద్రా చెప్పుకొచ్చారు.

ఎగ్జిట్ పోల్స్ నిజమని తేలింది!

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆప్‌పై బీజేపీ తిరుగులేని ఆధిక్యం సాధించనుందంటూ అంచనా వేసిన ఎగ్జిట్ పోల్స్ చాలా వరకు నిజమయ్యాయి. అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు గాను బీజేపీ 48, ఆప్ 22 సీట్లు గెలుచుకోగా ఖాతా తెరవడంలో కాంగ్రెస్ మరోసారి విఫలమైంది. ముఖ్యమైన ఎగ్జిట్ పోల్స్‌లో, యాక్సిస్ మై ఇండియా అత్యంత దగ్గర్లోకి ఫలితాలను అంచనా వేసింది. ఈ సంస్థ బీజేపీ 45–55 మధ్య సీట్లను, ఆప్‌కు 15–25 సీట్లు వస్తాయని తెలిపింది. ఆ తర్వాత టుడేస్ చాణక్య బీజేపీకి 45–57 సీట్లు, ఆప్‌కు 13–25 సీట్లను కట్టబెట్టింది. పీపుల్స్ ఇన్‌సైట్ ఎగ్జిట్ పోల్ మాత్రం బీజేపీ, మిత్ర పక్షాల ఖాతాలో 40–44 సీట్లను, ఆప్‌కు 25–29 సీట్లను వేసింది. పి–మార్క్ ఎగ్జిట్ పోల్ బీజేపీకి 39–49 స్థానాలు, ఆప్‌కు 21–31 సీట్లు వస్తాయంది. జేవీసీ ఎగ్జిట్ పోల్ బీజేపీ 39 నుంచి 45 మధ్య, ఆప్‌నకు 22 నుంచి 31 వరకు సీట్లు రావొచ్చని తెలిపింది. చాణక్య స్ట్రాటజీస్ కూడా బీజేపీకి 39–44, ఆప్‌కు 25–28 వరకు సీట్లు రావొచ్చంది. మరికొన్ని సంస్థలు బీజేపీ ఇంకా ఎక్కువ సీట్లే సాధిస్తాయని జోస్యం చెప్పాయి. పీపుల్స్ పల్స్ అయితే బీజేపీకి ఏకంగా 51–60 సీట్లు దక్కుతాయని తెలిపింది. అయితే, రెండు సర్వేలు మాత్రం ఆప్‌దే మళ్లీ అధికారమని చెప్పాయి. వీ ప్రిసైడ్ సంస్థ ఆప్‌నకు 46–52 సీట్లు, బీజేపీకి 18–23 సీట్లు మాత్రమే వస్తాయని తెలిపింది. మైండ్ బ్రింక్ మీడియా కూడా ఆప్‌కు 44–49 సీట్లొస్తాయని, బీజేపీకి 21–25, కాంగ్రెస్‌కు ఒక సీటు వస్తాయని అంచనా వేసింది.

క్లుప్తంగా...

కేరళ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం రాత్రి కేరళకు వెళ్లారు. ఆదివారం తిరువనంతపురంలో జరగనున్న 'మాతృభూమి' ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ ఇన్ కేరళ' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌దే నైతిక విజయం

ఆప్ తెలంగాణ కన్వీనర్ సుధాకర్

లిబర్టీ (హైదరాబాద్): ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీతో పాటు అధికారులు ఆప్‌ను అష్టదిగ్బంధం చేసినా 43 శాతం ఓట్లు సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీదే నైతిక విజయం అని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ పేర్కొన్నారు. ఢిల్లీ ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, తాము ఓటమి చెందినప్పటికీ దేశ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు. ఆప్ అమలు చేసిన విద్య, వైద్యం, విద్యుత్ విధానాలను బీజేపీ బేషరతుగా అమలు చేయాలని సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అక్రమాలు, ఎన్నికల సమయంలో అవకతవకలు, నిరంకుశ విధానాలపై ఆప్ బీజేపీపై యుద్ధం కొనసాగిస్తుందని తెలిపారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల కోసం భారత్‌తో పాటు ప్రపంచదేశాలన్నీ ఎదురు చూశాయన్నారు. 2029లో ప్రధానమంత్రి స్థానం లక్ష్యంగా ఆప్ పార్టీ పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బుర్రా రాములుగౌడ్, షరీఫ్, రహమాన్, కొడంగల్ శ్రీనివాస్, అజీమ్ బైగ్, సురేశ్, ఇస్మాయిల్, జూహి, అహసన్ తదితరులు పాల్గొన్నారు.

ఆపద నుంచి ప్రజలకు విముక్తి

ఢిల్లీ ఎన్నికల్లో విజయం చరిత్రాత్మకం
- నగరంలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- అవినీతిపరులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- ఆప్ సర్కారు పాపాలపై దర్యాప్తు జరిపిస్తాం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధారణ విజయం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. దశాబ్ద కాలం తర్వాత ఆప్‌ద(ఆపద) నుంచి ఢిల్లీ ప్రజలకు ఎట్టకేలకు విముక్తి లభించిందని అన్నారు. బీజేపీని గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. దేశ రాజధానిలో డబుల్ ఇంజన్ సర్కారు పాలనలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించబోతున్నామని వెల్లడించారు. శనివారం ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ప్రధాని మోదీ బీజేపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆనందం పంచుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగించారు. అవినీతిపరులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వ అవినీతి, ఆర్థిక అవకతవకలపై 'కాగ్' ఇచ్చిన నివేదికను బీజేపీ ప్రభుత్వం తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెడుతుందని చెప్పారు. అన్నిరకాల అవినీతి వ్యవహారాలపై కచ్చితంగా దర్యాప్తు చేస్తుందని పేర్కొన్నారు. జనం సొమ్మును లూటీ చేసినవారి నుంచి తిరిగి కక్కిస్తామని, ఇది మోదీ గ్యారంటీ అని తేల్చిచెప్పారు. ఢిల్లీలో ఇప్పటిదాకా పాలన వెలగబెట్టినవారు పచ్చి అవినీతిపరులు అని మండిపడ్డారు. షార్ట్–కట్ రాజకీయాలు చేసేవారికి ప్రజలు షార్ట్–సర్క్యూట్‌తో బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు.

ప్రజల రుణం తీర్చుకుంటాం

ధూర్త, మూర్ఖ రాజకీయాలు మన దేశానికి అవసరం లేదని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఆప్, కాంగ్రెస్‌లపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల ఎజెండాను చోరీ చేసిందన్నారు. హిందుత్వ వేషంతో ఓట్లు రావడం లేదు కాబట్టి మిత్రపక్షాల ఓట్లను కొల్లగొట్టాలని చూస్తోందని చెప్పారు. కాంగ్రెస్ లేవనెత్తుతున్న కులగణన అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. 'మోదీ కీ గ్యారంటీ' పట్ల ఢిల్లీ ప్రజలు సంపూర్ణ విశ్వాసం చూపించారని, నగరాన్ని అభివృద్ధి చేసి వారి రుణం తీర్చుకుంటామని వివరించారు. యమునా నదిలో శుభ్రం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. మన ప్రయత్నాలను యమున మాత తప్పకుండా ఆశీర్వదిస్తుందని అన్నారు. ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. ఢిల్లీని సరికొత్త ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ధూర్త, మూర్ఖ రాజకీయాలు చేసే దుష్టులు దేశ రాజకీయాలను కబ్జా చేయకుండా ఉండాలంటే లక్ష మంది యువత రాజకీయ రంగంలోకి రావాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లో రాకపోతే దేశానికి చాలా నష్టం జరుగుతుందన్నారు. దేశానికి ఇప్పుడు రాజకీయ పరివర్తన అవసరమని తెలిపారు. 21వ శతాబ్దంలో వికసిత్ భారత్‌కు నూతన జీవన శక్తి, నూతన ఆలోచనలు, నూతన ఉత్సాహం అవసరమని పేర్కొన్నారు. రాజ్యాంగంపై యుద్ధం చేస్తున్నామంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ దేశ ప్రయోజనాల కోసం కాకుండా అర్బన్ నక్సలైట్ల కోసం రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. దేశ ప్రయోజనాలను బలిపెట్టడంలో ఆమ్ ఆద్మీ పార్టీ సైతం ముందంజలో ఉందన్నారు. రాజకీయాల్లో మార్పు తెస్తామంటూ అధికారంలోకి వచ్చి నీచ రాజకీయాలు చేసేవారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు అభివృద్ధి, సుపరిపాలనతో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. ఢిల్లీలో డబుల్ ఇంజన్ ప్రభుత్వ పాలనలో రెండు రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తామన్నారు. ఇదొక చరిత్రాత్మక విజయమని అభివర్ణించారు.

ఢిల్లీ ప్రజలకు సెల్యూట్

ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తంచేశారు. ప్రజాశక్తికి తిరుగులేదని ఉద్ఘాటించారు. ఈ మేరకు ఆయన శనివారం ఎన్నికల ఫలితాల అనంతరం 'ఎక్స్'లో పోస్టుచేశారు. అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. చరిత్రాత్మక విజయం అందించినందుకు ఢిల్లీ ప్రజలకు సెల్యూట్ అని పేర్కొన్నారు. ఢిల్లీ సమగ్రాభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి కృషి చేస్తామని వెల్లడించారు. ఇది తమ గ్యారంటీ అని స్పష్టంచేశారు. ఎన్నికల్లో విజయం కోసం శ్రమించిన బీజేపీ నేతలు, కార్యకర్తలకు మోదీ ధన్యవాదాలు తెలిపారు.

గ్రేటర్ కమల దళంలో ఆనంద హేల!

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం నగరంలో సంబురాలు చేసుకున్నారు. పార్టీ కార్యాలయంతో పాటు, వివిధ వార్డుల్లో కేడర్‌తో కలిసి నృత్యాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు మాట్లాడుతూ.. సుమారు రెండున్నర దశాబ్దాల అనంతరం ఢిల్లీలో తిరిగి అధికారంలోకి రావడం అత్యంత శుభ పరిణామం అన్నారు. మోదీపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, సరూర్‌నగర్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గోవర్ధన్, కొత్తపేట్ కార్పొరేటర్ పవన్, హైదరాబాద్ సెంట్రల్ బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సన్న.. అన్నిటికన్నా మిన్న!

▶ మొదటి పేజీ తరువాయి

నిలిచిపోయింది. ఈసారి ప్రభుత్వం గుర్తించిన 33రకాల సన్న ధాన్యం వంగడాల్లో.. తమ ప్రాంతానికి అనుకూలంగా ఉన్న వాటిని ఈ జిల్లాల్లో సాగు చేస్తున్నారు. ఉత్తర తెలంగాణలో బీపీటీ–5204, కెఎన్ఎం–1638, ఎంటీయూ–1224 తోపాటు జగిత్యాలలోని పొలాస పరిశోధన కేంద్రం ఉత్పత్తి చేసిన వంగడాలను ఎక్కువగా వేసినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. నిజామాబాద్‌లో తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048)ను సాగు చేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో యాసంగి సాధారణ సాగు విస్తీర్ణం కన్నా.. ఈసారి ఒక్క వరి పంటే అధికంగా సాగవుతోందని తెలిపారు. వరంగల్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలతోపాటు మరి కొన్ని ప్రాంతాల్లో సాగు మందకొడిగా ఉందని పేర్కొన్నారు.

మొత్తం వరి సాగులోనూ రికార్డు!

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం.. యాసంగిలో అన్ని రకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం 63.54 లక్షల ఎకరాలు. అందులో వరి విస్తీర్ణం 47.27 లక్షల వరకు ఉంటుంది. ఈసారి పరిస్థితులు అనుకూలించడంతో.. అన్ని పంటలు కలిపి మొత్తం సాగు 79.40 లక్షల ఎకరాలకు చేరుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో వరి ఒక్కటే 65 లక్షల ఎకరాల వరకు ఉంటుందని, యాసంగికి సంబంధించి ఇది రికార్డు అని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములకే 'రైతు భరోసా'ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో.. కొన్నేళ్లుగా పంటలు వేయని బీడు భూముల్లోనూ రైతులు సాగు చేపట్టినట్టు వివరిస్తున్నారు. గత యాసంగిలో 67.83 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుకాగా.. అందులో వరి 52 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈసారి అంతకన్నా 10- 13 లక్షల ఎకరాల్లో అధికంగా సాగవుతుందని భావిస్తున్నారు. ఇక రాష్ట్రంలో ఖరీఫ్‌కు సంబంధించి 23 లక్షల టన్నుల సన్న ధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్‌గా చెల్లించింది. ఈ మేరకు రైతులకు రూ.1,154 కోట్లను రైతుల ఖాతాల్లో వేసింది. దీనితోపాటు సీఎం, మంత్రులు కూడా సన్నాల సాగు చేపట్టాలని విజ్ఞప్తి చేయడం ఫలితమిస్తోందని వ్యవసాయవర్గాలు చెబుతున్నాయి.

మొక్కజొన్న, వేరుశనగ పంటలు కూడా..: యాసంగిలో 7.18 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు కావొచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. ఇప్పటికే 6.94 లక్షల ఎకరాల్లో సాగు మొదలైంది. మరో రెండు లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. నిర్మల్, వరంగల్ రూరల్, ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్ అర్బన్, మహబూబాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మొక్కజొన్న ఎక్కువగా వేశారు. వేరుశనగ కూడా 2.57 లక్షల ఎకరాల అంచనాకుగాను.. ఇప్పటికే 2.32 లక్షల ఎకరాల్లో సాగు మొదలైంది. జొన్న, కంది పంటల సాగు కూడా పెరిగింది.

నీళ్లు అందుబాటులో ఉండటంతో..

రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో నీళ్లు అందుబాటులో ఉండటంతోనూ యాసంగి సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమని వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి. ఉత్తర తెలంగాణలో ప్రధాన చెరువుల కింద పొలాలన్నింటికీ యాసంగి వరి సాగుకు సరిపడా నీళ్లు ఉన్నాయని.. భూగర్భ జలాలు కూడా ఆశాజనకంగానే ఉండటం వరిసాగు పెరగడానికి కారణమని పేర్కొంటున్నాయి.

ప్రజల నిర్ణయాన్ని ఎవరూ మార్చలేరు

రాహుల్, కేజ్రీవాల్ ఒకే తాను ముక్కలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రజలు ఒకసారి నిర్ణయం తీసుకుంటే, అది కేజ్రీవాల్ అయినా, రాహుల్ గాంధీ, కేసీఆర్ అయినా.. ఎవరూ దానిని మార్చలేరని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సరైన సమయంలో ప్రజలు సరైన తీర్పు ఇస్తారని ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో మరోసారి నిరూపితమైందన్నారు. కాంగ్రెస్, ఆప్ పార్టీలు.. ఒకే నాణేనికి బొమ్మా, బొరుసులాంటివని, రాహుల్, కేజ్రీవాల్ ఒకే తానుముక్కలేనని అన్నారు. ఢిల్లీ అభివృద్ధిలో కేజ్రీవాల్ ప్రభుత్వం విఫలమైందని, దోపిడీ పాలనను కొనసాగించిన ఆప్ సర్కార్‌ను ప్రజలు ఎన్నికల్లో తిరస్కరించారని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో, జైల్లో నుంచే పరిపాలన చేసిన ఏకైక సీఎం కేజ్రీవాల్ అని ఎద్దేవా చేశారు. కేజ్రీవాల్ లిక్కర్ స్కామ్‌లో జైలుకెళ్లి, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారన్నారు. శనివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లోనూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ డబుల్ హ్యాట్రిక్ ఓటమిని మూటగట్టుకుందన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వ బాధ్యతలు చేపట్టాక కాంగ్రెస్ ఓటములను కంప్యూటర్ ద్వారా లెక్కపెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. రాహుల్ నాయకత్వంపై కాంగ్రెస్ కార్యకర్తలకే విశ్వాసం లేదని, ఇక దేశ ప్రజలు ఎలా విశ్వసిస్తారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసిన మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ 16 సీట్లే గెలుచుకోగా, ఢిల్లీ ఎన్నికల్లో గుండుసున్నా వచ్చిందన్నారు.

చీపురుతో చీ కొట్టారు.. చేతిని చిదిమేశారు.. బీజేపీని ఆదరించారు

ఢిల్లీ ఫలితాలపై 'ఎక్స్' వేదికగా కేంద్రమంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: అక్రమ దందాలకు పాల్పడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలు చీపురుతో ఊడ్చిపారేశారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. 'చీపురుతో చీ కొట్టారు. చేతిని చిదిమేశారు. కమలాన్ని వికసింపజేశారు. ఢిల్లీ అయినా గల్లీ అయినా ప్రధాని మోదీతోనే మేమంతా అని చాటిచెప్పిన ప్రజలకు కృతజ్ఞతలు'అని ఢిల్లీ ఫలితాలపై 'ఎక్స్'వేదికగా స్పందించారు. 'ఆప్‌ను ఊడ్చిపారేశాం. ఢిల్లీ మాదే. ప్రజల పక్షాన ప్రశ్నించే పార్టీ బీజేపీ. ఉద్యోగులు, పట్టభద్రులు, మేధావుల పక్షాన పోరాడేది బీజేపీనే. ఢిల్లీలో పట్టభద్రులు, మేధావులు ఏ విధంగా ఆదరించారో రాష్ట్రంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు బీజేపీకి ఓటేయండి'అని సంజయ్ విజ్ఞప్తిచేశారు. తెలంగాణ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం రాబోతోందని పేర్కొన్నారు.

బీజేపీని గెలిపించిన రాహుల్‌కు కంగ్రాట్స్!

కేటీఆర్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటూ గెలవకపోవడాన్ని ఎద్దేవా చేస్తూ కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''బీజేపీని గెలిపించినందుకు రాహుల్ గాంధీకి కంగ్రాట్స్''అంటూ వ్యంగ్యాస్త్రం సంధించారు.

తెలంగాణలో బీజేపీని గెలిపించిన మీకు అభినందనలు

కేటీఆర్‌కు ట్వీట్‌లో చురకలంటించిన మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సున్నా సీట్లు సాధించడంతోపాటు.. తెలంగాణలో బీజేపీకి ఎనిమిది సీట్లు బహుమతిగా ఇచ్చిన మీకు అభినందనలు'అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు.. రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చురకలంటించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్కసీటు కూడా రాకపోవడంపై ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీపై వ్యంగ్యాస్త్రాలతో కేటీఆర్ ట్వీట్ చేశారు. ఇందుకు కౌంటర్‌గా శనివారం కోమటిరెడ్డి మరో ట్వీట్ చేశారు. 'మేం కాంగ్రెస్ పార్టీ యోధులం. మేము ఎప్పుడూ పోరాటం వదలం. మేము తెలంగాణలో మాదిరిగానే మళ్లీ పుంజుకుంటాం. పార్లమెంటు ఎన్నికల్లో మీ సొంత పార్టీకి సున్నా సీట్లు అందించడం, తెలంగాణలో బీజేపీకి 8 సీట్లు బహుమతిగా ఇవ్వడం ద్వారా మీరు సాధించిన అద్భుతమైన విజయానికి అభినందనలు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలకు ఎవరైనా అర్హులున్నారంటే అది మీరే. అందుకు మీకు అభినందనలు'అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

కేసీఆర్‌తో స్నేహం కేజ్రీవాల్ కొంపముంచింది

ఢిల్లీలో ఆప్ ఓటమిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



సాక్షి, న్యూఢిల్లీ: కేసీఆర్‌తో స్నేహం కేజ్రీవాల్ కొంపముంచిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని శత్రువుగా భావించడంతోపాటు స్వయంకృతాపరాధాలు కూడా ఆప్ ఓటమికి కారణాలని పేర్కొన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి రెండు అంశాలే కారణమని శనివారం ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 'ఒకటి.. కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పార్టీతో కేజ్రీవాల్ స్నేహం ఆయన కొంప ముంచిందనే చెప్పాలి. కేసీఆర్ కుమార్తె కవితతో కేజ్రీ అండ్ కో లిక్కర్ వ్యాపారం ఆరోపణలు ఆయన పతనానికి పునాదులు వేశాయి. ఏ అవినీతిరహిత నినాదంతో కేజ్రీవాల్ దేశస్థాయిలో ఇమేజ్ తెచ్చుకున్నారో దానికి తూట్లు పొడిచింది లిక్కర్ స్కామ్. అవినీతికి కేజ్రీవాల్ అతీతుడు కాదన్న అభిప్రాయం ప్రజల్లో కలగడానికి కేసీఆర్ ఫ్యామిలీ కారణమైంది. రెండు దఫాలు ఢిల్లీని ఏలిన కేజ్రీవాల్ పాలనలో లిక్కర్ స్కామ్ తప్ప మరో అవినీతి ఆరోపణ లేదు. ఇక రెండో అంశం.. కాంగ్రెస్ పార్టీని శత్రువుగా పరిగణించడం తాజా ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ పతనానికి మరో కారణం. కాంగ్రెస్‌తో పొత్తు వద్దన్న ఆయన నిర్ణయం బీజేపీ నెత్తిన పాలు పోసిందనే చెప్పాలి. కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీ చేస్తే బీజేపీ వ్యతిరేక ఓటు చీలి కాషాయ పార్టీకి మేలు జరుగుతుందన్న చిన్న లాజిక్‌ను కేజ్రీవాల్ తెలిసి మిస్సయ్యారా? లేదా అవగాహనతో చేశారా అన్నది అర్థం కాని విషయం' అని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో బీజేపీకి చోటు లేదన్నారు. తెలంగాణ బీజేపీ నేతలు పగటికలలు మానుకోవాలని హితవు పలికారు.

ప్రజల చేతిలో కేజ్రీవాల్‌కు చావుదెబ్బ

బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ ప్రజల చేతిలో కేజ్రీవాల్ చావు దెబ్బ తిన్నారని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. 'ఢిల్లీలో కేజ్రీవాల్ దుర్మార్గ పాలన సాగింది. ఆ దుర్గంధం ఎలా ఉందో ఎన్నికల ప్రచారం సందర్భంగా చూశా. పేదల ఇళ్ల పక్కన మురికి చూస్తే మనం అన్నం కూడా తినలేం. పేదల బతుకుల గురించి కేజ్రీవాల్ పట్టించుకోలేదు. ఆయన మాటలతో కాలం గడిపారు. కేజ్రీవాల్‌ను గెలిపించినందుకు చెంపలు వేసుకుంటున్నాం. మళ్లీ ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేయం అని కుండబద్దలు కొట్టినట్లు ముందుగానే అక్కడి ప్రజలు చెప్పారు'అని పేర్కొన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో తెలంగాణ గడ్డమీద కాషాయ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. 'తెలంగాణలో పదేళ్ల కేసీఆర్ పాలన చూసి ప్రజలు ఓడగొట్టారు. కేసీఆర్‌పై కోపంతో కాంగ్రెస్‌ను గెలిపిస్తే, ఆ పార్టీ వాలకం ప్రజలకు అర్థమైంది. అతితక్కువ కాలంలో ప్రజలతో ఛీ కొట్టించుకున్న వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి'అని విరుచుకుపడ్డారు. ఢిల్లీ, మహారాష్ట్ర ఫలితాలే రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ కూడా రిపీట్ అవుతాయనే విశ్వాసాన్ని ఈటల వ్యక్తంచేశారు.

క్లుప్తంగా...

విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా ఉడుముల బాలా



రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): వరంగల్ బిషప్‌గా పనిచేస్తున్న ఉడుముల బాలాను విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా నియమిస్తూ పోప్ ఫ్రాన్సిస్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఉడుముల బాలా తెలంగాణలోని ఘన్‌పూర్‌లో జన్మించారు. 1979 ఫిబ్రవరి 20వ తేదీన ప్రీస్ట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన రోమ్‌లోని ఆల్ఫోన్సియన్ అకాడమీ నుంచి మోరల్ థియాలజీలో డాక్టరేట్ సాధించారు. వరంగల్ డయాసిస్‌లో ఫాదర్‌గానూ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 1994 నుంచి 2006 వరకు బిషప్ బాలా హైదరాబాద్‌లోని సెయింట్ జాన్స్ రీజనల్ సెమినరీలో మోరల్ థియాలజీ ప్రొఫెసర్‌గా, 1997 నుంచి 2006 వరకు రెక్టార్‌గా కూడా పనిచేశారు. 2006లో బెంగళూరులోని బిషప్ ఆఫ్ క్యాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్‌కు డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఉన్నారు. 2013లో బిషప్ ఆఫ్ వరంగల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన బిషప్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత డయాసిస్‌లో మత సంరక్షణ, సామాజిక సేవలు, విద్యపై దృష్టి సారించి మంచి పేరు సంపాదించుకున్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న వీరారెడ్డి

ఆడపిల్ల పుడితే ఐదువేల పదహార్లు

- సొంతంగా అందిస్తున్న మాజీ మండల ఉపాధ్యక్షుడు

తిమ్మాపూర్: ఆడపిల్ల భారం కారాదనే ఉద్దేశంతో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంటలో పుట్టిన ప్రతి ఆడబిడ్డకు 'మా ఊరు మహాలక్ష్మి'పథకం కింద మాజీ మండల ఉపాధ్యక్షుడు ల్యాగల వీరారెడ్డి రూ.5,016 డిపాజిట్ చేస్తున్నారు. 2022లో ఈ పథకాన్ని ప్రారంభించిన వీరారెడ్డి.. ఇప్పటి వరకు 30 మంది ఆడపిల్లల పేరిట రూ.5,016 చొప్పున డిపాజిట్ చేశారు. తాజాగా శనివారం మరో 16 మంది పేరిట రూ.5,016 చొప్పున డిపాజిట్ చేసి.. ఆ పత్రాలను వారి తల్లిదండ్రులకు అందజేశారు. తన కుమార్తె జన్మదినం సందర్భంగా ఏటా పంపిణీ చేస్తున్నట్లు వీరారెడ్డి తెలిపారు.



శనివారం హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి కుమార్తె అఖిల వివాహం ముఖ్యమంత్రి కార్యదర్శి, సీనియర్ ఐఎఫ్‌ఎస్ అధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు అక్షయ్‌తో జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

విద్యుత్ బకాయిలు రూ. 30,777 కోట్లు!

ఈఆర్సీకి సమర్పించిన ఏఆర్ఆర్, టారిఫ్ నివేదికలో డిస్కంల వెల్లడి

- వాటిలో ప్రభుత్వ శాఖల బకాయిలే రూ. 28 వేల కోట్లపైన..!
- విద్యుదాఘాతంతో 316 మంది మృతి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు విద్యుత్ వినియోగదారుల నుంచి రావాల్సిన విద్యుత్ బిల్లుల మొండి బకాయిలు గతేడాది సెప్టెంబర్ 30 నాటికి ఏకంగా రూ. 30,777 కోట్లకు ఎగబాకాయి. రూ. 50 వేలు, ఆపై కరెంట్ బిల్లులు బకాయిపడిన వినియోగదారుల నుంచి రావాల్సిన బకాయిలివి. అందులో టీజీఎస్పీడీసీఎల్‌కు రావాల్సిన బకాయిలు రూ. 17,405.04 కోట్లకాగా టీజీఎన్పీడీసీఎల్‌కు రావాల్సిన బకాయిలు రూ. 13,372.61 కోట్లుగా ఉన్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్) 2025–26లో ఈ విషయాన్ని డిస్కంలు వెల్లడించాయి. ఎల్టీ కేటగిరీ వినియోగదారుల నుంచి టీజీఎస్పీడీసీఎల్‌కు రూ. 630.05 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్‌కు రూ.320.66 కోట్లు కలిపి మొత్తం రూ.950.71 కోట్ల బాకాయిలు రావాల్సి ఉంది. ఇక హెచ్‌టీ కేటగిరీ వినియోగదారులు టీజీఎస్పీడీసీఎల్‌కు రూ.16,774.98 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్ రూ.13,051.95 కోట్లు కలిపి మొత్తం రూ.29,826.93 కోట్లు బకాయిపడ్డారు.

సర్కారు వారి బకాయిలే అత్యధికం..

మొత్తం బకాయిల్లో రూ. 29,826.93 కోట్లు హెచ్‌టీ కేటగిరీ వినియోగదారులవే. వాటిలో అత్యధిక బకాయిలు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది రాష్ట్ర విద్యుత్ రంగంపై విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారమే డిస్కంలకు వివిధ ప్రభుత్వ శాఖలు రూ. 28 వేల కోట్లపైనే బకాయిపడ్డాయి. కాళేశ్వరం వంటి భారీ ఎత్తిపోతల పథకాలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరా పథకాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో ఏటేటా బకాయిలు పెరిగిపోయాయి.

టపటపా పేలిన ట్రాన్స్‌ఫార్మర్లు

గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య రాష్ట్రవ్యాప్తంగా 52,202 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధమయ్యాయి. కేవలం 6 నెలల్లోనే 50 వేలకుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధం కావడం ఓవర్‌లోడ్ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో మొత్తం 28,996 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా.. టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో మొత్తం 24,132 ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధమయ్యాయి. మరోవైపు అదే కాలానికి విద్యుత్ వినియోగదారులకు సంబంధించిన మొత్తం 2,79,939 విద్యుత్ మీటర్లు దగ్ధం కావడం లేదా పాడయ్యాయి.

6 నెలల్లో 316 మంది బలి

గతేడాది ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య రాష్ట్రంలో విద్యుదాఘాతంతో 316 మంది మృతిచెందగా 105 మంది గాయపడ్డారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 99 మంది, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో 217 మంది మృత్యువాతపడ్డారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 34, కామారెడ్డిలో 20, మహబూబాబాద్, కొత్తగూడెం, మెదక్ జిల్లాల్లో చెరో 19 మంది మరణించారు. పాత కేసులు కలుపుకుని ఈ కాలంలో టీజీఎస్పీడీసీఎల్ 138 మంది, టీజీఎన్పీడీసీఎల్ 165 మంది మృతుల కుటుంబాలకు చెరో రూ. 5 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాయి. ఇక విద్యుత్ సరఫరా అంతరాయాలకు సంబంధించి మొత్తం 5,23,762 ఫిర్యాదులను రెండు డిస్కంలు అందుకున్నాయి. మరోవైపు 53,633 విద్యుత్ చౌర్యం కేసులు నమోదవగా అందుకు సంబంధించి రూ. 65.04 కోట్ల జరిమానాలను డిస్కంలు విధించాయి.

28లోగా అభ్యంతరాలు తెలపండి: టీజీఈఆర్సీ

డిస్కంల ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలపై ఈ నెల 28లోగా అభ్యంతరాలు, సలహాలను పంపించాలని టీజీఈఆర్సీ బహిరంగ ప్రకటన జారీ చేసింది. మార్చి 19న హన్మకొండలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో, 21న హైదరాబాద్‌లోని టీజీఈఆర్సీ కార్యాలయం(విద్యుత్ నిలయం)లో బహిరంగ విచారణ నిర్వహిస్తామని వెల్లడించింది.

రూ.32,024 కోట్లు వెంటనే ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకున్న నిధులు అన్ని కలిపి రూ.32,024 కోట్లను ఇవ్వాలని కోరారు.

ఏపీ నుంచి బకాయిలు ఇప్పించండి

హైదరాబాద్‌లోని పలు రాజ్యాంగ సంస్థల భవనాల నిర్వహణ ఖర్చుల కింద ఏపీ ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.408 కోట్లను వెంటనే ఇప్పించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని భట్టి కోరారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం – 2014లోని సెక్షన్ 56 (2) ప్రకారం రావాల్సిన రూ.208.24 కోట్లను కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా భట్టి వెంట ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, అధికారులు ఉన్నారు.

ఏ పద్దు కింద ఎన్ని నిధులు? (రూ.కోట్లలో)

పద్దు	నిధులు
ఈఏపీ	2,547
కేంద్ర ప్రాయోజిత పథకాలు	495.26
వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి	1,800
షెడ్యూల్ 9 సంస్థల నిర్వహణ	408.49
భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి	455.76
ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్	208.24
విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు	24,106
విద్యుత్ సంస్థల నికర బకాయిలు	1,244

బీఆర్‌ఎస్ భస్మాసుర హస్తమే ఆప్ ఓటమికి కారణం: కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ భస్మాసుర హస్తమే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పరాజయానికి కారణమని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ కవిత, కేజ్రీవాల్‌ల లిక్కర్ స్కామే ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలకు దూరం చేసిందని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ ఫలితాలనుద్దేశించి రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమైనవని మండిపడ్డారు. ఈ అహంకారాన్ని అణచివేసేందుకే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రాన్ని అగాథంలోకి నెట్టిన బీఆర్‌ఎస్ నాయకులు దేశంలోని మిగతా పార్టీలను భ్రష్టు పట్టిస్తూ బీజేపీని నిలబెడుతున్నారని ప్రజలు అనుమానిస్తున్నారన్నారు.



హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ దంపతులకు శ్రీస్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

యాదగిరీశుడి దర్శనంతో ఆధ్యాత్మిక అనుభూతి

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని ఇచ్చిందని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. ఆయన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం, శ్రీస్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి వెంట జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు, జిల్లా అదనపు ప్రధాన న్యాయమూర్తి (నల్లగొండ) సంపూర్ణ ఆనంద్ తదితరులున్నారు.

కాంగ్రెస్ నేతలు కనిపిస్తే.. జనం కొట్టేలా ఉన్నారు

▶ మొదటి పేజీ తరువాయి

వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఏడాదిలోపే కాంగ్రెస్ దగాకోరు విధానాలను తెలంగాణ ప్రజలు అర్థం చేసుకున్నారని.. రేవంత్‌రెడ్డి పుణ్యాన మరో 15 ఏళ్ల వరకు తెలంగాణలో ఓట్లు అడిగే పరిస్థితిలో కాంగ్రెస్ ఉండదని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వంలోని మంత్రులు అందిన కాడికి దోచుకుంటూనే ఉన్నారని ఆరోపించారు.

రేవంత్ ఐరన్ లెగ్ సీఎం..

''ఐరన్ లెగ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ప్రచారానికి వెళ్లి కాంగ్రెస్‌కు గుండు సున్నా తీసుకువచ్చారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంతో కాంగ్రెస్ పతనాన్ని ప్రారంభించి ఢిల్లీలో ముగించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలో బీజేపీ, ప్రధాని మోదీకి అతిపెద్ద కార్యకర్తలా పనిచేస్తున్నారు. రాష్ట్రం నుంచి బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎనిమిది మంది చొప్పున గెలిచినా బడ్జెట్‌లో తెలంగాణకు దక్కింది శూన్యం..''అని కేటీఆర్ పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రం చెప్పినా.. ఒక్క బీజేపీ ఎంపీ నోరు మెదపలేదేమని ప్రశ్నించారు. లోక్‌సభలో బీఆర్‌ఎస్ ఎంపీలు ఉంటే కేంద్రాన్ని నిలదీసేవారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

మోసగాళ్లంతా వెళ్లిపోయారు

''మోసగాళ్లంతా పార్టీ నుంచి వెళ్లిపోయారు. ఇప్పుడు నికార్సైన కార్యకర్తలు, నాయకులు మాత్రమే ఉన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఫుట్‌బాల్ ఆడుతున్నారు. ప్రజాపాలన అని చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు మైకు ఇవ్వడానికి వణికిపోతున్నారు..''అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో పేదల సంక్షేమం కోసం అనేక మంచి పనులు చేసిన కేసీఆర్.. సూర్యుడి తరహాలో కొంతకాలం మబ్బుల చాటుకు వెళ్లారని, ప్రజల ఆశీర్వాదంతో తిరిగి మళ్లీ అధికారంలోకి వస్తారని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా తమతో కలసి పనిచేసేందుకు అధికార పార్టీ ఆహ్వానాన్ని పక్కనపెట్టి మరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరారని చెప్పారు. చిన్న చిన్న తప్పుల వల్లే బీఆర్‌ఎస్ ఓటమి పాలైందని పేర్కొన్నారు. మరో పదిహేను రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్నారు. గెలిచే అభ్యర్థులకు అవకాశాలు ఇస్తామని, కలసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

నేడు బీఆర్‌ఎస్ బీసీ ముఖ్య నేతల భేటీ

రాష్ట్రంలో కులగణన లోటుపాట్లను ఎత్తిచూపడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడం లక్ష్యంగా బీఆర్‌ఎస్ ఆదివారం కీలక సమావేశం ఏర్పాటు చేసింది. దీనికి రావాలంటూ పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు కలిపి సుమారు 500 మందికిపైగా ఆహ్వానం పంపారు. తెలంగాణ భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ బీసీ నేతల సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.



ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో డీకే అరుణ, బండి సంజయ్, లక్ష్మణ్ తదితరులు

అన్ని సీట్లూ గెలవాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఎండగడుతూ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న మోసాలను ప్రజలకు వివరించేలా ప్రచారాన్ని ఉధృతం చేయాలని సూచించింది. శనివారం ఓ స్టార్ హోటల్‌లో తొలుత పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆ తర్వాత రాష్ట్రపదాధికారులతో జరిగిన కీలక సమావేశాల్లో.. తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా కరీంనగర్– నిజామాబాద్– మెదక్– ఆదిలాబాద్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, ఇదే నియోజకవర్గం గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి సి.అంజిరెడ్డి, నల్లగొండ– ఖమ్మం– వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డిలను రాష్ట్ర నాయకత్వం పరిచయం చేసింది. ఈ సమావేశాలకు అధ్యక్షత వహించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'రానున్న రోజుల్లో కర్ణాటక, తెలంగాణలో అధికారంలోకి వస్తాం. తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలు గెలవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు, యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు'అని విమర్శించారు. ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు.. ప్రతిఒక్కరూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఎన్.రామచంద్రరావు, పొంగులేటి సుధాకర రెడ్డి, పార్టీనేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డా.కాసం వెంకటేశ్వర్లు, డా.ప్రకాశ్ రెడ్డి, ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఒకడి గర్వము వానిని తగ్గించును.
వినయ మనస్కుడు ఘనత నొందును.
– క్రైస్తవ ధర్మం

వెనక్కి పంపేస్తే నష్టమే!

అభిప్రాయం



నికోలస్ సార్జెన్

2024 ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ సాధించిన విజయానికీ – బైడెన్ పాలనా కాలంలో అమె రికా ద్రవ్యోల్బణం పెరగడం, దేశ దక్షిణ సరిహద్దులో వలసదారుల ప్రవాహం వంటివాటి పట్ల ఓటర్లకు ఉన్న అసంతృప్తికీ మధ్య దగ్గరి సంబంధం ఉంది.

ట్రంప్ తన రెండవ పదవీకాలంలో మొదటి రోజున తీసుకున్న చర్యలను పరిశీ లిద్దాం. సరిహద్దును మూసివేయడం, సరైన పత్రాలు లేని వలసదారులపై కఠినంగా వ్యవహరించడం, అలాగే పౌరులు కాని వారి పిల్లలకు జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దుచేయడంవంటి అంశాలపై అధ్యక్షుడు వరుసగా ఆదేశాలు జారీ చేశారు.

అక్రమ వలసలపై ఇంతటి అణచివేతకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడంలో ట్రంప్ ఉద్దేశ్యం ఓటర్లలో ప్రజాదరణ పొందడమే. ఇటీవలి ఆక్సియోస్–ఇప్సోస్ పోల్‌లో 10 మందిలో తొమ్మిది మంది రిపబ్లి కన్లతోపాటు దాదాపు సగం మంది డెమొక్రాట్లు కూడా అనధికార వలసదారుల సామూహిక బహిష్కరణకు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. బహిష్కరణ కోసం ఎంపిక చేసుకున్న పద్ధతుల దగ్గరికి వచ్చేటప్పటికి... అంటే కుటుంబాలను వేరు చేయడం లేదా పిల్లలుగా అమెరికాకు వచ్చిన వారిని బహిష్కరించడం వంటివాటికి మద్దతు పలచబడుతోంది.

ట్రంప్ ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవడానికి అమెరికన్ కాంగ్రెస్ కూడా సిద్ధంగా ఉంది. జనవరి 7న, ప్రతినిధుల సభ లేకన్ రిలే చట్టాన్ని ఆమోదించింది. దొంగతనం, దోపిడీ, కస్టమర్‌గా దుకాణాలలో ప్రవేశించి వస్తువులను దొంగిలించడం వంటివే కాక అంతకు మించిన హింసాత్మక నేరాలకు పాల్పడే అనధికార వలసదారులను బహిష్కరించడాన్ని ఈ చట్టం సులభతరం చేస్తుంది. మొదటి రోజే సెనేట్ తమ ముందుకొచ్చిన బిల్లును 64–35 ఓట్లతో ఆమోదించింది. 12 మంది డెమొక్రాట్లు కూడా రిపబ్లికన్లతో కలిసి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో సరైన పత్రాలు లేని వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటే ఆర్థిక పరిణామాలు ఎలా ఉంటాయనే విషయంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్యూ రీసెర్చ్ సెంటర్ ప్రకారం, 2022లో దాదాపు కోటి 10 లక్షల మంది అనధికార వలసదారులు అమెరికాలో ఉన్నారు. వారిలో 80 లక్షల 30 వేలమంది శ్రామికులు. గత రెండేళ్లలో వలసదారుల సంఖ్య పెరగడంతో, ఇప్పుడు కోటి మంది అనధికార కార్మికులు ఉండవచ్చని అంచనా. ఇది అమెరికా శ్రామిక శక్తిలో 6 శాతం. కాలిఫోర్నియా, ఫ్లోరిడా, న్యూయార్క్, టెక్సాస్ నగరాల్లోనే దాదాపు సగం మంది వీరు ఉన్నారు.

సామూహిక బహిష్కరణలను సమర్థించేవారి వాదన ఏమిటంటే, అవి అమెరికన్ కార్మికులకు ఒక వరం. సామూహిక తొలగింపులు అమెరికన్లకు ఉద్యోగాలను కల్పిస్తాయనీ, వారి వేతనాలను పెంచుతాయనీ ట్రంప్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టీఫెన్ మిల్లర్ వాదన. అనధికార వలస కార్మికులు ఇలాంటి ఉద్యోగాల కోసం స్థానికంగా జన్మించిన కార్మికులతో పోటీ పడుతున్నారని ఈ వాదన చెబుతోంది. అయితే ఇది వాస్తవం కాదని అనేక అధ్యయనాల వల్ల తేలుతోంది. నిజానికి నమోదుకాని వలసదారులు తరచుగా అమెరికన్ కార్మికులు కోరుకోని ఉద్యోగాలను తీసుకుంటారని ఇవి చెబుతున్నాయి. ఇందుకు 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎంప్లాయర్స్' కోవిడ్–19 మహమ్మారి కాలంలో సుమారు 1,00,000 సీజనల్ వ్యవసాయ ఉద్యోగాలలో ఎంత మంది నిరుద్యోగ అమెరికన్లు చేరతారో తెలుసుకోవడానికి నిర్వహించిన సర్వే ఒక మంచి ఉదాహరణ. లక్ష ఉద్యోగాలకుగాను కేవలం 337 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని సర్వే చెప్పింది. కాలానుగుణ వలసదారులు లేకపోతే, కార్మికుల కొరత (ఆహార కొరత) కొనసాగే అవకాశం ఉందని సర్వే తెలిపింది.

అనధికార వలసదారులు చేపట్టే అతి సాధారణమైన 15 వృత్తులలో అమెరికాలో జన్మించిన కార్మికులు–అనధికార వలస కార్మికులు ఎంతెంత మంది ఉన్నారనే సంగతినిని 'బ్రూకింగ్స్' అధ్యయనం చెబు తోంది. స్థానిక కార్మికులు, అధికారిక వలస కార్మికుల కంటే అనధికార వలసదారులు తక్కువ జీతం, ప్రమాదకరమైన, తక్కువ ఆకర్షణీ యమైన ఉద్యోగాలను ఎక్కువగా తీసుకుంటారని ఈ అధ్యయనం ప్రధానంగా తేల్చింది.

అక్రమ వలస కార్మికులను బలవంతంగా పంపివేసే చర్య వల్ల అనేక రంగాలపై వివిధ స్థాయుల్లో కార్మికుల సరఫరాపై ప్రభావం పడుతుందని 'ది ఎకానమిస్ట్' ఎత్తి చూపింది. ముఖ్యంగా వ్యవసాయంపై దీని ప్రభావం అధికంగా ఉంటుంది. అమెరికాలోని 25 లక్షలమంది వ్యవసాయ కార్మికులలో దాదాపు 40 శాతం మంది అనధికార వలస దారులేనని అంచనా. వీరి తొలగింపు వల్ల గృహ నిర్మాణం కూడా ప్రభా వితమయ్యే అవకాశం ఉంది. అనధికార వలసదారులు గృహ నిర్మాణ శ్రామిక శక్తిలో ఆరవ వంతు ఉన్నారు.

> ప్యూ రీసెర్చ్ సెంటర్ ప్రకారం, 2022లో దాదాపు కోటి 10 లక్షల మంది అనధికార వలసదారులు అమెరికాలో ఉన్నారు. వారిలో 80 లక్షల 30 వేలమంది శ్రామికులు. గత రెండేళ్లలో వలసదారుల సంఖ్య పెరగడంతో, ఇప్పుడు కోటి మంది అనధికార కార్మికులు ఉండవచ్చని అంచనా. ఇది అమెరికా శ్రామిక శక్తిలో 6 శాతం. కాలిఫోర్నియా, ఫ్లోరిడా, న్యూయార్క్, టెక్సాస్ నగరాల్లోనే దాదాపు సగం మంది వీరు ఉన్నారు.

బహిష్కరణలు ఎంత విస్తృతంగా ఉన్నాయనే దానిపైనే మొత్తం అమెరికా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం ఆధారపడి ఉంటుంది. ట్రంప్ లక్షలాదిమంది వలసదారులను సాగనంపే 'అమెరికన్ చరిత్రలో అతిపెద్ద బహిష్కరణ కార్యక్రమం' నిర్వహిస్తామని బెదిరించినప్పటికీ... చట్టపరమైన, రవాణాపరమైన, ఆర్థిక, రాజకీయ పరమైన అడ్డంకుల వల్ల ఈ కార్యక్రమం విజయవంతం కావడం కష్టమే!

ఇంతలోనే, 'అమెరికన్ పాలనాయంత్రాంగం 10 లక్షలమంది బహిష్కరణతో ప్రారంభించి... ఆపై అక్కడి నుండి ఇంకా ముందుకు వెళ్ళవచ్చు' అని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సూచించారు. పీటర్సన్ 'ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్' చేసిన అధ్యయనంలో, 1956లో అధ్యక్షుడు ఐజెన్ హోవర్ 'ఆపరేషన్ వెట్‌బ్యాక్' కేంపెయిన్ సమయంలో చేసిన 13 లక్షల బహిష్కరణల సంఖ్యకు సమానమైతే గనక, ప్రస్తుత బహిష్కరణల ఫలితంగా 2028లో అమెరికా... జీడీపీ దాని ప్రాథమిక అంచనా కంటే 1.2 శాతం తక్కువగా ఉంటుందట!

సక్రమ పత్రాలు లేని కార్మికులు... ప్రభుత్వ ప్రాయోజిత ప్రయోజనాలను పొందుతూ పన్నులు చెల్లించని 'అమాం బాపతు' అని మరొక వాదన ఉంది. 'ఫెడరేషన్ ఫర్ అమెరికన్ ఇమ్మిగ్రేషన్ రిఫార్మ్' నుండి వచ్చిన డేటా ఆధారంగా, అక్రమ వలసదారులు 2023లో అమెరికన్ పన్ను చెల్లింపుదారులు కట్టిన పన్నుల్లో 150 బిలియన్ డాలర్ల ఖర్చుకు కారణమయ్యారని ఎలాన్ మస్క్ నేతృత్వంలోని 'ప్రభుత్వ ఖర్చు తగ్గింపు కార్యక్రమం' పేర్కొంటోంది.

దీనికి ప్రధాన కారణం... 'వారు తక్కువ సగటు విద్యా స్థాయులను కలిగిఉండటం, ఫలితంగా తక్కువ పన్ను చెల్లింపులు జరగడం, పైగా వారు తరచుగా వారి పిల్లల తరఫున సంక్షేమ కార్య క్రమాలకు అర్హత పొందడం' అని 'సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్'కు చెందిన స్టీవెన్ కమరోటా వాదన.

> అమెరికాలోని 25 లక్షలమంది వ్యవసాయ కార్మికులలో దాదాపు 40 శాతం మంది అనధికార వలసదారులేనని అంచనా. వీరి తొలగింపు వల్ల గృహ నిర్మాణం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అనధికార వలసదారులు గృహనిర్మాణ శ్రామిక శక్తిలో ఆరవ వంతు ఉన్నారు.



అక్రమ వలసదారులను అమెరికా నుంచి వెనక్కి పంపుతున్న దృశ్యం

అయితే, మొత్తం వలసదారుల విషయానికి వచ్చేటప్పటికి ఈ వాదన సరికాదు. కోవిడ్–19 మహమ్మారి తర్వాత వలసదారులు 90 లక్షలకు పెరిగారంటే రాబోయే 10 సంవత్సరాలలో అమెరికా ప్రభుత్వ ఆదాయానికి అది 1.2 ట్రిలియన్ డాలర్లను జోడిస్తుందని, ప్రభుత్వ తప్పనిసరి కార్యక్రమాలకు ఖర్చులు 300 బిలియన్ డాలర్ల మేరకు మాత్రమే పెరుగుతాయని 'కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ నివేదిక' అంచనా వేసింది. వలసదారులు స్థానికంగా జన్మించిన కార్మికుల కంటే తక్కువ సంఖ్యలో ఉన్నారు. పైగా వారు పదవీ విరమణ వయస్సుకు చేరుకునే వరకు సామాజిక భద్రత, మెడికేర్ నుండి ప్రయోజనాలను పొందకపోవడం గమనార్హం.

చివరగా, నేటి వలసల గురించి చర్చ... పత్రాలు లేని వలస దారులపై కేంద్రీకృతమై ఉన్నప్పటికీ, 34 సంవత్సరాలుగా అమెరికా వలస చట్టాలు గణనీయంగా నవీకరించబడలేదని రెండు వైపులా ఉన్న రాజకీయ నాయకులు గుర్తించాలి. తగ్గుతున్న సంతా నోత్పత్తి రేటు కారణంగా అమెరికా జనాభా పెరుగుదల మందగించడంతో, అమెరికా కార్మిక మార్కెట్ వృద్ధికి ప్రధాన ఆధారం చట్టబద్ధమైన వలసల ద్వారానే లభిస్తుంది.

వలసలను అరికట్టడం వల్ల ఆర్థిక వృద్ధి మందగించే అవకాశం ఉంది. అమెరికాకు వలస వచ్చిన చాలా మంది దక్షిణ సరిహద్దు నుంచే ఉధృతంగా రావడానికి ముఖ్య కారణం కాలం చెల్లిన అమెరికా వలస చట్టాలు అని గుర్తించాలి.

వ్యాసకర్త ఫోర్ట్ వాషింగ్టన్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్‌కు ఆర్థిక సలహాదారు

భగ్నస్వప్న గాథ!

అభిప్రాయం



మనోజ్ కుమార్ ఝా

సైనిక విమానంలో చేతికి సంకెళ్లతో అమెరికా నుండి భారతీయులను బహిష్కరిస్తున్న చిత్రం మనలో చాలా మందిని తీవ్ర బాధలో ముంచెత్తింది. మెరుగైన జీవితాన్ని ఆశించిన మన తోటి పౌరులు, సోదర సోదరీమణులు ఇటువంటి అవమానకరమైన పరిస్థితులలో స్వదేశానికి తిరిగి రావడం వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు; తక్షణ, సమష్టి ప్రతిస్పందన అవసరమైన జాతీయ అవమానం.

హై ప్రొఫైల్ సందర్శనలు, ఫోటో ఆప్‌లపై దృష్టి సారించే పర్సనాలిటీ ఆధారితమైన విదేశాంగ విధానం... విదేశాలలో చట్టపరమైన వివాదాలలో చిక్కుకున్న పౌరులను రక్షించడానికి అవసరమైన స్థిరమైన దౌత్యాన్ని పక్కనపెడుతుందనే విషయాన్ని మనం విస్మరించగలమా? నాటకీయ హావభావాలు దృశ్యపరంగా ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, కష్టాల్లో ఉన్నవారికి కాన్సులర్ తక్షణ మద్దతు లభించేలా చూసుకోవడంలో రోజువారీ పనిని అవి నిర్లక్ష్యం చేయడానికి దారితీస్తున్నాయి. ప్రపంచంలో వివిధ దేశాలకు వలసవెళ్లిన భారతీయుల కార్యక్రమాలు వ్యక్తిగత బ్రాండింగ్ కోసం విలాసవంతంగా, లీడర్ కేంద్రంగా జరిగే ధోరణిని మనం చూశాం. అయినప్పటికీ, ఈ వలసపోయిన వారిలో అత్యంత దుర్బలమైన సభ్యులు నిర్బంధం, బహిష్కరణను ఎదుర్కొన్నప్పుడు లేదా జీవనోపాధిని కోల్పోయినప్పుడు... వారికి తగినంత ప్రభుత్వ సహాయం లేకుండా పోతోంది.

ఈ నేపథ్యంలో మనం ఒక కలతపెట్టే ప్రశ్నను ఎదుర్కోవలసి వస్తుంది: మన ప్రజలు భారతదేశం నుండి వెళ్లిపోవడానికి ఎందుకు ఇంత తీవ్రమైన ప్రమాదాలను సైతం ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు? బలవంతంగా తిరిగి వచ్చిన ప్రతి వ్యక్తికీ లోతైన గాయం ఉంది – అది వ్యక్తులు నిరాశతో దేశం నుంచి వెళ్ళిపోయేలా చేసే వ్యవస్థాగత వైఫల్యాల కథ. అందరికీ సహాయం చేయడంలో లేదా దేశంలోని ప్రతి మూలలో ఆశను నింపడంలో మన సమాజ అసమర్థత... తమ ఇష్టానికి వ్యతిరేకంగా భారతదేశానికి తిరిగి వచ్చే వారి దృశ్యాలున్న వీడియోలలో బహిర్గతమవుతోంది. ఒకప్పుడు వారిని ప్రేరేపించిన స్వప్నాలు ఇప్పుడు బహిష్కరణతో భంగమయ్యాయి.

దేశంలో నెలకొని ఉన్న నిర్మాణాత్మకమైన అసమానతలను, స్పష్టమైన ఆర్థిక పరిస్థితులను మనం విస్మరించలేము. ఇవి చాలా మంది భారతీయులను ప్రమాదకరమైన ప్రయాణాలను ఎంచుకోవడానికి ప్రేరేపించాయి. దీర్ఘకాలిక నిరుద్యోగం నుండి తక్కువ వేతనాల వరకు; గ్రామీణ దుస్థితి నుండి పట్టణ పేదరికం వరకు... ఎన్నో కారకాలు! ఇవి కేవలం దేశం నుంచి 'బయటపడవేసే కారకాలు' మాత్రమే కావు. దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యవస్థాగత నిర్లక్ష్యానికి సంకే తాలు! అయితే ప్రపంచ అసమానతలు మరిన్ని సమస్యలను పెంచుతాయనుకోండి. కానీ ప్రాథమిక సమస్య ఏమిటంటే మన సొంత ఇల్లు (భారత్) అస్తవ్యస్తంగానే ఉంది. భారతదేశంలో యువతీ యువకులకు ఎటువంటి ఆచరణీయమైన మార్గాలూ కనిపించనప్పుడు స్థిరమైన జీవనోపాధి, గౌరవప్రదమైన ఉపాధి లేకపోవడంతో... విదేశాల్లో ఉన్నప్పుడు వీసాలు గడువు ముగిసినా అక్కడే ఉండడానికి ప్రయత్నించడం లేదా సరైన డాక్యుమెంటేషన్ లేకుండా బయటి దేశాలలోకి ప్రవేశించడం... మెరుగైన భవిష్యత్తును పొందేందుకు ఏదైనా మార్గం కోసం ప్రయత్నించడం జరూర్ అవసరంగా మారుతుంది.

ఇలాంటి సంక్షుభిత క్షణాల్లో, భారత ప్రభుత్వానికి తన పౌరులను ఎక్కడ ఉన్నా రక్షించాల్సిన రాజ్యాంగబద్ధమైన, నైతిక బాధ్యత ఉందని మనం గుర్తు చేసుకోవాలి. ప్రభుత్వ బాధ్యత మన సరిహద్దుల వద్దే ముగియదు. బహిష్కరణ ప్రక్రియ గౌరవంగా జరుగుతోందని నిర్ధారించడానికి కాన్సులర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుత అవమానకరమైన దృశ్యాలు ప్రభుత్వ ప్రమత్తతనే సూచిస్తోంది. ఇప్పుడు చాలా మంది భారతీయులు బహిష్కరణ చర్యలను ఎదుర్కొంటున్నందున, ఈ బాధాకరమైన ప్రక్రియలో తీవ్రమైన బలప్రయోగాన్ని, అవమానకరమైన పరిస్థితులను నివారించ డానికి మన అధికారులు చర్యలు తీసుకోవడం అత్యవసరం.

భారత ప్రభుత్వం నిష్క్రియాత్మకంగా, కేవల స్పందనాత్మకంగా ఉండకూడదు. అన్నింటి కంటే ముందు, బహిష్కృతుల సంఖ్య గురించి పారదర్శకత ఉండాలి. బహిష్కరణను ఎదుర్కొంటున్న వారికి చట్టపరమైన, ప్రయాణ పరమైన సహాయంతో సహా భారత కాన్సులేట్ సమగ్ర మద్దతును అందించాలి. చాలామంది బ్యాంకు ఖాతాలు, వాహనాలు, ఇతర ఆస్తులను వదిలివేసి వస్తున్నారు. వాటిని వారు అమెరికాలో ఇప్పటికీ చట్టబద్ధంగా కలిగి ఉన్నారు. భారతదేశం నుండి వీటిని అందుకోవడానికి, నిర్వహించడానికి వారికి సహాయం చేయాలి. వలసలో ఉన్నవారితో, పౌర సమాజంతో కలిసి పనిచేస్తూ, బహిష్కరణకు ముందే... లేదా బహిష్కరణ జరిగిన వెంటనే వారి ఆస్తిని రక్షించడంలో, వెనక్కు తీసుకురావడంలో భారతీయులకు మనం ముందస్తుగా మద్దతు ఇవ్వాలి. అలాంటి చర్యలు లేకుంటే, వ్యక్తులు మరింత ఆర్థిక నష్టానికి గురవుతారు. వారి కష్టాలు మరింత పెరుగుతాయి కూడా!

సమీప భవిష్యత్తులో బహిష్కరించబడే వారిలో తోడు లేని మైనర్లు, గర్భిణులు, అత్యవసర వైద్యం లేదా మానసిక అవసరాలు ఉన్న ఇతరులు ఎవరైనా ఉండవచ్చు. ఈ బలవంతపు తొలగింపుల సమయంలో కుటుంబాలు, పిల్లలు, మహిళలు ఎదుర్కొనే చికిత్స గురించి ఆందోళన ఉంది. భారతదేశానికి తిరిగి వచ్చిన బహిష్కృతుల గతి ఏమిటి? వారిలో చాలామందికి ఎటువంటి భరోసా ఉండదు. కొందరికి తమ వలస కారణంగా పేరుకుపోయిన అప్పులు ఇక్కడ ఎదురవుతాయి. మరికొందరు విదేశాలలో స్థిరపడటంలో 'విఫలమయ్యారు' అనే ఎగతాళి మాటను ఎదుర్కోవలసి వస్తుంది.

> భారతదేశానికి తిరిగి వచ్చిన బహిష్కృతుల గతి ఏమిటి? వారిలో చాలామందికి ఎటువంటి భరోసా ఉండదు. కొందరికి తమ వలస కారణంగా పేరుకుపోయిన అప్పులు ఇక్కడ ఎదురవుతాయి. మరికొందరు విదేశాలలో స్థిరపడటంలో 'విఫలమయ్యారు' అనే ఎగతాళి మాటను ఎదుర్కోవలసి వస్తుంది.

విదేశీ తీరాలపై ఆశలను పెట్టుకున్న వ్యక్తుల 'విధి' ఇప్పుడు మరింత ప్రమాదంలో ఉంది. మనలో అత్యంత దుర్బలమైన వారితో... అంటే తీవ్రమైన అవసరం కారణంగా దేశాన్ని విడిచిపెట్టి వెళ్లి, బాధతో తిరిగి వచ్చిన వారితో మనం ఎలా వ్యవహరిస్తాం అనే అంశంలో మన దేశ గౌరవం, నైతిక నిర్మాణం పరీక్షించబడతాయి. భారతదేశం నిజంగా ప్రపంచ శక్తిగా ఎదగాలని కోరుకుంటే, దాని పౌరులు అభివృద్ధి చెందడానికి దేశం నుండి పారిపోవాల్సిన అవసరం లేదని నిర్ధారించుకోవడం ద్వారా ప్రారంభించాలి. అంతర్గతమైన ఆర్థిక అసమానతలను ఎదుర్కోవాలంటే... మరింత సమ్మిళితమైన, గౌరవప్రదమైన మాతృభూమిని సృష్టించాలనే సమష్టి సంకల్పాన్ని చేసుకోవాలి. ఈ బహిష్కరణలు ఈ అవసరాన్నే డిమాండ్ చేస్తున్నాయి.

వ్యాసకర్త రాజ్యసభ సభ్యుడు (రాష్ట్రీయ జనతా దళ్)

హద్దులు లేని సేవాస్ఫూర్తి

మనదేశపు ఉమెన్స్ మెడికల్ సర్వీస్‌లో తొలి భారతీయ మెడికల్ ఆఫీసర్ అయిన డాక్టర్ హిల్డా మేరీ లాజరస్ 1890 జనవరి 23న విశాఖపట్నంలో జన్మించారు. తండ్రి డేనియల్ లాజరస్ విశాఖపట్నంలో ప్రఖ్యాతి చెందిన సీబీఎం హైస్కూలును తీర్చిదిద్దిన వ్యక్తి. ఆమె తల్లి ఎలీజా తోబుట్టువులు కూడా విద్యారంగంలో ఉన్నత స్థానాలు అధిరోహించినవారు. హిల్డా మేరీ లాజ రస్ మద్రాసులోని విక్టోరియా స్త్రీలు–పిల్లల హాస్పిటల్‌లో తొలి భారతీయ మహిళా సూపరింటెండెంట్‌గా అందించిన సేవలకు గుర్తుగా తర్వాత కాలంలో ఆ హాస్పిటల్‌లో ఆమె పేరున ఒక వార్డు రావడం విశేషం. విశాఖపట్నంలో ప్రసూతి శిక్షణాకేంద్రాన్ని ప్రారంభించి, అందులో తెలుగులో బోధనకు అంకురార్పణ చేసిన భాషాభిమాని కూడా ఆమె. సదా ఖాదీ చీరనే ధరించిన ఈ మహిళామణికి గాంధీజీ అభిమాన నాయకుడు.

మద్రాస్ మెడికల్ కళాశాలలో 1916లో ఎంబీబీఎస్ పట్టా పొందారు. పిమ్మట లండన్, డబ్లిన్ నగరాలు వెళ్లి వైద్యురాలిగా మరింత మెరుగైన శిక్షణ పొంది, ఎంఆర్‌సీఎస్ పట్టా గడించారు. 1917 నుంచి 1947 దాకా గవర్నమెంట్ మెడికల్ సర్వీస్‌లో భాగంగా న్యూఢిల్లీ, కలకత్తా, మద్రాసు, సూరత్... ఇలా చాలా చోట్ల రోగులు, మంత్రసానులు, సామాన్య ప్రజలతో పని చేయడం వల్ల ఆరు భారతీయ భాషలు పట్టుబడ్డాయి. బ్రిటిష్ ప్రభుత్వ సర్వీసులో ఆమె లెఫ్టినెంట్ కల్నల్ స్థాయిని పొందారు. మద్రాసులోని 'లేడీ వెల్లింగ్టన్ మహిళా మెడికల్ స్కూల్' సూపరింటెండెంట్ గానూ, అలాగే న్యూఢిల్లీలోని 'లేడీ హార్డింగ్ మహిళా వైద్య కళాశాల'లో తొలి భారతీయ ప్రిన్సిపాల్‌గానూ సేవలందించారు. కెరీర్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ హోదా వరకు వెళ్లారు. 1943–45 మధ్యకాలంలో భారతీయ వైద్య సేవల స్థాయి పెంచడానికి ఏర్పాటు చేసిన 'సర్ జోసెఫ్ భోర్' కమిటీ సభ్యురాలిగా గణనీయమైన సేవలందించారు.

వైజ్ఞానిక వేగుచుక్కలు - 21



డాక్టర్ హిల్డా మేరీ లాజరస్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1948 నుంచి ఆరేళ్లపాటు వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కళాశాలకు తొలి ఇండియన్ ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. ఆంధ్ర మెడి కల్ కళాశాలలోని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆబ్‌స్టెట్రిక్స్ – గైనకాలజీ' ప్రిన్సిపల్‌గా, కింగ్ జార్జ్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పనిచేసి వివిధ విభాగాల సేవల నాణ్యతను ఎంతగానో పెంచారు. ఎలిజబెత్ మహారాణి పర్సనల్ డాక్టర్‌గా కూడా సేవలందించారని అంటారు. ఇందిరాగాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితురాలనీ, ఆమె ఇరు ప్రసవాలనూ పర్యవేక్షించారనీ చెబు తారు.

అంతేకాకుండా మద్రాసు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులుగా, విశాఖపట్నం జిల్లా పరిషత్ సభ్యురాలుగా, ఎమ్మెల్సీగా కూడా సేవలు అందించారు. అనేక దాన ధర్మాలు చేశారు. ఆమె భూరి విరాళం ఆధారంగా విశాఖపట్నంలో లాజరస్ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ అసోసి యేషన్, అసోసియేషన్ ఆఫ్ మెడికల్ ఉమెన్ ఇన్ ఇండియా, రెడ్ క్రాస్ వంటి సంస్థల ద్వారా ఎంతో సేవ చేశారు. కనుకనే 'కైజర్ ఎ హింద్' బంగారు పతకంతో పాటు 1961లో పద్మశ్రీ కూడా లభించాయి. జీవిత చరమాంకంలో విశాఖపట్నంలో స్థిరపడ్డారు. ఈ నిత్య చైతన్య శీలి 1978లో తుదిశ్వాస విడిచినా భారత వైద్యరంగంలో చిరంజీవిగా మిగిలారు.


– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి । 94407 32392

శరణమ్మ... మరియమ్మ

ఆమె పేరు ఓ మృదుత్వం నింపుకొంది. ఆమె ఎంతటి భాగ్యవతి అంటే భూలోక స్త్రీలందరి లోనూ ఓ ప్రత్యేకమైన దైవ వరాలు పొందిన ధన్యురాలు. ఓ మామూలు స్త్రీ మూర్తి దేవునికి తల్లి కావడమేమిటీ? ఆమెయే మరియమ్మ! మరియమ్మ తన కుమారుని బాగోగులు చూచుకున్నట్టే, తన కుమారుని భక్తుల్ని సైతం తన బిడ్డల్లా చూచుకుంటుంది. వారికి ఎప్పుడెప్పుడు ఏమేమి కావాలో పరిశీలిస్తుంది. వారు చెప్పుకున్న సమస్యలన్నిటినీ ఆ దేవాది దేవుని ముందు నివేదిస్తుంది. గుర్తు పెట్టు కోవడానికై, మరచి పోకుండా తాను ఆకాశ వీధిలో వచ్చే దారిలో తనకు తగిలే మేఘాల్ని కాగితాల్లా భావించి, వాటిపై రాసుకుంటుంది.

క్రైస్తవులు యెహోవాను తమ మూలకర్తగా, దేవదేవునిగా నమ్ముతారు. ఆ దేవుణ్ణి మన మానవుల మధ్యలోకి కేవలం ఒక మనిషిగా తీసుకురావడానికి కారకురాలయ్యిందీ మరియ తల్లి. అదీ దైవాదేశం ప్రకా రమే జరిగిన సంఘటన. దేవదూత చెప్పిన వచనాలే ఇందుకు సాక్ష్యం (లూకా 1:28). ప్రజల కష్ట నష్టాలు బాధలు చెవులారా విన్నవి, కళ్ళారా చూచినవి తన గర్భాన కుమారునిగా పుట్టిన దైవమూర్తి ప్రభువుకు విన్నవించగల దయార్ద్ర హృదయ మరియ. ఇదీ మరియాతత్త్వం.





అలాగే ప్రభువు సిలువపై మరణించే ముందు, తన శిష్యుడు యోహానుని ఉద్దేశించి 'ఇదిగో నీ తల్లి' అంటూ ఆమెను ఆయనకు అప్పగించి జగన్మాతగా పరిచయం చేశాడు ప్రభువు.

మరియ తత్త్వం మాతృతత్త్వానికి పరాకాష్ఠ. విజయవాడ శివార్లలోని గుణదల మాత ఉత్సవాలు చాలా ప్రసిద్ధమైనవి. క్రీస్తు తల్లిలో తమ తమ తల్లుల్ని హృదయానుభవంలోకి తెచ్చుకోవడం విశేషం. ఏదేమైనా ఇలాంటి ఉత్సవాలు, అమా యకులైన మనుషుల్లో నిక్షిప్తమైన సద్భావనకు, మానసిక పరివర్తనకు దోహద పడాలి. మూఢమైన ఆచారాలకు, దురాచారాలకు దూరంగా ఉంచాలి. అందుకు ఆ మరియ తల్లి సాయపడాలి. ఈ ఆశయాల సాధనకే ఏటేటా ఈ జన సందోహం! తథాస్తు!!

– డా। దేవదాసు బెర్నార్డ్ రాజు । 98667 55024

(నేటి నుంచి 11వ తేదీ వరకు విజయవాడలోని గుణదల మేరీమాత ఉత్సవాలు)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.ద్వాదశి, రా.8.12 వరకు తదుపరి త్రయోదశి, నక్షత్రం: ఆరుద్ర రా.6.55 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: సా.4.29 నుండి 5.17 వరకు, అమృత ఘడియలు: ఉ.9.11 నుండి 10.44 వరకు; రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు, యమగండం: ప.12.00 నుంచి 1.30 వరకు, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 5.54.

'పాలమూరు'పై కేంద్రం వివక్ష

- ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పడం సరికాదు
- నిర్మాణంలో జాప్యానికి బీఆర్ఎస్ అసమర్థతే కారణం: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: సాంకేతిక, ఆర్థిక మదింపు, నీటి వాటాలు, న్యాయపరమైన అంశాలను సాకుగా చూపి పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేర్కొనడాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తప్పుపట్టారు. ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వరని, జాతీయ హోదా ఇవ్వకపోవడం వివక్ష కాదా అని నిలదీశారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సినవి అడుగుతున్నామని, ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా కేంద్రం పక్షపాత ధోరణి అవలంభిస్తోందని శనివారం ఆయన ఓ ప్రకటనలో విమర్శించారు. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చటంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని ఆయన తప్పుపట్టారు. పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టు ప్రజల ఆకాంక్ష మాత్రమే కాదని, కాంగ్రెస్ పార్టీ ఆకాంక్ష అని, ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం ఈ ప్రాంత బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నా రాష్ట్రానికి చెందిన భాజపా ఎంపీలు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టుకు బీఆర్ఎస్ ఒరగబెట్టిందేమీ లేదని, ప్రాజెక్టు నిర్మాణ జాప్యానికి ఆ పార్టీయే కారణమని జూపల్లి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న ప్రేమ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ఉంటే ఏనాడో పూర్తయ్యేదని బీఆర్ఎస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'మల్లన్న' నిర్వాసితులను ఆదుకోవాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ
- ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు హడావుడి చేసి ఇప్పుడు ఎందుకు స్పందించరు?



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆ విషయంపై ఏడాదిగా ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. నిర్వాసితులకు గత ప్రభుత్వం తక్కువ పరిహారం ఇచ్చిందని ఆరోపణలు చేసిన రేవంత్, ఇప్పుడు వారికి ఎక్కువ పరిహారం ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని సవాలు చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితులను ఆదుకోవాలని కోరుతూ హరీశ్‌రావు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 'మా ప్రభుత్వంలో అక్కడక్కడ ప్యాకేజీ మిస్సయిన వారికి పరిహారం అందించాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టు తీర్పులు అనుకూలంగా వచ్చినవారికి కూడా పరిహారం అందజేయాలి' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

దరఖాస్తుల పేరిట దగా ఎంత కాలం?

రేషన్ కార్డుల కోసం మీ సేవ దరఖాస్తుల పేరిట కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను దగా చేస్తోందని హరీశ్‌రావు ఒక ప్రకటనలో మండిపడ్డారు. 'ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నారు. గ్రామ సభల పేరిట డ్రామా చేశారు. ఇప్పుడు మళ్లీ మీసేవలో దరఖాస్తులు అంటున్నారు. పథకాల పేరిట ఇన్నాళ్లు మీరు చేసిన హడావుడి స్థానిక సంస్థల ఎన్నికల కోసం చేసిన గారడీయేనా? ప్రజాపాలన, గ్రామసభల దరఖాస్తులకు విలువ లేదా?' అని మండిపడ్డారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పరాజయంపై ఆయన స్పందిస్తూ, హామీలు అమలు చేయకుండా, ప్రచారం చేసుకున్నంత మాత్రాన ఓట్లు పడతాయా? అని ప్రశ్నించారు.

రుణాలు బంగారంలా పెరిగాయ్!



అప్పుల కోసం పుత్తడి తాకట్టు వైపు జనం మొగ్గు

సురక్షిత సాధనంగా అవతరించిన పసిడి బంగారంపై తీసుకునే రుణాల్లో దక్షిణాది రాష్ట్రాలదే సింహభాగం	రూ.1,72,581 కోట్ల రుణాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నాటికి..	ఏడాదిలో బంగారం రుణ మార్కెట్ వృద్ధి 71.3%


సాక్షి, బిజినెస్ బ్యూరో: బంగారం ధర ఒక్కటే కాదు.. బ్యాంకుల్లో పసిడి తాకట్టు రుణాలూ అదే స్థాయిలో పెరిగిపోతున్నాయి. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గణాంకాల ప్రకారం.. దేశవ్యాప్తంగా 2024 ఏప్రిల్‌లో రూ.1,01,552 కోట్లుగా ఉన్న బంగారు రుణాలు.. డిసెంబర్ నాటికి రూ.1,72,581 కోట్లకు చేరాయి. అదే 2023 డిసెంబర్‌తో పోలిస్తే బంగారం రుణాల్లో ఏకంగా 71.3 శాతం వృద్ధి నమోదవడం గమనార్హం. అంతకు ముందు ఏడాదిలో ఇది 17 శాతమే. భారత్‌లో అతి పెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మొత్తం పసిడి రుణాలు డిసెంబర్ నాటికి 41.66 శాతం పెరిగి.. రూ.43,745 కోట్లకు చేరాయి. ఇటీవలి కాలంలో పెరుగుతున్న గోల్డ్ లోన్స్ తీరును ఈ పరిస్థితి స్పష్టం చేస్తోంది. పసిడి ధరలకు రెక్కలు రావడంతో ఆభరణాలపై అందుకునే లోన్ విలువ కూడా పెరిగింది. రుణ గ్రహీతలు తమకు ఉన్న ఇతర రుణాల చెల్లింపుల కోసం గోల్డ్ లోన్స్ తీసుకుంటున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పెట్టుబడికే కాదు చదువులు, ఆరోగ్యం, వివాహం ఇలా ఏ అవసరంలోనైనా ఆదుకుంటుందన్న ఉద్దేశంతో బంగారం కొనిపెట్టుకోవడం, అవసరానికి తాకట్టు పెట్టడం పెరుగుతోంది.


బంగారం లాంటి సౌలభ్యం!

ఎవరైనా ఇతర రుణాలు తీసుకోవాలంటే క్రెడిట్ హిస్టరీ తప్పదు. పైగా ప్రతి నెల ఈఎంఐ రూపంలో వడ్డీ, అసలు కట్టాల్సిందే. అదే గోల్డ్ లోన్‌కు ఏ అడ్డంకీ లేదు. నగలు ఎంత స్వచ్ఛంగా ఉంటే అంత రుణం. చెల్లింపుల్లోనూ సౌలభ్యం ఉంటుంది. నిర్దేశిత కాల పరిమితి ముగిసే సమయానికి బాకీపడ్డ మొత్తం చెల్లిస్తే సరిపోతుంది. బ్యాంకు, తీసుకునే మొత్తాన్ని బట్టి వార్షిక వడ్డీ 9 నుంచి 26 శాతం వరకు ఉంది. ఐడీ కార్డు, అడ్రస్ ప్రూఫ్ ఉంటే చాలు. 10 నిమిషాల్లో అప్పు పుడుతుంది. ఇంటికొచ్చి మరీ బంగారం రుణాలిస్తున్న సంస్థలూ ఉన్నాయి. ఆభరణాల స్వచ్ఛతను బట్టి విలువలో 75 శాతం వరకు రుణం అందుకోవచ్చు. కొన్ని ప్రైవేట్ సంస్థలు 90 శాతం వరకు ఆఫర్ చేస్తున్నాయి. నెల నెలా వడ్డీ కట్టే విధానంగానీ, కాల పరిమితి ముగిశాక ఒకేసారి అసలు, వడ్డీ చెల్లించే విధానంగానీ ఎంచుకోవచ్చు. రుణం చెల్లించడంలో విఫలమైతే నిబంధనల ప్రకారం నోటీసులు ఇస్తారు. అయినా స్పందించకపోతే తాకట్టు పెట్టిన బంగారాన్ని వేలం వేస్తారు.

బంగారం, రుణాల లెక్కలివీ..

వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ గణాంకాల ప్రకారం... 2024లో దేశంలో బంగారం డిమాండ్ 802.8 టన్నులుగా నమోదైంది. 2023లో ఇది 761 టన్నులు మాత్రమే. భారతీయుల వద్ద మొత్తంగా సుమారు 25,000 టన్నులకుపైగా బంగారం నిల్వలు ఉన్నట్టు అంచనా. ఇందులో 5.6 శాతం బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. 2023–24లో పుత్తడి రుణ విపణి రూ.7.1 లక్షల కోట్లుగా ఉంటే.. రెండేళ్లలోనే రెండింతలైంది. మొత్తం బంగారం రుణాల్లో రూరల్ వాటా 35 %, సెమీ అర్బన్ 42 %, అర్బన్ వాటా 23 శాతంగా నమోదైంది. ఇక ఎన్‌బీఎఫ్‌సీలు అందిస్తున్న బంగారం రుణాల్లో రూ.30,000లోపు తీసుకునేవే 50శాతం దాకా ఉన్నాయి. అన్‌సెక్యూర్డ్ లోన్స్, క్రెడిట్ కార్డుల కంటే గోల్డ్ లోన్ చవక. బంగారం రుణాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా 63 శాతంకాగా.. మిగిలినది ఎన్‌బీఎఫ్‌సీలు, ప్రైవేటు బ్యాంకులది.





ఇతర రుణాలు కఠినతరం కావడంతో..

బ్యాంకుల కఠిన నిబంధనల కారణంగా పర్సనల్ లోన్లు, క్రెడిట్‌కార్డులు వంటి అన్‌సెక్యూర్డ్ రుణాలు తగ్గుముఖం పడుతున్నాయి. రుణగ్రహీతలు ప్రత్యామ్నాయంగా బంగారం రుణాలపై ఆధారపడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. వ్యక్తిగత రుణాల విభాగం 2023 డిసెంబర్‌లో నమోదైన 20.8%తో పోలిస్తే 2024 డిసెంబర్‌లో వృద్ధి 9.7 శాతమే కావడం గమనార్హం. క్రెడిట్ కార్డ్ రుణాలు 2024 డిసెంబర్‌లో 15.6% పెరిగాయి. ముందటి ఏడాదిలో ఇది 32.6%. గృహ, వాహనాలు, క్రెడిట్ కార్డ్‌లు, వ్యక్తిగత రుణాలు సహా రిటైల్ లోన్ విభాగంలో బ్యాంకుల రుణాల వృద్ధి 2023 డిసెంబర్‌లో 17.6% నుంచి 2024డిసెంబర్‌లో 14.9 శాతానికి తగ్గిపోయిందని రిజర్వుబ్యాంకు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

స్టేట్ బ్యాంకులో గోల్డ్‌లోన్ ఇలా..

ఎస్‌బీఐ.. 18–22 క్యారెట్ల ఆభరణాల స్వచ్ఛతను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుతం ప్రతి 10 గ్రాములకు రూ.45,000 వరకు రుణం ఇస్తోంది. రుణ గ్రహీత మూడేళ్ల వరకు వడ్డీ కట్టుకుంటూ ఉండొచ్చు. ఆ తర్వాత లోన్‌ను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. బుల్లెట్ రీపేమెంట్ విధానంలో 6 నెలలు లేదా 12 నెలల వ్యవధిని ఎంచుకోవచ్చు. ఈ విధానంలో గరిష్టంగా 10 గ్రాములకు రూ.48,000 వరకు లోన్ అందుకోవచ్చు. ప్రతి నెలా నిర్దేశిత వడ్డీ చెల్లించాలి. టెన్యూర్ ముగిసే ముందు అసలు మొత్తాన్ని కట్టి లోన్‌ను క్లోజ్ చేసుకోవాలి. అయితే గోల్డ్ లోన్‌పై 90 రోజులపాటు వడ్డీ చెల్లించకపోతే ఖాతా ఎన్‌పీఏ (మొండి బకాయి) అవుతుంది. ఆ తర్వాత 90 రోజుల దాకా కూడా కస్టమర్ నుంచి ఎటువంటి స్పందన లేకపోతే బంగారాన్ని వేలం వేస్తారు.

ధర పెరిగి.. ఎక్కువ రుణం..

పసిడి ధర పెరిగిపోతుండటంతో దానిపై అందుకునే లోన్ మొత్తమూ పెరుగుతోంది. దీనితో జనం తమ అవసరాల కోసం బంగారం లోన్ల వైపు మొగ్గు చూపుతున్నారని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పుత్తడి ధర హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల స్వచ్ఛత ధర రూ.87,650 దాటింది. గతేడాది ధర సుమారు రూ.64,000 మాత్రమే కావడం గమనార్హం.

బంగారంపై రుణాల తీరు ఇదీ..

- వార్షిక వడ్డీ: 9% నుంచి 26% వరకు
- రుణమిచ్చేది: కనిష్టంగా రూ.1,500 నుంచి గరిష్టంగా రూ.5 కోట్ల వరకు
- కాల పరిమితి: 7 రోజుల నుంచి 4 ఏళ్ల వరకు..
- ఆభరణం విలువలో రుణం: గరిష్టంగా 75 శాతం

బీసీల రిజర్వేషన్లు పెంచాల్సిందే

మంత్రి పొన్నం అధ్యక్షతన బీసీ సంఘాలు, బీసీ మేధావులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్. చిత్రంలో అంజన్ కుమార్, కె. కేశవరావు, నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన పెంచాల్సిందేనని బీసీ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేశాయి. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచుతూ చట్టబద్ధం చేయాలని సూచించాయి. రిజర్వేషన్లు తేల్చిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సమగ్ర సర్వే పట్ల పలు అనుమానాలు, సందేహాలు నెలకొన్న నేపథ్యంలో బీసీ సంఘాలు, మేధావులు, ప్రజాప్రతినిధులతో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సచివాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌తో పాటు ఎంపీలు సురేశ్ షెట్కార్, ఆర్.కృష్ణయ్య, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, బీసీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి దాపరికాలు లేవని, ప్రతి ఒక్కరి నుంచి సలహాలు తీసుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. సలహాలు, సూచనలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని పొన్నం ఆరోపించారు. సంఘాల ప్రతినిధులు చెప్పే ప్రతి అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని, ఈ ప్రక్రియలో ప్రభుత్వ సలహాదారు కేశవరావు ప్రత్యేక చొరవ తీసుకుంటారని చెప్పారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సర్వేను తిరిగి నిర్వహించాలని, శాస్త్రీయంగా, చట్టబద్ధంగా సర్వే చేయాలని, ప్రత్యేక కమిషన్ ఆధ్వర్యంలో సర్వే జరగాలన్నారు. రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలును సమీక్షించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎంపీలు మధుయాష్కి, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచకుండా లెక్కలెందుకు చూపిస్తున్నారు?

- సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం కేవలం లెక్కలు చూపడంలో ఆంతర్యమేమిటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పెట్టాల్సింది పోయి, కేవలం కులగణన లెక్కలు చదివి వినిపించడంలో ఉద్దేశమేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటులో మాట్లాడుతూ.. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని, అలాంటప్పుడు రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపులో అభ్యంతరమేమిటని నిలదీశారు. కేవలం కులగణన లెక్కలు చెప్పేందుకు అసెంబ్లీలో ప్రకటన చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును చూపుతూ, బీసీలకు రిజర్వేషన్లు పెంచకుండా ప్రభుత్వం కాలయాపన చేసే పరిస్థితి కనిపిస్తోందని కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడం వెనక కుట్ర: కేంద్రమంత్రి బండి సంజయ్



కరీంనగర్‌లో నిర్వహించిన పట్టభద్రుల సంకల్పయాత్రలో కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడం వెనుక కుట్ర ఉందని కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడం వల్ల భవిష్యత్‌లో తెలంగాణలోని బీసీలు పోటీచేసే స్థానాల్లో హిందూ సమాజం గెలిచే పరిస్థితి ఉండబోదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని రాంనగర్ చౌరస్తా నుంచి గీతాభవన్ చౌరస్తా వరకు 'పట్టభద్రుల సంకల్పయాత్ర' నిర్వహించారు. మెదక్, ఆదిలాబాద్ ఎంపీలు రఘునందన్‌రావు, గెడం నగేశ్, ఉమ్మడి మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్యతో కలిసి సంజయ్ మాట్లాడారు. 'కులగణనలో బీసీల జనాభా శాతాన్ని తగ్గించారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి హిందూ సమాజాన్ని దెబ్బతీసే కుట్ర చేస్తున్నారు. ఇంత అన్యాయం జరుగుతుంటే బీసీ సంఘాలు ఎందుకు స్పందించడం లేదు?' అని మండిపడ్డారు. మోసకారి కాంగ్రెస్‌కు ఢిల్లీ ప్రజలు గాడిదగుడ్డును బహుమతిగా ఇచ్చారని ఎద్దేవా చేశారు. రఘునందన్‌రావు మాట్లాడుతూ బీజేపీ గెలుపుతో ఢిల్లీలో అవినీతి లేకుండా పోయిందన్నారు. ఈ యాత్రలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ మేయర్ సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

3 ఇళ్లు.. రూ.4 కోట్ల ఆస్తులు

కోట్లకు పడగలెత్తిన వరంగల్ డీటీసీ పుప్పాల శ్రీనివాస్
- శుక్రవారం నుంచి ఆయన ఇళ్లలో ఏసీబీ సోదాలు
- రూ.4.04 కోట్ల విలువైన అక్రమాస్తుల గుర్తింపు
- బహిరంగ మార్కెట్‌లో భారీగా వీటి విలువ
- శ్రీనివాస్‌ను కోర్టులో హాజరుపరిచిన ఏసీబీ



శ్రీనివాస్ ఇంట్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్/వరంగల్: వరంగల్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) పుప్పాల శ్రీనివాస్ అక్రమాస్తుల చిట్టాను ఏసీబీ అధికారులు విప్పుతున్నారు. శుక్రవారం నుంచి శ్రీనివాస్, ఆయన బంధువుల ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పెద్ద మొత్తంలో అక్రమాస్తుల పత్రాలు, బంగారంతో పాటు విదేశీ మద్యం గుర్తించినట్లు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం హనుమకొండ పలివేల్పుల రహదారిలోని దుర్గా కాలనీలో ఉన్న శ్రీనివాస్ నివాసంతోపాటు ఆయన బంధువుల ఇళ్లతో కలిపి మొత్తం ఐదు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూమి, నగదు, బంగారం, ఇతర ఆభరణాలు, వాహనాలు, ఖరీదైన గృహోపకరణాలు కలిపి మొత్తం రూ.4,04,78,767 విలువైన ఆస్తులను గుర్తించినట్టు విజయ్‌కుమార్ వెల్లడించారు. బహిరంగమార్కెట్‌లో ఈ ఆస్తుల విలువ చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. శ్రీనివాస్‌పై అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(1)(బి), 13(2)తో పాటు తెలంగాణ ఎక్సైజ్ చట్టం–1968 కింద కేసు నమోదు చేసి వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.


ఏసీబీ సోదాల్లో గుర్తించిన శ్రీనివాస్ అక్రమాస్తులు

- శ్రీనివాస్ నివాసంలో రూ.19,55,650 విలువైన 1,542.8 గ్రాముల (కిలోన్నర)బంగారం. రూ.28 వేల విలువైన వెండి ఆభరణాలు.
- శ్రీనివాస్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల పేరిట ఉన్న రూ.2,79,32,740 విలువైన మూడు ఇళ్లకు సంబంధించిన పత్రాలు.
- రూ.13.57 లక్షల విలువైన 16 ఓపెన్ ప్లాట్ల పత్రాలు.
- రూ.14,04,768 విలువైన 15.20 ఎకరాల వ్యవసాయ భూమి పత్రాలు.
- బ్యాంకు ఖాతాలో రూ.5,85,409 డిపాజిట్లు.
- రూ.22,85,700 విలువైన గృహోపకరణాలు.
- రూ.43,80,000 విలువైన మూడు కార్లు, ఒక బైక్.
- రూ.5.29,000 ఖరీదు చేసే 23 విదేశీ మద్యం బాటిళ్లు.

కులగణన సర్వే అశాస్త్రీయం

వెంటనే రీ సర్వే జరిపించాలి..
సీఎస్‌కు వినతి పత్రం ఇచ్చిన బీఆర్ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే అశాస్త్రీయంగా, తప్పులతడకగా ఉందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. వెంటనే రీ సర్వే జరిపించాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం తీసుకువచ్చాకే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ తదితరులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం సచివాలయం మీడియా పాయింట్ బయట విలేకరులతో మాట్లాడారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల జనాభా 52% ఉంటే, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదికలో 46 శాతంగా చూపడం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో జనాభా పెరుగుతుందే తప్ప తగ్గడమనేది జరుగుతుందా? అని నిలదీశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలంగాణలో బీసీలకు జరుగుతున్న అన్యాయం గురించి తెలియదా? అని ప్రశ్నించారు.



అక్కడ కాన్పులు 'సాధారణం'!

కామారెడ్డి జిల్లాలోని మారుమూల గ్రామాల్లో నార్మల్ డెలివరీలకే గర్భిణుల ప్రాధాన్యత
- డెలివరీ రోజు దాకా పొలం పనులకు వెళ్లడం మామూలే
- నొప్పులు మొదలయ్యాక డెలివరీల కోసం పీహెచ్‌సీలకు పయనం
- తప్పదని వైద్యులు చెబితేనే సిజేరియన్లకు అంగీకారం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రులతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఓవైపు ప్రసవాల కోసం కడుపు'కోత'లు (సిజేరియన్లు) పెరుగుతున్నప్పటికీ పలు మారుమూల గ్రామాల్లో మాత్రం నేటికీ సాధారణ ప్రసవాలే అత్యధికంగా జరుగుతున్నాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని శివారు గ్రామాల్లో నిండు గర్భిణులు నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. పురిటినొప్పులు భరించేందుకే మొగ్గుచూపుతున్నారు తప్ప శస్త్రచికిత్సలకు ఇష్టపడటంలేదు. తప్పనిసరి పరిస్థితుల్లోనే సిజేరియన్లు చేయించుకుంటున్నారు. ఆయా గ్రామాల పరిధిలో గత ఐదేళ్లలో జరిగిన కాన్పుల గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లోనైతే 90 శాతానికిపైగా సాధారణ ప్రసవాలే జరగడం గమనార్హం.

జీవన విధానమూ భిన్నమే..

మూడు రాష్ట్రాల కూడలిగా.. త్రిభాషా సంగమంగా పిలిచే జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్, పెద్దకొడప్‌గల్, డోంగ్లీ, మద్నూర్ తదితర మండలాల్లో ప్రజల ఆచార వ్యవహారాలతోపాటు జీవన విధానం కూడా భిన్నమే. వ్యవసాయమే వారి జీవనాధారం. రాళ్ల భూములే అయినా వాటిలోనూ రకరకాల పంటలు పండిస్తారు. ఇంటిల్లిపాదితోపాటు గర్భిణులు సైతం పొద్దున్నే పొలంబాట పడుతుంటారు. ఒక్కోసారి పొలం పనులకు వెళ్లిన గర్భిణులకు పురిటినొప్పులు మొదలై పొలం దగ్గరే కాన్పులు జరిగిన ఘటనలు సైతం ఉన్నాయి.

2020 నుంచి 2024 వరకు కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలు/తండాల్లో ప్రసవాలు ఇలా..

గ్రామం	మొత్తం కాన్పులు	సాధారణం	సిజేరియన్లు
శివాపూర్	124	106	18
మధుర తండా	34	33	1
విఠల్‌వాడీ/ విఠల్‌వాడీ తండా	162	135	27
పోచారం/ పోచారం తండా	263	190	73

పీహెచ్‌సీలకే ప్రాధాన్యం..

మారుమూల గ్రామాలైనప్పటికీ ప్రభుత్వ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. దీంతో వారంతా దూరాన ఉన్న పట్టణాలు, నగరాలకు వెళ్లకుండా నొప్పులు మొదలవగానే ప్రభుత్వ అంబులెన్స్‌ల ద్వారానే సమీపంలోని పీహెచ్‌సీలకు వెళ్తున్నారు. అక్కడి వైద్య సిబ్బంది ఏదైనా సమస్య ఉందని గుర్తిస్తే బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి లేదా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు.

హైరిస్క్ ఉంటేనే రిఫర్ చేస్తాం



మా దగ్గర నార్మల్ డెలివరీలే చేస్తాం. హైరిస్క్ ఉంటే బాన్సువాడకు రిఫర్ చేస్తాం. గర్భిణులు మా సిబ్బంది చెప్పినట్లు నడుచుకుంటారు. తప్పనిసరి అయితేనే సిజేరియన్‌కు ఒప్పుకుంటారు.
– డాక్టర్ విఠల్ పాటిల్, మెడికల్ ఆఫీసర్, జుక్కల్

చెప్పినట్టు వింటారు



మా ఊళ్లో అందరూ ఏఎన్ఎం వచ్చిన రోజు వచ్చి చెకప్ చేయించుకుంటారు. ప్రెగ్నెన్సీ వచ్చిన నుంచి డెలివరీ అయ్యేదాకా ఎవరి పనులు వాళ్లు చేసుకుంటారు. అందుకే నార్మల్ డెలివరీలు అవుతాయి.
– కవిత, అంగన్‌వాడీ టీచర్, శివాపూర్

రెండు కాన్పులూ నార్మలే...

నాకు రెండు కాన్పులూ నార్మల్‌గానే జరిగాయి. అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు, పాలు అందిస్తారు. భోజనం పెడతారు. మా ఊళ్లో అందరూ నార్మల్ డెలివరీ అవుతారు.
– సరోజన, బాలింత, శివాపూర్

గత ఐదేళ్లలో కామారెడ్డి జిల్లాలోని పలు పీహెచ్‌సీల పరిధిలో జరిగిన నార్మల్, సిజేరియన్ డెలివరీలు

పీహెచ్‌సీ	మొత్తం ప్రసవాలు	సాధారణ ప్రసవాలు	సిజేరియన్లు	ఇళ్లలో/మార్గమధ్యలో జరిగినవి
జుక్కల్	4,161	2,506	1,155	500
పెద్ద కొడప్‌గల్	5,052	2,616	2,211	225
డోంగ్లీ	4,681	2,275	1,539	867

ఐటీ ఊరటే ▸ గేమ్ ఛేంజర్

ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంలో మోదీ సర్కారు తాజా బడ్జెట్లో ప్రకటించిన ఐటీ ఊరట ప్రధాన పాత్ర పోషించింది. ఈ నిర్ణయంతో రాజధాని నగరంలో ఏకంగా మూడింట రెండొంతుల దాకా ఉండే ప్రభుత్వోద్యోగులు, వేతన జీవుల్లో అత్యధికులు ఆ పార్టీవైపు మొగ్గారు. మధ్య తరగతి, పూర్వాంచల్ ఓటర్ల మద్దతు దానికి తోడైంది. వీటికి తోడు 2015, 2020ల్లో ఆప్‌కు అండగా నిలిచిన పలు వర్గాల ఓటర్లు కూడా ఈసారి కమలం పార్టీ వైపు మొగ్గారు. సాధారణంగా కేజ్రీవాల్ పార్టీకి మద్దతుదార్లయిన మహిళలు సైతం ఈసారి బీజేపీకి జైకొట్టారు. వారికి నెలకు రూ.2,500 అందిస్తామన్న హామీ బాగా పేలింది. పంజాబ్‌లో మహిళలకు నెలకు రూ.1,000 ఇస్తామన్న హామీని గెలిచాక నిలబెట్టుకోకపోవడం ఆప్‌కు ప్రతికూలంగా మారింది.

ఢిల్లీలో మధ్య తరగతి ప్రజలు అధికం. ఉద్యోగాలు, చిన్నపాటి వ్యాపారాలతో వారు ఉపాధి పొందుతుంటారు. రూ.12 లక్షల వార్షిక ఆదాయానికి ఆదాయ పన్ను పూర్తిగా మినహాయిస్తూ ఢిల్లీ పోలింగ్‌కేవలం నాలుగు రోజుల ముందు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో మోదీ సర్కారు ప్రకటించడం తెలిసిందే. పన్ను భారం తొలగిపోవడం ఆ ఎంతగానో ఊరటనివ్వడంతో వేతన జీవులు ఓటు రూపంలో బీజేపీ పట్ల కృతజ్ఞత చూపినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్ నుంచి వచ్చి ఢిల్లీలో స్థిరపడిన పూర్వాంచల్ ఓటర్లు మొత్తం ఓటర్లలో ఏకంగా 30 శాతం దాకా ఉంటారు. వారి ప్రగతిపై ప్రత్యేకంగా దృష్టి పెడతామన్న బీజేపీ హామీ ఆకట్టుకుంది. దీనికి తోడు యూపీ, బిహార్ల నుంచి పెద్ద సంఖ్యలో జనాన్ని తెచ్చి ఢిల్లీలో ఓటర్లుగా చేర్పిస్తున్నారన్న కేజ్రీవాల్ ఆరోపణలు, వారంతా ఫేక్ ఓటర్లన్న విమర్శలు పూర్వాంచల్ ప్రజలకు ఆగ్రహానికి కారణమయ్యాయి. దాంతో వారంతా బీజేపీకే ఓటేశారు. పదేళ్ల ఆప్ పాలనలో తమకు ఒరిగిందేమీ లేదంటూ ప్రజల్లో నెలకొన్న భావన కూడా కేజ్రీవాల్‌కు ప్రతికూలంగా మారింది.

ఆరెస్సెస్ నిశ్శబ్ద ప్రచారం

ఢిల్లీ ఎన్నికల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) బీజేపీ విజయం కోసం నిశ్శబ్దంగా పని చేసుకుంటూ వెళ్లింది. అవినీతి రహిత, పారదర్శకమైన పాలన కావాలంటే బీజేపీని గెలపించాలని సంఘ్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేశారు. వారు ఇంటింటా తిరిగారు. బీజేపీ గెలుపులో సంఘ్ పాత్ర తక్కువేమీ కాదు. చిన్నచిన్న సభలు వందల సంఖ్యలో నిర్వహించారు. ఆప్ ప్రభుత్వ వైఫల్యాలను సమర్థవంతంగా ఎండగట్టారు. ఢిల్లీ మోడల్ అంటూ ఆప్ నేతలు చేస్తున్న ప్రచారంలోని డొల్లతనాన్ని బయటపెట్టారు. ఇక ఆప్ ప్రభుత్వ పెద్దల అవినీతి గురించి ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పగలిగారు. రాజకీయ పార్టీల కంటే ముందే సంఘ్ కార్యకర్తలు ప్రచారం ప్రారంభించారు. మురికివాడలు, అనధికారిక కాలనీల్లోకి వేగంగా చొచ్చుకెళ్లారు. అక్కడి ప్రజలను ఆకట్టుకున్నారు. ప్రచారం చేసి పేరు ప్రతిష్టలు కోరుకోవడం, నిత్యం ప్రసార మాధ్యమాల్లో కనిపించడం సంఘ్ కార్యకర్తలకు ఇష్టం ఉండదు. తెరవెనుక నిశ్శబ్దంగా పని చేయడానికే వారు ఆసక్తి చూపుతారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

బీజేపీకి ప్రధానంగా లాభించింది అదే
- ఆ పార్టీవైపు మొగ్గిన వేతన జీవులు
- మధ్యతరగతి, పూర్వాంచల్ ఓటర్ల అండ

8వ వేతన సంఘంతో లబ్ధి

సరిగ్గా ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఎనిమిదో వేతన సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం బీజేపీకి లబ్ధి చేకూర్చింది. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఎనిమిదో వేతన సంఘంతో వారి వేతనాలు పెరుగనున్నాయి. నిజానికి ఉచిత పథకాలకు బీజేపీ బద్ధ వ్యతిరేకి. అయినప్పటికీ ఢిల్లీ ఎన్నికల్లో ఉచిత పథకాలకు వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఆప్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ యథాతథంగా అమలు చేస్తామని ప్రకటించింది. దాంతో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు బీజేపీని ఆదరించారు. ఉచిత విద్యుత్, ఉచిత బస్సు వంటి పథకాలు ఎప్పటిలాగే అమలవుతాయి కాబట్టి బీజేపీకి ఓట్లు వేశారు. యమునా నదిని ఎగువన ఉన్న హరియాణా ప్రభుత్వం కలుషితం చేస్తోందంటూ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించడం వివాదాస్పదంగా మారింది. హరియాణా ప్రజలు ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని హరియాణా ఓటర్లు కేజ్రీవాల్ పార్టీకి వ్యతిరేకంగా ఓటేశారు.



న్యూఢిల్లీ స్థానంలో కేజ్రీవాల్‌పై గెలిచాక కౌంటింగ్ కేంద్రం వద్ద కాషాయ జెండాతో బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ ఆనందోత్సాహాలు

ఢిల్లీలో ప్రధాని మోదీ కటౌట్‌తో బీజేపీ కార్యకర్తల విజయోత్సవాలు



ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద విజయ సంకేతం చూపుతున్న ప్రధాని మోదీ

ఢిల్లీలో గత మూడు ఎన్నికల్లో పార్టీల ప్రదర్శన

2015

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	3	32.6
ఆప్	67	54.3
కాంగ్రెస్	0	9.7
ఇతరులు	0	0.5

2020

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	8	38.5
ఆప్	62	53.6
కాంగ్రెస్	0	4.3
ఇతరులు	0	3.7

2025

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	48	47.15
ఆప్	22	43.57
కాంగ్రెస్	0	6.34
ఇతరులు	0	2.94

జెయింట్ కిల్లర్ పర్వేశ్ వర్మ

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై నెగ్గిన బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ(47) పేరు మార్మోగిపోతోంది. న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్‌పై 4,089 ఓట్ల తేడాతో ఆయన జయకేతనం ఎగురవేశారు. జెయింట్ కిల్లర్‌గా అవతరించారు. వర్మకు 30,088 ఓట్లు, కేజ్రీవాల్‌కు 25,999 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్‌కు 4,568 ఓట్లు లభించాయి. పశ్చిమ ఢిల్లీకి చెందిన పర్వేశ్ వర్మ రెండుసార్లు ఎంపీగా విజయం సాధించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన అభ్యర్థిత్వం ఖరారు కాకముందు నుంచే ప్రచారం ప్రారంభించారు. ఓటర్లకు చేరువయ్యారు. ఎన్నికలకు రెండు నెలల ముందే ఇంటికి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గరిష్ట స్థాయిలో ఓటర్లను కలుసుకున్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడైన పర్వేశ్‌వర్మ ఈ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఓడించి, బీజేపీ తరఫున నూతన ముఖ్యమంత్రి రేసులో ముందంజలో ఉన్నారు.

బాల్యం నుంచే సంఘ్ భావజాలం

పర్వేశ్ వర్మ 1977 నవంబర్ 7న ఢిల్లీలో జన్మించారు. చిన్నప్పుడే రాజకీయాలపై ఆసక్తి కనబర్చారు. తండ్రి బాటలో నడుస్తూ 1991లో ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. బాల స్వయంసేవక్‌గా పనిచేశారు. అనంతరం బీజేపీ యువమోర్చాలో చేరారు. యువమోర్చా జాతీయ కార్యనిర్వాహక సభ్యుడయ్యారు. తర్వాత ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. 2013 ఎన్నికల్లో ఢిల్లీలోని మెహ్రౌలీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2015లో పశ్చిమ ఢిల్లీ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. 2019లో అదే నియోజకవర్గంలో 4.78 లక్షల ఓట్ల మెజార్టీతో మరోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ కార్యనిర్వాహక సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. తండ్రి సాహిబ్‌సింగ్ వర్మ స్థాపించిన 'రాష్ట్రీయ స్వాభిమాన్' అనే సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకుంటున్నారు. ఆర్థిక సాయం అందిస్తున్నారు. మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్ అయిన పర్వేశ్ వర్మ మంచి వక్తగా పేరుగాంచారు. ఇప్పటి ఎన్నిల్లో కేజ్రీవాల్‌ను తానే ఢీకొట్టబోతున్నానని బహిరంగంగా ప్రకటించారు. రెండుసార్లు సీఎంగా పనిచేసిన షీలా దీక్షిత్‌ను ఓడించి కేజ్రీవాల్ సీఎం అయ్యారు. రెండుసార్లు సీఎంగా వ్యవహరించిన కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ శర్మ సీఎం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



తల్లి ఆశీస్సులు తీసుకుంటున్న పర్వేశ్ వర్మ

రెండు జాతీయ పార్టీలకు నోటా కంటే తక్కువ ఓట్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల డేటా విశ్లేషణలో ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. ఢిల్లీ ఓటర్లు గుర్తింపు పొందిన జాతీయ పార్టీలైన బీఎస్పీ, సీపీఎం కంటే నోటా (నాన్ ఆఫ్ ది ఎబవ్)ఆప్షన్ వైపే ఎక్కువగా మొగ్గు చూపారని తేలింది. మొత్తం పోలైన ఓట్లలో నోటా ఆప్షన్‌కు 0.57 శాతం ఓట్లు పడగా బీఎస్పీకి 0.55 శాతం, సీపీఎంకు 0.01శాతం మంది మాత్రమే ఓటేయడం గమనార్హం. ఈ రెండు పార్టీలకు దక్కిన ఓట్ల కంటే నోటా ఓట్ల శాతమే ఎక్కువ. ఈ ఎన్నికల్లో సీపీఐకి 0.01, జేడీయూకు 0.53 శాతం ఓట్లు పడ్డాయి.

ఫైళ్లు, రికార్డులు భద్రం: జీఏడీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో అధికార పగ్గాలు చేతులు మారనున్న వేళ సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. ఫైళ్లు, డాక్యుమెంట్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను తగు అనుమతులు లేకుండా సెక్రటేరియట్ నుంచి వెళ్లడానికి వీల్లేదని, వాటిని సురక్షితంగా ఉంచాలని సంబంధిత విభాగాల అధిపతులకు అందులో స్పష్టంగా వివరించింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సూచనలను అనుసరించి జీఏడీ ఈ మేరకు అన్ని విభాగాలు, ఏజెన్సీలు, మంత్రుల క్యాంపు కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేసింది.

మిల్కిపూర్‌లో బీజేపీ ఘన విజయం

అయోధ్య: యూపీలోని అయోధ్య జిల్లాలో మిల్కిపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ ఘన విజయం సాధించింది. దీంతో, ఈ జిల్లాలోని అన్ని స్థానాలూ బీజేపీ వశమైనట్లయింది. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మిల్కిపూర్ (ఎస్సీ) ఎమ్మెల్యే అవధేశ్ ప్రసాద్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఫైజాబాద్ నుంచి పోటీ చేసి విజయం సాధించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ సీటును తిరిగి నిలబెట్టుకోవాలని అవధేశ్ ప్రసాద్ కుమారుడు అజిత్ ప్రసాద్‌ను బరిలోకి దించింది. అయితే, బీజేపీ అభ్యర్థి చంద్రభాను పాశ్వాన్ 61,710 ఓట్ల మెజారిటీతో అజిత్‌పై ఘన విజయం సాధించారు. అదేవిధంగా, తమిళనాడులోని ఈరోడ్(ఈస్ట్)స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార డీఎంకే విజయం సాధించింది. డీఎంకే అభ్యర్థి చందిర కుమార్, సమీప ప్రత్యర్థి నామ్ తమిళర్ కట్చి(ఎన్‌టీకే)కు చెందిన ఎంకే సీతాలక్ష్మిపై 91 వేల పైచిలుకు ఓట్లతో తిరుగులేని గెలుపు సాధించారు. ఈరోడ్(ఈస్ట్) నుంచి ఎన్నికైన కాంగ్రెస్‌కు చెందిన ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతితో ఈ ఉప ఎన్నిక జరిగింది.

పార్టీలు మారి.. పరాజితులయ్యారు

మొత్తం 25 మందిలో గెలిచింది 8 మందే

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు కండువాలు మార్చుకుని బరిలోకి దిగిన వారిని ప్రజలు తిరస్కరించారు. పార్టీలు మారి పోటీ చేసిన మొత్తం 25 మంది నాయకుల్లో కేవలం 8 మందిని మాత్రమే ఓటర్లు గెలిపించారు. మిగతా 15 మందికి పరాజయం తప్పలేదు. ఈ ఎన్నికల్లో దాదాపు ప్రతి పార్టీ బయటి పార్టీల నుంచి వచ్చిన వారిని రంగంలోకి దించాయి. ఇతర పార్టీల తిరుగుబాటుదార్లకు ఆమ్ ఆద్మీ పార్టీ అత్యధికంగా 11 మందికి, బీజేపీ ఏడుగురికి, కాంగ్రెస్ ఐదుగురికి టిక్కెట్లిచ్చాయి. అయితే, ఆప్ తరఫున పోటీ చేసిన 11 మందిలో నలుగురు మాత్రమే గెలవగా.. ఏడుగురు ఓడిపోయారు. బీజేపీ నుంచి పోటీ చేసిన ఏడుగురిలో నలుగురు విజయం సాధించగా, ముగ్గురు ఓటమి చెందారు. అదే సమయంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరి పోటీకి దిగిన ఐదుగురిలో ఒక్కరు కూడా గెలవలేకపోయారు.

అవినీతే ఆప్‌ను ముంచింది
నలుగురు ముస్లింల ఎన్నిక
మీమ్స్ వరద
అసత్యాలు, మోసానికి ముగింపు: అమిత్‌షా

ప్రత్యేక కథనాలు ఈ-ప్లస్ పేజీలో...

స్వయంకృతాపరాధమే..

అవినీతి కేసులతో అప్రతిష్ట పాలైన ఆప్
- కేజ్రీవాల్‌తోపాటు సీనియర్ నేతల అరెస్టుతో ఆప్ పట్ల జనంలో తీవ్ర వ్యతిరేకత
- సంక్షేమ పథకాలు అమలు చేసినా మౌలిక సదుపాయాలపై నిర్లక్ష్యం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మట్టికరిచింది. హ్యాట్రిక్ కొట్టలేక చతికిలపడింది. ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పరాజయం పాలయ్యారు. సీనియర్ నేతలకు సైతం ఓటమి తప్పలేదు. గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు రావడం, ముఖ్యమంత్రి ఆతిశీ నెగ్గడం కొంతలో కొంత ఊరట కలిగించిందనే చెప్పాలి. ఆప్ ఓటమికి దారితీసిన కారణాలు ఏమిటన్న దానిపై చర్చ మొదలైంది. ఆ పార్టీలోనూ అంతర్మథనం సాగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఢిల్లీలో సంక్షేమ పథకాలు గొప్పగా అమలు చేశామని చెప్పుకున్నప్పటికీ ఓటర్లు కనికరించలేదు. ఆప్ ఓటమికి స్వయం కృతాపరాధమే కారణమన్న వాదన వినిపిస్తోంది. అవినీతి వ్యతిరేక ఉద్యమం నుంచి పుట్టుకొచ్చిన పార్టీ స్వయంగా అవినీతిలో కూరుకుపోవడం ప్రజల్లో వెగటు కలిగించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసు కేజ్రీవాల్ పార్టీ కొంపముంచినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ కేసులో కేజ్రీవాల్‌జైలుకు వెళ్లినప్పటికీ జనంలో ఏమాత్రం సానుభూతి లభించలేదు.

ఫలించిన బీజేపీ ప్రచారం

మద్యం కుంభకోణం వ్యవహారంలో కేజ్రీవాల్‌తో పాటు ఆప్ సీనియర్ నేతలపై కేసులు నమోదయ్యాయి. కొందరు మంత్రి పదవులకు రాజీనామా చేయాల్సి వచ్చింది. మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్ జైలుకెళ్లారు. ఎంపీ సంజయ్ సింగ్ అరెస్టయ్యారు. ఆప్ నేతల్లో చాలామందిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. తమ నాయకులపై కేసులన్నీ బీజేపీ కుట్రేనని ఆప్ పెద్దలు గగ్గోలు పెట్టినప్పటికీ జనం పట్టించుకోలేదు. ఇక కేజ్రీవాల్ నిర్మించుకున్న అద్దాల మేడ(శీష్ మహల్) దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ అంశాన్ని విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లడంలో బీజేపీ విజయవంతమైంది. అద్దాల మేడ వ్యవహారం ఎన్నికల్లో కీలక ప్రచారాంశంగా మారిపోయింది. అవినీతి రహిత, స్వచ్ఛమైన పాలన అందిస్తానంటూ అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ ఆ మాట నిలబెట్టుకోలేకపోయారు. పైకి నిరాడంబరంగా కనిపించే కేజ్రీవాల్ భారీగా ఆస్తులు పోగేసుకొని విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని బీజేపీ నేతలు చేసిన ఆరోపణలు ప్రజలను ఆలోచింపజేశాయి.

'డబుల్ ఇంజన్'కు ఆమోదం!

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌తో ఆప్ ప్రభుత్వం తరచుగా ఘర్షణకు దిగింది. పరిపాలనా సంబంధిత అంశాల్లో ఆయనను వ్యతిరేకించడం, కేంద్ర ప్రభుత్వాన్ని ధిక్కరిస్తున్నట్లు వ్యవహరించడం జనానికి నచ్చలేదు. పరిపాలనకు అడ్డంకులు సృష్టిస్తున్నారని లెఫ్టినెంట్ గవర్నర్‌పై, కేంద్రంపై నిందలు వేసినప్పటికీ ఓటర్లు విశ్వసించలేదు. ఆప్ అంటే ఆపద అని ప్రధాని మోదీ సహా బీజేపీ అగ్రనేతలు ప్రచారం చేశారు. పచ్చి అవినీతి పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. బీజేపీ ప్రచారాన్ని ఆప్ నేతలు గట్టిగా తిప్పికొట్టలేకపోయారు. అద్దాల మేడపై ఏం సమాధానం చెప్పాలో వారికి తోచలేదు. ఢిల్లీ అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావాలని బీజేపీ నేతలు పదేపదే చెప్పడం ఓటర్లపై ప్రభావం చూపినట్లు కనిపిస్తోంది. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ ప్రభుత్వం ఉంటే మేలు జరుగుతుందన్న అభిప్రాయం జనంలో నెలకొంది. బీజేపీకి ఒక్క అవకాశం ఇచ్చిచూద్దామన్న నిర్ణయానికి వారు వచ్చారు. ఢిల్లీ ఓటర్లకు ఆప్ పలు ఉచిత హామీల్చింది. అవి కూడా గట్టెక్కించలేదు.

బీజేపీకి లాభించిన విపక్షాల అనైక్యత

జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పాటైన 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్, ఆప్ భాగస్వామ్య పక్షాలు. ఢిల్లీ ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ చేయాల్సిన ఈ రెండు పార్టీలు విడివిడిగా బరిలోకి దిగాయి. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేసిన కాంగ్రెస్, ఆప్ ఈ ఎన్నికల్లో పరస్పరం కత్తులు దూసుకున్నాయి. ఆప్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఆప్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. రెండు పార్టీలు మొత్తం 70 స్థానాల్లో తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. బీఎస్పీ, వామపక్షాలు, ఎంఐఎం, ఆజాద్ సమాజ్ పార్టీ, ఎన్సీపీ వంటివి తమకు బలం ఉన్న చోట పోటీ పడ్డాయి. ఫలితంగా బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోయాయి. చాలాచోట్ల ఆమ్ ఆద్మీ పార్టీకి రావాల్సిన ఓట్లను కాంగ్రెస్ కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఇండియా కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా పోటీ చేస్తే ఫలితం మరోలా ఉండేదని విశ్లేషకులు అంటున్నారు. ఏదేమైనప్పటికీ ప్రతిపక్షాల అనైక్యత కారణంగా చివరకు బీజేపీ లబ్ధి పొందింది.

- సాక్షి, నేషనల్ డెస్క్




మార్పు కోరుకున్న జనం

ఆప్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసినప్పటికీ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్న విమర్శలు ఉన్నాయి. పదేళ్ల పాలనలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చలేదు. నగరంలో అస్తవ్యస్తమైన మారిన డ్రైనేజీ వ్యవస్థ, పెరిగిపోయిన కాలుష్యం, మురికికూపంగా మారిన యమునా నది, స్వచ్ఛమైన తాగునీరు, గాలి లభించకపోవడం ఓటర్లు మనసు మార్చేసింది. అంతేకాకుండా పదేళ్లుగా అధికారంలోకి కొనసాగుతున్న ఆప్‌పై సహజంగానే కొంత ప్రజావ్యతిరేకత ఏర్పడింది. జనం మార్పును కోరుకున్నారు. అవినీతి ఆరోపణలు చుట్టుముట్టడం, అభివృద్ధి లేకపోవడం కేజ్రీవాల్ విశ్వసనీయతను దిగజార్చాయి. ఈ పరిణామాలను బీజేపీ ఎంచక్కా సొమ్ము చేసుకుంది.

స్తంభించిన పాలన

కేజ్రీవాల్ అరెస్టు కావడం, జైలుకెళ్లడం, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం ఆప్ ప్రతిష్టను దారుణంగా దిగజార్చింది. ఆయన తర్వాత సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కేజ్రీవాల్ తర్వాత బీజేపీని ఢీకొట్టే స్థాయి కలిగిన బలమైన నాయకులు లేకపోవడం ఆమ్ ఆద్మీ పార్టీకి ప్రతికూలంగా మారింది. చాలా మంది సీనియర్లు ఓడిపోవడంతో ఈ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని చెప్పుకొనే పరిస్థితి లేకుండాపోయింది. కేజ్రీవాల్ అరెస్టు కావడంతో పరిపాలన చాలావరకు స్తంభించింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో గత ఏడాది మార్చి నెలలో ఆయన అరెస్టయ్యారు. వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయలేదు. కేంద్రం ఎదుట తలవంచబోనని తేల్చి చెప్పారు. ఈ కేసులో బెయిల్ వచ్చి జైలు నుంచి విడుదలైన తర్వాత ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకున్నారు. ప్రజలు ఇచ్చే నిజాయితీ సర్టిఫికెట్‌తో మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని కేజ్రీవాల్ చెప్పినప్పటికీ అది నెరవేరలేదు.



మూడోసారీ 'సున్నా'!

ఢిల్లీ ఎన్నికల్లో పూర్తిగా చతికిలపడ్డ కాంగ్రెస్ పార్టీ

హామీల వర్షం కురిపించినా లెక్కచేయని ఓటర్లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో పూర్వ వైభవాన్ని సాధించాలని ఆశపడ్డ కాంగ్రెస్ పార్టీకి వరుసగా మూడోసారి కూడా భంగపాటే ఎదురైంది. అధికార పీఠాన్ని అధిరోహించే శక్తి లేకున్నా కనీసం తమ అస్థిత్వాన్ని నిలుపుకోవాలన్న ఆశలపై ఢిల్లీ ఓటర్లు పూర్తిగా నీళ్లు చల్లారు. హ్యాట్రిక్ విజయాలతో 1998 నుంచి వరుసగా 15 ఏళ్ల పాటు ఢిల్లీని పరిపాలించిన కాంగ్రెస్ ఆ తర్వాత హ్యాట్రిక్ పరాజయాలు నమోదు చేసింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క స్థానం కూడా గెలుచుకోలేకపోయింది. వరుసగా మూడు సార్లు ఓడిపోవడం కాంగ్రెస్ శ్రేణులకు తీవ్ర నిరాశకు గురిచేసింది. గత ఎన్నికల కంటే కొంత మెరుగైన స్థాయిలో ఓట్లు సాధించినప్పటికీ సీట్ల ఖాతా తెరవలేదు.

దెబ్బకొట్టిన ఒంటరి పోరు

ఢిల్లీలో 2015, 2020 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా నెగ్గని కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో కనీసంగా 10 స్థానాలు గెలుచుకోవాలన్న లక్ష్యంతో బరిలోకి దిగింది. ఇందుకు అనుగుణంగా ఎన్నో హామీలు ఇవ్వడంతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు ప్రచారం నిర్వహించారు. అయితే అధికార ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు లేకపోవడం దెబ్బకొట్టింది. అడిగినన్ని సీట్లు ఇచ్చేందుకు ఆప్ నిరాకరించడంతో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసింది. ప్రధాన పోటీ బీజేపీ, ఆప్‌ల మధ్యే కొనసాగుతుండటంతో కాంగ్రెస్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. 2008లో 48 శాతం ఓట్లతో 43 సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ 2013లో 24.70 శాతం సీట్లతో 7 సీట్లకు పరిమితమైంది. 2015లో కాంగ్రెస్‌కు 9.7 శాతం, 2020లో 4.3 శాతం ఓట్లు వచ్చినా ఒక్క సీటు కూడా గెలువలేదు. ఇక ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీ దాదాపు 6.38 శాతం ఓట్లను రాబట్టుకుంది. 70 శాతానికి పైగా అభ్యర్థులు డిపాజిట్లు సైతం కోల్పోయారు. ఆప్‌తో పొత్తుపెట్టుకొని పోటీ చేస్తే కనీసం ఖాతా తెరిచే పరిస్థితి అయినా ఉండేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

పనిచేయని హామీలు

ఢిల్లీ అసెంబ్లీలో ఎలాగైనా పాగా వేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఓటర్లపై అనేక హామీలు గుప్పించింది. ఎన్నికలకు కొన్ని నెలల ముందే ఐదు గ్యారంటీలను ప్రకటించింది. 'ప్యారీ దీదీ యోజన' కింద మహిళలకు నెలకు రూ.2,500, రూ.500లకే ఎల్‌పీజీ సిలిండర్, కుటుంబాలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్, పింఛను రూ.2,500 నుంచి రూ.5,000కు పెంపు, నిరుద్యోగ యువతకు ఏడాది పాటు నెలకు రూ.8,500 ఆర్థిక సహాయం వంటి హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లింది. తన మేనిఫెస్టోలో సైతం కులగణన , మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, వితంతువుల కుమార్తెల పెళ్లికి రూ.1.10 లక్షల ఆర్థిక సాయం, ఢిల్లీవ్యాప్తంగా 100 ఇందిరా క్యాంటీన్ల ఏర్పాటు వంటి హామీలతో ముందుకెళ్లినా ఆ పార్టీని జనం పట్టించుకోలేదు. వీటికి తోడు యమునా నదీ కాలుష్యాన్ని ప్రచారాస్త్రంగా మలుచుకున్నా ఉపయోగపడలేదు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితరులు ప్రచారం చేసినా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కాంగ్రెస్ కీలక నేతలైన సందీప్ దీక్షిత్ న్యూఢిల్లీ నియోజకవర్గంలో 25,520 ఓట్ల తేడాతో ఓటమి చెందగా, కల్కాజీ నియోజకవర్గంలో అల్కా లాంబ 47,691 ఓట్ల తేడాతో, నాంగ్‌లోయి నుంచి రోహిత్ చౌదరి 36,401 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పతనం

ఏడాది	పోటీ చేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
1998	70	52	47.75
2003	70	47	48.13
2008	70	43	4.31
2013	70	8	11.4
2015	70	0	9.7
2020	66	0	4.26
2025	70	0	6.38

సాక్షి
కరీంనగర్
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025

స్వామివారి ఊరేగింపులో భక్తజనం





తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, ఈవో



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

కమనీయం.. మత్స్యగిరీంద్రుని కల్యాణం

శంకరపట్నం(మానకొండూర్): కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి, భూదేవి, నీలాదేవి కల్యాణం శనివారం కనులపండువగా జరిపించారు. వీణవంక మండలం బేతిగల్‌కు చెందిన విడపు వంశస్తులు స్వామివారి తరఫున పుస్తె, మెట్టెలు తీసుకువచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపెల్లి మోహన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఈవో సుధాకర్, ధర్మకర్తలు, యజ్ఞాచార్యులు రామకృష్ణమాచార్యులు, అర్చకుడు శేషం మురళీధరాచార్యులు పాల్గొన్నారు. కొత్తగట్టు గుట్ట ఘాట్ రోడ్డుపైకి కార్లు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. రాజకీయ నాయకులు, పోలీసులు సిఫార్సు చేసిన వాహనాలనే పంపించారని పలువురు ఆరోపించారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

హనుమ వాహనంపై శ్రీవారు

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ మార్కెట్ రోడ్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మూలమంత్ర, సుదర్శన హవనాలు వైభవంగా నిర్వహించారు. బలిహరణం, తీర్థగోష్ఠి, అన్నకూటోత్సవం జరిపారు. శ్రీవారికి ఆలయ మాడ వీధుల్లో హనుమ వాహనంపై ఊరేగింపు చేపట్టారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, కళాభారతి, బస్టాండ్, సీపీ కార్యాలయం, కలెక్టర్ బంగ్లా మీదుగా తిరిగి ఆలయానికి చేరారు. ఉత్సవమూర్తులకు సహస్ర దీపాలంకరణ నేత్రపర్వంగా సాగింది. కళా వేదికపై నటరాజ నృత్యాలయం బృందం మాస్టర్ సుభాన్ మోహన్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం మహాపూర్ణాహుతి, పుష్పయాగం, వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆలయ నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.



న్యూస్‌రీల్

మహిళా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం



నియామక పత్రాలు అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, పక్కన సత్యప్రసన్న

కరీంనగర్ కార్పొరేషన్: జిల్లాలోని పలు పట్టణాలు, మండలాలకు మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు నియమితులయ్యారు. హుజూరాబాద్ పట్టణ అధ్యక్షురాలిగా ఎముల పుష్పలత, జమ్మికుంట పట్టణ అధ్యక్షురాలిగా పూదరి రేణుక, చొప్పదండి పట్టణ అధ్యక్షురాలిగా గుంటి స్వరూపను నియమించారు. చిగురుమామిడి మండల అధ్యక్షురాలిగా పోలు స్వప్న, హుజూరాబాద్ మండల అధ్యక్షురాలిగా పుల్ల రాధమ్మ, చొప్పదండి మండల అధ్యక్షురాలిగా చిలుముల స్వప్న, తిమ్మాపూర్ మండల అధ్యక్షురాలిగా రాచపల్లి సరితను నియమించారు. అలాగే, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎండీ.హసీనా, మారుపాక మంజుల, ఎన్నం రజిత రెడ్డి, కాలువ స్వప్న, మానకొండూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కవ్వ పద్మ నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సత్యప్రసన్నరెడ్డి సూచించారు.

ఆప్ పాలనకు చరమగీతం



స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చరిత్ర తిరగరాసిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఢిల్లీలో బీజేపీ గెలుపుపై శనివారం కరీంనగర్‌లో సంబరాలు నిర్వహించారు. ఆప్ పాలనకు అక్కడి ప్రజలు చరమగీతం పాడారని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ పార్టీ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకుడు కన్నబోయిన ఓదెలు, కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

చొప్పదండి: చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిది, పదకొండవ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తొమ్మిదో తరగతి పరీక్షకు 1,340 మంది దరఖాస్తు చేసుకోగా 802 మంది, పదకొండవ తరగతి పరీక్షకు 1,278 మంది దరఖాస్తు చేసుకోగా 1,021 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన విద్యాలయ చైర్మన్, కలెక్టర్ పమేలా సత్పతి, డీఈవో జనార్దన్‌రావు, ఇతర అధికారులకు జేఎన్‌వీ ప్రిన్సిపాల్ మంగతాయారు కృతజ్ఞతలు తెలిపారు. ఫలితాలు త్వరలోనే విడుదలవుతాయని పేర్కొన్నారు.

'సదరం' షెడ్యూల్ విడుదల

కరీంనగర్ అర్బన్: సాంకేతిక కారణాలతో వాయిదా పడిన సదరం శిబిరాలకు శనివారం షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 10 నుంచి కేటగిరీల వారీగా కరీంనగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్యాంపులు జరుగుతాయని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 10, 11, 12వ తేదీల్లో శారీరక వికలాంగులు, 13న మూగ, చెవుడు, 17న కంటిచూపు, 18న మానసిక వికలాంగులకు పరీక్షలు జరుగుతాయన్నారు. రెన్యువల్, నూతన సర్టిఫికెట్లకు ఈ నెల 9 నుంచి స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

స్వశక్తి లక్ష్యానికి పరుగులు

- రూ.2,548 కోట్ల రుణ లక్ష్యాన్ని చేరేందుకు డీఆర్‌డీవోల ఆరాటం
- ఇప్పటికే మహిళా సంఘాలకు రూ.2,181 కోట్లు గ్రౌండింగ్
- ఉమ్మడి జిల్లాలో కరీంనగర్‌ది మొదటిస్థానం
- 40 వేల పైచిలుకు సంఘాల్లో 21 వేల సంఘాలకు లబ్ధి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు రుణాల మంజూరులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)లు వేగం పెంచాయి. మార్చి కల్లా అన్ని స్వశక్తి సంఘాలకు విధించిన బ్యాంకు లింకేజీ రుణాల టార్గెట్‌ను చేరుకునేలా పరుగులు తీస్తున్నాయి. వాస్తవానికి జనవరి చివరి నాటికి అన్ని జిల్లాలు దాదాపు 80 శాతానికి పైగా టార్గెట్ చేరుకోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో కలిపి మొత్తం 40 వేల పైచిలుకు స్వయం సహాయక సంఘాలుంటే రూ.2,548 కోట్ల రుణం ఇచ్చేందుకు మార్చి ఆఖరునాటికి టార్గెట్ విధించారు. ఇందులో ఈ నెల 6వ తేదీ వరకు రూ.2,181 కోట్ల(80 శాతానికి పైగా) గ్రౌండింగ్ పూర్తయింది. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం చిరువ్యాపారాలు, కుటీర పరిశ్రమలు నెలకొల్పునేందుకు మహిళా సంఘాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా రుణాలు మంజూరు చేస్తున్నారు. రుణాలు మంజూరవుతున్న తీరు చూస్తే ఈ నెలాఖరు నాటికే 100 శాతం లక్ష్యం చేరుకునేలా ఉన్నారు.

కరీంనగర్ జిల్లాలో 87.4 శాతం..

ఉమ్మడి జిల్లాలోని జగిత్యాలలో 12 వేలు, కరీంనగర్‌లో 11 వేలు, పెద్దపల్లి 9 వేలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 8 వేలకు పైగా మహిళా సంఘాలున్నాయి. వీటిలో 21,018 సంఘాలకు రుణాలు మంజూరయ్యాయి. ఈ విషయంలో కరీంనగర్ అధికారులు ముందంజలో ఉన్నారు. వీరికి రూ.771.21 కోట్లు టార్గెట్ విధించగా.. ఇప్పటివరకు వీరు 87.4 శాతం అంటే రూ.674.04 కోట్ల మేర రుణాల మంజూరు చేసి, అగ్రస్థానంలో నిలిచారు. ఆ తర్వాతి స్థానంలో జగిత్యాల రూ.651 కోట్లు (85.11 శాతం), రాజన్న సిరిసిల్ల రూ.451 కోట్లు (84.67 శాతం), పెద్దపల్లి అధికారులు రూ.404 కోట్లు(84.12శాతం) మంజూరు చేశారు.

వద్దంటే రుణాలన్న ఆరోపణలు..

అయితే, అధికారులు వద్దంటే స్వశక్తి సంఘాలకు రుణాలు అంటగడుతున్నారన్న ఆరోపణలున్నా యి. పాత జిల్లాలో 40 వేలకు పైగా సంఘాలుంటే.. వీటిలో 21 వేల సంఘాలే 100 శాతం రుణాలు తీసుకునేలా చేయ డం వారి ఒత్తిడికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాల్లో వెనకబడ్డ మండలాల్లో పరిస్థితిపై గూగుల్ మీట్ ద్వారా అధికారులు సమీక్ష చేస్తున్నారు. అక్కడ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం), అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్(ఏపీఎం), కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ (సీసీ), విలేజ్ ఆఫీసర్(వీవో)ల ద్వారా కారణాలు అడిగి తెలుసుకుంటున్నారు. కొన్ని గ్రూపుల్లో అవసరం లేకున్నా బలవంతంగా రుణాలు ఇప్పిస్తున్నారన్న విషయమై కరీంనగర్ డీఆర్‌డీవోను వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదన్నారు. అవసరం లేనివారు తప్పనిసరిగా తీసుకోవాలన్న నిబంధనేమీ లేదని, వారి పేరిట రూ.జీరో లోన్ అని పెట్టేయవచ్చని పేర్కొన్నారు. ప్రతీరోజు పరిస్థితిని సమీక్షిస్తున్నామని, ఈ నెలాఖరుకు 100 శాతం టార్గెట్ చేరుకుంటామని తెలిపారు.

సీసీఎల్ విధానంతో పెరిగిన రుణాలు

వాస్తవానికి ఐదారేళ్ల క్రితం టర్మ్ విధానంలో రుణాల పద్ధతి ఉండేది. అంటే ఒక స్వశక్తి గ్రూపు(కనీసం 10 నుంచి 15 మంది సభ్యులు) గతంలో రూ.10 లక్షల రుణం తీసుకొని, అందులో రూ.3 లక్షలు బకాయి ఉంటే.. అవి చెల్లించేవరకు కొత్త రుణం ఇచ్చేవారు కాదు. ఐదేళ్లుగా క్యాష్ క్రెడిట్ బేస్డ్ లోన్ (సీసీఎల్) విధానం రావడంతో అదే సంఘం మరోసారి రూ.15 లక్షలకు అర్హత సాధించాలి. కానీ, బకాయి పడ్డ రూ.3 లక్షలు మినహాయించుకొని, వారికి రూ.12 లక్షలు మంజూరు చేస్తున్నారు. దీంతో కొత్త లోన్లకు డిమాండ్ పెరిగిందని డీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు.

మహిళా సంఘాలు, రుణాల వివరాలు

జిల్లా	సంఘాలు	రుణం పొందినవి	లక్ష్యం (రూ.కోట్లు)	ఇచ్చిన రుణాలు (రూ.కోట్లు)
కరీంనగర్	11,083	6,244	771.21	674.04
జగిత్యాల	12,636	6,354	765.63	651.63
సిరిసిల్ల	8,007	3,603	533.13	451.42
పెద్దపల్లి	9,101	4,817	477.96	404.31

ప్రశ్నించేవారికే పట్టం కట్టండి



సంకల్ప యాత్రకు హాజరైన బీజేపీ నాయకులు

- పట్టభద్రులు, టీచర్ల సమస్యలపై కొట్లాడింది బీజేపీనే..
- సంకల్ప యాత్రలో కేంద్రమంత్రి బండి సంజయ్
- నగరం.. కాషాయమయం

సాక్షిప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌టౌన్:

కరీంనగర్‌లో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్ప యాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నగరంలోని మార్క్‌ఫెడ్ చౌరస్తా నుంచి గీతాభవన్ చౌరస్తా భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా చేసిన ఏర్పాట్లతో నగరం కాషాయమయంగా మారింది. దారి పొడవునా స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, కటౌట్లు, ముఖ్య కూడళ్లను పార్టీ జె ండాలతో నింపేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడారు. పట్టభద్రులు, టీచర్ల సమస్యలపై కొట్లాడింది బీజేపీనేనని అన్నారు. ప్రశ్నించేవారికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్యనారాయణ, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు పాల్గొన్నారు.

అర్బన్ నక్సల్స్ చేతిలో తెలంగాణ విద్యా వ్యవస్థ



అభివాదం చేస్తున్న కేంద్రమంత్రి సంజయ్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణలోని విద్యావ్యవస్థ అర్బన్ నక్సల్స్ చేతిలో బందీగా మారిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. తెరమరుగైన అంశాలను వెలుగులోకి తెచ్చి, నేటి విద్యార్థులను అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్‌పటేల్, తాంతియా తోపే, ఛత్రపతి శివాజీ, వీర సావర్కర్‌లాగా తీర్చిదిద్దేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం నూతన విద్యావిధానం తీసుకొచ్చిందన్నారు. కానీ.. తెలంగాణ ప్రభుత్వం నక్సల్స్ భావజాలాన్ని జొప్పించి, విద్యార్థులను చంద్ర పుల్లారెడ్డి, కొండపల్లి సీతారామయ్యలాగా తయారు చేయాలని చూస్తోందని ఆరోపించారు. శనివారం రాత్రి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి గ్రామ శివారులో ఓ ప్రైవేట్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ స్కూళ్లు ర్యాంకులను కొలుగోలు చేస్తుండటం బాధాకరమన్నారు. భారతదేశంపై దండయాత్ర చేసి, ఇక్కడి ప్రజలపై అత్యాచారాలు చేసిన వాళ్లను గొప్పవాళ్లుగా చరిత్రలో చూపించడం శోచనీయమన్నారు. షాజహాన్ తాజ్‌మహల్ కట్టించాడని గొప్పగా చెప్పడం కాకుండా అది నిర్మించిన కూలీల చేతులు నరికారన్న వాస్తవాన్ని దాచిపెట్టారని, నిజాం తెలంగాణ ఆడబిడ్డలను నగ్నంగా బతుకమ్మ ఆడిస్తూ అరాచకాలు, హత్యలకు పాల్పడ్డ విషయాన్ని తెరమరుగు చేశారన్నారు.

శరవేగంగా 'కొత్తపల్లి' ఆధునీకరణ

- రూ.86.16 కోట్లతో రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు
- రవాణా టెర్మినల్‌గా రూపొందించేందుకు ప్రణాళిక
- త్వరలోనే అందుబాటులోకి..



కొత్తపల్లి రైల్వేస్టేషన్ నూతన భవనం



బ్రాడ్‌గేజ్ లైన్లు, ప్యాసింజర్ ప్లాట్‌ఫాంలు



కొత్తపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చే దారి

కొత్తపల్లి(కరీంనగర్): రైలు ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం, కనీస వసతులు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. విదేశాలతో పోటీపడేలా రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల కరీంనగర్ రైల్వేస్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కొత్తపల్లి రైల్వే జంక్షన్/స్టేషన్ ఆధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ బ్రాడ్‌గేజ్ ప్రాజెక్టులో భాగంగా ఈ జంక్షన్ నిర్మిస్తున్నారు. ఫ్రైట్ హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, కరీంనగర్‌లో రవాణా రద్దీని తగ్గించడానికి, ట్రాఫిక్ అవసరాలను తీర్చడానికి ఇది ఉపయోగపడనుంది. అంతేకాకుండా, కొత్తపల్లి–మనోహరాబాద్ బ్రాడ్‌గేజ్ (బి.జి.) లైన్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది.

మార్చి వరకు గడువు..

కొత్తపల్లి రైల్వే జంక్షన్/స్టేషన్‌ను రూ.86.16 కోట్ల అంచనా వ్యయంతో ఆధునీకరిస్తున్నారు. ఇందుకోసం 2023లో టెండర్లు పిలవగా.. పనుల పూర్తికి మార్చి 2025 వరకు గడువు విధించారు. ఇప్పటికే స్టేషన్‌కు వెళ్లేలా కొత్తపల్లి, కొక్కెరకుంట వైపు నుంచి రెండు రోడ్లు నిర్మించారు. సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి, మధ్యలో మొక్కలు నాటారు. అండర్ గ్రౌండ్ కేబిలింగ్ పనులు కొనసాగుతున్నాయి. 6 రోడ్లతో ఉన్న స్టేషన్‌లో ఒక ప్రధాన రేఖ (పెద్దపల్లి–నిజామాబాద్), 3 ప్యాసింజర్ లూప్ లైన్లు, 2 గూడ్స్ లూప్ లైన్లు, 1 టీటీఎం సైడింగ్‌లు ఉన్నాయి.

బ్రాడ్‌గేజ్ లైన్ 151.36 కి.మీ..

కొత్తపల్లి–మనోహరాబాద్ మధ్య కొత్త బ్రాడ్‌గేజ్ (బి.జి.) లైన్ (151.36 కి.మీ.) నిర్మాణానికి రూ.1,160.47 కోట్ల అంచనాతో 21 జూలై 2016న రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. కొత్త బి.జి. లైన్ ప్రస్తుతం ఉన్న మనోహరాబాద్ స్టేషన్ నుంచి ముద్కెడ్ అంచున ప్రారంభమై గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ, కొత్తపల్లి స్టేషన్‌కు జగిత్యాల్ ఎండ్ వద్ద చేరుకుంటుంది.

పరిమిత లైన్ల కారణంగా..

కొత్తపల్లి రైల్వేస్టేషన్ ప్రస్తుతం ఒక హాల్ట్ స్టేషన్‌గా ఉంది. ఇది పెద్దపల్లి–నిజామాబాద్ బి.జి. లైన్‌లో 43.32 కి.మీ. వద్ద ఒకే ప్రధాన రేఖతో ఉంది. కరీంనగర్ ఒక ముఖ్యమైన ఫ్రైట్ హబ్. పరిమిత లైన్ల కారణంగా నివాస ప్రాంతాలకు సమీపంగా ఉండటం వల్ల, సరకు రవాణా ఆపరేషన్స్‌ను ప్రభావితం చేయనుంది. ఫలితంగా సరకు రవాణా వ్యాపారానికి ఉన్న పూర్తి సామర్థ్యం వినియోగంలో లేదు.

కరీంనగర్ స్టేషన్‌కు తగ్గనున్న భారం..

కొత్తపల్లి జంక్షన్‌ను ప్రధాన రవాణా (ట్రాన్స్‌పోర్ట్) టెర్మినల్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ స్టేషన్ ఫ్రైట్ హ్యాండ్లింగ్ సదుపాయాలు కలిగి ఉండి, కరీంనగర్ స్టేషన్‌పై భారం తగ్గించనుంది. అందుకే, సౌత్ సెంట్రల్ రైల్వే ఈ స్టేషన్ నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది.

రైల్వేస్టేషన్ పనుల వివరాలు

- అంచనా వ్యయం : 86.16 కోట్లు
- ప్యాసింజర్ ప్లాట్‌ఫాంలు : 4 (2 హైలెవల్ ప్యాసింజర్, 2 రైల్ లెవల్ గూడ్స్ ప్లాట్‌ఫాంలు)
- స్టేషన్ భవనం : 783.486 చ.మీ. విస్తీర్ణంలో జీ+1 ఆర్‌సీసీ నిర్మాణం
- సదుపాయాలు : సాధారణ వేయిటింగ్ హాల్, అప్పర్ క్లాస్ వేయిటింగ్ హాల్, బుకింగ్ ఆఫీస్, టాయిలెట్లు, ఆపరేషనల్ సదుపాయాలు (రిలే గది, ఎలక్ట్రికల్ గది, స్టోర్స్).
- పనుల లక్ష్యం : మార్చి 2025

ప్రధాని విజన్‌లో భాగంగానే..



ప్రధాని నరేంద్ర మోదీ విజన్‌లో భాగంగానే దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. ఒకప్పుడు నిర్వహణ లోపం, కనీస సౌకర్యాలు లేక స్టేషన్‌లన్నీ కంపు కొడుతుండేవి. కానీ ప్రస్తుతం ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. ఎలాంటి డబ్బుకు వెనకాడకుండానే ప్రయాణికులకు అవసరమైన రవాణా సౌకర్యం, కనీస వసతులు కల్పిస్తున్నాం. అందులో భాగంగానే కొత్తపల్లి రైల్వే స్టేషన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాం.

– బండి సంజయ్‌కుమార్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి

మళ్లీ జంతు కళేబరాల నిల్వ



జంతు కళేబరాలు నిల్వ ఉంచిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని డంపింగ్ యార్డు సమీప ప్రైవేటు స్థలంలో మళ్లీ జంతు కళేబరాలు కలకలం రేపుతున్నాయి. పెద్ద ఎత్తున వాటిని ఇక్కడ నిల్వ చేస్తుండటంతో సమీప ప్రాంతాలవాసులు దుర్వాసన భరించలేకపోతున్నారు. ఇప్పటికే డంపింగ్‌యార్డుతో సమస్య ఉందంటే, జంతు కళేబరాలను తీసుకొస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం నగరపాలక సంస్థ పర్యావరణ ఇంజినీర్ స్వామి తదితరులు కళేబరాలను నిల్వ చేసిన స్థలాన్ని పరిశీలించారు. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేసి, ఇక్కడి నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలోనూ ఇక్కడ కళేబరాలను ఉంచడంతో అధికారుల చర్యల కారణంగా తాత్కాలికంగా తొలగించారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11 కేవీ విద్యానగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ లావణ్య తెలిపారు. విద్యానగర్, విజయదుర్గకాలనీ, ఆర్టీసీ వర్క్‌షాపు వెనక భాగం, రత్నం స్కూల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి


హమీద్ మృతదేహం

ధర్మపురి: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాలు.. జగిత్యాల జిల్లా భీమారం మండలం ఈదుల లింగంపేట గ్రామానికి చెందిన ఎండీ హమీద్ (35) బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి నెల క్రితం గ్రామానికి వచ్చాడు. జనవరి 27న తన స్నేహితుడితో కలిసి ధర్మపురిలోని ఓ ఇంటికి పేయింటింగ్ వేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పని చేసి ఈనెల 5న ఇంటికి వెళ్లిపోయారు. పని నిమిత్తం మళ్లీ ఈనెల 7న ధర్మపురికి వచ్చి రాత్రి ఇంటికి వెళ్లే క్రమంలో హమీద్ బహిర్భూమికి వెళ్లాడు. మూర్ఛవ్యాధితో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. మృతుడి అన్న నసీరుద్దీన్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గీతకార్మికుడు..


రాజారాం మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. నిమ్మపల్లికి చెందిన గీతకార్మికుడు దొంతరవేణి రాజారాం (65) శుక్రవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్ల వద్దకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తాటి వనం వద్ద వెతకగా మూలవాగు సమీపంలో బొప్పన బుచ్చయ్య పొలం సమీపంలో అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ముక్కునుంచి రక్తం కారినట్లు ఉండడంతో అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, రాత్రి 9 గంటలకు మృతి చెందాడు. మృతికి గల కారణాలు సరిగా తెలియడంలేదని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సారెస్పీ కెనాల్‌లో వృద్ధురాలి మృతదేహం

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని ముత్యంపేట శివారులో గల ఎస్సారెస్పీ డీ–20 కెనాల్‌లో గుర్తు తెలియని 60 ఏళ్ల వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

మజ్జిగలో బొద్దింక



జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో గల బార్ అండ్ రెస్టారెంట్‌లో మజ్జిగలో బొద్దింక వచ్చిన ఘటన జరిగింది. వివరాలు.. జగిత్యాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు సదరు బార్‌కు వెళ్లి బిర్యాని ఆర్డర్ ఇచ్చారు. దాంతో పాటు మజ్జిగ ఇవ్వగా అందులో బొద్దింక వచ్చింది. ఇదేంటని ప్రశ్నిస్తే యాజమాన్యం నుంచి స్పందన లేదు. గతంలో కూడా ఇదే బార్‌లో కుళ్లిన చికెన్, గడువు ముగిసిన వంట పదార్థాలు బయటపడ్డాయి. మున్సిపల్, ఆహార భద్రత శాఖ అధికారులు నామమాత్రపు జరిమానా విధించి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కృపయా ధ్యాన్‌దే

- రేపటి నుంచి భాగ్యనగర్ రాకపోకలు బంద్
- ఉదయం, రాత్రివేళ ఆ రైలే ఆధారం
- సికింద్రాబాద్ – కాగజ్‌నగర్ మధ్య ప్రయాణం ఇక నరకం
- వివాహాల సీజన్ కావడంతో ప్రయాణికులకు తప్పని తిప్పలు



భాగ్యనగర్ రైలు

పెద్దపల్లిరూరల్/రామగుండం: సికింద్రాబాద్–కాగజ్‌నగర్ మధ్య నడిచే రైలు నంబరు 17233/17234 భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 10 నుంచి 21వ తేదీ వరకు ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించడంతో ఈ మార్గంలోని వేలాది మంది ప్రయాణికులకు తిప్పలు తప్పేట్టు లేదు. సికింద్రాబాద్–గుంటూరు మధ్య మూడో రైల్వేట్రాక్ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవంగా కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లిన తర్వాత భాగ్యనగర్ రైలుకు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌గా పేరు మార్చి సికింద్రాబాద్–గుంటూరు మధ్య నడుపుతున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో ట్రాక్ పనులు కొనసాగుతుండడంతో భాగ్యనగర్ రైలును రద్దు చేసినట్లు అధికారులు వివరిస్తున్నారు.

ప్రయాణికుల ఆగ్రహం..

సికింద్రాబాద్ – కాగజ్‌నగర్ మధ్య ట్రాక్ పనులు చేపడితే భాగ్యనగర్ రైలు నడిచేందుకు ఆటంకాలు, అవాంతరాలు ఎదురవుతాయి. కానీ, ఈ మార్గంతో సంబంధమే లేని గుంటూరు మార్గంలో పనులు చేపడితే భాగ్యనగర్ రైలును ఎలా రద్దు చేస్తారని, ఇది అధికారుల వివక్షకు నిదర్శనమని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నుంచి ఈనెలాఖరు వరకు శుభముహూర్తాలు అధికంగా ఉన్నాయి. ప్రయాణికులు ఎక్కువగా భాగ్యనగర్ రైలుపై ఆధారపడి వేడుకలకు హాజరవుతారు. కానీ, రైల్వే అధికారుల నిర్ణయంతో ప్రయాణికులకు తిప్పలు తప్పేట్టులేదు.

కోల్‌బెల్ట్‌వాసులకు సౌకర్యం..

కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే భాగ్యనగర్.. వేకువజామున బయలు దేరుతుంది. ఇది రేపల్లెవాడ, రేచ్నీ, బెల్లంపల్లి, మందమర్రి, రవీంద్రఖని, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, జమ్మికుంట, ఉప్పల్, హసన్‌పర్తిరోడ్డు, కాజీపేట స్టేషన్లలో ఆగుతుంది. ఉదయం వేళ బయలు దేరడంతో ఈ మార్గంలోని ప్రయాణికులకు ఎంతోఅనుకూలంగా ఉంటుంది. అంతేకాదు.. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వరకు కూడా ఆయా ప్రాంతాల్లోని ఉద్యోగులకు సౌకర్యంగా ఉంటుంది.

తిరుగు ప్రయాణానికి కూడా..

మధ్యాహ్నం సికింద్రాబాద్ చేరుకునే ప్రయాణికులు, కాజీపేటలో పనులు, వివాహ వేడుకలకు హాజరై తిరుగు ప్రయాణమయ్యేవారు సాయంత్రం మళ్లీ ఇదే రైలును ఆశ్రయిస్తారు. తక్కువ చార్జీ, సుఖమయ ప్రయాణం కావడంతో రోజూ వేలాది మంది భాగ్యనగర్‌ను నమ్ముకుంటున్నారు. ప్రత్యామ్నాయంగా మరోరైలు లేకపోవడం కూడా దీనికి డిమాండ్ పెరుగుతోంది. కానీ, దీనిని రద్దు చేస్తుండడంతో బస్సులను ఆశ్రయించి ఆర్థికంగానే కాకుండా ప్రయాసలకు గురికావాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రద్దుతో ఇబ్బంది



పేద, మధ్యతరగతి ప్రజలకు భాగ్యనగర్ రైలు ప్రయాణం ఎంతో అనువుగా ఉంది. ముఖ్యంగా పెద్దపల్లి నుంచి సికింద్రాబాద్, అక్కడి నుంచి బల్హార్షా వరకు ప్రయాణించే వారికి ఎంతో సౌకర్యవంతంగా ఉంది. దీని రద్దుతో ఇబ్బందులు తప్పవు.

– ఎర్రం మల్లారెడ్డి, ప్రయాణికుడు, కాసులపల్లి, పెద్దపల్లి

ఆర్థికభారం ఉండదు



పనుల నిమిత్తం కాజీపేట, సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు భాగ్యనగర్ రైలు చార్జీ చాలా తక్కువ. రైలును రద్దు చేస్తే బస్సులే ప్రత్యామ్నాయం. అందులో ప్రయాణం ఆర్థికంగా భారంగా మారుతుంది. ఈ విషయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు పునరాలోచన చేయాలి.

– ముత్యాల రాజయ్య, ప్రయాణికుడు, తుర్కలమద్దికుంట

రెగ్యులర్‌గా నడిపించాలి



పేద, మధ్యతరగతి ప్రజలు ప్రయాణం కోసం వినియోగించుకుంటున్న భాగ్యనగర్ రైలును రెగ్యులర్‌గా నడిపించేలా చూడాలి. పెద్దపల్లి నుంచి ప్రతీరోజు ఉదయం అందుబాటులో ఉండే ఈ రైలును ఇప్పుడు రద్దు చేస్తుండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– పల్లె సదానందం, ప్రయాణికుడు, కొత్తపల్లి

అదుపుతప్పి పల్టీలు కొట్టిన కారు

- మెట్‌పల్లి శివారు వెంకట్రావుపేట వద్ద ఘటన
- ముగ్గురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం


ఘటన స్థలంలో బోల్తాపడిన కారు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి శివారులోని వెంకట్రావుపేట వద్ద శనివారం ఓ కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన లక్ష్మీనర్సయ్య తన కుటుంబసభ్యులతో గండి హనుమాన్ ఆలయానికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో కారులో తిరిగి ఇంటికి బయల్దేరారు. వెంకట్రావుపేట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పిన కారు రెండుసార్లు పల్టీలు కొట్టి రహదారి పక్కకు కొద్దిదూరం వెళ్లి ఆగిపోయింది. స్థానికులు వెంటనే కారులో ఉన్న నలుగురిని బయటకు తీశారు. అందరినీ మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లక్ష్మీనర్సయ్య, శారద, వైష్ణవికి తీవ్ర గాయాలయ్యాయి. శాంత పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

బైక్ ఎత్తుకెళ్లిన బాలుడు

- వెంబడించి పట్టుకున్న స్థానికులు
- పోలీసులకు అప్పగింత
- కౌన్సెలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు

మెట్‌పల్లిరూరల్: ఇంటిముందు పార్కింగ్ చేసిన బైక్‌ను ఎత్తుకెళ్లిన ఓ బాలుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న బాలుడు (12) శనివారం మెట్‌పల్లి మండలం వేంపేటకు వెళ్లాడు. గ్రామానికి చెందిన మర్రిపల్లి వెంకటేశ్ తన ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేసి తాళాలు దానికే వదిలేయడాన్ని గమనించి బైక్‌ను కొద్ది దూరం నెట్టుకుంటూ వెళ్లాడు. తర్వాత స్టార్ట్ చేసుకుని వెళ్లిపోతున్నాడు. మార్గంమధ్యలో ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న మరో బైక్ తాళాలను పట్టుకొని వెళ్లాడు. సదరు బాలుడికి బైక్ సరిగ్గా నడపరాకపోవడం.. అప్పటికే బైక్ కనిపించకపోవడంతో వెతుకున్న పలువురికి గ్రామ శివారులో బైక్ తీసుకెళ్తూ కనిపించాడు. దీంతో బాలుడిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పజెప్పారు. బాలుడు ఇటీవలే మెట్‌పల్లిలోని కళానగర్‌లో సైకిల్ ఎత్తుకెళ్లగా ఆ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాలుడి తల్లిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. మిగతా చోట్ల కూడా సదరు బాలుడు చోరీలు చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి.

పోలీసుల అదుపులో ఘరానా మోసగాడు


పోలీస్‌స్టేషన్‌లో బాధితులు

జగిత్యాలక్రైం: స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకునేందుకు కేంద్ర ప్రభుత్వ పీఎంఈజీపీ పథకం కింద రూ.కోటి నుంచి రూ.10 కోట్ల వరకు సబ్సిడీ రుణాలు ఇప్పిస్తానంటూ బాధితుల నుంచి సుమారు రూ.30 కోట్లు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని బాధితులు శనివారం పోలీసులకు అప్పగించారు. వివరాలు.. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌కు చెందిన వేణువర్మ మూడేళ్లుగా జగిత్యాల జిల్లాలో సుమారు 60 మంది బాధితులకు పీఎంఈజీపీ పథకం కింద రూ.4 కోట్ల నుంచి మొదలుకుని రూ.10 కోట్ల వరకు రుణాలు ఇప్పిస్తామని, అందులో 50 శాతం రాయితీ ఉంటుందని నమ్మించాడు. డిపాజిట్ల పేరిట ఒక్కొక్కరి వద్ద రూ.కోటి నుంచి రూ.5 కోట్ల వరకు, మరికొంత మంది నుంచి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేశాడు. వారికి రుణాలు రాకపోవడంతో పాటు, వేణువర్మ ఫోన్ చేసినా స్పందించకపోవడం, అతడి గ్రామానికి వెళ్తే దొరక్కపోవడం, దొరికిన సమయంలో పొంతనలేని సమాధానాలు చెబుతూ తప్పించుకున్నాడు. ఈ నేపథ్యంలో అత్తగారింటికి జగిత్యాలకు వచ్చిన వేణువర్మను బాధితులు పట్టుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు లోతైన విచారణ చేపడుతున్నారు. కాగా, విచారణలో కూడా నిందితుడు పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా బీర్‌పూర్ నృసింహుడి బ్రహ్మోత్సవాలు


స్వామివారికి మంగళహారతులు ఇస్తున్న మహిళలు

సారంగాపూర్: జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఊరేగింపు సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ చేశారు. 12 మట్టిచిప్పల్లో పుట్టమట్టిని నింపి.. నవధాన్యాలు.. గోదావరి జలాలను పోసి ఆరాధించారు. ఆలయ ఈవో శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమార్, హేమంతాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీసీ కులగణన తప్పుల తడక

- మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య


సమావేశంలో నాయకులు

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణన తప్పుల తడక అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల కాపులున్నప్పటికీ ఇప్పుడు కేవలం 13 లక్షల 60వేలు మాత్రమే ఉన్నట్లుగా చూపించడం సరికాదన్నారు. 2014లో చేసిన సర్వేలో 28 లక్షల మున్నూరుకాపులున్నట్లు వెల్లడించగా, ఇప్పుడు తప్పుడు లెక్కలు చూపిస్తు ప్రభుత్వం పబ్బం గడుపుకోవాలని చూస్తుందని ఆరోపించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ మాట్లాడుతూ, బీసీలు రాజకీయంగా ఎదుగుతున్నారనే అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల వివక్ష చూపుతుందన్నారు. సర్వే మళ్లీ చేయాలని లేకుంటే ఇందిరాపార్కు వద్ద భారీ ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్, సత్తినేని శ్రీనివాస్, శ్రావణ్, శ్రీనివాస్, మెతుకు హేమలత తదితరులు పాల్గొన్నారు.

‘స్వదేశీ మేళా’ పనులు ప్రారంభం


భూమిపూజ చేస్తున్న స్వదేశీ మేళా బాధ్యులు

కరీంనగర్‌టౌన్: స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 16 వరకు కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో తలపెట్టిన ‘స్వదేశీ మేళా’ ప్రారంభం కోసం శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ మేళా బాధ్యులు చల్మెడ రాజేశ్వరరావు, ముక్క హరీశ్‌బాబు మాట్లాడుతూ, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6 రోజుల పాటు జరిగే మేళాలో దాదాపు 2 లక్షల మంది పాల్గొనేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉద్యోగాల కల్పన కోసం 120 కంపెనీలు మేళాలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు. అలాగే 9న ఉదయం 6 గంటలకు కరీంనగర్‌లోని పలు ప్రాంతాల మీదుగా సైకిల్ ర్యాలీ, 10న 5 కే రన్ కార్యక్రమాలు చేపడుతామని, మేళాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మేళా బాధ్యులు మాధవరావు, నిరంజనాచారి, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, గంప వెంకట్, కళ్లెం వాసుదేవరెడ్డి, గోపికృష్ణ, పాక సత్యనారాయణ, నాగమల్ల వేణుమాధవ్, పుల్లూరి సంతోష్, అభిలాష్, మునీందర్, వేద పండితులు మంగళంపల్లి శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విచారణ?

చందుర్తి (వేములవాడ): మండలంలోని నర్సింగాపూర్‌లో అంబేద్కర్ సంఘం భవనానికి సంబంధించి రికార్డులు దహనం చేశారని అదే గ్రామానికి చెందిన ఇద్దరు అనుమానిత యువకులను పోలీసులు విచారించినట్లు సమాచారం. శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు సంఘ భవనం తలుపులు పగులగొట్టి రికార్డులు దహనం చేశారని ఆ సంఘం అధ్యక్షుడు ఫిర్యాదు చేశాడు. కాగా ఈ ఘటనతో సంబంధం ఉందన్న అనుమానంతో ఇద్దరిని శనివారం సాయంత్రం వరకు విచారించి వదిలిపెట్టినట్లు తెలిసింది. తిరిగి ఆదివారం ఉదయం మళ్లీ పోలీసుస్టేషన్‌కు రావాలని ఆదేశించినట్లు సమాచారం.

10న పోలీస్ వాహనాల విడిభాగాల వేలం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌లోని పోలీసు వాహనాల విడి భాగాలకు ఈ నెల 10న ఉదయం 10 గంటలకు కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వాటర్స్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం నందు వేలం నిర్వహించనున్నట్లు కమిషనరేట్ వర్గాలు తెలిపాయి. వాహనాలకు వినియోగించి తొలగించిన బ్యాటరీలు, టైర్లు, ఇతర విడిభాగాలు, వినియోగించిన ఆయిల్‌కు వేలం వేస్తామని, ఆసక్తి గల బిడ్డర్‌లు ఆధార్‌కార్డ్‌తో వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నాయి. మరిన్ని వివరాలకు 87126 70725 నంబర్‌లో సంప్రదించాలని తెలిపాయి.

ఫైనాన్స్ వేధింపులతో మెకానిక్ ఆత్మహత్యాయత్నం?

ధర్మారం(ధర్మపురి): మండలంలోని పత్తిపాకకు చెందిన మెకానిక్ గుండ్లపల్లి కరుణాకర్ ఫైనాన్స్ వేధింపులతో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల వివరాలు.. కరుణాకర్ పెగడపల్లి మండల కేంద్రంలో మోటార్‌సైకిల్ మెకానిక్ షాపు పెట్టాడు. ఈక్రమంలో కరీంనగర్‌కు చెందిన ఓ ఫైనాన్స్ కంపెనీ వారు కరుణాకర్ వద్దకు వచ్చి వ్యాపార అభివృద్ధికి రుణం మంజూరు చేస్తామని చెప్పారు. అతడికి ఫైనాన్స్ అవసరం లేకున్నా వారు ముందుకు రావడంతో పత్తిపాకలో ఇంటి నిర్మాణం చేస్తామనే ఆలోచనతో 2020లో రూ.5లక్షల రుణం తీసుకున్నాడు. ఆ రుణం కిస్తీలు దగ్గర పడడంతో మళ్లీ ఫైనాన్స్ వారు రూ.4.5 లక్షలు ఇచ్చారు. తర్వాత కరుణాకర్ అనారోగ్యంతో ఇంటి వద్దే ఉండిపోయాడు. ఫైనాన్స్ కిస్తీలు పెండింగ్‌లో పడ్డాయి. దీంతో ఫైనాన్స్ వారు డబ్బు చెల్లించాలని ఒత్తిడి పెంచారు. ఈక్రమంలో కరుణాకర్ పత్తిపాక క్రాస్ రోడ్డు వద్ద మెకానిక్ షాప్ ఏర్పాటు చేసినా, ఫైనాన్స్ చెల్లించే పరిస్థితి లేదు. కిస్తీలు చెల్లించకపోవటంతో ఫైనాన్స్ వారు ఇంటికి వచ్చి దూషించినట్లు అతడి భార్య జ్యోతి తెలిపారు. దీంతో కరుణాకర్ పోలీసుల ను ఆశ్రయించగా ఫైనాన్స్‌వారు సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు తెలిసింది. అయితే సెటిల్‌మెంట్ డబ్బు కూడా చెల్లించే స్తోమత లేక భయాందోళనకు గురైన కరుణాకర్ ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఇల్లంతకుంట ఎంపీవో సస్పెన్షన్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సస్పెండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో పని చేసిన శ్రీనివాస్ అనారోగ్య కారణాలతో సెలవు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆయన్ని ఇల్లంతకుంట ఎంపీవోగా బదిలీ చేశారు. ఆయన విధుల్లో చేరకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. గతంలో ఆయన చందుర్తి ఎంపీడీవోగా పని చేశారు. పని చేసిన కాలంలో జారీ చేసిన చెక్కులు, ఇతర రికార్డులను కలెక్టర్ తెప్పించుకుని పరిశీలించినట్లు సమాచారం. ఎంపీవో సస్పెన్షన్ జిల్లా పరిషత్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఇండ్లు కేటాయించాలి

విద్యానగర్(కరీంనగర్): డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 20శాతం బేడ బుడగ జంగాలకు కేటాయించాలని బేడ బుడగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న హామీ హామీగానే ఉందన్నారు. హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు తూర్పాటి లింగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పస్తం ఆంజనేయులు, కోశాధికారి రాజేశ్, నాయకులు వానరాశి గిర్ని వెంకటి, చింతల అంజి, రమేశ్, చిన్న గంగారాం, రాజారాం, మహేందర్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు. విద్యార్థినితో ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులకు తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



అంజన్న సన్నిధిలో రద్దీ

జగిత్యాలరూరల్: కొండగట్టు అంజన్న సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కొండకు తరలివచ్చి కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, సిబ్బంది సేవలందించారు.







అభిషేక ప్రియుడికి జనహారతి

- రాజన్నను దర్శించుకున్న 50 వేల మంది

వేములవాడ: వరుస సెలవులు రావడంతో వేములవాడ రాజన్న దర్శనానికి శనివారం 50వేల మంది తరలివచ్చారు. భక్తుల రద్దీని గమనించిన ఆలయ అధికారులు క్యూలైన్లను కట్టడి చేశారు. అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. వీఐపీల రద్దీ సైతం పెరిగిపోవడంతో పీఆర్వో విభాగం నుంచి బ్రేక్ దర్శనాలకు అనుమతించారు.



తిరు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



హోమంలో పాల్గొన్న భక్తులు

సత్యదేవుని ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని రాంనగర్‌లో గల శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి, శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 21వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచసూక్త, మన్యుసూక్త హోమం, పూర్ణాహుతితో పాటు విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి వారి తిరు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ సభ్యుడు టి.సంతోష్‌కుమార్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున రజనీదేవి, రాజేందర్, కమిటీ చైర్మన్ చల్ల పద్మ హరికృష్ణ, మాజీ చైర్మన్ ఏ.కిరణ్‌కుమార్, ప్రధాన అర్చకులు బహిరి అనిల్‌కుమార్, తిరునహరి ప్రవీణ్‌కుమార్, అర్చకులు బి.వెంకటసాయి, కార్తీక్, కమిటీ సభ్యులు రామస్వామి గౌడ్, బొబ్బిలి శంకర్, వేదాంతం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా పోచమ్మ బోనాలు

కరీంనగర్‌రూరల్: దుర్శేడ్‌లో నూతనంగా నిర్మించిన బంగారు పోచమ్మ ఆలయంలో దేవతా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామస్తులందరూ పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనం చొప్పున మహిళలు బోనాలను తలపై పెట్టుకుని డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలివచ్చారు.అనంతరం పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. బైండ్ల పూజారుల ఆధ్వర్యంలో భూలక్ష్మి, శ్రీలక్ష్మి సహిత బొడ్రాయి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోరకంటి వేణుమాధవరావు, సభ్యులు సుంకిశాల సంపత్‌రావు, తోట తిరుపతి, గాజుల అంజయ్య, నందాల తిరుపతి, వేణుమాధవరావు, రాంచంద్రం, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజన్న సేవలో కలెక్టర్



వేములవాడ: ఎములాడ రాజన్నను శనివారం కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు. ఏఈవో అశోక్, పర్యవేక్షకులు, ఆలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్

కరీంనగర్ క్రైం: నగరంలోని జిల్లా జైలులోని సిబ్బంది, ఖైదీలకు శనివారం టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. కరీంనగర్ టీబీ కోఆర్డినేటర్ అశోక్ టీబీ వ్యాధి రాకుండా, వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధి అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి జి.విజయడేని, జైలర్స్ శ్రీనివాస్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ జైలర్లు రమేశ్, అజయ్ చారి, డాక్టర్ శ్రీనివాస్, జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

కొత్తపల్లి: క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని సుడా చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంట శివారులోని శ్రీచైతన్య స్కూల్‌లో శనివారం జరిగిన జోనల్ లెవల్ రాష్ట్రస్థాయి పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

దాస్యం సేనాధిపతికి సినారె పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న దాస్యం సేనాధిపతి

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌కు చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు దాస్యం సేనాధిపతి సాహిత్యంలో చేస్తున్న విశేషకృషికి రాష్ట్రస్థాయి సినారె పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్ మల్కాజిగిరిలోని అక్షరకౌముది సాంస్కృతిక సాహితీ సంస్థ 5వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం చేతులమీదుగా పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, మహిళా పారిశ్రామిక వేత్త రాణి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తులసి వెంకట రమణాచార్యులు, ప్రధాన కార్యదర్శి మూర్తి శ్రీదేవి, తులసి విజయలక్ష్మి, మాధవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు సేనాధిపతికి అభినందనలు తెలిపారు.

కులగణనలో క్రైస్తవుల ఊసు లేకపోవడం శోచనీయం

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణనలో క్రైస్తవుల ఊసులేక పోవడం శోచనీయమని క్రైస్తవ హక్కుల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలీషా అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో క్రైస్తవుల ఉనికి లేకుండా చేసే కుట్రలో భాగంగానే క్రైస్తవుల పేరు లేకుండా చేశారని ఆరోపించారు. తెలంగాణ క్రైస్తవ మైనార్టీ ఆఫీసులో రిజిస్టర్ చర్చిల పూర్తి సమాచారం ఉన్నప్పటికీ క్రైస్తవులను చులకన చేయడానికే సర్వేలో వివరాలు లేకుండా చేసారని అన్నారు. ఈ సమావేశంలో ఆర్‌కేపీ రాష్ట్ర నాయకులు శ్రీధర్, క్రైస్తవ హక్కుల రక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెన్నీ, జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు మెరుగుపర్చాలి



కొత్తపల్లిలో తనిఖీ చేస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్

కొత్తపల్లి: నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని శానిటేషన్ అధికారులు, సిబ్బందిని కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ ఆదేశించారు. శనివారం కొత్తపల్లిలోని పలు కాలనీల్లో పర్యటించి పరిసరాలు, డ్రైనేజీలు పరిశీలించారు. 60 డివిజన్లలో పారిశుధ్య పనులు కొనసాగుతున్న విధంగానే విలీనం గ్రామాలు, మున్సిపాలిటీల్లో జరగాలని అన్నారు. సంబంధిత ప్రాంతాల్లో పిన్ పాయింట్ పద్ధతి అమలు చేయాలని సూచించారు. జవాన్లు, వార్డు ఆఫీసర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్లు ప్రతీరోజు పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ స్వామి, వార్డు ఆఫీసర్, జవానులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలి

కరీంనగర్‌రూరల్: కార్పొరేషన్‌లో విలీనమైన బొమ్మకల్‌లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ అధికారులను ఆదేశించారు. శనివారం బొమ్మకల్‌లో మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం సమీపంలోని డంపుయార్డును పరిశీలించారు. ఓపెన్ డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు సిల్టు తొలగించాలని, పారిశుధ్య పనుల విషయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

హామీని నిలబెట్టుకోవడంలో విఫలం



మాట్లాడుతున్న గజ్జెల శ్రీకాంత్

కరీంనగర్‌కల్చరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా విద్యారంగానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజాపాలనలో విద్యారంగం నిర్వీర్యమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. శనివారం నగరంలో జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు ఇస్తామని చెప్పి కేవలం 6శాతం మాత్రమే కేటాయించారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు నాగుల శ్రీజ, జిల్లా ఉపాధ్యక్షుడు షాక్, నాయకులు శివ, కవిత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు

కరీంనగర్ కార్పొరేషన్: విలీన మున్సిపాలిటీ, గ్రామాలతోపాటు కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ అధికారులకు పని విభజన చేస్తూ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని మల్కాపూర్ రిజర్వాయర్, 17, 18, 19, 38, 39, 56వ డివిజన్‌లతోపాటు చింతకుంట, మల్కాపూర్‌లకు ఈఈ ఆర్.యాదగిరి, డీఈ శ్రీనివాస్, ఏఈ గట్టు స్వామి, ఎస్‌ఆర్‌ఆర్ వాటర్‌ట్యాంక్, 20, 21, 22, 40, 57వ డివిజన్లు, కొత్తపల్లికి ఈఈ యాదగిరి, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ గట్టుస్వామి, రాంనగర్ వాటర్‌ట్యాంక్, 14, 15, 16, 36, 37, 54, 55వ డివిజన్లకు ఈఈ యాదగిరి, డీఈ టి.శ్రీనివాస్, ఏఈ గట్టుస్వామి, కోర్టు రిజర్వాయర్, 23, 41, 42, 43, 53, 58, 59, 60వ డివిజన్లకు ఈఈ యాదగిరి, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ గట్టుస్వామిలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే, భగత్‌నగర్ రిజర్వాయర్, 33, 34, 35వ డివిజన్లకు ఈఈ ఎస్.సంజయ్, డీఈ ఓంప్రకాశ్, ఏఈ అబ్దుల్‌గఫూర్, గౌతమినగర్ రిజర్వాయర్, 11, 12, 13వ డివిజన్లకు ఈఈ సంజయ్, డీఈ ఓంప్రకాశ్, ఏఈ గఫూర్, అంబేడ్కర్‌నగర్ రిజర్వాయర్, 1, 2, 3, 4, 5, 24, 25, 26, 27, 28, 29, 44వ డివిజన్లు, దుర్శేడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్‌ను ఈఈ యాదగిరి, డీఈ అయూబ్‌ఖాన్, ఏఈ గఫూర్‌లకు కేటాయించారు. కోతిరాంపూర్ రిజర్వాయర్, 8, 9, 10, 32వ డివిజన్లకు ఈఈ సంజయ్, డీఈ టి.వెంకటేశ్వర్లు, ఏఈ టి.సతీశ్, మార్కెట్ ట్యాంక్, 6, 45, 46, 48, 49, 50, 51, 52వ డివిజన్లకు ఈఈ సంజయ్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సతీశ్, హౌసింగ్‌బోర్డు (24/7) రిజర్వాయర్, 7, 30, 31, 47వ డివిజన్లకు ఈఈ సంజయ్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సతీశ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. శానిటేషన్ వాహనాలు, ఫిల్టర్ బెడ్ బాధ్యతలు ఈఈ యాదగిరి, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ గట్టుస్వామి, నర్సరీ, వనమహోత్సవానికి ఈఈ సంజయ్, డీఈ శ్రీనివాస్, ఏఈ గట్టుస్వామి, డంపింగ్‌యార్డు, ఎస్‌టీపీ, ఎఫ్‌ఎస్‌టీపీకి ఈఈ యాదగిరి, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ గట్టుస్వామి, డీబీ (స్మార్ట్‌సిటీ)కి ఈఈలు యాదగిరి, సంజయ్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ గట్టుస్వామి, డీబీ(జనరల్)కి ఈఈలు యాదగిరి, సంజయ్, డీఈ ఓంప్రకాశ్, వీధి దీపాల నిర్వహణ, ఎలక్ట్రికల్ వర్క్స్ బాధ్యతలు ఈఈ యాదగిరి, డీఈ అయూబ్ ఖాన్, ఏఈ అబ్దుల్ గఫూర్‌లకు అప్పగించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కరీంనగర్ సిటీ: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పలు కోర్సుల్లో అవకాశాలు కల్పిస్తున్నామని కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. రాబోయే విద్యాసంవత్సరం 2025–26 అడ్మిషన్ల కోసం అధ్యాపకులతో కలిసి కళాశాలలో శనివారం ప్రవేశాల ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సారార్ కళాశాల ప్రస్తుత సంవత్సర అడ్మిషన్లలో రాష్ట్రస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కొత్త సంవత్సరంలోనూ ఇలాగే అడ్మిషన్లు అయ్యేందుకు అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గల 40 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్లలో ప్రచారం చేయాలని సూచించారు. టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, దోస్త్ కో–ఆర్డినేటర్ రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు నితిన్ పాఠక్, రాజయ్య, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మంద జ్యోతి

విద్యానగర్: ధర్మ సమాజ్ పార్టీ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మంద జ్యోతి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువెరు శ్రీకాంత్ ప్రకటించారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ సూచన మేరకు మంద జ్యోతిని పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మంద జ్యోతి మాట్లాడతూ కాంగ్రెస్, బీజేపీలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు అగ్రకుల వారికి మాత్రమే ఎమ్మెల్సీ టిక్కెట్లు కేటాయించారని అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ మాత్రమే దళిత (మాల) సమాజానికి చెందిన తనకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేశ్, ఉపాధ్యక్షుడు గాజుల రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భీష్మ ఏకాదశి



శ్రీనిలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని పలు ఆలయాల్లో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. మయూరగిరి పీఠాధిపతులు, జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు నమిలకొండ రమణాచారిస్వామి ఆధ్వర్యంలో తిరుమల్‌నగర్‌లోని మయూరగిరి పీఠం శ్రీనిలయంలో శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహించారు. శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణాలు జరిగాయి. కార్యక్రమంలో రామకృష్ణమాచార్యులు, వివేక్, వినయ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. గంగ పరమేశ్వర ఆలయంలో గంగపుత్ర మంకమ్మతోట డివిజన్ అధ్యక్షుడు నాగుల కనకయ్య ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జితేందర్, కోటేశ్, నాగరాజ్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, మహేశ్, శంకర్, మల్లేశం, పరుశురాం, సతీశ్, మణికంఠ, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఆదివారం జిల్లా అథ్లెటిక్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. 14, 16, 18, 20 సంవత్సరాల బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను ఈనెల 18 నుంచి 19 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 8 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

మహేశ్ హంతకులను శిక్షించాలి



ఆందోళన చేస్తున్న దళితులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో బెజ్జంకి మహేశ్‌ను హత్య చేసిన నిందితులను శిక్షించాలని కోరుతూ శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మృతుడి తల్లిదండ్రులతో పాటు పలువురు దళితులు కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. మహేశ్‌ను నమ్మించి హత్య చేసిన ఏడెల్లి సతీశ్, కాల్వ సతీశ్‌లపై తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపల్లి శ్రీనివాస్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోష్కి శంకర్ డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏఎస్పీ శివం ప్రకాశ్‌ను కలిసి నిందితులపై పీడీ యాక్టు కేసు నమోదు చేయాలని కోరారు.

నరేంద్ర మోదీ విజన్‌కు ఢిల్లీ ఫలితాలు నిదర్శనం

కరీంనగర్‌టౌన్: దేశంలో బీజేపీకి తిరుగులేదనేందుకు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని మాజీ మేయర్ సునీల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. దేశ భవిష్యత్ అంతా బీజేపీదే అనేందుకు ఈ ఫలితాలే ప్రతిపక్ష పార్టీలకు సమాధానం ఇస్తున్నాయని అన్నారు. ఢిల్లీ ప్రజలు ఆప్ పార్టీని చీపురుతో చెత్తను ఊడ్చినట్లు ఊడ్చేశారన్నారు. కాంగ్రెస్‌కు అక్కడ గుండు సున్న వచ్చిందనే విషయాన్ని ఇక్కడి నాయకులు గుర్తించాలని తెలిపారు. భవిష్యత్‌లో తెలంగాణ గల్లీ నుంచి ఢిల్లీ దాకా బీజేపీ కాషాయజెండానే రెపరెపలాడుతుందని వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సారథ్యంలో ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీ పక్షాన ప్రజలు నిలబడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సన్మానం



స్వరూపరాణి దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

కరీంనగర్‌టౌన్: మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి–హరిశంకర్ దంపతులను శనివారం కార్యాలయంలో మున్నూరు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ ఆధ్వర్యంలో సన్మానించారు. మంచి సేవలతోనే ఉత్తమ గుర్తింపు లభిస్తుందని, మనం చేసిన మంచి పనులే మనకు సంతృప్తినిస్తాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, నాయకులు ఆవుల శ్రీనివాస్, పూరెళ్ల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'అద్వితోత్సవ్'



నృత్యం చేస్తున్న చిన్నారులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం 'అద్వితోత్సవ్' పేరిట నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం అలరించింది. బిట్స్ ప్రొఫెసర్ శాస్త్రవేత్త రామయ్య, డాక్టర్ రఘురామన్, విశ్రాంత తెలుగు ప్రొఫెసర్ గండ్ర లక్ష్మణ్‌రావు, తెలుగు పాఠ్య పుస్తకాల రచయిత గాజుల రవీందర్, విద్యాసంస్థల చైర్మన్ సాగని కొమురయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని అంబేడ్కర్ స్టేడియం మెయిన్ గేట్ పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు కొట్టివేశారు. కొట్టిన ఆ చెట్ల కొమ్మలను అక్కడే రోడ్డుపై పడవేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు వెంటనే ఆ చెట్టు కొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి. – బుర్ర శ్రీనివాస్ గౌడ్, తిరుమల్‌నగర్, కరీంనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, 9502933311

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: ఢిల్లీలో మార్చి 27న భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమ పోస్టర్‌ను శనివారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి, కార్యదర్శి మాదం తిరుపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్‌క్రైం: నగరంలోని జ్యోతినగర్‌లో శనివారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. రేవంత్, అభిరాం, నాగరాజులపై కేసు నమోదు చేసి 183 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్: ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) కరీంనగర్‌లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది తాత్కాలిక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధించే విజ్ఞాన శాస్త్ర బోధన పద్ధతులు, కళావిద్యలో ఖాళీలున్నాయన్నారు. ఉర్దూ మాధ్యమంలో బోధించే సైకాలజీ/ఫిలాసఫీ, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతుల్లో ఖాళీలున్నాయని తెలిపారు. అభ్యర్థులు ఆయా విషయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఈడీ కలిగి ఉండాలన్నారు. బోధన పద్ధతులు బోధించేందుకు దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత మెథడాలజీ బీఈడీలో పూర్తి చేసి ఉండాలని అన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈనెల 14న సా.5 గంటల్లోగా ఎల్‌ఎండీకాలనీలోని డైట్ కళాశాలలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

యూరియా కరువు



యూరియా కోసం వచ్చిన రైతులు



మూసి ఉన్న దుర్శేడ్ సొసైటీ ఎరువుల గోదాం

- కొరత సాకుతో మార్క్‌ఫెడ్ కోత
- సహకార సంఘాలకు సరఫరాలో జాప్యం
- ఆందోళనలో రైతాంగం

కరీంనగర్‌రూరల్:యాసంగిలో పంటలు సాగు చేసిన రైతాంగాన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. ఒకవైపు సకాలంలో ఎస్సారెస్పీ కాలువ నీళ్లందక పంటలు ఎండిపోతుండగా.. మరోవైపు యూరియా లభించక రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా బస్తాల కోసం పడరానిపాట్లు పడుతున్నారు. కొరత సాకుతో మార్క్‌ఫెడ్ అధికారులు సహకార సంఘాలకు సరఫరా చేస్తున్న యూరియా కోటాలో కోతపెడుతున్నారు. వారం రోజుల నుంచి కరీంనగర్, దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘాలకు ఇండెంట్ ప్రకారం యూరియా స్టాక్ పంపించక పోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం రైతులందరూ వరిపంటలో కలుపు తీసి యూరియా చల్లుతుండటంతో డిమాండ్ ఏర్పడింది. మూడు రోజుల నుంచి రెండు సంఘాల్లో యూరియా స్టాక్ లేకపోవడంతో పలువురు రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద యూరియా బస్తాలను అధిక ధరకు కొనుగోలు చేశారు. శనివారం కరీంనగర్ ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని చెర్లభూత్కూర్, బొమ్మకల్ గ్రామాల్లోని విక్రయ కేంద్రాలకు 20 టన్నుల చొప్పున యూరియా స్టాక్ వచ్చింది. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున మాత్రమే విక్రయించగా కేవలం గంట వ్యవధిలోనే స్టాక్ ఖాళీ అయింది. మొత్తం 60టన్నుల ఇండెంట్ పెడితే 20 టన్నులు మాత్రమే వచ్చిందని, మరో 40 టన్నుల స్టాక్ సోమవారం వచ్చే అవకాశముందని సీఈవో ఎం.రమేశ్ తెలిపారు. కాగా దుర్శేడ్ సంఘానికి శనివారం సాయంత్రం 10టన్నుల యూరియా స్టాక్ వచ్చినప్పటికీ రైతులకు విక్రయించే అవకాశం లేకుండా పోయింది. సోమవారం నుంచి యూరియా బస్తాలను విక్రయించనున్నట్లు సీఈవో వేణుమాధవ్ తెలిపారు. మార్క్‌ఫెడ్‌కు మొత్తం 40 టన్నుల యూరియా ఇండెంట్ పెడితే ఇప్పటివరకు మూడు దఫాలుగా 30టన్నుల స్టాక్ మాత్రమే వచ్చినట్లు వివరించారు.

సిద్ధార్థుడి జీవితం ఆదర్శనీయం

- కొనియాడిన దక్షిణాసియా బౌద్ధ భిక్షువులు


బుద్ధవనంలోని ధర్మగంట వద్ద బౌద్ధులు

నాగార్జునసాగర్: సిద్ధార్థుడి (బుద్ధుడి) జీవితం ఆదర్శనీయమని దక్షిణాసియా బౌద్ధ భిక్షువులు కొనియాడారు. నాగార్జునసాగర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ త్రిపీటక పఠనోత్సవంలో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు శనివారం బుద్ధవనంలో ఆచార్య నాగార్జునుడి శిల్పం, బుద్ధుడి పాదుకలు, బుద్ధ చరితవనం, శ్రీలంక బహూకరించిన అవుకన బుద్ధుడి శిల్పం, స్తూపవనంలోని 14 నమూనా స్తూపాలను సందర్శించారు. బుద్ధవనం కన్సల్టెంట్, చరిత్ర పరిశోధకుడు, బౌద్ధనిపుణుడు శివనాగిరెడ్డి వారికి బుద్ధవనంలోని శిల్పాల విశేషాలను, చారిత్రక ప్రాధాన్యాలను వివరించారు. శ్రీలంక ప్రభుత్వం బహూకరించిన గంటను మోగించి బుద్ధవనం పర్యటనను ముగించారు. అక్కడినుంచి లాంచీలో వెళ్లి నాగార్జునకొండను సందర్శించారు. అక్కడి కట్టడాలు, శిల్పాలను ఆసక్తిగా వీక్షించారు. బౌద్ధ ప్రదర్శనశాల విశేషాలను మ్యూజియం అధికారి కమల్‌హాసన్ వివరించారు. కార్యక్రమంలో మహాబోధి బుద్ధవిహార అధ్యక్షుడు కశ్యపబంతే, ఆనంద బంతే, సంఘపాల బంతే, శ్రీలంక మయన్మార్, లావోస్, కంబోడియా, వియత్నాం, థాయ్‌లాండ్ దేశాల బౌద్ధ భిక్షువులు అంతర్జాతీయ త్రిపీటక పఠన మండలి వ్యవస్థాపకురాలు వాంగ్మోదీక్షి(అమెరికా), సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజే 268 మంది మందుబాబులు చిక్కారు!

సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మందుబాబుల మత్తు వదిలిస్తున్నారు. ఈ నెల 7న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) తనిఖీల్లో 268 మంది పట్టుబడ్డారు. వీరిలో 223 మంది ద్విచక్ర వాహనదారులు కాగా.. 10 మంది త్రీ వీలర్స్, 33 మంది ఫోర్ వీలర్స్, ఇద్దరు ట్రక్ డ్రైవర్లు ఉన్నారు. ఆయా వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. పట్టుబడిన వారిలో 35 మంది మత్తుబాబుల బీఏసీ మోతాదు 200 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్‌గా నమోదయింది. మద్యం మత్తులో వాహనాలను నడిపే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేశారు.



పొట్టచేత 'బట్టి'..

జానెడు పొట్ట కోసం ఇటుక బట్టీల్లో మహిళా కార్మికులు మోయలేని భారంతో పనులు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా బ్రిక్స్ వ్యాపారానికి ప్రసిద్ధి. జిల్లా వ్యాప్తంగా 90 వరకు ఉన్న ఇటుక బట్టీల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మంది వలస కూలీలు ఉపాధి పొందుతున్నారు. పెద్దపల్లి శివారులో మహిళలు తలపై ఇటుకలు మోస్తూ ఇలా కనిపించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ఎటుచూసినా ఎర్ర బంగారం

మహబూబాబాద్ జిల్లా మిర్చి అంటే జాతీయ స్థాయిలో మంచి గిరాకీ ఉంది. అలాంటిది.. మిర్చి ధరలు సగానికి సగం పడిపోవడంతో.. మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం చింతపల్లి, పెద్ద లాలు తండా, చిన్న లాలు తండా గ్రామాల పైనుండి వెళ్తున్న జాతీయ రహదారి–365 పై.. రైతులు కిలోమీటర్ల మేర మిర్చిని ఎండబోసారు. మధ్యాహ్న సమయంలో మిర్చిని ఎండబెట్టి.. సాయంత్రం కాగానే వాటిని కుప్పలు చేసి టార్పాలిన్లు కప్పి ఉంచుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

చొరబాటు ప్రయాణం!

మయన్మార్ టు ఇండియా వయా బంగ్లాదేశ్

- నగరానికి రోహింగ్యాల రాక సాగుతోందిలా..
- అత్యధికంగా పాతబస్తీలో స్థిరపడుతున్న వైనం
- మీ సేవ సెంటర్ల నిర్వాహకులతో గుర్తింపు పత్రాలు
- కోల్‌కతాలో చిక్కినవారి విచారణలో వెలుగులోకి
- బంగ్లా పరిణామాల నేపథ్యంలో నిఘా వర్గాల అలర్ట్

సాక్షి, హైదరాబాద్: మయన్మార్ నుంచి అక్రమ మార్గంలో భారత్‌లోకి చొరబడుతున్న రోహింగ్యాల్లో అనేక మంది నగరంలోనూ ఉంటున్నారా? అనే ప్రశ్నకు ఔననే అంటున్నాయి నిఘా వర్గాలు. వీరిలో అత్యధికులు హైదరాబాద్‌లోని పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో స్థిరపడుతున్నట్లు చెబుతున్నాయి. కోల్‌కతాలోని సాంత్రాగచ్చి రైల్వే స్టేషన్‌లో అక్కడి రైల్వే పోలీసులు బుధవారం నలుగురు రోహింగ్యాలను పట్టుకున్నారు. వీళ్లు ఏళ్ల క్రితం అక్రమంగా సరిహద్దులు దాటి వచ్చి నగరంలోని పాతబస్తీలో ఉంటున్నారని, తిరిగి బంగ్లాదేశ్ వెళ్లే ప్రయత్నాల్లో అక్కడి పోలీసులకు చిక్కారు. వీరి విచారణలో మయన్మార్ నుంచి భారత్ వరకు సాగుతున్న రోహింగ్యాల 'ప్రయాణం' వెలుగులోకి వచ్చింది.

అక్కడి అలజడులతో ఇక్కడ దడ...

బంగ్లాదేశ్‌తో పాటు మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత పరిస్థితులపై ఈ అక్రమ వలసదారుల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఆయా దేశాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తిన ప్రతిసారీ.. అనేక మంది రోహింగ్యాలు వాటిని విడిచిపెడుతున్నారు. వీరిలో అత్యధికులు నేరుగా భారత్‌కు వలస వస్తున్నారు. నగరంలోని పాతబస్తీతో పాటు శివార్లలో స్థిరపడుతున్నారు. తాజాగా మరోసారి బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు చెలరేగడంతో అక్రమ వలసలు పెరిగే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

మాంగ్డో నుంచి టెక్నాఫ్ నగరానికి..

మయన్మార్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన రోహింగ్యాలు అడవుల వెంట కాలిబాటన నడుస్తూ ఆ దేశంలోని మాంగ్డో అనే ప్రాంతానికి చేరుకుంటున్నారు. రాత్రి వేళల్లో చిన్న చిన్న పడవలపై నఫ్ నదిని దాటుతున్న రోహింగ్యాలను బంగ్లాదేశ్‌లో ఉన్న దళారులు రిసీవ్ చేసుకుని, భద్రత బలగాల కంట పడకుండా టెక్నాఫ్ అనే నగరానికి తీసుకువెళ్తున్నారు. అక్కడి నుంచి బస్సుల్లో ప్రపంచంలోనే అతిపెద్ద రోహింగ్యాల శరణార్థి శిబిరం ఉన్న కాక్స్ బజార్‌కు వీళ్లు వచ్చి చేరుతున్నారు. అక్కడ ఉండగానే అనేక మంది ఐక్యరాజ్య సమితి శరణార్థి కార్డు పొందుతున్నారు. అక్కడ శరణార్థి శిబిరంలో కొన్నాళ్లు తలదాచుకుని బంగ్లాదేశ్ రాజధాని ఢాకా చేరుకుని అక్కడి నుంచి ఇండో–బంగ్లా సరిహద్దుల్లోని భోమ్రా ప్రాంతానికి బస్సుల్లో వస్తున్నారు. భద్రతా బలగాల కళ్లుగప్పి ఇచ్ఛామతి నది దాటి భారత్‌లోకి ప్రవేశిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులుగా...

కాక్స్ టౌన్‌లో పనులు చేసుకుంటే నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకే సంపాదన ఉంటుందని, అదే హైదరాబాద్ లాంటి నగరాల్లో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నామని సాంత్రాగచ్చిలో చిక్కిన రోహింగ్యాలు మహ్మద్ ఆలం, రియాసుల్ ఇస్లాం, బేగం దిల్‌బార్, రబీల్ ఇస్లాం పశ్చిమ బెంగాల్ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు. అందుకే నగరానికి అక్రమ వలసదారుల్లో అనేక మంది జీవనోపాధి కోసమే వస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.


సాంత్రాగచ్చిలో చిక్కిన రోహింగ్యాలతో పోలీసులు

పశ్చిమ బెంగాల్ నుంచి అనేక వైపులకు..

ఇలా రెండు దేశాల్లోని నదులు దాటి పశ్చిమ బెంగాల్‌లోని బసిర్హట్ ప్రాంతానికి చేరుకున్న ఈ శరణార్థులు అక్కడ నుంచి హౌరాకు వచ్చి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌తో పాటు బిహార్, జమ్మూ కశ్మీర్‌లకు వెళ్తున్నారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఏ ప్రాంతానికి వెళ్లినా తాము పశ్చిమ బెంగాల్ వాసులమంటూ ఇంటిని అద్దెకు తీసుకుంటున్నారు. అద్దె ఇంటి కరెంట్ బిల్లు ఆధారంగా, వ్యవస్థాగతంగా ఉన్న లోపాలను వాడుకుంటున్న వీళ్లు మీ సేవ కేంద్రాల నిర్వాహకుల సాయంతో ఓటర్ ఐడీలు పొందుతున్నారు. దీని ఆధారంగా ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ ఇలా వరుసగా గుర్తింపు కార్డులు తీసుకుంటున్నారు.

ఆధార్ లింకు ఉంటేనే ఈపీఎఫ్ ప్రోత్సాహకాలు

- ఇప్పటికే పలుమార్లు అవకాశం కల్పించినా అప్‌డేషన్ అంతంతే
- 15వ తేదీలోగా తప్పనిసరిగా లింకు చేసుకోవాలని ఈపీఎఫ్ఓ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ)లో కొత్తగా చందాదారులుగా చేరుతున్న వారికి ప్రోత్సాహకాల పంపిణీలో అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఉద్యోగులుగా కొత్తగా చేరే వారికి కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయీస్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ (ఈఎల్ఐ) కింద ఒక నెల వేతనం (గరిష్టంగా రూ.15 వేలు) మూడు వాయిదాల్లో అందిస్తుంది. ఇది నేరుగా ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి ఈపీఎఫ్ఓ అధికారులు బదిలీ చేస్తారు. ఈ పథకానికి అర్హత సాధించాలంటే సదరు ఉద్యోగి తన పూర్తి వివరాలను సమర్పించి యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్)ను యాక్టివ్ చేసుకోవాలి. కానీ మెజార్టీ ఉద్యోగులు ఈ ప్రక్రియను పూర్తి చేయకపోవడంతో ప్రోత్సాహకాల పంపిణీ ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో ఉద్యోగంలో చేరిన మూడు నెలల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఈపీఎఫ్ఓ పలుమార్లు సూచించినప్పటికీ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఈ క్రమంలో ఈఎల్ఐ పథకానికి అర్హత సాధించిన వారు ఈనెల 15వ తేదీలోగా యూఏఎన్ యాక్టివేషన్, బ్యాంకు ఖాతాను ఆధార్‌తో సీడింగ్ ప్రక్రియను తప్పకుండా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈమేరకు ఈపీఎఫ్ఓ ప్రధాన కార్యాలయంలోని అదనపు ప్రావిడెంట్ కమిషనర్ అనిల్ ఓకే తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఈడీఎల్ఐ పథకానికీ లింకు తప్పనిసరి...

ఈపీఎఫ్ఓ చందాదారులకు బీమా పథకంలో భాగంగా ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఈడీఎల్ఐ)ను అందిస్తోంది. పీఎఫ్ చందాదారుడైన ప్రతి ఉద్యోగికి ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. వివిధ కారణాలతో ఉద్యోగి మరణిస్తే గరిష్టంగా రూ.7 లక్షల వరకు బీమా డబ్బులు సదరు చందాదారుడి నామినీకి అందుతాయి. ఈ పథకం కింద పలు క్లెయిములు ఆధార్ సీడింగ్ లేకపోవడం, ఉద్యోగికి సంబంధించిన సరైన వివరాలు లేకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఉద్యోగి యూఏఎన్ యాక్టివేషన్ పూర్తి చేసుకోవాలని ఈపీఎఫ్ఓ సూచిస్తుంది. అదేవిధంగా ఆధార్ సీడింగ్ ప్రక్రియ సైతం అత్యవసరంగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కల్యాణం.. చూతము రారండి..


పెళ్లికి ముస్తాబైన రమాసహిత సత్యనారాయణస్వామి


బ్రహ్మోత్సవాల్లో భాగంగా విద్యుత్‌కాంతులతో మెరిసిపోతున్న సత్యదేవుని ఆలయం..

దండేపల్లి: మంచిర్యాల జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 06 నుంచి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం గోధూళిక సుముహూర్తమున రమాసహిత సత్యనారాయణస్వామి కల్యాణం వైష్ణవ సంప్రదాయ ప్రకారం అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేయడంతోపాటు, పూలతో అలంకరించి, రంగురంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. కల్యాణానికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేశారు. గుట్టపైన ప్రధాన ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన సామూహిక వ్రతమండపంలో స్వామివారి కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. సుమారుగా 10 వేల మంది భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

కొనసాగుతున్న సప్తాహ భజనలు..

స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సప్తాహ భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆలయ యజ్ఞశాల సమీపంలో ఏర్పాటు చేసిన భజన మండపం వద్ద కళాకారులు సప్తాహ భజనలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

స్పందించి.. పావురానికి ప్రాణం పోసి..


పావురాన్ని కిందకు దింపడానికి ప్రయత్నిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది..

నస్పూర్: మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ పోల్‌కు చుట్టుకున్న మాంజా దారంలో రెండు రోజుల క్రితం ఓ పావురం చిక్కుకుంది. దారం కాలుకు చుట్టుకోవడంతో ఎగరలేకపోయింది. గమనించిన తాళ్లపల్లి మాజీ సర్పంచ్ పబ్బ తినేని కమలాకర్‌రావు కలెక్టర్ కుమార్‌దీపక్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పారు. స్పందించిన కలెక్టర్ నగర పాలక సిబ్బందికి సమాచారం అందించారు. కార్పొరేషన్ సిబ్బంది హుటాహుటిన సీసీసీ కార్నర్‌కు చేరుకుని నిచ్చెన సహాయంతో సెంట్రల్ లైటింగ్ పోల్ పైకి ఎక్కి మాంజాలో చిక్కుకున్న పావురాన్ని కాపాడారు. దీనికి నీళ్లు తాగించి, ఆహారం అందించారు. అనంతరం వదిలి పెట్టడతో ఎగురుకుంటూ వెళ్లిపోయింది. పావురం ప్రాణాలు కాపాడిన కలెక్టర్‌కు కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.


చిక్కుకున్న పావురం వద్ద మిగతా పావురాలు

రూ.కోట్లు కొల్లగొడుతున్నారు

సుమారు ఏడాది క్రితం గోదావరిఖని తిలక్‌నగర్ సెంటర్‌లోని ఓ సూపర్ మార్కెట్ వ్యాపారి కస్టమర్లు, తెలిసిన వారివద్ద దాదాపు రూ.4.5కోట్లు వివిధ రూపాల్లో వసూలు చేశాడు. ఆ తర్వాత తిరిగి చెల్లించలేక చేతులెత్తేశాడు. పెద్దమొత్తంలో కోల్పోయిన బాధితులు లబోదిబోమంటున్నారు.

15నెలల క్రితం గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన ఉడిపి హోటల్ యాజమాని రూ.కోటి వరకు ఇలాగే వసూలు చేసి ఎటో ఉడాయించాడు. ఆయనకు అప్పులు, ఇతరత్రా సాయం చేసిన వారు ఆందోళన చెందుతున్నారు.

గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన నగల వ్యాపారి సుమారు రూ.10కోట్ల వరకు వసూలు చేసి కనిపించకుండా పోయాడు. ఆభరణాలు చేయించడం కోసం డబ్బులు ఇచ్చిన వారు, బంగారం కుదవ పెట్టి అప్పు తీసుకున్న వారు రెండ్రోజులుగా షాపు ఎదుట ఆందోళన చేస్తున్నా ప్రయోజనం లేకుండాపోతోంది.

- రూ.10 కోట్లతో బడా వ్యాపారి పరార్?
- గతంలో రూ.4.5 కోట్లతో సూపర్ మార్కెట్ వ్యాపారి..
- రూ.కోటితో కనిపించకుండా పోయిన హోటల్ యజమాని
- లబోదిబోమంటున్న బాధితులు


నగల దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

గోదావరిఖని: పారిశ్రామిక ప్రాంతంలో బడావ్యాపారులు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. అప్పటివరకు నమ్మకంగా ఉంటూ బోర్డులు తిప్పేస్తున్నారు. కనిపించకుండా పారిపోయే వరకూ బాధితులకు వాస్తవాలు తెలియడం లేదు. సూపర్ మార్కెట్, ఉడిపి హోటల్, నగల దుకాణం.. ఇలా వ్యాపారం ఏదైనా మోసపోవడం నగరవాసుల వంతవుతోంది. వ్యాపారులే కాదు.. చిట్టీల నిర్వాహకులు కూడా చిట్టీల రూపంలో సేకరించిన డబ్బులను కస్టమర్లకు ఇవ్వకుండానే పారిపోతున్నారు. నగరంలోని ఓ ప్రముఖ వైద్యుడు కూడా ఇటీవల అప్పుల రూపంలో భారీగా వసూలు చేసి ఐపీ పెట్టినట్లుగా ప్రచారం జరిగింది. నగరంలో ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మ కూడదో తెలియని పరిస్థితి నెలకొంది.


నగల వ్యాపారికి రూ.5 లక్షల అప్పు ఇచ్చినట్లు బుక్ చూపిస్తున్న బాధితుడు

నగల దుకాణం ఎదుట బాధితులు..

నగరంలోని లక్ష్మీనగర్‌కు చెందిన ఓ నగల వ్యాపారి రూ.కోట్లు కొల్లగొట్టి పరారు కావడంతో బాధితులు షాపు వద్ద పోటెత్తుతున్నారు. దుకాణం ఎదుట కూర్చొని తమకు జరిగిన నష్టం గురించి చెబుతూ విలపిస్తున్నారు. కూతురు పెళ్లి కోసం ఆభరణాలు తయారు చేయాలని బంగారం ఇస్తే దాంతో పరారయ్యాడని, ఇక తన కూతురు వివాహం చేసెదెలా? అని ఓ తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు. ఇలాంటి ఘటనలు కొత్తేమీ కాకున్నా.. రూ.కోట్లలో కొల్లగొట్టడమే నగరవాసులనే కాదు.. జిల్లా ప్రజలనూ కలవర పరుస్తోంది. కాగా, ఇప్పటివరకు 72 మంది వద్ద సుమారు రూ.1.80కోట్లు ఇలా మోసం చేసినట్లు తేలింది.


రూ.10 కోట్లతో వ్యాపారి పరార్

లక్ష్మీనగర్‌లోని ఓ నగల దుకాణ యాజమాని రూ.10 కోట్ల వరకు వివిధ రకాలుగా కస్టమర్ల నుంచి వసూలు చేశాడని, ఆ తర్వాత అవి చెల్లించకుండానే పరారైనట్లు బాధితులు వాపోతున్నారు. కొందరు శుభాకార్యాల కోసం బంగారం ఇచ్చి ఆభరణాలు తయారు చేయించాలని, మరి కొందరు అప్పు రూపంలో ఇచ్చారని చెబుతున్నారు. షాపు ఎదుట ఆందోళన వ్యక్తం చేసి చేసేదేమీ లేక గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాధితుల వివరాలు, కోల్పోయిన డబ్బు వివరాలను పోలీసులు నమోదు చేసుకుంటున్నారు.

వ్యాపారిపై కేసు

అప్పు, చేబదులుతోపాటు నగలు తయారు చేసేందుకు పలువురి వద్ద బంగారం, డబ్బులు తీసుకుని మోసం చేసిన శ్రీనాథ్ జ్యుయలరీ షాపు యాజమాని తానాజీ, అతడి కుమారులు శ్రీకాంత్, సురేశ్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది వెంకటేశ్వర్ వద్ద రూ.25లక్షల విలువైన 120 గ్రాముల బంగారం, కొంత నగదు తీసుకుని తానాజీ మోసం చేశాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.


40 ఏళ్ల నమ్మకం



నగల షాపు యజమానితో మాకు 40ఏళ్ల పరిచయం ఉంది. అప్పు కావాలంటే రూ.లక్ష ఇచ్చినం. తిరిగి ఇవ్వాలని అడిగితే ఏడాదిన్నరగా తిప్పుకుంటున్నడు. చివరకు మోసం చేశాడు. ఫోన్ చేస్తే ఎత్తడం లేదు.

– రేణుక, బాధితురాలు

రూ.5 లక్షల చెక్కు ఇచ్చా



నగలు తయారు చేయాలని 12తులాల బంగారం ఇచ్చినం. రూ.5లక్షల విలువైన చెక్కు కూడా ఇచ్చినం. నగల గురించి అడిగితే ఇప్పుడు, అప్పుడని వాయిదా వేస్తూ వచ్చాడు. చివరకు ఈనెల ఒకటిన ఇస్తనని అన్నడు. ఐదో తేదీన షాపు వద్దకు వస్తే బోర్డు తీసేసి ఉంది. నా కూతురు పెళ్లి కోసం నగలు ఇస్తే మోసం చేసిండు.

– తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు, బాధితుడు

వివరాలు నమోదు చేస్తున్నాం

బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నారు. మోసపోయిన వారి వివరాలన్నీ కూడా సేకరిస్తున్నాం. వ్యాపారికి డబ్బులు ఇచ్చినట్లు ఆధారాలు ఉంటేనే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. బాధితులు ఫిర్యాదు చేస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఇలాంటి సంఘటనల్లో అమాయకులు మోసపోకుండా చైతన్యం తెస్తాం.

– రమేశ్ ఏసీపీ, గోదావరిఖని

పురాతన నాణేలు లభ్యం


లభ్యమైన నాణేలు


నాణేలను పరిశీలిస్తున్న అధికారులు

ముథోల్: నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రంలో శనివారం పురాతన నాణేలు లభ్యమైనట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లూటీ మారుతి నూతన గృహ నిర్మాణం కోసం పునాది తవ్వుతుండగా పాత కుండ బయట పడింది. గడ్డపార తగిలి అది పగిలిపోగా అందులోంచి పురాతన నాణేలు బయటపడ్డాయి. దీంతో మారుతి స్థానిక ఎస్సై సంజీవ్‌కు సమాచారం అందించాడు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణ్‌పటేల్ పరిశీలించారు. పంచనామా నిర్వహించి 92నాణేలు లభ్యమైనట్లు తెలిపారు. వీటిని జిల్లా ఖజానా కార్యాలయంలో జమ చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక సబ్ ట్రెజరీ అధికారి జయరాం గురు, ఎస్సై సంజీవ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



● అమెరికా కలవరం

డిపోర్టేషన్ పరేషాన్

రూపాయి విలువ ఎక్కువున్న దేశానికి ఎందుకు వెళ్తాం? సంపాదించుకోవడానికి! చదువు పేరుతో వెళ్లినా అంతిమ లక్ష్యం అక్కడ కొలువు సాధించడమే! ఈ ప్రస్తావన అమెరికా డిపోర్టేషన్ గురించే! స్టూడెంట్ వీసా మీదున్న వాళ్లు పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసుకోకపోతే కష్టం! అక్కడున్న చట్టాల ప్రకారం చదువుకునే క్యాంపస్ లోనే కొలువులు చేయాలి. అవి దొరకడం క్లిష్టం! క్యాంపస్‌కు ఆవల ఉద్యోగాలకు వెళితే డిపోర్టేషన్ ఖాయం! ఈ క్రమంలో అక్కడున్న భారతీయ కుటుంబాలు కొన్ని.. అవసరంలో ఉన్న స్టూడెంట్స్‌కి తమ ఇళ్లల్లో డొమెస్టిక్ హెల్ప్ ఉద్యోగాలను ఆఫర్ చేస్తున్నాయి. అవి చేయడం తప్పనిసరైతే భద్రత, రక్షణను దృష్టిలో పెట్టుకుని, లీగల్ హెల్ప్ తీసుకుని అడుగేయడం మంచిది!

తెలంగాణకు చెందిన నేహా (పేరు మార్చాం) అమెరికాలో ఎమ్మెస్ చదువుతోంది. వాళ్లది వ్యవసాయ కుటుంబం. అందరి పిల్లల్లాగే తమ పిల్లలూ విదేశాల్లో మంచి ఉద్యోగంలో స్థిరపడాలని నేహా తల్లిదండ్రుల ఆశ. అందుకే నేహా వాళ్ల అక్కను (యూకే), ఆమెను అప్పులు చేసి మరీ విదేశాలకు పంపారు చదివించడానికి. ఖర్చుల కోసం అమ్మా, నాన్న మీద ఆధారపడకూడదని చదువుతూనే పార్ట్ టైమ్ జాబ్స్ చేసుకుంటున్నారిద్దరూ. నేహా తన యూనివర్సిటీ దగ్గర్లోని సూపర్‌మార్కెట్‌లో సేల్స్ గర్ల్‌గా పనిచేసేది. ఆ ఏరియా పోలీసులు, ఇమిగ్రేషన్ సిబ్బంది ఆ సూపర్ మార్కెట్‌లో పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్న ఫారిన్ స్టూడెంట్స్‌ని తీసేయమని, లేదంటే ఆ షాప్ లైసెన్స్ రద్దవుతుందని యజమానికి వార్నింగ్ ఇచ్చారు. మరుక్షణమే నేహా జాబ్ పోయింది. ఖర్చులెలా? అప్పుడే నేహా స్నేహితురాలు ఆమెకు సబర్బ్‌లోని ఇండియన్ కమ్యూనిటీలో ఉన్న డొమెస్టిక్ హెల్పర్ కొలువు గురించి చెప్పింది. 'వీకెండ్స్‌కి వెళ్లి ఇల్లు క్లీన్ చేయాలి. వాళ్లకు పిల్లలుంటే ఆడించాలి. గెట్ టు గెదర్స్‌కి అరెంజ్‌మెంట్స్ చేయాలి అంతే!' అంటూ ఆ ఉద్యోగంలో చేయాల్సిన పనులను వివరించింది. 'పేమెంట్ ప్రామ్ప్ట్‌గానే ఉంటుంది. మన ఐడెంటిటీ ఎక్కడా రివీల్ చేయర'నే అభయమూ ఇచ్చింది. మరో ఆప్షన్ లేదని మారు మాట్లాడకుండా ఓ గుజరాతీ కుటుంబంలో డొమెస్టిక్ హెల్పర్‌గా చేరింది నేహా.

ఇంకో స్టేట్‌లో...

ఆంధ్రప్రదేశ్‌కి చెందిన మాలతి (పేరు మార్చాం) డిపెండెంట్ వీసా మీద అమెరికా వెళ్లింది. భర్తకు హెచ్1బీ ఉంది. ఆమె అక్కడ తమకు తెలిసిన వాళ్ల రెస్టరెంట్‌లో మేనేజర్‌గా పని చేసేది. కానీ ఈ మధ్యే ఉద్యోగం మానేసింది. రెస్టరెంట్ ఓనర్ మీద ఇమిగ్రేషన్ అధికారుల ఒత్తిడి, డిపెండెంట్ వీసా మీద తాను ఉద్యోగం చేస్తున్నట్టు ఇమిగ్రేషన్ సిబ్బందికి తెలిస్తే తన భర్త హెచ్1బీ వీసా రద్దవుతుందేమోనన్న భయంతో!

ఈ ఇద్దరే కాదు.. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన క్షణం నుంచి.. అమెరికాలో విజిటింగ్ వీసా, స్టూడెంట్ వీసాల మీద ఆఫ్ క్యాంపస్ (వాళ్లు చదువుతున్న యూనివర్సిటీకి ఆవల) ఉద్యోగాలు చేస్తున్నవారు, డిపెండెంట్ వీసా మీద గుంభనంగా జాబ్స్ చేసుకుంటున్న వాళ్లందరి పరిస్థితి అలాగే ఉంది. కారణం.. వర్క్ పర్మిట్ లేకుండా ఫుల్ టైమ్ జాబ్స్ చేస్తున్నవారిని, అనుమతి లేని ప్రదేశాల్లో పార్ట్ టైమ్‌కి కుదిరిన వారిని, చట్టవిరుద్ధంగా ఆ దేశంలోకి చొరబడిన వారిని వెనక్కి పంపే కార్యక్రమాన్ని ట్రంప్ కఠినంగా అమలు చేస్తున్నాడు. పాస్‌పోర్ట్‌లో ఒక్కసారి డిపోర్టెడ్ అని ముద్ర పడితే మళ్లీ ఆ దేశానికి విమానమెక్కే చాన్స్ ఉండదు. ఆ స్థితికి రావద్దని ప్రయత్నించని వారులేరు. అందుకే అది పాచి పనా.. ఇంకోటా అని చూడకుండా, పని చోట భద్రత ఉందా? రక్షణ ఎంత? అని ఆలోచించకుండా తాము పనిచేస్తున్నట్టు అమెరికన్ గవర్నమెంట్‌కు తెలియకపోతే చాలు అనుకుంటూ దొరికిన పనిలో చేరిపోతున్నారు! అమెరికా అంతటా ఇలాంటి పరిస్థితే లేదని, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులు గెలిచిన రాష్ట్రాల్లోనే డిపోర్టేషన్ కఠినంగా ఉందని చెబుతున్నారు అక్కడుంటున్న తెలుగువాళ్లు కొందరు. ఇలా చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉంటున్న వాళ్లను సొంత దేశాలకు పంపించేయడం ఇదే మొదటిసారి కాదని, ఆందోళనలు.. భయాలు కొత్తేం కాదని తేలిగ్గా తీసుకుంటున్న అమెరికా పౌరసత్వం పొందిన భారతీయులూ ఉన్నారు. అయితే ఈ డిపోర్టేషన్‌ను ఆసరాగా తీసుకుని తక్కువ జీతానికే భారతీయ విద్యార్థుల చేత ఇంటి పనులు, దుస్తుల ఇస్త్రీ, తోట పని, కార్లు తుడిపించడం, పిల్లలను ఆడించడం వంటి బండెడు చాకిరీ చేయించుకుంటున్నారని వాపోతున్నవారూ ఉన్నారు. ఏమైనా సరే.. పరాయి దేశంలో ఉంటున్నప్పుడు వాళ్ల చట్టాలను గౌరవించడం, ఆ ప్రకారం నడుచుకోవడం తప్పనిసరని చెబుతున్నారు న్యాయసలహాదారులు.

- సరస్వతి రమ

ఇది తెలుసుకోండి

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం గత 15 ఏళ్లుగా 15,000కి పైగా భారతీయులను అమెరికా ప్రభుత్వం డిపోర్ట్ చేసింది. చట్టవిరుద్ధంగా ఆ దేశంలోకి ప్రవేశించినవారెవరైనా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొని గౌరవంగా వెనక్కి రావచ్చు. చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉంటున్న మన పౌరుల్లో అక్కడ చదువుకున్నవారు, పెళ్లి చేసుకుని డిపెండెంట్ వీసా మీద వెళ్లి తర్వాత కుటుంబ కారణాల రీత్యా విడాకులు తీసుకున్నవారు, గృహహింసకు గురైనవారే ఎక్కువ. వీరు స్వచ్ఛందంగా తమ వీసా స్టేటస్‌ను మార్చుకుంటే అమెరికాలోనే ఉండవచ్చు. భర్త వేధింపులకు గురైన అమ్మాయిలు చాలామంది స్టూడెంట్ వీసాకి మారి చదువుకుంటూ అక్కడే ఉండిపోతున్నారు. కొన్ని నేరాలలో విక్టిమ్స్ అయితే వీసాకు అర్హులవుతారు. ఇలా వారికి అర్హత ఉన్న వీసా తీసుకొని అక్కడే ఉండిపోవచ్చు.

అక్కడే ఉండాలనుకునేవారు చేయవలసిన పనులు

1. ఆ దేశ కోర్టును ఆశ్రయించి, పరిస్థితులను వివరిస్తూ, ఆ దేశంలో పౌరసత్వం కోసమో లేక వీసా కోసమో చేసిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే మానవీయ కోణంలో కొంత గడువు కోరడం.
2. కొన్ని ప్రత్యేక కేసులలో.. ఏదైనా అమెరికా సంస్థ నుంచి ఉద్యోగావకాశం ఉందని చూపించగలిగితే వీసా గడువు తర్వాత కూడా మరలా వీసా వచ్చేంత వరకు ఉండొచ్చు.
3. అమెరికా పౌరసత్వం లేదా శాశ్వత నివాసం (పర్మనెంట్ రెసిడెన్సీ) గల వ్యక్తి కుటుంబ సభ్యులు అంటే భార్య, పిల్లలు లేదా తల్లిదండ్రులు అయ్యుండి, సదరు పౌరుడిచే లేదా అతని కుటుంబ సభ్యులచే గృహహింసకు లోనయ్యుంటే వయొలెన్స్ అగెనెస్ట్ విమెన్ యాక్ట్ (VAWA) కింద.. గృహహింసకు గురి చేసిన వ్యక్తికి తెలియకుండానే గ్రీన్ కార్డు పొందవచ్చు.
4. ప్రత్యేక పరిస్థితుల్లో ఆశ్రయం కోరవచ్చు.

వీటన్నిటి కోసం ముందుగా మంచి ఇమిగ్రేషన్ అటార్నీ (లాయర్)ని కలవాలి. ఏజెంట్ల ద్వారా వెళ్తే మోసపోయే ప్రమాదం ఉంటుంది. ఇమిగ్రేషన్ చట్టం సులభంగా అర్థమయ్యేది కాదు కాబట్టి నిపుణుల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

వైవిధ్యం

రాయల్ నేవీ చీర!



'రాయల్ నేవీ' అనేది కొత్త డిజైన్‌తో వచ్చిన చీర కాదు. విషయం ఏమిటంటే... సాంస్కృతిక వైవిధ్యాన్ని విస్తృత పరచడానికి శ్రీకారం చుట్టింది యూకే రాయల్ నేవీ. ఇందులో భాగంగా 'ఫార్మల్ డ్రెస్‌కోడ్'ను అప్‌డేట్ చేసింది. అధికారిక కార్యక్రమాలలో మహిళా ఆఫీసర్‌లు చీరలు, సల్వార్ కమీజ్, లెహంగాలాంటి కల్చరల్ డ్రెస్‌లను ధరించడానికి అనుమతిస్తున్నట్లు తొలిసారిగా బ్రిటిష్ నేవీ ప్రకటించింది.

అయితే వీటిపై యూనిఫాం షర్ట్, బ్లాక్ బో ధరించాల్సి ఉంటుంది.

బ్రిటిష్ పాకిస్థానీ నేవీ ఆఫీసర్ దుర్దాన అన్సారి ఫొటోను జత చేస్తూ రాయల్ నేవీ(ఆర్ ఎన్) డైవర్సిటీ నెట్‌వర్క్ చైర్ పర్సన్ జాక్ కనాని లింక్డిన్‌లో కొత్త పాలసీ గురించి ప్రకటించారు. ఈ ఫొటోలో అన్సారి తెల్లని చీరలో మెస్ జాకెట్ ధరించి కనిపిస్తుంది.

అయితే 'ఫార్మల్ డ్రెస్‌కోడ్'లో మార్పు తేవడం కొందరు మాజీ బ్రిటిష్ అధికారులకు బొత్తిగా నచ్చలేదు.

'సాంస్కృతిక గుర్తింపును యూనిఫామ్‌తో కలపడం సరికాదు' అని విమర్శించారు.

అయితే వారి విమర్శల సంగతి ఎలా ఉన్నా ఫార్మల్ డ్రెస్‌కోడ్ అప్‌డేట్‌పై ఎక్కువ మంది సానుకూలంగా, సంతోషంగా స్పందించారు.

న్యూ పాపరాజీ

'సెల్'బ్రిటీ కష్టాలు!



సెలబ్రిటీల కదలికలు, వ్యక్తిగత జీవిత విషయాలను సొమ్ము చేసుకునే ఎల్లో మీడియా పాపరాజీ దారిలో రాజీ పడకుండా నడుస్తుంటుంది. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్‌ల పుణ్యమా అని మీడియాతో సంబంధం లేని వారు కూడా సెలబ్రిటీలు కనిపిస్తే చాలు పాపింగ్ చేస్తున్నారు. సెలబ్రిటీల పాలిట పెనుభూతం పాపరాజీ. ఇల్లు దాటి బయటికి వస్తే ఎవరు ఎక్కడ కెమెరాతో క్లిక్ అనిపిస్తారో తెలియదు. బిగ్ బాస్ సీజన్ 17 ద్వారా సోషల్ మీడియాలో పాపులారిటీ సంపాదించుకున్న నటి ఆయేషా ఖాన్ పాపరాజీపై మండిపడింది. తన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ అనవసర కామెంట్స్ చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీడియా పట్ల నాకు గౌరవం ఉంది. అయితే పాపరాజీ మాత్రం చాలా ఇబ్బందికరంగా ఉంది. నా కారు వరకు నన్ను అనుసరించడం, నన్ను ముందుకు నడవనివ్వక పోవడం...ఇలా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాను. చేతిలో మొబైల్ ఉంటే చాలు పాపింగ్ పేరుతో వెంటబడుతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేసింది.

ఆయేషా విషయానికి వస్తే అభిమానులతో పాటు, నెటిజనులు ఆమెకు సపోర్ట్ చేస్తూ పాపరాజీ తీరుపై మండిపడుతున్నారు. 'చౌకబారు మనసున్న వ్యక్తులకు వ్యతిరేకంగా మీరు గళం విప్పినందుకు సంతోషంగా ఉంది. పాపరాజీ పేరుతో మిమ్మల్ని అసౌకర్యానికి గురి చేసే హక్కు వారికి లేదు' అని ఒక నెటిజనుడు స్పందించాడు.

హెల్త్



నిద్రలేమితో నాడీ ఢీలా!

మనిషి ఆరోగ్యానికి నిద్ర చాలా ముఖ్యం. సరైన నిద్రలేకపోవడం వల్ల గుండెజబ్బులు మొదలుకొని ఆరోగ్యపరంగా ఇతరత్రా అనేక సమస్యలు వచ్చే అవకాశముంది. ఇటీవల అనేక కారణాలతో మనలో చాలామందికి నిద్ర తగ్గిపోవడం చాలా సాధారణమైంది. ఈ కారణం చేత ప్రజల్లోని అన్ని వర్గాల వాళ్లలో చాలారకాల ఆరోగ్య సమస్యలు పెరిగిపోయాయి. నిద్ర తగ్గడం వల్ల బాగా పెరిగిపోయిన సమస్యల్లో నాడీ సంబంధమైన వ్యాధులు ముఖ్యమైనవి. ఉదాహరణకు ఏదైనా విషయాన్ని అర్థం చేసుకోవడం, విశ్లేషించడంలో (కాగ్నిటివ్) సమస్యలూ, అల్జైమర్స్ కేసులు పెరగడంతో పాటు కొందరు పక్షవాతానికి గురైన దాఖలాలు ఉన్నాయి. నిద్ర తగ్గడం వల్ల వచ్చే నాడీ సంబంధమైన సమస్యలూ, వాటి నివారణ ఎలా అన్నది చూద్దాం.

నిద్రకూ, మెదడూ అలాగే నాడీ వ్యవస్థకు ఉన్న సంబంధం చాలా సంక్లిష్టం. అయినప్పటికీ చాలా చిన్న చిన్న ఉదాహరణలతోనే ఆ సంక్లిష్ట సంబంధాన్ని నిరూపించవచ్చు. ఉదాహరణకు క్రితం రాత్రి నిద్రలేకపోతే... ఆ మర్నాడంతా దేనిపైనా దృష్టి కేంద్రీకరించలేరు. స్వల్పకాలిక జ్ఞాపకశక్తి (షార్ట్ టర్మ్ మెమరీ) తగ్గుతుంది. అలాగే నాలుగైదు రోజులు సరిగా నిద్రలేకపోతే చిన్న చిన్న విషయాలకే చికాకు కలగవచ్చు. చిర్రెత్తుకు రావచ్చు. పిచ్చికోపం వచ్చేస్తుంది. కొన్ని భ్రాంతులకూ లోనయ్యే ప్రమాదం ఉంది. ఇలా నిద్రలేమి కారణంగా మూడ్స్ మారిపోవడాన్ని బట్టి చూస్తే... నిద్రకూ, నాడీ వ్యవస్థకూ సంబంధముంటుందని తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు... వాహనాలు నడిపేవారికి తగినంత నిద్రలేకపోతే డ్రైవింగ్‌పై పూర్తిగా దృష్టి నిలపలేక యాక్సిడెంట్లు అయిన ఉదంతాలు అన్నీ ఇన్నీ కావన్నది అందరికీ తెలిసిన విషయాలే.

నిద్ర సమయంలో మెదడులో జరుగుతూ మానవులకు మేలు చేసే కొన్ని పరిణామాలివి...

పెద్దవాళ్ల విషయంలో...

అల్జైమర్స్ వ్యాధికి గురికావడం : మెదడులో వెలువడే కొన్ని విషపూరితమైన రసాయనాలను అంటే... ఉదాహరణకు బీటా ఎమైలాయిడ్ ప్లాక్ వంటి పాచిలాంటి పదార్థాలను నిద్రపోయే సమయంలోనే బ్రెయిన్ వదిలించుకుంటుంది. ఈ పాచి వంటి రసాయనాలే అల్జైమర్ వ్యాధికి కారణమవుతాయి. ఈ వ్యాధి ఎంతటి ప్రమాదకరమైనదంటే గతంలో తాను నివసించిన ప్రాంతాలు, తాను నివాసముంటున్న ఇల్లు, తనకు తెలిసిన అన్ని నైపుణ్యాలు (వాహనం నడపడం వంటివి) ఇలా అన్నింటినీ మరచిపోయే ప్రమాదముంటుంది. అల్జైమర్స్ సోకినవాళ్లు మింగడం ఎలాగో అనేదే కాదు... చివరికి తానెవరో అనే సంగతీ మరచిపోతారు.



డా. విక్రమ్ కిశోర్ రెడ్డి
సీనియర్ న్యూరో ఫిజిషియన్

స్లీప్ ఆప్నియా : గొంతులోంచి ఊపిరితిత్తులకు గాలిని తీసుకెళ్లే నాళం ముడత పడటంతో శ్వాసప్రక్రియలో అందులోంచి గాలి ప్రవహించేటప్పుడు గురక వస్తుంది. చాలామంది గురకను తేలిగ్గా తీసుకుంటారుగానీ 'స్లీప్ ఆప్నియా' అని పిలిచే ఇది... చాలా ప్రమాదకరమైన వ్యాధి. గొంతులోని వాయునాళానికి సంబంధించిన ఈ వ్యాధిని... నిజానికి ముక్కు, గొంతుకు సంబంధిత రుగ్మత అనుకుంటారుగానీ... ఈ వ్యాధికీ మెదడుకూ ఎంత సంబంధముంటుందంటే... గురక సమయంలో ముడుచుకుపోయిన వాయునాళం కారణంగా మెదడుకు తగినంత ఆక్సిజన్ అందనప్పుడు... బాధితుణ్ణి నిద్రలేవాల్సిందిగా మెదడు ఆదేశిస్తుంది. ఈ శ్వాసనాళం పూర్తిగా మూసుకుపోవడం అనే పరిస్థితి 10 సెకండ్లకు పైగానే కొనసాగవచ్చు. అంటే ఆ టైమ్‌లో శ్వాస అందదు. అలాంటి ప్రమాదకరమైన పరిస్థితిని తప్పించడానికి బాధితుణ్ణి నిద్రలేవమని మనను మన మెదడు ఆదేశిస్తుంది. అప్పుడు నిద్రలేచి శ్వాస తీసుకుని మళ్లీ నిద్రలోకి జారుకుంటారు. అలా నిద్రాభంగం కాగానే ముడుతలు పడ్డ వాయునాళం కాస్తా మామూలుగా అయిపోవడంతో మళ్లీ మెదడుకు తగినంత ఆక్సిజన్ అందుతుంటుంది. ఇలా శ్వాస అందని (ఆప్నియా) స్థితి ఒక రాత్రిలోనే కొన్ని వందల సార్లు రావచ్చు. ఫలితంగా వచ్చే నిద్రలోటును 'స్లీప్ డెఫిసిట్' అంటారు. ఇలా గురక వస్తూ ఉంటుంది కాబట్టి మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవడంతో అలాగే నాణ్యమైన నిద్ర కరవు కావడంతో (అంటే స్లీప్ డెఫిసిట్‌తో) ఆ మర్నాడు బాధితులు మగతగా, డల్‌గా కనిపిస్తుంటారు. దేనిపైనా దృష్టి కేంద్రీకరించలేరు. దీనివల్ల అర్థం చేసుకునే శక్తి, లాజికల్‌గా నేర్చుకునే శక్తియుక్తులు (కాగ్నెటివ్ ఎబిలిటీస్) తగ్గుతాయి. అంతేకాదు... పలు నాడీ సంబంధమైన రుగ్మతలు (న్యూరలాజికల్ కండిషన్స్)తో పాటు క్రమంగా మెదడు ఆరోగ్యమూ ప్రభావితమయ్యే అవకాశముంది.



పక్షవాతం : నిద్రలేమి కారణంగా మెదడుకు కలిగే అసౌకర్యాలూ లోపాలతో పక్షవాతం లాంటి తీవ్రమైన వ్యాధులు సైతం వచ్చే అవకాశముంది.

త్వరగా వయసు పైబడటం : నిద్రలేమి కారణంగా వయసు పెరగడం (ఏజింగ్) వల్ల కలిగే అనర్థాలు చాలా త్వరగా వచ్చేస్తాయి. కంటినిండా నిద్రపోయే వారిలో ఏజింగ్ ప్రక్రియ నెమ్మదిగా జరుగుతుంది. అంటే వాళ్లు సుదీర్ఘకాలం పాటు యౌవనంగా ఉంటారు. ఆరోగ్యకరమైన నిద్ర వల్ల చర్మం త్వరగా ముడతలు పడదు. అలా ముడతలు పడకుండా ఉంచేందుకు దోహదపడే కొలాజెన్ అనే కణజాలం చాలా కాలం పటుత్వంగా ఉండటంతో చర్మంపైనా, కళ్ల కింద నల్లబడటం జరగదు (డార్క్ సర్కిల్స్ రావు). నుదుటిమీద గీతలు పడవు.

మంచి నిద్రతోనే మంచి జ్ఞాపకశక్తి : నిద్రలో మెదడులో కొన్ని తరంగాలు లయబద్ధంగా కదులుతూ ఉంటాయి. వాటినే 'షార్ట్ వేవ్ రిపుల్స్' అంటారు. మనుషులు ఏదైనా విషయాన్ని గుర్తుపెట్టుకున్నప్పుడు అది మరింతగా గుర్తుండిపోవడానికి కారణమౌతూ జ్ఞాపకశక్తికి తోడ్పడేవి ఈ తరంగాలే. అమెరికన్, ఫ్రెంచ్ శాస్త్రజ్ఞులు 2009లో నిర్వహించిన ఒక పరిశోధన ప్రకారం ఈ జ్ఞాపకాలన్నీ మెదడులోని హిప్పోక్యాంపస్ నుంచి మరో ప్రాంతం అయిన నియోకార్టెక్స్‌కు బదిలీ అయి... అక్కడ దీర్ఘకాలపు జ్ఞాపకాలు (లాంగ్ టర్మ్ మెమరీ)గా ఉండిపోతాయి. అంటే ఇక్కడ షార్ట్ టర్మ్ మెమరీగా ఉన్న జ్ఞాపకాలు... అక్కడ లాంగ్ టర్మ్ మెమరీస్‌గా మారి శాశ్వతమవుతాయి. అందుకు కారణమైన 'షార్ప్ వేవ్ రిపుల్స్' అన్నీ గాఢనిద్రలోనే సాధ్యమవుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే... నిద్ర ఉంటేనే మంచి జ్ఞాపకశక్తి సాధ్యమవుతుంది.

పిల్లల విషయంలో...

పిల్లల్లో నేర్చుకునే శక్తి తగ్గించే నిద్రలేమి : పిల్లల్లో నిద్రలేమి ఎంతటి తీవ్రమైన పరిణామాలను తెచ్చిపెడుతుందో జరిగిన పరిశోధనలు చాలా ఎక్కువ. ఉదాహరణకు పిల్లలు కంటినిండా నిద్రపోకపోతే వారిలో నేర్చుకునే శక్తి మందగిస్తుంది. ఏకాగ్రత తగ్గుతుంది. చురుకుదనం లోపిస్తుంది. ఏదైనా అంశం మీద దృష్టి కేంద్రీకరించే శక్తి, రీజనింగ్ పవర్, సమస్యను పరిష్కరించే నైపుణ్యాలు, సృజనాత్మకతా తగ్గుతాయి. పిల్లలు మందకొడిగా అయిపోతారు. అంటే పిల్లలు కంటినిండా నిద్రపోతే పై అనర్థాలన్నీ తప్పిపోతాయి. అందుకే చిన్నారుల నిద్ర సమయాన్ని తగ్గనివ్వకూడదు. వాళ్లను కంటి నిండా నిద్రపోనివ్వాలి.

నిద్రతోనే పిల్లలు ఎత్తు పెరిగే సామర్థ్యం : పిల్లల్లో ఎత్తు పెరిగేందుకు సహాయం చేసే గ్రోత్ హార్మోన్‌లు నిద్రలోనే స్రవించేలా మెదడు ఆదేశాలు ఇస్తుంది. అంటే పిల్లలు కంటి నిండా నిద్రపోతేనే బాగా పెరుగుతారు. బాగా ఎత్తుగా ఎదురుతారు. ఒక వయసు దాటాక ఇదే గ్రోత్ హార్మోన్ కండరాలను పెంచుతుంది. అవి మందంగా అయ్యేలా చేస్తుంది. ఎముకలను గట్టిపరుస్తుంది. చిన్న పిల్లలు కంటి నిండా నిద్రపోతున్నారంటే... పై ప్రయోజనాలన్నీ చేకూరుతున్నాయని అర్థం.

మంచి నిద్ర కోసం...

- ప్రతిరోజూ ఒకే వేళకు నిద్రించడం / నిద్రలేవడం
- నిద్రపోయే ముందర సమస్యలను చర్చించకపోవడం
- గోరువెచ్చటి నీళ్లతో స్నానం, శ్రావ్యమైన సంగీతం వినడం
- రాత్రిపూట పడుకునే ముందు కాఫీ, టీ, శీతల పానీయాలు, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం
- నిద్రకు ముందర టీవీ చూడటం, కంప్యూటర్ పై పనిచేయడానికి దూరంగా ఉండటం
- పడకగదిలో మరీ ఎక్కువ కాంతిగానీ, చప్పుళ్లు గానీ లేకుండా చూసుకోవడం
- పడకగదిలో మరీ ఎక్కువ చల్లగా లేకుండా, వెచ్చగా లేకుండా జాగ్రత్తపడటం
- అన్నిటికంటే ముఖ్యంగా రోజూ దేహానికి తగినంత వ్యాయామం ఇవ్వడం. దానితో పాటు మెదడుకు మేతగా సుడోకూ, పజిల్స్ వంటివి సాల్వ్ చేస్తూ మెదడుకూ తగినంత వ్యాయామాన్ని కల్పించడం.

ఇలాంటివి చేయడం వల్ల మంచి నిద్ర పట్టడంతో పాటు మెదడుకూ మంచి ఆరోగ్యం సమకూరుతుంది.

యంగ్ లుక్ మంచిదే!

మహిళల్లో చాలామంది తమ వాస్తవమైన ఏజ్ కంటే తక్కువ వయసు వారిగా కనిపించడానికి ప్రయత్నిస్తుంటారంటూ ఈ అంశంపై సమాజంలో జోకులూ, సెటైర్లూ ఎక్కువగానే వినిపిస్తుంటాయి. కానీ ఇలా తక్కువ వయసువారిగా కనిపించడం అన్నది ఆరోగ్యపరంగా, ఆత్మవిశ్వాసపరంగా చాలా మేలు చేస్తుందని పరిశోధనల్లో నిరూపితమైంది. మహిళలకే కాదు... ఈ విషయం పురుషులకూ వర్తిస్తుంది. నిజానికి తమ వాస్తవమైన ఏజ్ కంటే తక్కువ వయసువారిగా కనిపించేవారు ఆత్మవిశ్వాసంతో వ్యవహరించడంతో పాటు ఆరోగ్యపరంగా వాళ్లకు హైబీపీ, పక్షవాతం, గుండెజబ్బుల వంటి జబ్బులు వచ్చే అవకాశాలు తక్కువని పరిశోధనల్లో తేలింది. తామింకా చిన్నవాళ్లమేననే భావన వల్ల వారు సుదీర్ఘకాలం పాటు జీవించడమూ జరుగుతుందని వెల్లడైంది. వాళ్ల ముఖంపైన ముడుతలు రావడమూ తక్కువేనని తేలింది. ''జర్నల్ ఆఫ్ జెరంటాలజీ'' అనే వైద్య జర్నల్‌లో నమోదైన పరిశోధనల ఫలితాలు ఈ విషయాలను వెల్లడిస్తున్నాయి.





తల్లిపాలతో మెదడు మెరుగ్గా!

తమ నెలల వయసులో పూర్తిగా తల్లి పాలపైనే ఆధారపడటంతో పాటు... చాలాకాలం పాటు అలా తల్లిపాలు తాగుతూ పెరిగే పిల్లలకు భాషలు నేర్చుకునే సామర్థ్యం, ప్రతిభ (లాంగ్వేజ్ స్కిల్స్) చాలా ఎక్కువని కొన్ని పరిశోధనల్లో తేలింది. అంతేకాదు... ఇలా తల్లిపాలపై దీర్ఘకాలం పెరిగే పిల్లల్లో మెదడు వికాసం బాగా జరగడం వల్ల వాళ్లకు సహజమైన తెలివితేటలూ, తార్కికంగా ఆలోచించే శక్తియుక్తులు (లాజికల్ స్కిల్స్) కూడా బాగా పెరుగుతాయంటూ హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధకులు నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది.

ఈ అధ్యయనం కోసం దాదాపు 1500 మంది తల్లులను ఎంపిక చేశారు. దాదాపు ఏడు సంవత్సరాల పాటు సాగిన ఈ అధ్యయనంలో చాలాకాలం పాటు తల్లిపాలు తాగిన పిల్లలూ, కేవలం కొద్దికాలం పాటు మాత్రమే బ్రెస్ట్ ఫీడింగ్‌పై ఉన్న పిల్లల తెలివితేటలనూ, ఐక్యూను పరీక్షించారు.

ఈ అధ్యయనంతో తేలిన అంశాలను బట్టి... చాలాకాలం పాటు తల్లిపాలు తాగిన పిల్లలు వారి మంచి సామర్థ్యాలను కనబరిచారు. సుదీర్ఘకాలం పాటు తల్లిపాలను తాగిన పిల్లలు ఎక్కువ వకాబ్యులరీని కలిగి ఉండటంతో పాటు, భాషపై మంచి పట్టు సాధించినట్లు తేలింది. హార్వర్డ్ పరిశోధకుల పరిశోధన వివరాలు 'జామా పీడియాట్రిక్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.







చెన్నై ఏటీపీ టోర్నీ రన్నరప్‌గా సాకేత్ జోడీ

చెన్నై: ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్, భారత డేవిస్ కప్ జట్టు మాజీ సభ్యుడు సాకేత్ మైనేని ఈ సీజన్‌లో చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీలో డబుల్స్ టైటిల్ నిలబెట్టుకోలేకపోయాడు. భారత సహచరుడు రామ్‌కుమార్ రామనాథన్‌తో కలిసి బరిలోకి దిగిన సాకేత్ చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. శనివారం జరిగిన తుదిపోరులో సాకేత్ - రామ్‌కుమార్ జోడీ 4–6, 4–6తో పింటారో మొచిజుకి-కైటో వునుగి (జపాన్) జంట చేతిలో పరాజయం చవిచూసింది. జపాన్ జోడీ మ్యాచ్ ఆరంభం నుంచే భారత ఆటగాళ్లపై పైచేయి సాధించింది. దీంతో తొలి సెట్ గెలిచేందుకు ఎంతోసేపు పట్టలేదు. తర్వాత రెండో సెట్‌లోనూ భారత జంట పుంజుకోలేకపోయింది. ఇదే అదనుగా పింటారో–కైటోలు చక్కని సమన్వయంతో వరుసగా రెండో సెట్‌తో పాటు టైటిల్‌ను గెలుచుకుంది. గతేడాది ఇక్కడ భారత ద్వయం టైటిల్ సాధించింది. ఈ సారీ టైటిల్ వేటలో నిలిచినా... చివరి మెట్టుపై చతికిలబడింది. సాకేత్–రామ్ కుమార్ జోడీ తదుపరి ఈ నెల 17 నుంచి పుణేలో జరిగే ఏటీపీ చాలెంజర్ టోర్నమెంట్ బరిలోకి దిగుతుంది.

సిరీస్ విజయమే లక్ష్యంగా...

నేడు భారత్, ఇంగ్లండ్ రెండో వన్డే

- గెలిస్తే సిరీస్ టీమిండియా సొంతం
- సమం చేయడంపై ఇంగ్లండ్ దృష్టి
- మ.గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్, స్పోర్ట్స్18లలో ప్రసారం

ఇంగ్లండ్‌పై టి20 సిరీస్ జోరును కొనసాగిస్తూ వన్డేల్లోనూ శుభారంభం చేసిన భారత జట్టు ఇప్పుడు మరో సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు సిద్ధమైంది. అన్ని రకాలుగా ఫామ్‌లో ఉన్న టీమిండియా ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో చెలరేగుతున్న భారత్‌ను నిలువరించడంలో తీవ్రంగా ఇబ్బంది పడుతూ వరుస పరాజయాలు ఎదుర్కొంటున్న ఇంగ్లండ్ ఈ సారైనా కోలుకొని పోటీనిస్తుందా చూడాలి.





కటక్: ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు సొంతగడ్డపై తమ సత్తాను ప్రదర్శిస్తున్న భారత జట్టు ఇంగ్లండ్‌పై వన్డే సిరీస్‌ను గెలుచుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. బారాబతి స్టేడియంలో నేడు జరిగే రెండో వన్డేలో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేసి 38.4 ఓవర్లలోనే ఛేదన పూర్తి చేసిన భారత్ అదే స్థాయి ఆటను ప్రదర్శిస్తే మరో మ్యాచ్ కూడా రోహిత్ సేన ఖాతాలో చేరుతుంది. టి20ల్లో చిత్తుగా ఓడి తొలి వన్డేలో కూడా 248కే పరిమితమైన ఇంగ్లండ్ మెరుగైన ప్రదర్శనతో సిరీస్ సమం చేయాలని భావిస్తోంది. 2006 నుంచి భారత గడ్డపై 31 సార్లు భారత్‌తో తలపడిన ఇంగ్లండ్ 5 మ్యాచ్‌లే గెలిచి 25 ఓడింది.

కోహ్లి సిద్ధం...

గాయంతో తొలి మ్యాచ్‌కు దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి పూర్తి ఫిట్‌గా సిద్ధమయ్యాడు. రెండో వన్డేలో అతను బరిలోకి దిగడం ఖాయమైంది. కోహ్లి కూడా చాలా రోజులుగా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. లయ అందుకునేందుకు అతనికి ఇదే సరైన అవకాశం. అయితే ఎవరి స్థానంలో విరాట్ ఆడతాడనేది ఆసక్తికరం. గత మ్యాచ్‌లో చెప్పినదాని ప్రకారం శ్రేయస్‌ను తప్పించి కోహ్లిని తీసుకోవాలి. కానీ మెరుపు అర్ధసెంచరీతో ఆకట్టుకున్న శ్రేయస్‌ను పక్కన పెడితే టీమ్ మేనేజ్‌మెంట్‌పై తీవ్ర విమర్శలు రావచ్చు. కోచ్ గంభీర్ సాధారణంగా ఓపెనింగ్ ఎడమ, కుడిచేతివాటం కాంబినేషన్‌ను ఇష్టపడతాడు. అలా చూస్తే శ్రేయస్‌పైనే వేటు వేసి జైస్వాల్‌ను ఆడించవచ్చు. కానీ చాంపియన్స్ ట్రోఫీ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని చూస్తే ప్రయోగాలు చేయకుండా జైస్వాల్‌ను పక్కన పెట్టడం సరైన నిర్ణయమవుతుంది. మరోవైపు రాహుల్ స్థానంలో కీపర్‌గా పంత్‌ను ఆడించే ఆలోచన కూడా ఉంది. లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను పరీక్షించేందుకు రాణాను పక్కన పెట్టాలనే చర్చ కూడా జరుగుతోంది. ఎలాగైనా ఈ సిరీస్ గెలవాలని భావిస్తే భారత జట్టు మార్పులపై దృష్టి పెట్టకపోవచ్చు. కానీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ సిరీస్‌లో ఆటగాళ్లను పరీక్షించాలనే ఆలోచన ఉంటే మాత్రం మార్పులు ఖాయం. సీనియర్ పేసర్ షమీ గత మ్యాచ్‌లో వికెట్లు తీయకపోయినా చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆల్‌రౌండర్ అక్షర్ బ్యాటింగ్‌లో రాణించడం సానుకూలాంశం. అయితే అన్నింటికి మించి కెప్టెన్ రోహిత్ ఫామ్‌లోకి రావడం భారత్‌కు ముఖ్యం. చాలా కాలంగా వరుసగా విఫలమవుతున్న రోహిత్ ఇక్కడైనా రాణిస్తాడా చూడాలి. గిల్, పాండ్యా, జడేజాలతో మన బ్యాటింగ్ పటిష్టంగా ఉంది.

గెలిపించేదెవరు?

ఈ పర్యటనలో ఐదు మ్యాచ్‌లలో ఓడిన ఇంగ్లండ్ ఆట దిశానిర్దేశం లేకుండా సాగుతోంది. పేరుకు భారీ బ్యాటింగ్ లైనప్ కనిపిస్తున్నా ఆ జట్టు వ్యూహాల్లో పదును లోపించింది. గుడ్డిగా బ్యాట్‌లు ఊపడం తప్ప ఆటగాళ్లు విఫలమవుతున్న చోట రెండో ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. కోచ్ మెక్‌కలమ్ ప్రణాళికలు ఏవీ పని చేయడం లేదు. భారత గడ్డపై అనుభవం ఉన్న బట్లర్ మాత్రమే ఎంతో కొంత రాణిస్తుండగా బెతెల్ కాస్త పట్టుదలగా ఆడగలిగాడు. జట్టు ఆధారపడుతున్న రూట్, బ్రూక్ స్థాయికి తగ్గ ఆటను కనబర్చాల్సి ఉంది. ముఖ్యంగా బ్రూక్ 5 టి20లు, వన్డే కలిపి 91 పరుగులే చేశాడు. డకెట్ ఇంకా వన్డే ఓపెనర్‌గా కుదురుకోకపోగా, సాల్ట్ మరో మెరుపు ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. ఆర్చర్, కార్స్ పేస్ భారత బ్యాటర్లపై ఎలాంటి ప్రభావం చూపకపోగా, రషీద్ తేలిపోయాడు. ఈ మ్యాచ్‌లో మరో పేసర్ వుడ్ బరిలోకి దిగే అవకాశం ఉంది. 40 ఓవర్లలోపే భారత్ తొలి వన్డే ముగించడం ఇంగ్లండ్ బౌలింగ్ బలహీనతను కూడా చూపించింది. దీనిని ఆ జట్టు ఎలా అధిగమిస్తుందో చూడాలి.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్/ పంత్, పాండ్యా, జడేజా, అక్షర్, కుల్దీప్, అర్ష్‌దీప్, షమీ

ఇంగ్లండ్: బట్లర్ (కెప్టెన్),సాల్ట్, రూట్, బ్రూక్, డకెట్, లివింగ్‌స్టోన్, బెతెల్, కార్స్, ఆర్చర్, రషీద్, వుడ్.

పిచ్, వాతావరణం

ఈ మైదానంలో ఐదేళ్ల తర్వాత వన్డే మ్యాచ్ జరుగుతోంది. మొదటినుంచి ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఈ సారి కూడా పరుగుల వరద ఖాయం. వర్షం అంతరాయం కలిగించే అవకాశం లేదు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

నిత్యకు రజత పతకం

38వ జాతీయ క్రీడలు



డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో మరో పతకం చేరింది. గంధె నిత్య అథ్లెటిక్స్‌తో ఈ పతకాన్ని అందించింది. మహిళల 100 మీటర్ల పరుగులో నిత్య రెండో స్థానంలో నిలిచింది. ఆమె 11.79 సెకన్లలో రేసును ముగించింది. సుదేశ్న శివాంకర్ (మహారాష్ట్ర – 11.76 సె.), గిరిధరణి (తమిళనాడు – 11.88 సె.) స్వర్ణ, కాంస్యాలు గెలుచుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ 1 స్వర్ణం, 2 రజతాలు, 4 కాంస్యాలతో (మొత్తం 7 పతకాలు) 29వ స్థానంలో ఉంది. మహిళల టెన్నిస్ సింగిల్స్‌లో తెలంగాణకు చెందిన దండు లక్ష్మీసిరి సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్స్‌లో లక్ష్మీసిరి 6–2, 6–1తో రియా సచ్‌దేవ (ఢిల్లీ)పై గెలుపొందింది. ప్రభ అరుణ్‌కుమార్ (తమిళనాడు)తో జరిగిన మ్యాచ్‌లో మరో తెలంగాణ ప్లేయర్ సంజన సిరిమళ్ల 3–0తో ఆధిక్యంలో ఉన్న దశలో రిటైర్డ్ అయి నిష్క్రమించింది. పురుషుల 100 మీటర్ల పరుగులో అనిమేశ్ కుజూర్ (ఒడిషా) విజేతగా నిలిచాడు. 10.28 సెకన్లలో పరుగు పూర్తి చేసిన అనిమేశ్ స్వర్ణం గెలుచుకోగా... ప్రణవ్ గురవ్ (మహారాష్ట్ర – 10.32 సె.), అమ్లన్ బొర్గొహైన్ (అసోం – 10.43 సె.) రజత, కాంస్యాలు సాధించారు.

మాయ పోరాటం ముగిసె...



ముంబై: భారత టీనేజ్ టెన్నిస్ స్టార్ మాయ రాజేశ్వరన్ రేవతి సంచలన ప్రదర్శన సెమీ ఫైనల్లో ముగిసింది. ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ–125 టోర్నీలో వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగిన ఆమె అద్భుత ప్రదర్శనతో పలువురు అంతర్జాతీయ క్రీడాకారిణులను కంగుతినిపించి ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. కానీ ఆమె జోరుకు సెమీస్‌లో చుక్కెదురైంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 15 ఏళ్ల భారత ప్లేయర్ 3–6, 1–6తో స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రపంచ 117వ ర్యాంకర్ జిల్ టిచ్‌మన్ చేతిలో పరాజయం చవిచూసింది. మొత్తానికి బరిలోకి దిగిన తొలి సీనియర్ స్థాయి టోర్నీలో మాయ చేసిన పోరాటం అందర్నీ ఆకట్టుకుంది. రెండో సెమీస్‌లో ఎనిమిదో సీడ్ మనంచయ సవంగ్‌కావ్ (థాయ్‌లాండ్) 6–2, 6–2తో రెండో సీడ్ రెబెక్కా మరినో (కెనడా)పై గెలిచి ఫైనల్ చేరింది. టిచ్‌మన్, రెబెక్కాల మధ్య నేడు టైటిల్ పోరు జరగనుంది. డబుల్స్‌లో డచ్ ప్లేయర్ అరియనె హర్తొనొతో కలిసి బరిలోకి దిగిన భారత స్టార్ ప్రార్థన తోంబరే తుదిపోరుకు అర్హత సాధించింది.

సాక్షి సినిమా

"నాకు పదిహేనేళ్ల వయసు ఉన్నప్పుడే నటిగా కెరీర్ స్టార్ట్ చేశాను. నాగార్జునగారి 'మన్మథుడు' సినిమా చేశాను. మరో వైపు చదువుకోవాల్సి వచ్చింది. దీంతో లండన్ వెళ్లిపోయాను. అక్కడ కాలేజ్ స్టడీస్ పూర్తి చేసి, మాస్టర్స్ చేశాను. సైకాలజిస్ట్ అయ్యాను. సొంతంగా ఓ క్లినిక్ కూడా రన్ చేస్తున్నాను. నా 24 ఏళ్ల వయసులో నేను సచిన్ సాగర్‌ను పెళ్లి చేసుకున్నాను. మాకు ఇద్దరు సంతానం. ఒక వేళ 'మన్మథుడు' సమయానికి నా వయసు 25 ఏళ్లు ఉండి ఉంటే నేను సినిమాల్లోనే కొనసాగేదాన్నేమో!" అని నటి అన్షు అన్నారు. సందీప్ కిషన్ హీరోగా నక్కిన త్రినాథ రావు దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించిన చిత్రం 'మజాకా'. రీతూ వర్మ హీరోయిన్‌గా, మరో లీడ్ రోల్‌లో అన్షు నటించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో అన్షు చెప్పిన సంగతులు...



అలా మజాకాకి చాన్స్ వచ్చింది

- నటి అన్షు

● 'మజాకా'లో నేను యశోద అనే క్యారెక్టర్ చేశాను. యశోద స్ట్రాంగ్ విమెన్. కానీ తనలో మంచి ఎమోషనల్ పెయిన్ ఉంది. సినిమాలో నా రోల్‌కి మంచి ఇంపార్టెన్స్ ఉంది. ఇక 'మన్మథుడు' సినిమా రీ–రిలీజ్ సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి నా వీడియో బైట్ కోసం నన్ను కాంటాక్ట్ చేశారు. అలా సోషల్ మీడియాలో కనిపించాను. ఆ తర్వాత రచయిత ప్రసన్నకుమార్‌గారు మా మేనేజర్ ద్వారా నన్ను కలిసి, ఈ సినిమా కథ చెప్పారు. అలా 'మజాకా'కి చాన్స్ వచ్చింది. ఈ కథ వింటున్నంత సేపు నవ్వుతూనే ఉన్నాను. ● నేను తిరిగి సినిమాలు చేస్తానన్నప్పుడు నా భర్త నన్ను ఎంకరేజ్ చేశారు. హీరోయిన్, క్యారెక్టర్ ఆర్టిస్టు... ఇలా ఏ తరహా పాత్రలు అయినా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ● నేను లండన్‌లో ఉన్నప్పుడు ఓ క్యాస్టింగ్ ఏజెన్సీకి నా వివరాలు ఇచ్చి, యాక్ట్ చేస్తానని చెప్పాను. నేను చేసిన సినిమాల గురించి చెప్పాను. వాళ్లు నన్ను రిజెక్ట్ చేశారు. అయితే నేనొక సైకాలజిస్టుని. సక్సెస్‌తో కన్నా ఫెయిల్యూర్స్‌తోనే ఎక్కువగా నేర్చుకోగలమని నమ్ముతాను.

హీరో లేడీ గెటప్ వేస్తే హిట్టే

- నిర్మాత సాహు గారపాటి



''హీరో లేడీ గెటప్ వేసిన 'భామనే సత్యభామనే, మేడమ్' వంటి సినిమాలు ప్రేక్షకులను అలరించి, హిట్స్‌గా నిలిచాయి. ఈ సెంటిమెంట్‌తో 'లైలా' మూవీ కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. అలాగే తెలుగులో ఈ తరహా సినిమాలు వచ్చి కూడా చాలా కాలం అయింది. దీంతో 'లైలా' మూవీ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని అన్నారు నిర్మాత సాహు గారపాటి. విశ్వక్ సేన్ హీరోగా నటించిన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'లైలా'. ఆకాంక్ష శర్మ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో కామాక్షీ భాస్కర్ల, అభిమన్యు సింగ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ– ''యూత్ టార్గెట్‌గా చేసిన 'లైలా'ని ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమాలో హీరో లేడీ క్యారెక్టర్ (లైలా) కూడా చేశారు. ఈ క్యారెక్టర్ కోసం ముందుగా కొందరు హీరోలను అనుకున్నాం. విశ్వక్ ఈ కథ వినగానే 'ఇది నేను చేయాల్సిన క్యారెక్టర్' అన్నారు. హీరో తొలి భాగం సోనూగా, రెండో భాగం లైలాగా మారతాడు. లైలాగా హీరో ఎందుకు మారాడు? అనేది ఎమోషనల్‌గా ఉంటుంది. ఇక ప్రస్తుతం నిర్మాత పరిస్థితి ఏమీ బాగోలేదు. అనుకున్న బడ్జెట్‌లో సినిమాను నిర్మించగలిగితే ఓకే. 'లైలా'ని అనుకున్న బడ్జెట్‌లోనే తీశాం. చిరంజీవిగారితో అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో మేం చేయనున్న నెక్ట్స్ మూవీ జూన్ లేదా జూలైలో ప్రారంభం అవుతుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో చేస్తున్న సినిమా చిత్రీకరణ 70 శాతం పూర్తయింది'' అని అన్నారు.



● నవీన్ ఎర్నేని, సుకుమార్, అల్లు అర్జున్, దేవిశ్రీ ప్రసాద్, వై. రవిశంకర్, చెర్రీ

పుష్ప ఐదేళ్ల జర్నీలో ప్రతి క్షణం నాకు ముఖ్యమే

- హీరో అల్లు అర్జున్

''చాలాసార్లు 'పుష్ప' సినిమా అసలు అవుద్దా అనిపించింది. కోవిడ్ టైమ్‌లో ఎంతో కష్టపడ్డాం. జాతర ఎపిసోడ్ టైమ్‌లో... ఈ ఎపిసోడ్ ఎండ్‌ని చూడగలనా అనిపించింది. 'పుష్ప 2'ని 2024 ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకున్నాం. కానీ చేయలేకపోయాం. డిసెంబరు 5న రిలీజ్ చేశాం. అయితే చివరి నిమిషం వరకూ కష్టపడ్డాం. 'పుష్ప' సినిమాకు చెందిన ఐదేళ్ల ప్రయాణంలోని ప్రతి క్షణం నాకు ముఖ్యమే. ఈ సినిమాగానీ హిట్టైతే ఈ కష్టం అంతా నా ఫ్యాన్స్‌కు అంకితం చేయాలనుకున్నాను... అంకితం చేస్తున్నాను. 'పుష్ప 3' గురించి నాకు, సుకుమార్‌గారికి తెలియదు. కానీ అదొక అద్భుతంలా అయితే ఉంది (నవ్వుతూ)'' అన్నారు అల్లు అర్జున్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన నేపథ్యంలో 'థ్యాంక్స్ మీట్'ను శనివారం హైదరాబాద్‌లో నిర్వహించింది చిత్రయూనిట్. ఈ వేదికపై ఇంకా **అల్లు అర్జున్ మాట్లాడుతూ–** ''పుష్ప 2' సినిమా రిలీజ్ సమయానికి మరో హిందీ చిత్రం రిలీజ్ కావాల్సింది. కానీ వాళ్లు వాయిదా వేసుకున్నారు. ఇలా ప్రతి ఇండస్ట్రీ నుంచి సపోర్ట్ లభించింది. ఇండియన్ సినిమాలోని అన్ని ఇండస్ట్రీలకు, ఆడియన్స్‌కు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'పుష్ప' ఫ్యాన్స్‌కు థ్యాంక్స్. ఒక్కరికి మాత్రం థ్యాంక్స్ చెప్పాలనుకోవడం లేదు. ఎందుకంటే... థ్యాంక్స్ అనే పదం సరిపోదు. ఒక యాక్టర్ ఎంత బాగా అయినా చేయవచ్చు. నిర్మాతలు ఎంతైనా ఖర్చు పెట్టవచ్చు... కానీ అందరికీ హిట్ ఇచ్చేది డైరెక్టర్ మాత్రమే. ఒకరు ఎంత పెద్ద యాక్టర్ అయినా సరే... సరైన మార్గ దర్శకులు లేకపోతే ఏ యాక్టర్ అయినా బ్యాడ్ యాక్టరే. నన్ను, మమ్మల్ని అందరినీ గైడ్ చేసినందుకు థ్యాంక్స్ (సుకుమార్‌ను ఉద్దేశించి). తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ గర్వపడేలా చేసినందుకు థ్యాంక్స్. డార్లింగ్... నిన్ను అందరూ నమ్ముతారు. నువ్వు ఒక్కడివే నిన్ను నువ్వు నమ్మవు. మైత్రీ మూవీ మేకర్స్ నవీన్, వై. రవిశంకర్ గార్ల వల్లే 'పుష్ప' సాధ్యమైంది. అలాగే ప్రతి రోజూ కష్టపడే చెర్రీగారికి థ్యాంక్స్. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ, నా వ్యక్తిగత ఏఏ టీమ్ అందరికీ ధన్యవాదాలు. సాంగ్స్ మిలియన్స్ ఎలా అవుతాయి అనుకున్న నాకు బిలియన్స్‌లో చూపించాడు దేవిశ్రీ ప్రసాద్. శ్రీవల్లి (రష్మిక), కెమేరామేన్ క్యూబా, డ్యాన్స్‌మాస్టర్స్ గణేశ్, విజయ్, ప్రేమ్ రక్షిత్, శేఖర్... ఇలా అందరికీ థ్యాంక్స్'' అన్నారు.

సుకుమార్ మాట్లాడుతూ– ''నేషనల్ అవార్డు విన్నర్ పెర్ఫార్మ్ చేస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుందీ సినిమా అని ప్రతి సీన్ ముందు అల్లు అర్జున్‌కి చెప్పేవాడిని. ఈ మాటను మరోలా తీసుకోవద్దు... ట్రోల్స్ చేయవద్దు. మా కాలనీలో ఓ పెద్దాయన నాతో 'ఎస్వీ రంగారావుగారిలా నటించాడు' అన్నారు. ఆ పక్కనే ఉన్న మరో పెద్దాయన 'ఎస్వీఆర్ డ్యాన్సులు, ఫైట్లు చేయడు కదా' అన్నారు. అల్లు అర్జున్ పరిపూర్ణమైన హీరో. డ్యాన్స్ చేయగలడు... ఫైట్స్ చేయగలడు... ఏడవగలడు... నవ్వగలడు... 'రంగస్థలం' నుంచి నాకు సూపర్‌డూపర్ హిట్స్ వచ్చాయంటే కారణం మైత్రీ మూవీ మేకర్సే. మంచి సీన్స్ కోసం రీ షూట్స్ చేసేంత ఫ్రీడమ్ ఇచ్చారు. 'పుష్ప' సక్సెస్ మైత్రీ మూవీ మేకర్స్‌కే చెందుతుంది. దేవీశ్రీ ప్రసాద్ లేకుండా నేను సినిమా తీయలేనేమో! మొదట్లో 'పుష్ప' రెండు పార్ట్స్ కాదు. తొలి భాగానికే మూడు గంటల ఫుటేజ్ వచ్చిందని 'పుష్ప 1'గా రిలీజ్ చేశాం. ఇది 'పుష్ప'కు జరిగిన అద్భుతం. ఇది చెర్రీగారి వల్ల జరిగింది. 'పుష్ప 2'నూ ఇలానే రిలీజ్ చేశాం. ఇలా మా లైఫ్‌లో ఆయన 'పుష్ప 1, పుష్ప 2, పుష్ప 3' పెట్టారు. ఈ సిరీస్ ఎక్కడికి వెళ్తుందో నాకు తెలియదు. 'పుష్ప 2'తో అసోసియేట్ అయిన అందరికీ థ్యాంక్స్'' అని తెలిపారు.

''పుష్ప 1, పుష్ప 2' అనే మ్యాజిక్‌ను క్రియేట్ చేసిన అందరికీ... ముఖ్యంగా అల్లు అర్జున్, సుకుమార్, మైత్రీ మూవీస్‌కు థ్యాంక్స్'' అన్నారు సంగీత దర్శకుడు **దేవిశ్రీ ప్రసాద్.**

''పుష్ప 3' కోసం ఎదురు చూస్తున్నాను'' అని పేర్కొన్నారు 'పుష్ప 2'ను హిందీలో పంపిణీ చేసిన హిందీ నిర్మాత **అనిల్ తదానీ.**

''సుకుమార్‌గారి విజన్‌ని అల్లు అర్జున్‌గారు సరిగ్గా తీసుకెళ్లగలిగారు. 'పుష్ప' కోసం చాలా కాల్షీట్స్ ఇచ్చారు రష్మిక. మా సినిమాకు దేవీగారు బ్యాక్ బోన్. 'పుష్ప' టీమ్ అందరికీ థ్యాంక్స్'' అన్నారు **వై. రవిశంకర్.**

''పుష్ప 2' అంచనాలను మించి కలెక్ట్ చేస్తుందని ఊహించాం. కానీ ఇంత పెద్ద స్థాయిలో ఉంటుందని మాత్రం ఊహించలేదు'' అన్నారు **నవీన్ ఎర్నేని.**

''స్పెయిన్‌లో షూటింగ్ చేస్తూ, అర్ధరాత్రి వేళ అక్కడ ఓ రెస్టారెంట్‌కి వెళితే, ఆ రెస్టారెంట్ నడిపే పాకిస్తాన్ వ్యక్తి నన్ను 'పుష్ప' సినిమాలోని మంగళం శీనుగా గుర్తుపట్టి, మాట్లాడితే చాలా హ్యాపీ ఫీలయ్యాను. తమిళ, కన్నడ, మలయాళం... ఇలా ఇతర ఇండస్ట్రీ వాళ్ళు నాకు గౌరవంతో పాటు, అవకాశాలు ఇస్తున్నారు. ఇది 'పుష్ప'తోనే సాధ్యమైంది'' అన్నారు **సునీల్.**

''పుష్ప' సినిమా అయ్యేలోపే రెండు ఇన్‌కమ్‌టాక్స్ రైడ్స్ జరిగాయి. ఈ రైడ్స్‌ను తట్టుకుని, అందరికీ కరెక్ట్‌గా పేమెంట్ చేసిన మా అకౌంట్స్ టీమ్‌కు థ్యాంక్స్'' అన్నారు మైత్రీ సీఈవో **చెర్రీ.**

'నైజాంలో వన్నాఫ్ ది బిగ్గెస్ట్ హిట్స్‌లో 'పుష్ప 2' కూడా ఉంది'' అన్నారు మైత్రీ డిస్ట్రిబ్యూటర్ **శశి.** సీడెడ్ డిస్ట్రిబ్యూటర్ **నాగార్జున** మాట్లాడారు.

అజయ్, ఆదిత్యా మీనన్, జగదీశ్, గణేశ్ ఆచార్య మాస్టర్, డ్యాన్స్ మాస్టర్ విజయ్ పోలంకి, ఎడిటర్ నవీన్ నూలి, బన్నీ వాసు తదితరులు పాల్గొన్నారు. ఈ వేదికపై అల్లు అర్జున్, సుకుమార్, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ కలిసి 'పుష్ప' టీమ్‌కు, డిస్ట్రిబ్యూటర్స్‌కు షీల్డ్స్ అందించారు.

ఈ కార్యక్రమంలో సుకుమార్‌కి స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

నన్ను నేను చాలెంజ్ చేసుకున్నాను

- నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా



''స్క్రిప్ట్ చదివి, ఓ మంచి సినిమా తీయడం నిర్మాత బాధ్యత అని భావిస్తాను. అందుకే ప్రతి స్క్రిప్ట్‌ను నేనే చదివి నిర్ణయం తీసుకుంటాను. సినిమా ట్రైలర్, ఫస్ట్ షో తర్వాత వచ్చే ఆడియన్స్ ఫీడ్‌బ్యాక్ నా ట్రంప్‌కార్డ్స్. పరిమిత బడ్జెట్‌తో, తక్కువ సమయంలో సినిమాలు తీస్తే నిర్మాతలకు లాభాలు వస్తాయని నమ్ముతాను'' అని అన్నారు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'బ్రహ్మా ఆనందం'. ఈ చిత్రంలో బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ లీడ్ రోల్స్‌లో నటించగా, మరో కీలక పాత్రలో 'వెన్నెల' కిశోర్ నటించారు. సావిత్రి, ఉమేష్ కుమార్ సమర్పణలో ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో రాహుల్ యాదవ్ నక్కా మాట్లాడుతూ– ''తాత–మనవళ్ల కథ ఇది. తాను చేసిన తప్పులను తాత ఎలా రియలైజ్ అయ్యాడు? మనవడు తాను చేసిన పొరపాట్లను ఎలా సరిదిద్దుకున్నాడు? అనే అంశాలతో ఈ సినిమా ఉంటుంది. అందరినీ ఎంటర్‌టైన్ చేసేలా మూవీ ఉంటుంది. బ్రహ్మానందంగారు కథ ఓకే చేయకపోతే ఈ సినిమాయే లేదు. ఇందులో మూర్తి పాత్రలో బ్రహ్మానందంగారు, బ్రహ్మ పాత్రలో రాజా గౌతమ్, గిరి పాత్రలో 'వెన్నెల' కిశోర్ నటించారు. ముందుగా బ్రహ్మ పాత్రకు 'వెన్నెల' కిశోర్‌గారిని అడగ్గా, ఆయన హీరో ఫ్రెండ్ గిరి పాత్ర చేస్తానన్నారు. దీంతో రాజా గౌతమ్ పేరు ప్రస్తావనకు వచ్చి, ఆయనతో మాట్లాడి, ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నాం.. ఇక సినీ ఇండస్ట్రీకి కొత్త దర్శకులను పరిచయం చేయాలని నన్ను నేను ఛాలెంజ్ చేసుకున్నాను. నేను పరిచయం చేయబోతున్న నాలుగో దర్శకుడు నిఖిల్. మా నెక్ట్స్ ప్రాజెక్ట్ 'వైబ్'. ఇందులో రాజా గౌతమ్ హీరోగా చేస్తున్నారు. 'ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ, మసూద' చిత్రాలకు సీక్వెల్స్ ఉన్నాయి. కానీ ఇంకా సమయం ఉంది '' అని అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రజక/B.Tech/C.Govt.బ్యాంక్ క్లర్క్ & క్యాషియర్ / SBI/45000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15443]

మాదిగ / B.Tech(IIT) / C.Govt.AE/ రైల్వే / 98000/-PM / 5'10"ఎత్తు /28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7780299703 [HA-15443]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/ 50Yrs/ B.Tech/ Govt. ఆఫీసర్/5 లక్షలు PM/సొంత ఇల్లు, రెంట్స్, పిల్లలు లేని, ఫెయిర్ అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. పిల్లలున్నా OK. Ph: 8341454870 [HA-15443]

కుల పట్టింపు లేదు: Ag 58, సెంట్రల్ గవర్నమెంట్ జాబ్, సొంత ఇల్లు కలిగిన వరునికి మంచి సాంప్రదాయమైన, విడో, పిల్లలు ఉన్న ఏ బాదర బందీ లేని వధువు కావలెను. సంప్ర॥ 94999 47658. [MH-13081]

37 సం॥లు గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కులప్రసక్తి లేదు. నో డౌరీ. Ph: 9652012478, 6301943220 [H-783522]

గంగపుత్ర (బెస్త) / 45yrs/5'8"/Hydలో సొంత ఇల్లు కలిగి పిల్లలు లేని డైవర్స్ అయిన వరుడికి Age 38yr నుండి 42 yr మధ్య వయసు గల వధువు కావలెను. సంప్ర : 6309325602(డైరెక్ట్) [H-783660]

రెడ్డి: 34/5'.11"/ సొంత పరిశ్రమలో డైరెక్టర్, సొంత ఇల్లు మరియు వ్యవసాయ భూమి గల తిరుపతి అబ్బాయికి చదువుకున్న సాధారణ వధువు కావలెను (ఎటువంటి బ్యాగ్ గ్రౌండ్ అవసరం లేదు). సంప్ర: 9989759279, 9553561616. [T-1270]

"Cast No Bar" No Dowry, Age:34, H-5'8", Hyd Job, B.Sc. అందమైన వరుడికి, అందమైన వధువు కావలెను. సంప్ర : 83329 96699 (B) [B-807247]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 27, 6' 2", Engineer, 120 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), MBA (ISB), 30, 5' 11", Manager, 36 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 10", Bank Of America, SWE, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 5' 6", SWE, 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 5", 20 Crores, Hyderabad, Rich Family, Fair & Slim Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 26, 5' 6", SWE, 100 K, H1, Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada, BE, MS, 28, 5' 7", Data Engineer, 3 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Australia, BE, MS, 29, 5' 8", Business Analyst, 90 K, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS (USA), 32, 5' 10", Manager, 50 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 6' 1", PG Doctor, Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), MBA (IIM), 33, 5' 10", 34 L P/A, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 6, SWE, Amazon, 200 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", Developer, 22 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 25, 5' 5", PG Doctor, 60 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MBA, 31, 5' 6", 16 L P/A, Hyd, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

★

గౌడ్/ఇంటర్/ప్రైవేట్ జాబ్, 15000/P.M 5'5'', 35 సం॥ల వరుడుకు అందమైన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్ సెల్:9440834136 [J-1086271]

రెడ్డిలేట్ మ్యారేజ్ /34y/1L P.M./Hydలో సొంత ఇల్లు, విలేజ్ లో 5 ఎకరాల వ్యవసాయ భూమి గల హైదరాబాద్ వరుడికి ఓట్లీ తెలంగాణ వధువు కావలెను. పిల్లలు లేకుంటే డైవర్స్ /విడో ఓకె కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-782730]

నో బ్రోకర్స్: డైవర్స్, 43, BC-D, M.A, B.Ed, ప్రై॥టీచర్, 30K, పిల్లలు లేరు. ఒక పట్నర్ ఉన్న వరునికి పిల్లలు లేని 2వ వధువు కావలెను. సెల్: 9392850846. [SCA25001564]

మాల/B.Tech/C.Govt. బ్యాంక్ PO/ యూనియన్ బ్యాంక్/42000/-PM/ 5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7416584304 [HA-15443]

2వ పెళ్లి/కుల పట్టింపు లేదు/37Yrs/ PG/Govt. ఆఫీసర్/3 లక్షల PM/ సొంత ఇల్లు, రెంట్స్, 100 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. పిల్లలున్నా OK, ఇల్లరికం OK. Ph: 8341454870 [HA-15443]

కుల పట్టింపు లేదు/విడో/48/C.Govt. Job/ VRS/ 80K/ ఫ్యామిలీ పెన్షన్/సొంత బిజినెస్/సొంత ఇల్లు కమర్షియల్ కాంప్లెక్స్ రెంట్స్/ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్/పొలం/20 కోట్ల ప్రాపర్టీ పూర్తి ఫ్యామిలీని కోల్పోయిన వధువుకి వరుడు కావలెను. 9642589295 [HA-15446]

FC/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ కాలేజ్ లెక్చరర్/సొంత ఇల్లు, విలేజ్‌లో 3 ఎకరాల వ్యవసాయ భూమి గల వధువుకి వరుడు కావలెను. Ph: 9985020249 [H-783522]

రెడ్డి/విడో/ Govt.Rtd పెన్షనర్ గెజిటెడ్/ 48y/ సొంత అపార్ట్‌మెంట్స్ & రెంట్స్/షాపింగ్ కాంప్లెక్స్/26 ఎకరాల పొలం గల సాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. 7093717220 [H-783522]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/Qly:B.Com/Pvt Job గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) All Cast marriages Available. Ph: 8121347478 [H-783613]

రెండవ పెళ్ళి/37yrs/కుల పట్టింపు లేదు MBA/డైవర్స్ Govt.ఎంప్లాయ్/2,00,000/- వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం & పిల్లలు ఉన్నా OK) సంప్రదించండి : 9133715309 [H-783660]

హిందూ మాల/M.Tech, 40y/5'2"/State Govt.ఉద్యోగి/50,000/-PM. డైవర్స్. సొంత ఇల్లు కల్గిన వధువుకు హైదరాబాద్‌లో Govt/Pvt జాబ్ ఉన్న వరుడు కావలెను. Ph: 9490167547 [H-783660]

రెడ్డి/కుల పట్టింపు లేదు/రెండవ పెళ్లి/50Y/ విడో/ సొంత ఇల్లులు/రెంట్స్/పిల్లలు లేరు/ సొంత ప్రాపర్టీ / ఎలాంటి బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK)(నో బ్రోకర్స్). 7799083500, 7386660643 [H-783660]

రెడ్డి/35yr/5'4"/ఫైనుర్/కుల పట్టింపు లేదు/ MCA/ Govt.ఎంప్లాయ్/70K (PM) & బిజినెస్/ వెల్ సెటిల్డ్, సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం & 1st, 2nd మ్యాచ్ OK) సంప్ర : 9133672661 [H-783613]

రెడ్డి/2nd మ్యారేజ్ (కుల/ఆస్తి) పట్టింపు లేదు 33Y/B.Com/Own Business & Lands, వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st, 2వ సంబంధాలు కలవు. Ph: 9100147176 [H-783613]

కాపు/43/5'6"/డిగ్రీ, విడో, ఎంపుర్, C.Govt, పెన్షనర్, 8L PA 25Cr ప్రాపర్టీ బాగా స్థిరపడిన ఏకైక వధువుకి మంచి సాంప్రదాయ కుటుంబం వరుడు కావలెను. Ph: 9573943211, 8125132949 [H-783613]

2వ పెళ్ళి/4,00,000 pm Govt Emp, బాగా స్థిరపడి, కోట్ల ప్రాపర్టీ కల్గిన అమ్మాయికి అందమైన వరుడు కావలెను. కుల, వృత్తితో పని లేదు, ఒంటరి అబ్బాయి అయినా పర్వాలేదు. ఇల్లరికం, పిల్లలు ఉన్నా OK. 9381696641 [H-783613]

కుల పట్టింపు లేదు/31/5'3"/B.Tech MBA/ ఎంటర్ ప్రైజస్ ఎనలిస్ట్/Hyd * 30/5'2"/MBBS/MD పీడియాట్రిక్స్/30/5'4"/MBBS/MS ENT *36/5'6"/ MBBS MS OBG/Infertility ఫెలోషిప్ *30/5'4"/ MBBS/ MD Gen Medicine అందమైన అమ్మాయిలకు కుల పట్టింపు లేని అబ్బాయిలు కావలెను. సంప్ర : "శుభమస్తు" DSNR, Hyd. S.రాములు గౌడ్. 8790690309 [H-783523]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపులేదు/జాబ్/వ్యాపారం/ ప్లాట్స్/ 4 కోట్ల ప్రాపర్టీ అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ముఖాముఖి కల్పించబడును. Ph : 9676096314 [H-783660]

రెడ్డి/2ND విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/డిగ్రీ, 32Y/ సొంత బిజినెస్, అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము OK) 1st, 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. 9032596676 [HA-15446]

రెడ్డి/విడో 35Y, 5'3"H డిగ్రీ సొంత ఇల్లు 20 ఎకరాల పొలం కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు) మీ ఫోటోలు వాట్సాప్‌లో పంపించండి. 9885463158 [HA-15446]

రెండో పెళ్ళి/24y&25y&27y&28y& 30y & 31y&33y&35y& 37&38y& 40y& 41y& 43y&44y&46y&47y&49y&50y/"మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-15446]

SC మాల/25/5'5"/MBBS, Government Medical Officer/ 60,000/-PM వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9346675639 [HA-15446]

వేదికలు



SC, మాల, మాదిగ, హిందూ క్రిస్టియన్ వెల్ సెటిల్డ్ పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి. Ph: 7416094972 [H-783522]

మాదిగ వివాహ పరిచయ వేదిక. ఆదివారం తేది : 09.02.2025. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 2PM-6PM, ఫీజు : 1000/- సంప్ర: స్వప్న వివాహ వేదిక, సికింద్రాబాద్ స్టేషన్. Ph: 9347046175 [H-783522]

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-15399]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7093969457 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15452]

Kapu పెళ్ళి సంబంధాలకైసంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15452]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7093969457 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15452]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15452]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7093969457/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15452]

పెళ్లి సంబంధాలు & ప్రయత్నిస్తున్న వారందరికి 'ఓం నమో వెంకటేశాయ'. All Caste సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, NRI, Group 1, 2 వారికి చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, ✆ 7093722724. [T-3255

ఫ్రీ రిజిస్ట్రేషన్ 16 రో॥ అన్ని కులాల వారికి తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి మ్యారేజి లైన్స్. ✆ 94418 29644, 98490 58673, 9493 661 288. వాట్సప్ [B-621]

★

బ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం Free Register 13/April/2025న Kamala Nagar Welfare Office, ECIL, Hyd. Ph: 9704656103/9533608887 Whatsapp. No. [HA-1314]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1326]

సైకిల్‌పై కుంభమేళాకు..

- 1,250 కిలోమీటర్ల యాత్ర ప్రారంభించిన పాల్వంచ వాసి



సైకిల్‌పై బయల్దేరిన గూడవల్లి కృష్ణ

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ గూడవల్లి కృష్ణ సైకిల్‌పై మహా కుంభమేళాకు బయల్దేరారు. ఈ సందర్భంగా శనివారం పాల్వంచలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ఆయన యాత్ర మొదలైంది. సుమారు 1,250 కిలోమీటర్ల దూరం ప్రయాణించి.. ఈనెల 22న ప్రయాగ్‌రాజ్ చేరుకోనున్నట్లు కృష్ణ తెలిపారు. కాగా, ఆయన గతంలోనూ భద్రాచలం నుంచి శబరిమల వరకు ఐదుసార్లు (మొత్తం 6,750 కిలోమీటర్లు), కాశీ నుంచి కన్యాకుమారి వరకు 19 రోజుల్లో 2,650 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేశారు.

'జీబీఎస్'తో మహిళ మృతి

సిద్దిపేట రూరల్: జీబీఎస్ (గులియన్ బ్యారి సిండ్రోమ్) వ్యాధికి గురైన మహిళ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. సిద్దిపేట జిల్లా సీతారాంపల్లికి చెందిన గ్రీష్మ (25) పక్షం రోజుల క్రితం అస్వస్థతకు గురైంది. సిద్దిపేటలోని ఒక ఆసుపత్రికి, అక్కడి నుండి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమెను పరీక్షించిన వైద్యులు..జీబీఎస్ లక్షణాలున్నట్లు గుర్తించారు. అయితే.. చికిత్స పొందుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లిన గ్రీష్మ.. శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, 2 నెలల వయసున్న కూతురు ఉన్నారు.

వెయ్యేళ్ల గరిష్ట వరదే ప్రామాణికం!

మేడిగడ్డ బరాజ్‌పై 2016 ఆగస్టు 8న భేటీలో చెప్పిన సీడబ్ల్యూసీ నాటి డైరెక్టర్

- 16 టీఎంసీల నిల్వ సామర్థ్యం దృష్ట్యా బరాజ్ డిజైన్లకు ఈ లెక్కే తీసుకోవాలి
- వందేళ్ల వరదను ప్రామాణికంగా తీసుకోవడాన్ని అంగీకరించలేమని వెల్లడి
- కాళేశ్వరం కమిషన్‌కు అప్పటి వివరాలను సమర్పించిన అమర్‌పాల్ సింగ్

1. Earlier barrages were of the height of about 8m to 10m without having any storage which is not going to create any additional flood in the event of failure during lean season and monsoon season. Accordingly, the design flood was considered as 1:100 year return period flood. Nowadays barrages are being designed of gate height about 15 to 20m with huge capacity behind the gates (in Medigadda case it is 450million cubic meter). Under these conditions, the flood of 1:100 year cannot be accepted as it is. A risk analysis should be carried out to work out the losses in case of structure failure,(or otherwise 1:1000 year return period flood should be adopted) and accordingly, the design flood be adopted.

సీడబ్ల్యూసీ నాటి డైరెక్టర్ అభిప్రాయాన్ని ఉటంకిస్తూ అమర్‌పాల్‌సింగ్ పంపిన ఈ-మెయిల్‌లోని భాగం

సాక్షి, హైదరాబాద్: 16 టీఎంసీల నిల్వ సామర్థ్యం దృష్ట్యా మేడిగడ్డ బరాజ్ డిజైన్లను వందేళ్లకు బదులుగా వెయ్యేళ్లలో ఓసారి పునరావృతమయ్యే అత్యధిక వరదను ప్రామాణికంగా తీసుకొని రూపొందించాలని గతంలో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) డైరెక్టరేట్ చెప్పిన విషయం వెలుగులోకి వచ్చింది. ఒకవేళ బరాజ్ విఫలమైతే సంభవించే విపత్తుపై అధ్యయనం (రిస్క్ అనాలిస్) జరపాలని 2016 ఆగస్టు 8న జరిగిన సమావేశంలో ఆయన అభిప్రాయపడ్డారు. సీడబ్ల్యూసీ నాటి డైరెక్టర్ అభిప్రాయాన్ని ఉటంకిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు రామగుండం సర్కిల్ నాటి చీఫ్ ఇంజనీర్‌కు మేడిగడ్డ బరాజ్ నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ'అప్పటి జీఎం అమర్‌పాల్ సింగ్ ఆ మర్నాడే (ఆగస్టు 9న) ఈ-మెయిల్ చేశారు. ఈ మేరకు కాళేశ్వరంపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ కోసం గతంలో జారీ చేసిన బహిరంగ ప్రకటనకు స్పందనగా అమర్‌పాల్ సింగ్ అఫిడవిట్ రూపంలో వివరాలు సమర్పించారు. బరాజ్ నిర్మాణానికి ముందు ఎల్ అండ్ టీ తరఫున రాష్ట్ర నీటిపారుదల శాఖతో జరిపిన ఉత్తర, ప్రత్యుత్తరాలను ఆయన సాక్ష్యాలుగా కమిషన్‌కు అందజేశారు.

సీడబ్ల్యూసీ నాటి డైరెక్టర్ ఏమన్నారంటే..

'గతంలో బరాజ్‌లను నిల్వ సామర్థ్యం లేకుండా కేవలం 8–10 మీటర్ల ఎత్తులో నిర్మించడంతో వాటి డిజైన్ల తయారీకి వందేళ్లలో ఓసారి పునరావృతమయ్యే అత్యధిక వరదను ప్రామాణికంగా తీసుకొనేవారు. కానీ ఇటీవల కాలంలో భారీ నిల్వ సామర్థ్యంతో 15–20 మీటర్ల ఎత్తులో బరాజ్‌లను నిర్మిస్తున్నారు. మేడిగడ్డ బరాజ్ నిల్వ సామర్థ్యం 16 టీఎంసీలు. ఇలాంటి పరిస్థితిలో 100 ఏళ్లలో ఓసారి పునరావృతమయ్యే వరదను ప్రామాణికంగా తీసుకోవడాన్ని అంగీకరించలేం. ఒకవేళ బరాజ్ విఫలమైతే సంభవించే విపత్తుపై అధ్యయనం జరపాలి. లేకుంటే వెయ్యేళ్లలో ఓసారి పునరావృతమయ్యే అత్యధిక వరదను ప్రామాణికంగా తీసుకొని బరాజ్ డిజైన్లను తయారు చేయాలి'అని సీడబ్ల్యూసీ నాటి డైరెక్టర్ పేర్కొన్నారు.

మీటర్ ఎత్తు పెంచినా వెయ్యేళ్ల వరదతోనే డిజైన్లు..

ఒకవేళ కేవలం ఒక మీటర్ ఎత్తు పెంచి 3 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో మేడిగడ్డ బరాజ్ నిర్మించి గేట్లను ఎల్లవేళలా తెరవాలనుకున్నా వెయ్యేళ్లలో ఓసారి పునరావృతమయ్యే అత్యధిక వరదను ప్రామాణికంగా తీసుకొని డిజైన్లను రూపొందించాల్సి ఉంటుందని సీడబ్ల్యూసీ నాటి డైరెక్టర్ పేర్కొన్నట్లు ఈ-మెయిల్‌లో అమర్‌పాల్ సింగ్ వివరించారు. బరాజ్ ఎత్తును ఒక మీటర్ పెంచినా తీవ్ర ముంపు ఏర్పడుతుందని కారణంగా చూపారన్నారు. నిల్వ సామర్థ్యం ఆధారంగా మేడిగడ్డ బరాజ్ డిజైన్ల తయారీకి ఇండియన్ స్టాండర్డ్ కోడ్ నిబంధనల మేరకు గరిష్ట వరద సంభావ్యత (పీఎంఎఫ్)ను పరిగణనలోకి తీసుకోవాలని సీడబ్ల్యూసీ డైరెక్టర్ సూచించారని అమర్‌పాల్‌సింగ్ తెలియజేశారు.

అందుకే తప్పుకున్న అమర్‌పాల్‌సింగ్!

మేడిగడ్డ బరాజ్ నిర్మాణానికి ముందు ప్రభుత్వంతో జరిగిన చర్చలకు 'ఎల్ అండ్ టీ'తరఫున అమర్‌పాల్ సింగ్ నేతృత్వం వహించారని ఇటీవల విచారణ కమిషన్ ఎదుట హాజరైన సంస్థ జనరల్ మేనేజర్ ఒకరు వాంగ్మూలం ఇచ్చారు. బరాజ్ డిజైన్ల తయారీలో తప్పిదాలను విభేదిస్తూ అమర్‌పాల్ సింగ్ అప్పట్లో తన ఉద్యోగ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

గరిష్ట వరద సంభావ్యత లెక్క ఇలా..

సాధారణంగా జలాశయాలను వాటి ప్రాధాన్యత ఆధారంగా 50 ఏళ్లు, 100 ఏళ్లు, 500 ఏళ్లు, 1,000 ఏళ్లలో ఓసారి పునరావృతమయ్యే అత్యధిక వరదను తట్టుకొనే ఆధారంగా నిర్మిస్తారు. అత్యధిక ప్రాధాన్యత గల భారీ ప్రాజెక్టులను 1,000 ఏళ్లలో ఒకసారి వచ్చే గరిష్ట వరద సంభావ్యత ఆధారంగా డిజైన్ చేస్తారు. దీనికోసం చారిత్రక వరద గణాంకాలు, వాటి విశ్లేషణ, నీటి ప్రవాహ దిశ, వేగం, నదికి ఇరువైపులా ఏర్పడే కోత, నదీ ప్రవాహంలో వేసిన మేట తదితర అంశాలపై విస్తృత అధ్యయనం చేస్తారు. అందులో వెల్లడయ్యే అంశాలను పరిగణనలోకి తీసుకొని వరదను అంచనా వేసి లెక్కిస్తారు. తద్వారా గరిష్ట వరదను లెక్కలోకి తీసుకొని.. అది పునరావృతమైనా తట్టుకొనేలా జలాశయాలను డిజైన్ చేస్తారని ఇంజనీర్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో మహిళల డిష్యూం.. డిష్యూం



బస్సులో కొట్టుకుంటున్న మహిళలు

జహీరాబాద్: బస్సులో సీట్లు లేకపోవడం, కనీసం నిల్చుందామన్నా స్థలం లేకపోవడం మహిళల పోట్లాటకు దారి తీసింది. సంగారెడ్డి నుంచి శనివారం జహీరాబాద్‌కు వస్తున్న బస్సులో మహిళలు జుట్లు పట్టుకున్నారు. స్థలం లేని కారణంగానే ఒకరికొకరు తోసుకోవడం గొడవకు దారి తీసిందని తోటి ప్రయాణికులు పేర్కొన్నారు. మహిళల డిష్యూం..డిష్యూం వీడియో సోషల్ మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

చదువు ఒత్తిడి తట్టుకోలేక..

- పదో తరగతి విద్యార్థి బలవన్మరణం



తరుణ్ సాయి (ఫైల్)

సంగారెడ్డి క్రైమ్: చదువు ఒత్తిడి తట్టుకోలేక పదో తరగతి విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సంఘటనపై సీఐ రమేశ్ కథనం ప్రకారం.. జోగిపేటకు చెందిన ఎసోజిపేట శ్రీనివాస్ పట్టణంలో కిరాణా దుకాణం నడుపుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు ఎసోజిపేట తరుణ్ సాయి(16).. పట్టణంలోని నారాయణ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిరోజులుగా చదువు మీద శ్రద్ధ చూపక, ఒత్తిడి తట్టుకోలేక ఎవరితో మాట్లాడటం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శాస్త్రీయ పద్ధతిలో ఎస్సీ వర్గీకరణ

తనను కలిసిన ఏపీ మాదిగ, ఉపకులాల నేతలతో మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయ పద్ధతులతో, జ్యుడీషియల్ కమిషన్ సూచనలకు అనుగుణంగా పూర్తి చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ కలను నెరవేర్చిన తొలి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు శాసనసభలో ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఏపీకి చెందిన మాదిగ, మాదిగ ఉపకుల సంఘాల నాయకులు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా దామోదర మాట్లాడుతూ 2 వేల ఏళ్లుగా అసమానతలు, అవమానాలు అనుభవిస్తూ మాదిగ కులాలు బతికాయన్నారు. మాదిగలు కోరుతున్న వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మద్దతు ఇచ్చిందని, 2005లోనే వైఎస్ఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసిందని దామోదర గుర్తుచేశారు. 2023లో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే సుప్రీంకోర్టులో వర్గీకరణకు అనుకూలంగా వాదించేందుకు ప్రముఖ న్యాయవాదిని సీఎం రేవంత్ రెడ్డి నియమించారన్నారు. వర్గీకరణతో మాదిగలకు మేలు జరుగుతుందే తప్ప జీవితాలు మారిపోవని, మన ఆలోచన విధానంలో మార్పు వస్తేనే భావితరాలు బాగుపడతాయన్నారు. మాదిగ సంఘాల నాయకుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో మాంగ్ కులస్తులకు న్యాయం చేయాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కాచిగూడ (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణలో మాంగ్ కులస్తులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మాంగ్ కులస్తుల ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కాంబ్లే బాలాజీ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ, గౌరవ అతిథిగా మాజీ ఎంపీ వెంకటేశ్ నేతకాని హాజరయ్యారు. మంద కృష్ణ మాట్లాడుతూ మాంగ్‌లు మాదిగలతో కలిసి ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. మాల నాయకులు కుట్ర చేసి జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను వారికి అనుకూలంగా మార్చుకున్నారని ఆరోపించారు. గతంలో 'బి'గ్రూప్‌లో ఉన్న మాంగ్‌లను 'ఏ'గ్రూప్‌లో కలపడంతో వారి మనోభావాలను దెబ్బతీశారని మంద కృష్ణ తెలిపారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సబ్‌కమిటీని, చీఫ్ సెక్రటరీ శాంతికుమారిని కలిసి మాంగ్‌ల, నేతకానిల అభిప్రాయాలను వారి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వెంకటేశ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు తప్పుల తడకగా ఉందని ధ్వజమెత్తారు.

వర్గీకరణ రిపోర్టు ప్రతుల దహనం

సీఎం ప్రకటనపై మాల సంఘాల నేతల ఆగ్రహం



ప్రతులను దహనం చేస్తున్న మాల సంఘాల నాయకులు

పంజగుట్ట (హైదరాబాద్): అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ, ఫిబ్రవరి 4వ తేదీని సామాజిక న్యాయ దినంగా ప్రకటించడం సిగ్గుచేటని మాల సంక్షేమ సంఘం, సమతా సైనిక్ దళ్, మాల సంఘాల జేఏసీ నాయకులు ధ్వజమెత్తారు. అది సామాజిక న్యాయాన్ని ముఖ్యమంత్రి ఖూనీ చేసిన దినమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రతిపాదించిన 13 పేజీల వర్గీకరణ రిపోర్టు ప్రతులను వారు దహనం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమతా సైనిక్ దళ్ నాయకుడు దిగంబర్ కాంబ్లే, మాల సంక్షేమ సంఘం నాయకుడు బత్తుల రాంప్రసాద్, సీనియర్ దళిత నాయకుడు భావన సాహెబ్, చెరుకు రాంచందర్ మాట్లాడుతూ... షమీమ్ అక్తర్ రిపోర్టును బహిర్గతం చెయ్యకుండా, జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదించకుండా ఎలా వర్గీకరణ చేస్తారని ప్రశ్నించారు. నిజంగా ఎంఆర్‌పీఎస్‌కు సామాజిక న్యాయంపై గౌరవం ఉంటే ఉషామెహ్రా కమిషన్ రిపోర్టు ప్రకారం ఇప్పటివరకు రిజర్వేషన్లు అనుభవించని కులాలకు వారికి 50 శాతం రిజర్వేషన్ ఫలాలు అందిద్దామని అన్నారు.

నకిలీ వాహన బీమా రాకెట్ గుట్టురట్టు

కుత్బుల్లాపూర్: నకిలీ వాహన బీమా రాకెట్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..దూలపల్లి అయ్యప్ప కాలనీకి చెందిన గురువుల ప్రవీణ్, రామంతాపూర్ లక్ష్మీశ్రీకాంత్‌నగర్‌కు చెందిన బాల మహేందర్, అన్‌విల్ సొల్యూషన్స్ కంపెనీలో పని చేస్తున్న బాలానగర్ ఫిరోజ్‌గూడకు చెందిన బాలాజీ, లోతుకుంట మారుతినగర్‌కు చెందిన రుహుల్లా బేగ్, సాయిరామ్, దనుష్, సౌమ్య, అంజలిలు ముఠాగా ఏర్పడి..తక్కువ ధరకే వెహికిల్ ఇన్సూరెన్సులు చేస్తామంటూ నకిలీవి అంటగట్టి పలువురిని మోసం చేశారు. నకిలీ స్టాంప్‌లు, ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసి గత కొంత కాలంగా వీరు నకిలీ ఇన్సూరెన్స్‌లను పలువురు వాహనదారులకు అందించారు. ఇటీవల పోలీసుల వాహన తనిఖీల్లో వీటి తతంగం బయట పడింది. వాహనదారులను విచారించగా నిందితుల ఆచూకీ బయటపడింది. ఈ క్రమంలో బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అధికార ప్రతినిధి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి వివిధ కంపెనీలకు చెందిన నకిలీ ఇన్సూరెన్స్ పేపర్లు, ప్రింటర్లు, లామినేషన్ యంత్రం, మూడు స్మార్ట్ ఫోన్‌లు, 45 నకిలీ డ్రైవింగ్ లైసెన్స్‌లను పోలీసులను స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నకిలీ రాకెట్ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ అడిషనల్ డిప్యూటీ కమిషనర్లు విశ్వప్రసాద్, పురుషోత్తమ్, బృందం సభ్యులను మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి.శ్రీనివాస్, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అభినందించారు.

టోఫెల్, జీఆర్ఈలో మంచి స్కోర్ రావాలంటే..?

ఈ పరీక్షల పేపర్లు సిద్ధం చేసే ఈటీఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రోహిత్‌శర్మతో సాక్షి ఎడ్యుకేషన్ ప్రత్యేక ఇంటర్వ్యూ



సాక్షి ఎడ్యుకేషన్: మనదేశంలో ఇంజనీరింగ్‌తో పాటు ఇతర డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన చాలా మంది ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనే ఆలోచనలో ఉంటారు. అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ లాంటి దేశాలు మన విద్యార్థులకు మొదటి చాయిస్‌గా ఉంటున్నాయి. ముఖ్యంగా అమెరికాకు వెళ్లాలనుకునే మన విద్యార్థులపై ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆంక్షలు ఎలాంటి ప్రభావం చూపనున్నాయి? సులువుగా ఇతర దేశాల వీసాల అనుమతులు ఎలా పొందాలి? టోఫెల్, జీఆర్ఈ పరీక్షల్లో రాబోతున్న మార్పులు, విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకు ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) చేపట్టిన కార్యాచరణ తదితరాలపై ఆ సంస్థ గ్లోబల్ వర్క్ స్కిల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ – జనరల్ మేనేజర్ రోహిత్ శర్మ సాక్షి ఎడ్యుకేషన్.కామ్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. **ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వీడియోను చూడటం ద్వారా విదేశీ విద్యపై మీకున్న అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు.**

4 విమానాలు మళ్లింపు

చెన్నైలో ప్రతికూల వాతావరణం

శంషాబాద్ (హైదరాబాద్): చెన్నైలో ప్రతికూల వాతావరణం కారణంగా శనివారం ఉదయం నాలుగు విమానాలను హైదరాబాద్‌కు మళ్లించారు. లండన్ నుంచి చెన్నైకి బయలుదేరిన బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ విమానం, మస్కట్, సింగపూర్ నుంచి చెన్నై విమానాశ్రయానికి చేరుకోవలసిన రెండు విమానాలతో పాటు ముంబయి నుంచి చెన్నైకి బయలుదేరిన మరో విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

అసిస్టెంట్ కమాండెంట్‌గా క్రికెటర్ సిరాజ్



వెంగళరావునగర్ (హైదరాబాద్): ప్రముఖ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు యూసుఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్‌లో శనివారం ఆయన కమాండెంట్‌ను కలిశారు. కాగా ఫస్ట్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సిరాజ్‌ను.. కమాండెంట్‌తోపాటు అసిస్టెంట్ కమాండెంట్లు, ఇతర సిబ్బంది అభినందించారు.

కల్యాణం.. కమనీయం!

వివాహ వేడుకల వ్యయాల్లో వెనక్కి తగ్గని జనం

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు.. ఇప్పుడీ రెండూ బాగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయాయి. ముఖ్యంగా పెళ్లి ఖర్చులు తడిసి మోపెడై చుక్కలు తాకుతున్నాయి. ప్రీ వెడ్డింగ్ షూట్‌లని, డెస్టినేషన్ వెడ్డింగ్‌లని ఎవరూ, ఎక్కడా తగ్గేదే లేదంటున్నారు. ఈ మధ్య జరిగిన కుబేరుడు ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వివాహానికి ఏకంగా రూ.5,000 కోట్లు ఖర్చయిందని అంచనా. బడా వ్యాపారవేత్తల పెళ్లిళ్ల భారీ ఖర్చుల విషయాన్ని అలా ఉంచితే.. మామూలు జనం కూడా ఎక్కడా తగ్గడం లేదు. దీంతో సగటు వివాహ ఖర్చు ఏకంగా రూ.32 లక్షలు దాటిపోయింది.

– సాక్షి, బిజినెస్ బ్యూరో





ఆహారం తర్వాత పెళ్లిళ్ల ఖర్చే ఎక్కువ...
(పరిశ్రమల వారీగా విలువ (రూ.లక్షల కోట్లలో))

దేశంలో ఫుడ్-గ్రోసరీ ఇండస్ట్రీ తర్వాత పెళ్లిళ్ల పరిశ్రమ విలువే అత్యధికమని జెఫరీస్ అధ్యయనంలో తేలింది. ఆ వ్యయాల విలువను చూస్తే...

పెళ్లి కోసం చేస్తున్న వ్యయాన్ని బట్టి చూస్తే...		
	రూ.3 లక్షల్లోపు ఖర్చుతో జరుగుతున్నవి	10 లక్షల పెళ్లిళ్లు
	రూ.6 లక్షల వరకు ఖర్చుతో జరుగుతున్నవి	10 లక్షల పెళ్లిళ్లు
	రూ.10-25 లక్షల ఖర్చు అవుతున్నవి	27 లక్షల పెళ్లిళ్లు
	రూ.50 లక్షల ఖర్చుతో జరుగుతున్నవి	10 లక్షల పెళ్లిళ్లు
	రూ. కోటికిపైగా ఖర్చు చేస్తున్నవి	50 వేల పెళ్లిళ్లు

పెళ్లిళ్ల లెక్కలివీ..

2024లో సగటు వివాహ ఖర్చు రూ.32 లక్షల నుంచి రూ. 35 లక్షలు

2022-2024 మధ్య పెరిగిన ఖర్చు **28%**

300 మందికి పైగా అతిథులతో వేడుకల్లో వృద్ధి **16%**

100లోపే అతిథులు ఉండే వేడుకల్లో వృద్ధి **27%**

సగటున ఒక్కో వేడుకకు అతిథుల సంఖ్య **119**

అమెరికా కంటే డబుల్..

పెళ్లి ఖర్చుల మార్కెట్ విలువ

భారత్‌లో రూ.10.9 లక్షల కోట్లు

అమెరికాలో రూ.5.8 లక్షల కోట్లు

- రూ.32 లక్షలు దాటిపోయిన సగటు వివాహ ఖర్చు
- ఏటా 14 శాతం మేర పెరిగిపోతున్న తీరు
- రూ.10.9 లక్షల కోట్లకు చేరిన వెడ్డింగ్ పరిశ్రమ
- దేశంలో ఫుడ్-గ్రోసరీ ఇండస్ట్రీ తర్వాత ఇదే అత్యధికం
- తక్కువ ఖర్చుతో పెళ్లిని ముగిస్తున్నవారూ పెరుగుతున్న వైనం..
- ప్రాచుర్యంలోకి వీకెండ్ వెడ్డింగ్స్

దేశంలో వివాహ వేడుకల ముఖచిత్రం వేగంగా మారిపోతోంది. జీవితకాల జ్ఞాపకం కోసం ఖర్చుకు వెనుకాడొద్దనే ధోరణి పెరుగుతోంది. దీంతో సగటు వివాహ వేడుకల ఖర్చు 2023లో రూ.28 లక్షలుగా ఉంటే.. గతేడాది 14 శాతం పెరిగి రూ.32 లక్షల నుంచి రూ.35 లక్షలకు చేరినట్టు వెడ్డింగ్ టెక్నాలజీ ప్లాట్‌ఫాం వెడ్డింగ్ వైర్ ఇండియా నివేదిక చెబుతోంది. దీని ప్రకారం.. 2022-2024 మధ్య కాలంలో పెళ్లి ఖర్చు ఏకంగా 28 శాతం పెరిగింది. 2023-24లో వివాహ వేడుకల పరిశ్రమ సుమారు రూ.10.9 లక్షల కోట్లు దాటిపోయినట్టు ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ జెఫరీస్ అధ్యయనంలో వెల్లడైంది. మరోవైపు అతిథుల విషయంలోనూ పెళ్లివారి ధోరణి మారుతోంది. భారీగా 300 మందికిపైగా అతిథులతో జరుపుకొనే వివాహాల సంఖ్య గతేడాది 16 శాతం పెరిగింది. అదే సమయంలో తక్కువ మందితో 100 మందిలోపు అతిథులతో జరుపుకొనే పెళ్లిళ్లు 27 శాతం పెరిగాయి. మొత్తమ్మీద పెళ్లిళ్లకు సగటున గెస్ట్ లిస్ట్ 119గా ఉన్నట్టు నివేదిక పేర్కొంది.

కొత్త డెస్టినేషన్లపై మక్కువ..

లగ్జరీ విషయంలో రాజీ పడకుండా, మరీ ఎక్కువ మందితో గందరగోళం తలెత్తకుండా కాస్తంత ప్రైవసీ కోరుకుంటున్నవారు పెరుగుతున్నారు. ఈ క్రమంలో దేశీయంగా కొత్త డెస్టినేషన్లు తెరపైకి వస్తున్నాయి. హడావుడిగా ఉండే సాధారణ వెడ్డింగ్ స్పాట్లతో పోలిస్తే ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే ప్రాంతాల వైపు మొగ్గు చూపే వారు పెరుగుతున్నారు. సాధారణంగా జైపూర్, గోవా, ఉదయ్‌పూర్ వంటి ప్రాంతాల ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ.. మరిన్ని కొత్త ప్రాంతాలూ వెడ్డింగ్ డెస్టినేషన్లుగా తెరపైకి వస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్, డెహ్రాడూన్.. కేరళలోని వయనాడ్ వంటి ప్రాంతాలపై ఆసక్తి పెరుగుతోంది.

కొత్త కాన్సెప్టులతో.. ఖర్చు తగ్గించుకునేలా..

భారీ ఖర్చు పెట్టి పెళ్లి చేసుకోవడమే కాదు.. ఖర్చును బాగా తగ్గించుకోవాలనుకునే వారూ ఉంటున్నారు. దీంతో వీక్ డే వెడ్డింగ్‌లనే కాన్సెప్టులూ ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. ఆదివారాలు, సెలవు రోజులైతే పాలోమంటూ అందరూ వచ్చేసి, ఖర్చులు పెరిగిపోతాయనే ఉద్దేశంతో ఆఫీసులు ఉండే రోజుల్లో పెళ్లిళ్లను ఫిక్స్ చేసుకుంటున్నారు కొందరు. ఇందు కోసం సోమవారం, మంగళవారాలు పాపులర్ చాయిస్‌గా ఉంటున్నాయి. వీకెండ్ వెడ్డింగ్‌లతో పోలిస్తే ఇవి తక్కువ ఖర్చులో అయిపోతున్నాయి.

నవంబర్ టు మార్చి.. కోటి పెళ్లిళ్లు..

సీజన్లపరంగా చూస్తే శీతాకాలంలో పెళ్లికి మొగ్గు చూపే వారు ఎక్కువగా ఉంటున్నారు. మంచి ముహూర్తాలు ఉండటంతో నవంబర్, డిసెంబర్, ఫిబ్రవరిపై ఆసక్తి ఉంటోంది. 2024లో జరిగిన పెళ్లిళ్లలో 18.5 శాతం ఒక్క నవంబర్‌లోనే జరిగాయి. మొత్తమ్మీద నవంబర్–మార్చి మధ్య ఏటా కోటిపైగా పెళ్లిళ్లు జరుగుతున్నాయని అంచనా. ఆలిండియా ట్రేడర్ల సమాఖ్య గణాంకాల ప్రకారం.. 2023లో పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలున్న 23 రోజుల్లో ఏకంగా రూ.4.25 లక్షల కోట్ల వ్యాపారం జరిగింది. అలాంటిది గతేడాది నవంబర్–డిసెంబర్ వెడ్డింగ్ సీజన్‌లో 35లక్షల పెళ్లిళ్లు జరిగిన నేపథ్యంలో.. రెండు నెలల వ్యవధిలోనే ఇంతకుమించి బిజినెస్ జరిగి ఉంటుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

పెళ్లి ఖర్చులో దేనికెంత?

- నగలకు: 25 శాతం
- ఫంక్షన్‌హాల్, డెకరేషన్, డీజే, తదితర ఖర్చులు: 25 శాతం
- ఫుడ్ (కేటరింగ్): 20 శాతం
- మెహెందీ, హల్దీ వంటి ఈవెంట్ల కోసం: 15 శాతం
- ఫొటోగ్రఫీ/వీడియో: 8శాతం
- పెళ్లి వస్త్రాల కోసం: 7శాతం

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్య

ఉన్నత విద్యా మండలి, బల్క్ డ్రగ్స్ పరిశ్రమ అసోసియేషన్ ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బల్క్ డ్రగ్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న వారిని అందించడానికి వీలుగా కళాశాల విద్యాబోధనలో మార్పులు చేసేందుకు ఉన్నత విద్యామండలి సిద్ధమైంది. ఈ మేరకు భారత బల్క్‌డ్రగ్ ఉత్పత్తిదారుల సంఘం (బీడీఎంఏఐ)తో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కీలకమైన అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బల్క్‌డ్రగ్ పరిశ్రమలో పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా కళాశాల విద్యార్థులకు నైపుణ్యం కల్పించడానికి బల్క్‌డ్రగ్ పరిశ్రమ సహకరించనుంది. విద్యాభ్యాసం ముగించుకుని వెళ్లే యువత నేరుగా బల్క్‌డ్రగ్ పరిశ్రమల్లో మళ్లీ శిక్షణ పొందాల్సిన అవసరం లేకుండా, ప్రాక్టిసింగ్ నాలెడ్జ్‌తో ఫార్మా మాన్యుఫాక్చరింగ్, పరిశోధన అభివృద్ధి, క్వాలిటీ కంట్రోల్ వంటి వాటిలో కళాశాలల దశలోనే ప్రాక్టికల్‌గా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ అవగాహన ఒప్పందం శనివారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, వైస్-చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, బీడీఎంఏఐ అధ్యక్షుడు ఆర్.కె.అగర్వాల్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రామేశ్వరరావు తదితరులు సమక్షంలో జరిగింది. ఈ ఒప్పందం వల్ల విద్యార్థులకు సరైన నైపుణ్యంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, నేరుగా ఇంటర్న్‌షిప్‌లో చేరడానికి అవకాశం ఏర్పడుతుందని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు అగర్వాల్ మాట్లాడుతూ, వృత్తి నైపుణ్యం ఉన్నవారికి విపరీతమైన డిమాండ్ ఉందని, ఈ ఒప్పందంతో విద్యార్థులకు ఉత్పత్తి, పరిశోధన ఇతరత్రా పనుల్లో సవాళ్లను సునాయాసంగా ఎదుర్కోవడానికి వీలవుతుందన్నారు. వేలాది మంది విద్యార్థులకు దీనితో ప్రయోజనం కలుగుతుందని ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ పేర్కొన్నారు.



బల్క్ డ్రగ్ పరిశ్రమ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ వి. బాలకిష్టారెడ్డి తదితరులు

12న తిరుమలలో రామకృష్ణ తీర్థ ముక్కోటి

తిరుమల: తిరుమలలో ఫిబ్రవరి 12న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటిని టీటీడీ నిర్వహించనుంది. దీని ఏర్పాట్లపై టీటీడీ ఏఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి శనివారం తిరుమల గోకులం సమావేశ మందిరంలో సమీక్షించారు. తీర్థ ముక్కోటికి వచ్చే యాత్రికుల కోసం రేడియో బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ప్రకటనలు, డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అన్నప్రసాదం, తాగునీరు, వైద్య సదుపాయాలు, అటవీ శాఖల ఏర్పాట్లపై సమీక్షించారు. ముక్కోటికి అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న యాత్రికులను, వృద్ధులను, పది ఏళ్లలోపు చిన్నారులను అనుమతించబోమని చెప్పారు. గోగర్భం డ్యామ్ పాయింట్ నుంచి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఏపీఎస్ఆర్టీసీ భారీగా బస్సులను ఏర్పాటు చేస్తోంది. 12న ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే యాత్రికులను ఈ తీర్థానికి అనుమతిస్తారు.

ఆర్టీసీ 'చలాన్' బకాయి రూ.కోటి

2022 నుంచి 25,609 ట్రాఫిక్ ఉల్లంఘనలు	పోలీసులు విధించిన జరిమానా	ఇప్పటి వరకు సంస్థ చెల్లించింది
	రూ.1.84 కోట్లు	రూ.74.03 లక్షలే..

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలో ప్రైవేట్ వాహనాలతో ఆర్టీసీ బస్సులు పోటీ పడుతున్నాయి. టీజీఎస్ఆర్టీసీ బస్సులపై ఏటా ట్రాఫిక్ పోలీసులు వేల సంఖ్యలో ఈ-చలాన్లు జారీ చేస్తున్నారు. 2022 నుంచి గత నెల 27 వరకు ఆర్టీసీ బస్సులకు 25,609 ఈ-చలాన్లు జారీ చేశారు. వీటికి సంబంధించి ఆర్టీసీ రూ.కోటికి పైగా చెల్లించాల్సి ఉంది. స్వచ్ఛంద సంస్థ యుగాంతర్ ఫౌండేషన్‌కు చెందిన యూఆర్టీఐ సంస్థ సమాచార హక్కు చట్టం కింద ట్రాఫిక్ పోలీసు విభాగం నుంచి ఈ సమాచారం సేకరించింది.

ప్రయాణికుల కోసమే ఉల్లంఘనలు..

ఆర్టీసీ బస్సుల ట్రాఫిక్ ఉల్లంఘనల్లో ఎక్కువగా ప్రయాణికుల కోసం చేస్తున్న పొరపాట్లే ఉంటున్నాయి. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ బస్సులు ఆపడం, బస్‌బేలను పట్టించుకోకపోవడం, స్టాప్‌లైన్ క్రాసింగ్, ఫ్రీ లెఫ్ట్ వయలేషన్ వంటి ఉల్లంఘనలపై పోలీసులు అధికంగా చలాన్లు విధిస్తున్నారు. కొందరు ప్రయాణికులు ఎక్కడపడితే అక్కడ బస్సులను ఆపాలని కోరుతున్నారు. సంస్థ ఆదాయం గురించి ఆలోచిస్తున్న డ్రైవర్లు.. చెయ్యెత్తిన చోట బస్సులు ఆపుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధిస్తున్నారు. బస్‌స్టాపుల్లో ఆటోలు తిష్టవేస్తుండటంతో బస్సులు రోడ్ల పైనే ఆగాల్సి వస్తోంది. కాగా, ట్రాఫిక్ జరిమానాలను చెల్లించడంలో ఆర్టీసీ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రైవేటు వాహనాల మాదిరిగా ట్రాఫిక్ పోలీసులు ఆర్టీసీ బస్సులపై కఠిన చర్యలు తీసుకోకపోవటంతో చలాన్లు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి.

ఆర్టీసీ బస్సులపై ఈ-చలాన్ల గణాంకాలు

	2022	2023	2024	2025 (జనవరి 27 వరకు)	మొత్తం
జారీ అయిన చలాన్లు	4,376	15,211	5,790	232	25,609
జరిమానా చెల్లించినవి	1,959	7,998	121	2	10,080
చెల్లించిన మొత్తం రూ.	11,73,630	61,40,985	84,820	4	74,03,434
పెండింగ్ చలాన్లు	2,417	7,213	5,669	230	15,529
చెల్లించాల్సిన మొత్తం రూ.	14,41,665	51,60,925	43,22,790	1,40,440	1,10,65,820

పంబన్ 2.0

పంబన్ (రామేశ్వరం) నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

దేశంలో మరో ఇంజనీరింగ్ అద్భుతం ప్రారంభానికి సిద్ధమైంది. సముద్రంలో నిర్మించిన తొలి వర్టికల్ లిఫ్ట్ (నిలువునా పైకి లేచే) వంతెన త్వరలో అందుబాటులోకి రానుంది. భారీ పడవలు వెళ్లటానికి వంతెనలోని 73 మీటర్ల పొడవు, 660 టన్నుల బరువున్న ఒక భాగం అమాంతం 17 మీటర్ల ఎత్తుకు లేవటం దీని ప్రత్యేకత. తమిళనాడులోని మండపం నుంచి రామేశ్వరం ద్వీపాన్ని కలుపుతూ ఆధునిక హంగులతో దీనిని నిర్మించారు. 111 సంవత్సరాల క్రితం ఇక్కడ నిర్మించిన పాత వంతెన కాలం తీరిపోవటంతో దాని పక్కనే ఈ కొత్త వంతెనను నిర్మించారు. త్వరలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీనిని జాతికి అంకితం చేయనున్నారు. వంతెనపై ట్రయల్స్‌ను శనివారం విజయవంతంగా చేశారు.


శనివారం వంతెన ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న దృశ్యం



ప్రారంభానికి సిద్ధమైన కొత్త వంతెన | నిలువునా పైకి లేచే వంతెన | దేశంలో మరో ఇంజనీరింగ్ అద్భుతం

దూర ప్రయాణాన్ని తగ్గించేందుకు..

1914లో నాటి బ్రిటిష్ ప్రభుత్వం తమిళనాడులోని మండపం (సముద్రం ప్రారంభమయ్యే ప్రాంతం) నుంచి పంబన్ (రామేశ్వరం దీవి ప్రారంభ చోటు) వరకు రైలు వంతెనను నిర్మించింది. ఆ సమయంలోనే వంతెన మధ్యలో పడవలకు దారిచ్చేందుకు రోలింగ్ లిఫ్ట్ ఏర్పాటు చేశారు. మధ్య భాగంలో వంతెన స్పాన్‌లు విడిపోయి ఉంటాయి. సిబ్బంది వాటికి ఏర్పాటు చేసిన చక్రంలో ఇనుప కమ్మీలతో తిప్పగానే ఆ రెండు భాగాలు రోడ్డు లెవల్ క్రాసింగ్ రైలు గేటు తరహాలు పైకి లేస్తాయి. దీంతో పడవలు ముందుకు సాగుతాయి. ఆ తర్వాత మళ్లీ మూసి విడిపోయిన రైలు పట్టాలు కలిసిపోయేలా చేస్తారు. సముద్రపు నీటి ప్రభావంతో ఈ వంతెన తుప్పుపట్టి బలహీనపడింది. దీంతో రోలింగ్ లిఫ్ట్‌కు బదులుగా వర్టికల్ లిఫ్ట్‌తో కొత్త వంతెనను నిర్మించారు. వంతెన మధ్యలో ఈ లిఫ్ట్ లేకపోతే నౌకలు రామేశ్వరం దాటిన తర్వాత ఉన్న మనదేశ చిట్టచివరి భూభాగం ధనుష్కోడి ఆవలి నుంచి తిరిగి రావాల్సి ఉంటుంది. దీనివల్ల 150 కి.మీ. అదనపు దూరాభారం అవుతుంది.



వంతెన ప్రత్యేకతలు..

- వంతెన నిర్మాణ వ్యయం రూ.540 కోట్లు. పొడవు 2.10 కి.మీ.
- పిల్లర్లతో కూడిన పైల్స్ సంఖ్య 333
- సముద్రగర్భంలో సగటున 38 మీటర్ల లోతు వరకు పిల్లర్లు. వీటికోసం వాడిన స్టెయిన్‌లెస్ స్టీలు 5,772 మెట్రిక్ టన్నులు (రీయిన్‌ఫోర్స్‌మెంట్), స్ట్రక్చరల్ స్టీల్ 4,500 మెట్రిక్ టన్నులు.
- సిమెంటు వినియోగం 3.38 లక్షల బస్తాలు. 25,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్
- పైకి లేచే భాగం బరువు 660 మెట్రిక్ టన్నులు.
- స్పెయిన్ టెక్నాలజీతో ఈ వంతెనను నిర్మించారు. ఆ దేశానికి చెందిన టిప్స సంస్థను కన్సల్టెన్సీగా నియమించుకుని వంతెనను డిజైన్ చేయించారు. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ దీనిని నిర్మించింది.
- ప్రపంచంలో సముద్రపు నీరు, ఉప్పు గాలి ప్రభావంతో ఇనుము అతి వేగంగా తుప్పుపట్టే ప్రాంతం మియామీ. ఆ తర్వాత పంబన్ ప్రాంతమే. దీంతో కొత్త వంతెన తుప్పు బారిన పడకుండా జింక్, 200 మైక్రాన్ల ఆప్రోక్సీ సీలెంట్, 125 మైక్రాన్ల పాలీ సిలోక్సేన్‌తో కూడిన రంగు డబుల్ కోట్ వేశారు. కనీసం 35 సంవత్సరాల పాటు ఈ పొర తుప్పును అడ్డుకుంటుంది. ఆ తర్వాత మళ్లీ పూస్తే మరికొంతకాలం తప్పు పట్టదు.
- పాత వంతెనలో 16 మంది సిబ్బంది 45 నిమిషాల పాటు చక్రం తిప్పితే రెండు భాగాలు రెక్కల్లా పైకి లేచేవి. కొత్త వంతెనలో కేవలం 5.20 నిమిషాల్లో 660 టన్నుల బరువున్న 72 మీటర్ల భాగం 17 మీటర్ల ఎత్తుకు లేస్తుంది.
- ఈ వంతెనపై రైళ్లను గంటకు 80 కి.మీ. వేగంతో నడిపే వీలుంది. కానీ, రైల్వే సేఫ్టీ కమిషనర్ 74 కి.మీ. వేగానికి అనుమతించారు. పాత వంతెనపై గరిష్ట వేగం గంటకు 10 కి.మీ. మాత్రమే.
- వంతెన నిర్మాణ పనులు 2019లో మొదలయ్యాయి. కోవిడ్ వల్ల కొంతకాలం ఆలస్యమైనా, మొత్తంగా 2 సంవత్సరాల్లోనే పూర్తిచేశారు.
- 2022 డిసెంబర్‌లో పాత వంతెనపై రైళ్ల రాకపోకలు నిలిపేశారు. అప్పట్లో రోజుకు 18 ట్రిప్పుల రైళ్లు తిరిగేవి. కొత్త వంతెన అందుబాటులోకి వస్తే మరిన్ని రైళ్లు తిప్పేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- లిఫ్ట్ టవర్లకు 310 టన్నుల బరువు తూగే భారీ స్టీల్ దిమ్మెలు రెండు వైపులా కౌంటర్ వెయిట్స్‌గా ఏర్పాటు చేశారు. కరెంటు శక్తితో వంతెన భాగం పైకి లేవటం మొదలుకాగానే కౌంటర్ వెయిట్స్ మరోవైపు దిగువకు జారటం ద్వారా వంతెన భాగం పైకి వెళ్లేలా చేస్తాయి. దీంతో 5 శాతం కరెంటు మాత్రమే ఖర్చవుతుంది.
- లిఫ్ట్ టవర్ పైభాగంలో ప్రత్యేకంగా స్కాడా (సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్) సెంటర్ ఏర్పాటు చేశారు. వంతెన భాగంలో ఎక్కడైనా లోపాలు తలెత్తితే వెంటనే ఇది అప్రమత్తం చేస్తుంది. అక్కడి భారీ కంప్యూటర్‌లో లోపాలను చూపుతుంది.
- రైల్వేలో సీనియర్ ఇంజనీర్, విజయనగరం జిల్లాకు చెందిన నడుకూరు వెంకట చక్రధర్ ఈ వంతెన నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం దాని ఇన్‌చార్జిగా ఉన్నారు.
- 1964 డిసెంబర్ 22న పెను తుఫాను కారణంగా 25 అడుగుల ఎత్తులో ఎగిసిపడ్డ అలలు, బలమైన గాలులతో పంబన్ వంతెన ధ్వంసమైంది. రాత్రి 11.50 సమయంలో వంతెన మీదుగా వెళ్తున్న 653 నంబర్ రైలు కొట్టుకుపోయి అందులోని 190 మంది ప్రయాణికులు మృతి చెందారు. కానీ, వంతెనలోని షెర్జర్ రోలింగ్ లిఫ్ట్ భాగం మాత్రం కొట్టుకుపోకుండా నిలిచింది. మెట్రో మ్యాన్‌గా పిలుచుకుంటున్న ఈ. శ్రీధరన్ ఆధ్వర్యంలో 46 రోజుల్లోనే వంతెనను పునరుద్ధరించారు.

టెక్నాలజీ మారేకొద్దీ పనితీరూ మారుతుంది

సైయంట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సైయంట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి

అమీర్‌పేట (హైదరాబాద్): టెక్నాలజీ మారేకొద్దీ పనితీరు కూడా మారుతుందన్న విషయాన్ని అందరం గుర్తించాలని, దానికి అనుగుణంగా మనల్ని మనం మార్చుకోవాలని సైయంట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) 2025 నాయకత్వ సదస్సు శనివారం అమీర్‌పేటలోని మారిగోల్డ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఆటోమేషన్‌కు అవకాశం ఉన్న ఉద్యోగాలు క్రమంగా పడిపోవడం మొదలయ్యాయని తెలిపారు. గతంలో మనం ఏదైనా సబ్జెక్ట్ మీద మాట్లాడాలనుకుంటే వివరాలు సేకరించేందుకు రెండు రోజులు పట్టేదని, అదే నేడు చాట్ జీపీటీకి చెబితే అరగంటలో పని అయిపోతుందని తెలిపారు. కొత్త టెక్నాలజీకి మనందరం అలవాటు పడాల్సిందేనని స్పష్టం చేశారు. టెక్నాలజీ నాయకులను తయారు చేయదని, నాయకులే టెక్నాలజీని తయారు చేసి దాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటారని చెప్పారు. నాయకత్వ స్థానాలకు ఏఐ సహాయపడుతుందని తెలిపారు. ప్యానల్ డిస్కషన్‌లో వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఏ అధ్యక్షులు చంద్రశేఖర్, రాజేష్ దుద్దు, ఇండియన్ బిజినెస్ స్కూల్ డీన్ మదన్ పిల్లుట్ల, ఐటీసీ గ్రూప్ హెడ్ శివకుమార్, అపోలో ఆసుపత్రి డైరెక్టర్ సంగీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

రక్షణ, హాజరుతో లక్ష్యసాధన

సింగరేణి యాజమాన్యం రెండు నెలల కోసం కేటగిరీ - 1, 2లను ప్రకటించింది. ఆయా కేటగిరీల్లో పనిచేస్తున్న అన్ని రకాల ఉద్యోగులు(సర్ఫేస్, అండర్ గ్రౌండ్) లక్ష్యాల సాధనకు కృషి చేయాలి. ఇదే సమయాన రక్షణ సూత్రాలు పాటిస్తూ హాజరు శాతం తగ్గకుండా పనిచేస్తే ప్రోత్సాహకాలు అందుకోవచ్చు.

- శాలేం రాజు, కొత్తగూడెం ఏరియా జీఎం






అందరికీ పని కల్పిస్తే ఫలితం

భూగర్భగనుల్లో చాలా మంది ఉద్యోగులకు మైనింగ్ అధికారులు పని ప్రదేశాలను చూపెట్టడం లేదు. దీంతో ఖాళీగా ఉండి వెనుదిరుగుతున్నారు. అలాగే, మైన్స్ కమిటీ అలంకారప్రాయంగా మారింది. కొందరు గనుల మేనేజర్లు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే వాట్సాప్ నివేదికలు ఇస్తారు. ఇలాంటివి సరిచేస్తే లక్ష్యాలను సాధించవచ్చు.

- రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి



కష్టానికి తగ్గ ఫలితం

సింగరేణి కార్మికులకు ప్రోత్సాహకాల ప్రకటన

- రెండు నెలల్లో 18.27 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం
- కార్మికులు లక్ష్యాన్ని చేరుకుంటే నగదు ప్రోత్సాహకం
- 1, 2 కేటగిరీలుగా భూగర్భ గనులు, ఓసీలు, సీహెచ్‌పీలు

సింగరేణి (కొత్తగూడెం):

వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు సింగరేణి కార్మికులకు ఆ సంస్థ ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సుమారు రెండు నెలల సమయం ఉంది. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకోగా, గత పది నెలల్లో 53.73 మిలియన్ టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదైంది. మిగిలిన 18.27 మిలియన్ టన్నులను మార్చి 31లోగా ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న 18 ఓపెన్ కాస్ట్ గనులు, 24 భూగర్భ గనులతో పాటు సీహెచ్‌పీ (కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్)లను కేటగిరీ 1, 2గా విభజించారు. ఆయా పని ప్రాంతాల్లో రానున్న రెండు నెలల్లో సెలవులు తీసుకోకుండా నెలకు 20 మస్టర్లు చేసే కార్మికులకు ప్రోత్సాహకాలు ఇస్తామని యాజమాన్యం ప్రకటించింది.

ప్రోత్సాహకాలు ఇలా...

- భూగర్భ గనుల్లో నెలకు 20 వేల టన్నుల కంటే ఎక్కువ బొగ్గు ఉత్పత్తి చేసే గనులను కేటగిరీ - 1గా పరిగణిస్తారు. వీటిలో 100 నుంచి 104 శాతం ఉత్పత్తి జరిగితే, అక్కడ పనిచేసే కార్మికులకు రెండు నెలల్లో రూ.1,500 ప్రోత్సాహకంగా ఇస్తారు. 105 నుంచి 109 శాతం ఉత్పత్తి చేస్తే రూ.2 వేలు, 110 శాతం కంటే అధికంగా ఉత్పత్తి చేసిన వారికి రూ.2,500 చెల్లిస్తారు.
- భూగర్భ గనుల్లో 20 వేల టన్నుల కంటే తక్కువ ఉత్పత్తి చేసే గనులను కేటగిరీ-2గా పరిగణిస్తారు. వీటిలో 100 నుంచి 104 శాతం ఉత్పత్తి చేస్తే రూ.1,200 ప్రోత్సాహం ఇస్తారు. 105 నుంచి 109 శాతం ఉత్పత్తి చేస్తే రూ.1,700.. 110 కంటే అధికంగా ఉత్పత్తి చేస్తే రూ.2,200 చొప్పున సంస్థ చెల్లించనుంది.
- రోజుకు 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే ఓపెన్ కాస్ట్ గనులను కేటగిరీ-1గా పరిగణిస్తారు. వీరు 100 నుంచి 104 శాతం ఉత్పత్తి చేస్తే రూ.1,500 ప్రోత్సాహం ఇస్తారు. 105 నుంచి 109 శాతం ఉత్పత్తి చేస్తే రూ.2 వేలు, 110 శాతం కంటే అధికంగా చేసిన వారికి రూ.2,500 ప్రోత్సాహకంగా చెల్లిస్తారు.
- కేటగిరీ-2లో రోజుకు 30 వేల టన్నుల కంటే తక్కువ ఉత్పత్తి చేసే ఓసీలు ఉన్నాయి. వీటిల్లో 100 నుంచి 104 శాతం ఉత్పత్తి చేస్తే రూ.1,200.. 105 నుంచి 109 శాతం ఉత్పత్తి చేస్తే రూ.1,700, 110 శాతం కంటే అధికంగా ఉత్పత్తి చేస్తే రూ.2,200 చెల్లించనున్నారు.
- రోజుకు 8 రేక్‌లు (32 వేల టన్నులు) రవాణా చేసే సీహెచ్‌పీలను కేటగిరీ-1గా, అంతకంటే తక్కువ రవాణా చేసేవాటిని కేటగిరీ-2గా పరిగణిస్తారు. ఈ రెండు కేటగిరీల్లోని ఉద్యోగులకు రవాణాకు అనుగుణంగా ప్రోత్సాహక నగదు చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించింది.

సమస్యల పరిష్కారానికి సమరం

- సింగరేణి అధికారుల కార్యాచరణ
- వెంటనే డైరెక్టర్ల నియామకానికి డిమాండ్



కార్యాచరణ కోసం సమావేశమైన అధికారులు

గోదావరిఖని: తమ సమస్యలను పరిష్కరించడంతోపాటు.. అనిశ్చితికి కారణమైన డైరెక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలనే డిమాండ్‌తో సింగరేణి అధికారులు సమరానికి సిద్ధమయ్యారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సీఎంవోఏఐ కార్యాలయంలో సమావేశమైన అధికారుల సంఘం నేతలు.. భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేశారు. మొత్తం 11 ఏరియాలకు చెందిన సుమారు 2,500 మంది అధికారులు ఇందులో భాగస్వాములవుతున్నారు. తొలుత ఏరియా జీఎంలకు వినతిపత్రాలు అందజేసి, రోజూ సాయంత్రం జీఎం కార్యాలయాల ఎదుట సమావేశమై ప్రణాళిక రూపొందించుకోవాలని నిర్ణయించారు. ఈమేరకు శనివారం జీఎంలకు వినతిపత్రాలు అందజేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్‌పీ) చెల్లించాలని కోరుతున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- గతేడాది రావలసిన పీఆర్పీ (పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) చెల్లించాలి
- కీలకమైన డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్, డైరెక్టర్ ఆపరేషన్ పోస్టులు భర్తీ చేయాలి
- ఏడేళ్ల పీఆర్‌పీతోపాటు 2007 - 2014 వరకు బకాయిలు చెల్లించాలి
- పదోన్నతుల విధానాన్ని సరిచేయాలి
- ఎస్‌సీడబ్ల్యూఏ నుంచి అధికారిగా పదోన్నతి పొందిన వారికి ఈ-2 నుంచి ఏడాదికే ఈ-3 ఇవ్వాలి
- ఎస్‌సీడబ్ల్యూఏ నుంచి ఈ-1కు వచ్చే జేఎంవో, జేటీవో అధికారులకు ఈ-5 వరకు పదోన్నతి విధానాన్ని వర్తింపజేయాలి
- ఈ-6 గ్రేడ్ ఏడేళ్లు దాటిన వారికి డీజీఎంగా పదోన్నతి కల్పించాలి
- డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) ఏడాదిలో రెండు ఏర్పాటు చేయాలి
- ఎఫ్ఎంఎంసీ (ఫస్ట్‌క్లాస్ మైన్ మేనేజ్‌మెంట్) సర్టిఫికెట్ ఉండి 12 ఏళ్ల సర్వీసు నిండిన వారికి ఎస్‌వోఎం హోదా ఇవ్వాలి
- కన్వేయన్స్, హెచ్‌వోడీ వాహనాలకు, ఆఫీస్ కార్యాలయాలకు ఏసీ సౌకర్యం కల్పించాలి
- నత్తువల్లి ఏరియాలో మాదిరిగా మూడు బెడ్ రూంలతో కూడిన నూతన క్వార్టర్లు నిర్మించాలి
- ఉద్యోగ విరమణ చేసేవారికి చెల్లింపుల్లో ఆటంకం లేకుండా సీడీఏ నిబంధనలు మార్చాలి
- కాలపరిమితితో విచారణలు పూర్తిచేయాలి
- కోల్ ఇండియాలో మాదిరిగా టీఏ, డీఏ నిబంధనలు అమలు చేయాలి
- రిటైర్డ్ అధికారులకు మెడికల్ బిల్లు పరిమితి పెంచాలి
- కోల్ ఇండియా మాదిరిగా హోదా ఇవ్వాలి
- ఖాళీలను పూరించాలి, పదోన్నతులు కల్పించాలి

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం



పదోన్నతులు, పీఆర్‌పీ చెల్లింపులో అధికారులకు అన్యాయం జరిగింది. మా సమస్యల పరిష్కారం కోసం ఐక్య కార్యాచరణకు సిద్ధమయ్యాం. సమస్యలు పరిష్కారం కాకుంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

- పొనుగోటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు, సీఎంవోఏఐ



మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్‌కు సీఎం నివాళి

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ ఉపకులపతిగా, బిహార్ గవర్నర్‌గా, రాష్ట్రపతిగా దేశానికి జాకీర్ హుస్సేన్ ఎన్నో సేవలు అందించారని సీఎం కొనియాడారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్‌రెడ్డి, మల్లు రవి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు భూముల సర్వే, హద్దుల గుర్తింపు కోసం భూయజమానులు పెట్టుకునే ఎఫ్-లైన్ (క్షేత్రస్థాయి కొలత) సర్వే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సర్వే శాఖకు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ యాక్ట్-1317 ఫస్లీ, తెలంగాణ సర్వే అండ్ బౌండరీస్ యాక్ట్-1923 ప్రకారం సర్వే డిపార్ట్‌మెంట్ సర్వేలు నిర్వహిస్తుంది. షరతులకు లోబడి దరఖాస్తులను చట్టప్రకారం పరిష్కరించాలని హైకోర్టు స్పష్టంచేసింది. ప్రభుత్వ సర్క్యులర్లలో పేర్కొన్న ప్రకారం 45 రోజుల్లో దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించింది. ములుగు జిల్లా వెంకటాపూర్ శివార్ గ్రామానికి చెందిన కె.రమేశ్, కె.లక్ష్మన్న తమ భూమి సర్వే చేసి సరిహద్దు రాళ్లు పాతాలంటూ సర్వే, రెవెన్యూ అధికారులకు ఎఫ్-లైన్ దరఖాస్తు చేసుకున్నారు. సర్వే అధికారులు పట్టించుకోకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం, ఎనిమిది వారాల్లో సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను ఆదేశిస్తూ విచారణను ముగించింది.



హైదరాబాద్‌లోని సన్‌సిటీలో శనివారం మధ్యాహ్నం ఎండ తాకిడికి గొడుగుతో వెళుతున్న తాతామనవడు

ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు తీసుకోండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి పంచాయతీలో ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. మండల పంచాయతీ అధికారి, కార్యదర్శుల అక్రమాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. రుద్రంగి పంచాయతీలో ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణాలకు అనుమతిస్తున్నారంటూ 2014, డిసెంబరు 9న ఇచ్చిన వినతిపత్రంపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ నరేశ్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పంచాయతీ సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుపుతామని ప్రభుత్వం తెలియజేసింది. ఈ హామీని నమోదు చేసిన హైకోర్టు అందుకు అనుగుణంగా పంచాయతీలో అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ విచారణను ముగించింది.

ఇక్కడ చికెన్ చీప్!

పేపర్ ధర కన్నా కిలోకు రూ.30 తక్కువ

- స్కిన్, స్కిన్‌లెస్ ఏదైనా సరే..
- కామారెడ్డి మార్కెట్‌లో రసవత్తర పోటీ



కామారెడ్డిలో ఓ చికెన్ షాప్ ముందు కట్టిన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోరోజువారీ ధరల ప్రకారం చికెన్ అమ్మకాలు సాగుతుంటే, కామారెడ్డి జిల్లా కేంద్రంలో మాత్రం మార్కెట్ రేట్ కన్నా కిలోకు రూ.30 తక్కువకు విక్రయిస్తుంటారు. ఎక్కడా కనిపించని పోటీ కామారెడ్డిలోనే ఉంటుంది. నాలుగైదేళ్ల కిందట మొదలైన పోటీ ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. ఇక్కడి దుకాణాల నిర్వాహకులు పేపర్ రేట్ కన్నా రూ.30 తక్కువ అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ విక్రయాల్లో పోటీ పడుతుంటారు.

ఇక్కడ తక్కువ ధరకు దొరుకుతుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి మరీ చికెన్ కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా పెళ్లిళ్లు, ఫంక్షన్లకు క్వింటాళ్ల కొద్దీ చికెన్ కొనుగోలు చేస్తారు. సాధారణంగా పేపర్‌లో వచ్చే ధరల ప్రకారమే రాష్ట్రమంతటా చికెన్ అమ్ముతారు. అక్కడక్కడా ఐదో, పదో రూపాయలు తగ్గించి అమ్ముతారు. కానీ కామారెడ్డిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటుంది. కొందరు పేపర్ ధర కన్నా కిలోకు రూ.30 తక్కువకు అమ్ముతుండగా, ఇంకొందరు రూ.35 నుంచి రూ.40 తక్కువ కూడా విక్రయిస్తుంటారు. గురువారం పేపర్ ధర ప్రకారం స్కిన్‌తో చికెన్ ధర కిలోకు రూ.181 ఉండగా, కామారెడ్డిలో రూ.150కి అమ్మారు. అంటే కిలోకు రూ.31 తక్కువగా విక్రయించారు. అలాగే స్కిన్‌లెస్ చికెన్ కిలో పేపర్ ధర ప్రకారం రూ.206 ఉండగా, కామారెడ్డిలో రూ.180కి అమ్మారు. అంటే కిలోకు రూ.26 తక్కువకు అమ్మినట్లు స్పష్టమవుతోంది. లైవ్ బర్డ్ ధర కిలోకు రూ.128 ఉండగా, ఇక్కడ రూ.120కి అమ్ముతారు. మొత్తంగా ఏ దుకాణానికి వెళ్లినా మార్కెట్ ధర కన్నా తక్కువకే దొరుకుతుంది.

టన్నుల కొద్దీ అమ్మకాలు..

కామారెడ్డి మార్కెట్‌లో నిత్యం 10 టన్నుల నుంచి 15 టన్నుల వరకు చికెన్ అమ్ముతుంటారు. ఆదివారం రోజైతే 40 టన్నుల నుంచి 50 టన్నుల వరకు అమ్ముడవుతోంది. వివిధ పౌల్ట్రీ సంస్థలు ఇక్కడ హోల్‌సేల్‌గా షాపులకు కోళ్లను సప్లై చేస్తాయి. కొందరు చికెన్ సెంటర్ల నిర్వాహకులకు సొంతంగా పౌల్ట్రీఫామ్‌లు కూడా ఉన్నాయి. ఇక్కడ కార్పొరేట్ సంస్థలకు చెందిన కోళ్ల అమ్మకాలు ఎక్కువగా జరుగుతాయని వ్యాపారులు తెలిపారు. వ్యాపారుల మధ్యన నెలకొన్న పోటీ మూలంగా కొనుగోలుదారులకు తక్కువ ధరకు చికెన్ లభిస్తోంది. రెగ్యులర్‌గా చికెన్ కొనుగోలు చేసే హోటళ్లు, రెస్టారెంట్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు మరింత తక్కువ ధరలకు అమ్ముతామని వ్యాపారులు చెబుతున్నారు.

చుట్టుపక్కల మండలాల్లో ఎక్కువ ధరలకు..

కామారెడ్డి పట్టణానికి చుట్టుపక్కల ఉన్న మండలాలు, గ్రామాల్లో పేపర్ ధరకే చికెన్ అమ్ముతారు. కొన్ని చోట్ల పేపర్ ధర కన్నా ఎక్కువకే అమ్ముతుంటారు. కామారెడ్డి లో ధరలు తక్కువగా ఉన్నాయని, ఇక్కడ ఎక్కువ ఎందుకని ఎవరైనా వినియోగదారులు చుట్టుపక్కల మండలాల్లో వ్యాపారులను ప్రశ్నిస్తే.. అక్కడి ధర అక్కడే, ఇక్కడి ధర ఇక్కడే అని విక్రయదారులు చెబుతారు. ఈ నేపథ్యంలో కిలో, రెండు కిలోలు తీసుకునేవాళ్లు అందుబాటులో ఉన్న దుకాణాల్లో ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తారు. అదే పెళ్లిళ్లు, ఫంక్షన్లు, పండుగల కోసం ఎక్కువ మొత్తంలో చికెన్ అవసరమైనపుడు మాత్రం కామారెడ్డిలో కొనుగోలు చేస్తుంటారు. ఎక్కువ మొత్తంలో కొంటే మరింత తక్కువ ధరకు ఇస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి చాలా మంది ఆటోలు, వ్యాన్లలో వచ్చి చికెన్ తీసుకుని వెళుతుంటారు.



శనివారం హైదరాబాద్‌లో ఫోన్ చూస్తూ ద్విచక్ర వాహనాన్ని ప్రమాదకరంగా నడుపుతున్న యువకుడు



శనివారం హైదరాబాద్‌లో పరిమితికి మించి ప్రమాదకరంగా ట్రాలీ ఆటోలో వస్తువులను తీసుకెళుతున్న దృశ్యం



శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చతికిల పడటంతో నిర్మానుష్యంగా మారిన హైదరాబాద్‌లోని గాంధీభవన్

కడలి దాచిన అందం



విశాఖ తీరంలో ఇటీవల సముద్రం కొంత వెనక్కి వెళ్లింది. దీనితో రాళ్లపై మెలిచిన ఈ సముద్రపు మొక్కలు బయటకు కనిపించాయి. రాతిని మెత్తం కప్పేసి ఆకుపచ్చని తివాచీని తలపించే విధంగా ఈ సముద్రపు మొక్కలు పర్యాటకులకు కనువిందుచేశాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

స్వర్ణ సంధ్యా సమయం



అస్తమించే రవిబింబం అరుణకాంతులు వెదజల్లుతోంది. పిల్లగాలి తెమ్మెర తటాకంలో అలలను సయ్యాటలాడిస్తుంటే.. భానుని కిరణ స్పర్శకు నీరు బంగారు వర్ణంలో మెరిసిపోతోంది. మరో వైపు ఇరులు జడలువిప్పి వెలుతురును మింగేస్తూ వస్తున్నాయి. ఈ మనోహర దృశ్యాన్ని అనంతపురం రూరల్ మండలం పాములాయి వడియంపేట పరిసరాల్లో సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

పట్నంలో పల్లె ముచ్చట్లు



పొట్టకూటికోసం పట్నం చేరిన ఈ వలసజీవులు ఉదయాన్నే కాస్త తిని చద్దిమూట కట్టుకుని నిర్మాణ పనుల కోసం అడ్డా వద్దకు చేరుకున్నారు. నలుగురూ ఒకచోట చేరడంతో సరదాగా ముచ్చట్లలో మునిగిపోయారు. విశాఖలోని అల్లిపురం ప్రాంతంలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చార్వాక ఆశ్రమంలో ప్రారంభమైన నాస్తికమేళా



నిడమర్రు (మంగళగిరి): మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జీవితాంతం కృషి చేసిన మేధావి పెరియార్ రామస్వామి అని పలువురు వక్తలు కొనియాడారు. గుంటూరు జిల్లా నిడమర్రు చార్వాక ఆశ్రమంలో శనివారం 33వ నాస్తిక మేళా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న మేళాను సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఫిర సభ్యురాలు మౌనిక ప్రారంభించారు. నాస్తిక సమాజం నాయకులు సీహెచ్ శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో భవిష్యత్తు ఆలోచనాపరుడు పెరియార్ అంశంపై ది రేషనలిస్ట్ ఫోరం తమిళనాడు అధ్యక్షుడు ఆర్ తమిళ సెల్వన్ మాట్లాడుతూ పెరియార్ రామస్వామి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేయడంతో పాటు విద్యార్థులు, ప్రజలలో శాస్త్రీయ అవగాహన కోసం కృషి చేశారన్నారు. సమాజంలో ఉన్న కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడంతో పాటు ప్రజలందరికి నాణ్యమైన విద్య అందించాలని కృషి చేశారన్నారు. సైన్స్ మీదా మాదా అనే అంశంపై రాయపూర్ ఎయిమ్స్ ప్రొఫెసర్ కె. విజయ కుమార్ మాట్లాడుతూ సైన్స్ ఎలా అభివృద్ధి చెందింది, జీవపరిణామం ఎలా జరిగింది . డార్విన్ మహనీయుడు ఏమి చెప్పారు ఈరోజులలో నూడో సైన్స్ ఎలా ప్రజల ముందుకు వస్తుంది అనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. 16 మందికి గాయాలు

- కాకినాడ జిల్లా పైడికొండలో ఘటన
- క్షతగాత్రులంతా రొయ్యల కంపెనీ కార్మికులు



తొండంగి: ఆటోలో డ్రైవర్‌తో కలిపి 19 మంది ప్రయాణించడంతో ఆటో అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో 17 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం పైడికొండలో శనివారం జరిగిన ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణాపురంలో అవంతి రొయ్యల కంపెనీలో పని చేసేందుకు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రామభద్రాపురం నుంచి ఆటో వెళ్తుంది. శనివారం ఉదయం రామభద్రాపురం, శ్రీరాంపురం గ్రామాలకు చెందిన కూలీలను ఎక్కించుకుని ఆనూరు, పైడికొండ మీదుగా వెళ్తుండగా అక్కడి మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ పట్నాల సంతోష్‌తో పాటు 16 మంది మహిళా కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వైద్యం నిమిత్తం వారందరినీ తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై జగన్మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ జీఎస్టీ ఆదాయం

నేల చూపులే



- జీఎస్టీలో కనిపించని సంక్రాంతి వెలుగులు
- జనవరిలో బీహార్ జీఎస్టీ ఆదాయం 8 శాతం పెరిగితే ఏపీలో జీరో
- పెద్ద రాష్ట్రాల్లో వృద్ధి నమోదు చేయని ఏకైక రాష్ట్రం ఏపీ
- 20 శాతం వృద్ధితో మొదటి స్థానంలో తమిళనాడు
- ఏప్రిల్-జనవరి జీఎస్టీ ఆదాయం చూసినా అదే పరిస్థితి
- 10 నెలల్లో బీహార్ జీఎస్టీ ఆదాయం 9.8 శాతం వృద్ధి
- ఇదే సమయంలో మన ఆదాయ వృద్ధి 1.2 శాతమే
- ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోవడమే కారణం అంటున్న నిపుణులు

సాక్షి, అమరావతి: సంపద సృష్టించడం దేవుడెరుగు.. ఉన్న సంపదను కూడా నాశనం చేస్తోంది కూటమి సర్కారు. బీహార్ వంటి రాష్ట్రాలు కూడా సంపద సృష్టించడంలో దూసుకుపోతుంటే.. ఆంధ్రప్రదేశ్ మాత్రం తిరోగమనంలో పయనిస్తోంది. కూటమి సర్కారు అధికారం చేపట్టినప్పటి నుంచి జీఎస్టీ ఆదాయంలో నమోదవుతున్న క్షీణతలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. తాజాగా జనవరి నెల జీఎస్టీ ఆదాయంలో ఎటువంటి వృద్ధి లేకుండా స్థిరంగా ఉండగా, ఇదే సమయంలో దేశ జీడీపీ ఆదాయం 10 శాతం పెరిగితే.. బీహార్ మనకంటే అధికంగా 8 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2024 జనవరిలో రూ.3,587 కోట్లుగా ఉన్న జీఎస్టీ ఆదాయం ఈ ఏడాది జనవరిలో రూ.3,604 కోట్లకు చేరింది. జనవరి నెల రాష్ట్ర ప్రజలకు అత్యంత ఇష్టమైన నెల. ఈ నెలలో సంక్రాంతి పండుగను పేదలు, ధనికులు.. ఎవరి స్తోమత మేరకు వారు ఘనంగా చేసుకుంటారు. కొత్త పంట చేతికందడంతో రైతులు ఏదో ఒక కొత్త వస్తువును కొనుగోలు చేస్తారు. అందుకే ప్రతి ఏటా జనవరి నెల జీఎస్టీ ఆదాయంలో భారీ వృద్ధి రేటు ఉంటుంది. కానీ ఈసారి దీనికి భిన్నంగా జీఎస్టీలో ఎక్కడా సంక్రాంతి వెలుగులు కనిపించ లేదు. ఇదే సమయంలో బీహార్ జీఎస్టీ ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.1,565 కోట్ల నుంచి రూ.1,684 కోట్లకు చేరింది. అదే మన పొరుగు రాష్ట్రం తమిళనాడు అయితే ఏకంగా 20 శాతం వృద్ధితో జీఎస్టీ ఆదాయం రూ.9,606 కోట్ల నుంచి రూ.11,496 కోట్లకు చేరింది. తెలంగాణ 10 శాతం, కర్ణాటక 8 శాతం, కేరళ 8 శాతం, ఒడిషా 7 శాతం చొప్పున వృద్ధి రేటు నమోదు చేస్తే పెద్ద రాష్ట్రాల్లో ఒక్క ఆంధ్రప్రదేశ్ ఆదాయం మాత్రమే స్థిరంగా ఉంది. ఇదే సమయంలో దేశ వ్యాప్తంగా జీఎస్టీ ఆదాయం 10.04 శాతం పెరిగింది.

జనవరిలో ముఖ్య రాష్ట్రాల జీఎస్టీ పెరుగుదల

రాష్ట్రం	2023-24	2024-25	వృద్ధి శాతం
తమిళనాడు	9,606	11,496	20%
తెలంగాణ	5,448	6,017	10%
గుజరాత్	10,967	12,135	11%
కేరళ	2,776	2,989	8%
కర్ణాటక	13,320	14,353	8%
ఆంధ్రప్రదేశ్	3,587	3,604	0%
బీహార్	1,565	1,684	8%

ఏప్రిల్-జనవరి అదే తీరు

ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకు పది నెలల కాలంలో రాష్ట్ర జీఎస్టీ ఆదాయం నేల చూపులు చూస్తోంది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు జీఎస్టీ ఆదాయంలో వృద్ధి రేటును నమోదు చేస్తుంటే ఒక్క ఏపీలో మాత్రమే వృద్ధి నమోదు అంతంత మాత్రంగా ఉంది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్-జనవరి మధ్య కాలంలో రాష్ట్ర జీఎస్టీ ఆదాయం కేవలం 1.2 శాతం వృద్ధితో రూ.36,975 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇదే సమయంలో వెనుకబడిన బీహార్ రాష్ట్ర జీఎస్టీ ఆదాయం 9.9 శాతం పెరిగి రూ.15,965 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కర్ణాటక 10.5 శాతం, తమిళనాడు 8, తెలంగాణ 6 శాతం వృద్ధితో దేశ వ్యాప్తంగా 10.1 శాతం వృద్ధి నమోదయ్యింది. జీఎస్టీ వచ్చినప్పటి నుంచి దేశ సగటు వృద్ధి రేటు కంటే ఏపీ వృద్ధిరేటు అధికంగా ఉంటూ వచ్చేదని, కానీ తొలిసారిగా ఈ ఏడాది దానికి భిన్నంగా తిరోగమన దిశలో పయనిస్తోందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. గత ఐదేళ్లు కొనసాగిన సంక్షేమ పథకాలను చంద్రబాబు ప్రభుత్వం అటకెక్కించడం, కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం తప్ప అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి పూర్తిగా పడిపోయింది. అందువల్లే పండుగల నెలలైనప్పటికీ నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో జీఎస్టీ ఆదాయం క్షీణించిందని అధికారులు పేర్కొంటున్నారు. సంపద సృష్టించి పేదలకు పంచుతానని, అందరినీ లక్షాధికారులను చేస్తానని ఎన్నికల ముందుచెప్పిన సీఎం చంద్రబాబుకు వాస్తవం బోధ పడుతున్నట్లు తెలుస్తోంది. అందువల్లే 'సంపద సృష్టించే సలహా ఉంటే నా చెవిలో చెప్పు తమ్ముడూ' అనే పరిస్థితికి దిగజారిపోయాడని, సంపద సృష్టించిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేస్తానంటూ కొత్త రాగం తీస్తున్నాడంటూ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలు నిలిచి పోయాయని, చివరికి ఉద్యోగుల జీతాల కోసం మంగళవారం రిజర్వ్ బ్యాంకు అప్పు కోసం ఎదురు చూసే పరిస్థితికి తీసుకొచ్చారంటూ విమర్శిస్తున్నారు.

జీతాలు ఎప్పుడిస్తారు బాబూ?

అప్పుల పాలవుతున్నామంటూ ఎస్వీయూ ఉద్యోగుల ఆవేదన



తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ)లో వేతన జీవుల అవస్థలు వర్ణనాతీతం. గత ఏడు నెలలుగా నెల ప్రారంభంలో జీతాలు అందిన దాఖలాలు లేవు. 9తేదీ వస్తున్నా అధికారులు వేతనాల ప్రస్తావన ఎత్తడం లేదని, శాశ్వత, తాత్కాలిక, పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచే ప్రతి నెల క్రమం తప్పకుండా ఒకటో తారీఖున వేతనాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందంటూ ఉద్యోగులు మదన పడుతున్నారు. సకాలంలో జీతాలు అందక కుటుంబం నడవకపోగా, బ్యాంకు రుణాలు, ఈఎంఐల చెల్లింపులు వేధిస్తున్నాయని, ఏంచేయాలో పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నామని వర్సిటీలో ఉద్యోగులు వాపోతున్నారు.

అప్పుల పాలవుతున్నాం..

పిల్లలకు పరీక్షలు దగ్గర పడుతున్నాయని, ఇంట్లో కనీసం నిత్యావసరాలను తెచ్చుకునేందుకు సైతం చిల్లిగవ్వలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న, మధ్యతరగతి ఉద్యోగులు బంగారు నగలు తాకట్టు పెట్టి అవసరాలు తీర్చుకునే దుస్థితికి చేరడం బాధాకరమన్నారు. మరికొందరు బయటి వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పు తెచ్చుకుని కుటుంబాన్ని పోషిస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థంచేసుకోవాలని ఉద్యోగులు చెబుతున్నారు. వర్సిటీ అధికారులు తమ గోడును అర్థంచేసుకోవడంలేదని వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే వేతనాలు అందడంలో జాప్యం జరుగుతోందని ఉద్యోగులు మండిపడుతున్నారు. తిరుపతిలో మిగిలిన అన్ని వర్సిటీలలో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు అందినా ఎస్వీయూలో మాత్రం ఇంకా అందకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు.

రైతుకు సాయం ఎక్కడ?

- కనీస మద్దతు ధర దక్కని పరిస్థితి
- గతంలో ఎన్నడూ లేనంతగా క్షీణిస్తున్న ధరలు
- అన్నదాత సుఖీభవ అమలు జాడలేదు
- ఏపీ కౌలు రైతుల సంఘం ఆగ్రహం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ధాన్యంసహా ప్రధాన పంట ఉత్పత్తులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కనీస మద్దతు ధరలు దక్కని దుస్థితి నెలకొందని ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇచ్చిన ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోతోందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేని రాష్ట్ర ప్రభుత్వం 'ఆదాయం వచ్చే ఉద్యాన, వాణిజ్య పంటలకు ప్రోత్సాహం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందంటూ' పేర్కొనడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన ఆహార పంటలను దెబ్బతీసి, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పచెప్పాలన్న ప్రయత్నమేనని మండిపడ్డారు. శనివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రకటనలో ముఖ్యాంశాలు..

- ధాన్యం కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1,730లు ఇవ్వాల్సి ఉండగా, రాష్ట్రంలో ఒక్కరైతుకూ ఈ ధర దక్కలేదు. కేవలం రూ.1,400–1,500 మధ్య చెల్లించారు.
- పత్తికి గతేడాది రూ.12వేలు ఉంటే, ఈ ఏడాది రూ.6వేలు, మిరపకు గతేడాది రూ.25వేలు ఉంటే, ఈ ఏడాది రూ.13వేలు, కందికి గతేడాది రూ.10 వేలుంటే, నేడు రూ.7వేలుకు మించి పలకడం లేదు.
- అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయం మాటలకే పరిమితమయ్యింది.

పక్క రాష్ట్రాలను చూస్తే...

- కేరళలో 16 రకాల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి మద్దతు ధరలను నిర్ణయించడమే కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది.
- ఒరిస్సాలో ఈ ఏడాది నుంచి ధాన్యానికి ఎమ్మెస్పీకి రూ.800 బోనస్ కలిపి క్వింటాకు రూ.3,100 చొప్పున చెల్లించింది.
- తెలంగాణలో కూడా క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది.

హామీల గురించి అడిగేవారు

కుక్కలు, సన్నాసులా?

- కలకలం రేపిన జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు వ్యాఖ్యలు
- ఆయన అహంకారానికి అద్దం పట్టాయని విమర్శలు
- పార్టీ ఎదుగుదలకు ఆటంకమని ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన
- ఇలాంటి నేతకు మంత్రి పదవిపై సర్వత్రా చర్చ

సాక్షి, అమరావతి : ఎన్నికల ముందు చంద్రబాబు, కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగే వారిని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సోదరుడు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు కుక్కలు, సన్నాసులుగా పేర్కొనడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వచ్చాక సొంత పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకునే ఉద్దేశంతో 'జనంలోకి జనసేన' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా బహిరంగ సభల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 2న చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో నిర్వహించిన సభలో నాగబాబు మాట్లాడుతూ.. 'కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైంది. ఇంకా అది చేయలేదు.. ఇది చేయలేదు.. ఆ స్కీం రాలేదు.. ఈ స్కీం రాలేదని నోటికి వచ్చినట్టు వాగే వారు వైఎస్సార్‌సీపీ గూండాలు, కుక్కలు, సన్నాసులు' అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు అటు సొంత పార్టీలో, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారానికి దారితీస్తున్నాయి. చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీని అమలు చేసి చూపించే బాధ్యత తనది అంటూ జనసేన పార్టీ అధినేతగా పవన్‌కళ్యాణ్ ఎన్నికల ముందు అనేక సభల్లో స్వయంగా చెప్పారు. ఇప్పుడు ఆయన సోదరుడు నాగబాబు వ్యాఖ్యలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయంటూ సొంత పార్టీలోనే అంతర్గతంగా చర్చ సాగుతోంది. రాష్ట్రంలో పార్టీ ఎదుగుదలపై ఈ వ్యాఖ్యలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని జనసేన నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2014–19 మధ్య అప్పటి టీడీపీ–బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి, అప్పటి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో అత్యధిక శాతం ఆ ఐదేళ్లలో అమలు చేయకపోయినా పవన్‌కళ్యాణ్ పెద్దగా ప్రశ్నించని కారణంగానే 2019 ఎన్నికల్లో జనసేన తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని ఆ పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయమని అడిగే వారిని కించపరిచేలా, చులకనగా మాట్లాడడం ఏ మాత్రం మంచిది కాదని పెదవి విరుస్తున్నారు. నాగబాబు త్వరలో ఎమ్మెల్సీ పదవితో పాటు మంత్రి పదవి కూడా చేపట్టనున్నట్లు ఇప్పటికే అధికారిక ప్రకటన వెలువడిన నేపథ్యంలో.. ఇలాంటి వ్యాఖ్యలు ఆయన అహంకారానికి అద్దం పడుతున్నాయని, ఇలాంటి వారికి మంత్రి పదవి ఇస్తే ఇక అంతేనని వివిధ రాజకీయ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. కాగా, గతంలో నాగబాబు 'సైకిల్ తొక్కితే మనకు ఆరోగ్యం – సైకిల్‌ను తొక్కితే రాష్ట్రానికి ఆరోగ్యం' అని పేర్కొన్న సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ వ్యాఖ్యలు టీడీపీ–జనసేన శ్రేణుల మధ్య తీవ్ర దుమారం రేపాయి.



శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,971 మంది స్వామిని దర్శించుకున్నారు. హుండీలో రూ.2.99 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 10 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న వారు 3 గంటల్లో దర్శనం చేసుకుంటున్నారు.

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ



రాపూరు : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించి ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

రత్నగిరి.. భక్తజన గోదారి




అన్నవరం: వరదల వేళ పోటెత్తే గోదారిలా.. భీష్మ ఏకాదశి పర్వదినం, రెండో శనివారం సెలవు కలసి రావడంతో.. రత్నగిరిపై భక్తజన ప్రవాహం పరవళ్లు తొక్కింది. సత్యదేవుని దర్శించేందుకు లక్ష మందికి పైగా భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ భక్తులు స్వామివారి దర్శనానికి వెల్లువలా వస్తూనే ఉన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని సత్యదేవుని ఆలయాన్ని వేకువజామున ఒంటి గంటకే తెరచి, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి వ్రతాలు ప్రారంభించారు. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. రద్దీ కారణంగా అంతరాలయ దర్శనాలను మధ్యాహ్నం వరకూ నిలిపివేశారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించామని చెప్పారు. ముగింపు రోజు సందర్భంగా ఉదయం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి తిరుమంజనం, అష్టోత్తర శతనామార్చన, వేదాశీర్వచనముతో కార్యక్రమాలు ముగిశాయన్నారు. విజయకీలాద్రి దివ్యక్షేత్ర అర్చకులు, వేదపండితులు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేదవిద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పునీత తోమాసు వారి మహోత్సవం



అమరావతి: మండల పరిధిలోని అత్తలూరులో అత్యంత పురాతనమైన పునీత తోమాసు వారి ఉత్సవాలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రార్థన కార్యక్రమాలలో భాగంగా గుంటూరు మేత్రాసన జూబిలీ గురువర్యులు రెవరెండ్ ఫాదర్ చిన్నాబత్తిన భాగ్యయ్య, తొలుత జిల్లావ్యాప్తంగా పలు చర్చిల నుంచి వచ్చిన 40 మంది విచారణ గురువులతో దివ్య పూజాబలి కార్యక్రమం నిర్వహించారు. 1936లో నిర్మించిన ఈ చర్చిలో అప్పటినుంచి ఇప్పటివరకు సాంప్రదాయబద్ధంగా పూజాబలి కార్యక్రమాలను నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది.


సాక్షి సినిమా

భాగ్యనగరంలో భలే జోరు


సినిమా షూటింగ్స్ అంటే లోకల్‌లోనే కాదు... నాన్ లోకల్‌లోనూ జరుగుతుంటాయి. దేశంతో పాటు విదేశాల్లోనూ చిత్రీకరణకు మేకర్స్ ఆసక్తి చూపుతుంటారు. అయితే ప్రస్తుతం భాగ్యనగరంలో (హైదరాబాద్) సినిమా షూటింగ్‌లు భలే జోరుగా సాగుతున్నాయి. బాలకృష్ణ, పవన్ కల్యాణ్, ప్రభాస్, మహేశ్‌బాబు, నాని, 'అల్లరి' నరేశ్, నిఖిల్, సాయిదుర్గా తేజ్ వంటి హీరోలంతా హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో తమ సినిమాల షూటింగ్‌లో జోరుగా పాల్గొంటున్నారు. ఆ విశేషాలేంటో ఓ లుక్కేద్దాం...


● చిరంజీవి


● బాలకృష్ణ



● పవన్ కల్యాణ్



● మహేశ్‌బాబు


● రామ్‌చరణ్


● నాని


● ప్రభాస్


● 'అల్లరి' నరేశ్


● నిఖిల్


● సాయిధరమ్ తేజ్

నాలుగో సారి...

హీరో బాలకృష్ణ-డైరెక్టర్ బోయపాటి శ్రీనులది హిట్ కాంబినేషన్. 'సింహా, లెజెండ్, అఖండ' వంటి సూపర్ హిట్ సినిమాల తర్వాత బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అఖండ 2: తాండవం'. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ మూవీలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా ఆది పినిశెట్టి విలన్‌గా చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో జరుగుతోంది. ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాశ్ నిర్మించిన సెట్‌లో యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. బాలకృష్ణ, ఆదిలపై చిత్రీకరిస్తున్న ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలోని మెయిన్ హైలైట్లలో ఒకటిగా ఉండనుంది. ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ సీక్వెన్స్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 25న ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: సి. రాంప్రసాద్, సంతోష్ డి.

ముచ్చింతల్‌లో వీరమల్లు

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, బాబీ డియోల్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు వంటి వారు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్‌పై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ వద్ద ఉన్న ముచ్చింతల్‌లో జరుగుతోందని టాక్. పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర ప్రధాన తారాగణంపై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. ఈ సినిమా మార్చి 28న విడుదల కానుంది. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించిన ఈ చిత్రానికి కెమేరా: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్.

బిజీ రాజా

వరుస పాన్ ఇండియా సినిమాలతో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తున్న కథానాయకుడు ప్రభాస్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని అజీజ్ నగర్‌లో జరుగుతోంది. చిత్ర తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని టాక్. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ దాదాపు 90 శాతం పూర్తయింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఇలా ఒకవైపు షూటింగ్ మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో 'రాజా సాబ్' యూనిట్ బిజీగా ఉంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది.

ప్రత్యేకమైన సెట్‌లో...

ప్రభాస్ హీరోగా సెన్సిబుల్ డైరెక్టర్ హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడికల్ మూవీ 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఇందులో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ నటిస్తున్నారు. తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో జరుగుతోంది. ఈ సినిమా షూటింగ్‌లోనూ పాల్గొంటున్నారు ప్రభాస్. బ్రిటిష్ కాలం నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారని టాక్. ప్రస్తుతం ప్రభాస్, ఇతర లీడ్ యాక్టర్స్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మిస్తున్న ఈ సినిమాకి విశాల్ చంద్రశేఖర్ సంగీతదర్శకుడు.

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆషికా రంగనాథ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. యు.వి. క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. సోషియో ఫ్యాంటసీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ మూవీ చిత్రీకరణ హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ముచ్చింతల్‌లోని ఆలయంలో ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుందట. ఈ సాంగ్ షూట్‌లో చిరంజీవితో పాటు హీరోయిన్లు పాల్గొననున్నారని టాక్. ఈ మూవీకి ఎంఎం కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం జనవరి 10న విడుదల కావాల్సి ఉండగా వాయిదా వేశారు. అయితే కొత్త రిలీజ్ డేట్‌ని మాత్రం చిత్రయూనిట్ ప్రకటించలేదు.

అల్యూమినియం ఫ్యాక్టరీలో...

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్) సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రేజీ కాంబినేషన్ మూవీపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. దుర్గా ఆర్ట్స్‌పై కేఎల్ నారాయణ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. అమేజాన్ అడవుల నేపథ్యంలో అడ్వెంచరస్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ సినిమా కోసం అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రత్యేకంగా సెట్స్ వేశారట. ప్రస్తుతం మహేశ్‌బాబుపై కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారట రాజమౌళి. ఈ షెడ్యూల్ తర్వాత కెన్యాలో షూటింగ్ ఆరంభం కానుందని టాక్. కాగా ఈ చిత్రంలో గ్లోబల్ బ్యూటీ ప్రియాంకా చోప్రా హీరోయిన్‌గా నటిస్తారనే వార్తలు వినిపించాయి. అయితే ఆమె హీరోయిన్‌గా కాదు.. విలన్ పాత్ర చేయనున్నారని తాజా టాక్.

పవర్‌ఫుల్ అర్జున్ సర్కార్

'హిట్' సినిమా సిరీస్‌లో వస్తోన్న మూడో భాగం 'హిట్: ది థర్డ్ కేస్'. నాని హీరోగా నటిస్తున్న ఈ మూవీలో శ్రీనిధీ శెట్టి కథానాయిక. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి త్రిపిర్నేని నిర్మిస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ మూవీలో అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు నాని. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. కాశ్మీర్‌లో ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు టాకీ పార్ట్‌ని చిత్రీకరించిన తర్వాత తాజా షెడ్యూల్ అల్యూమినియం ఫ్యాక్టరీలో మొదలైంది. హీరో, హీరోయిన్, ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని టాక్. మే 1న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమేరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్.

రామ్‌చరణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్). 'ఉప్పెన' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తెరకెక్కించిన బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీలో రామ్‌చరణ్‌కి జోడీగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లోని భూత్ బంగ్లాలో ముగిసింది. రామ్‌చరణ్‌తో పాటు ముఖ్య తారాగణంపై రాత్రి వేళ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు బుచ్చిబాబు. ఈ మూవీ చివరి రోజు షూటింగ్‌కి తన కుమార్తె క్లీంకారని రామ్‌చరణ్ తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

తప్పించుకోలేరు

'అల్లరి' నరేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఏఆర్ 63' (వర్కింగ్ టైటిల్). 'ఫ్యామిలీ డ్రామా' మూవీ ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. రుహానీ శర్మ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. నరేశ్ బర్త్‌డే సందర్భంగా జూన్ 30న 'మీరు అతని కంటి నుంచి తప్పించుకోలేరు' అంటూ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వచ్చింది.

యుద్ధ వీరుడు

'కార్తికేయ 2' సినిమాతో పాన్ ఇండియా హిట్ అందుకున్నారు నిఖిల్ సిద్ధార్థ్. ఆయన హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సోషియో ఫ్యాంటసీ జానర్‌లో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో యుద్ధ వీరుడిగా కనిపించనున్నారు నిఖిల్. ఈ పాత్ర కోసం ప్రత్యేకించి మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీ నేర్చుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ సమీపంలోని జన్‌వాడలో జరుగుతోంది. హీరోతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రం ఈ వేసవిలో రిలీజ్ కానుంది.

ఏటిగట్టుపై సంబరాలు

'విరూపాక్ష, బ్రో' వంటి హిట్ సినిమాల తర్వాత సాయి దుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల ఏటిగట్టు). నూతన దర్శకుడు రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'హను మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో జరుగుతోంది. హీరోతో పాటు ఇతర నటీనటులు షూట్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 25న తెలుగు, తమిళ, హిందీ, మలయాళం, కన్నడంలో విడుదల కానుంది.

ఇవే కాదు.. మరికొన్ని సినిమాల షూటింగ్స్ కూడా హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్నాయి.

- దేరంగుల జగన్ మోహన్

'మంగళవారం'లో..?


● శ్రీలీల

తెలుగు చిత్ర పరిశ్రమలో మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్‌గా దూసుకెళుతున్నారు శ్రీలీల. ఇప్పటికే అరడజను సినిమాలతో బిజీ బిజీగా ఉన్న ఈ బ్యూటీ తొలిసారి ఓ లేడీ ఓరియంటెడ్ మూవీలో నటించనున్నారని టాక్. అది కూడా హిట్ మూవీ 'మంగళవారం' సీక్వెల్‌లో అట. అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మంగళవారం'. 2023 నవంబరు 17న విడుదలైన ఈ చిత్రం హిట్‌గా నిలిచింది. ప్రత్యేకించి పాయల్ రాజ్‌పుత్ నటనకి మంచి మార్కులే పడ్డాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'మంగళవారం 2' రూపొందనుంది. అయితే ద్వితీయ భాగంలో తాను లీడ్ రోల్‌లో నటించడం లేదంటూ పాయల్ రాజ్‌పుత్ ఇన్‌డైరెక్ట్‌గా చెప్పారట. సీక్వెల్‌లో పూర్తిగా కొత్త కథ ఉంటుందని, అందుకే పాయల్ రాజ్‌పుత్ కాకుండా మరో హీరోయిన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించే ఆలోచనలో అజయ్ భూపతి ఉన్నారని సమాచారం. సీక్వెల్ కథకి శ్రీలీల అయితే సరిగ్గా సరిపోతుందన్నది ఆయన ఆలోచన అని ఫిల్మ్‌నగర్ టాక్. అయితే 'మంగళవారం 2' గురించి శ్రీలీలతో ఆయన చర్చించారా? లేదా? ఈ మూవీకి ఆమె పచ్చజెండా ఊపుతారా? లేదా వంటి విషయాలపై అధికారిక ప్రకటన వచ్చేవరకు వేచి చూడక తప్పదు. శ్రీలీల ప్రస్తుతం తెలుగులో నితిన్ 'రాబిన్ హుడ్', రవితేజ 'మాస్ జాతర', పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్', తమిళంలో శివ కార్తికేయన్‌తో 'పరాశక్తి' మూవీ చేస్తున్నారు.

హారర్... థ్రిల్


● స్వాసిక

ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'శంబాల'. 'ఏ మిస్టిక్ వరల్డ్' అనేది ఉపశీర్షిక. తమిళ, మలయాళ భాషల్లో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి స్వాసిక ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో వసంత అనే పాత్రలో స్వాసిక కనిపించనున్నట్లు ప్రకటించి, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. "సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'శంబాల'. ఈ మూవీలో ఆది భౌగోళిక శాస్త్రవేత్తగా సవాల్‌తో కూడుకున్న పాత్రలో కనిపించనున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో వీఎఫ్ఎక్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో ప్రత్యేకంగా రూపొందించిన సెట్‌లో ప్రస్తుతం మా సినిమా చిత్రీకరణ జరుగుతోంది" అని చిత్ర బృందం పేర్కొంది. ఇదిలా ఉంటే.. నితిన్ హీరోగా రూపొందుతోన్న 'తమ్ముడు'తో పాటు హీరో సూర్య 45వ సినిమాలోనూ కీలక పాత్రలు పోషిస్తున్నారు స్వాసిక.

ప్రేమ కుట్టిందంటే...


● రాగిన్ రాజ్, టి. రాజేందర్, అమ్మ రాజశేఖర్

'రణం' ఫేమ్ డైరెక్టర్, డ్యాన్స్ మాస్టర్ 'అమ్మ' రాజశేఖర్ తనయుడు అమ్మ రాగిన్ రాజ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'తల'. అంకిత నాన్సర్ హీరోయిన్‌గా నటించారు. రోహిత్, ఎస్తేర్ నోరోన్హా, 'సత్యం' రాజేష్, రాజీవ్ కనకాల, ఇంద్రజ కీలక పాత్రలు పోషించారు. 'అమ్మ' రాజశేఖర్ దర్శకత్వంలో దీపా ఆర్ట్స్‌పై పి. శ్రీనివాస్ గౌడ్ నిర్మించారు. రాధా రాజశేఖర్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ధర్మ తేజ, అస్లాం కేఈ సంగీతం అందించిన 'తల' నుంచి 'ప్రేమ కుట్టిందంటే...' అనే లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. మ్యూజిక్ డైరెక్టర్ ధర్మతేజ సాహిత్యం అందించిన ఈ పాటని తెలుగులో 'బిగ్ బాస్' ఫేమ్, సింగర్ భోలే షావలీ పాడగా, తమిళ్‌లో టి. రాజేందర్ పాడారు. నటుడు ముక్కు అవినాష్‌పై ఈ పాటను చిత్రీకరించారు. ''రణం' చిత్రంలో అలీపై చిత్రీకరించిన 'నమ్మొద్దు నమ్మొద్దు ఆడవాళ్లను నమ్మొద్దు' పాట ఎంత పెద్ద హిట్ అయిందో.. 'ప్రేమ కుట్టిందంటే...' పాట అంతకు మించి విజయం సాధిస్తుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు.

నీ వల్లే...

సత్యరాజ్, వశిష్ఠ ఎన్. సింహా, సాంచి రాయ్, 'సత్యం' రాజేష్, ఉదయ భాను కీలక పాత్రలు పోషించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. మారుతీ టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో వానర సెల్యూలాయిడ్‌పై విజయపాల్ రెడ్డి అడిదల నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నీ వల్లే...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. ఈ పాటకు రఘురాం సాహిత్యం అందించగా, సిద్ శ్రీరామ్ పాడారు. ''భీముడి మనవడు, ఘటోత్కచుడి కుమారుడు బార్బరిక్ (బార్బరికుడు) పాత్ర ఆధారంగా 'త్రిబాణధారి బార్బరిక్' రూపొందింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, మోషన్ పోస్టర్, గ్లింప్స్, టీజర్ ఆడియన్స్‌లో ఆసక్తి పెంచాయి. 'నీ వల్లే..' పాటలో యువతకి కనెక్ట్ అయ్యే అంశాలన్నీ ఉన్నాయి. విడుదలైన కాసేపట్లోనే ఈ సాంగ్ నెట్టింట వైరల్‌గా మారింది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: కుశేందర్ రమేశ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: రాజేశ్, లైన్ ప్రొడ్యూసర్: సురేష్.


● సాంచి రాయ్, వశిష్ఠ ఎన్. సింహా

బిజినెస్ రీల్

వచ్చే వారం
లోక్‌సభలో కొత్త ఐటీ బిల్లు



న్యూఢిల్లీ: ఆరు దశాబ్దాల నాటి ఐటీ చట్టం స్థానంలో కొత్త ఆదాయపు పన్ను బిల్లును లోక్‌సభలో వచ్చే వారం ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం తెలిపారు. ఎగువసభలో ప్రవేశపెట్టిన తర్వాత బిల్లు పరిశీలన కోసం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపిస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో బడ్జెట్ అనంతర సంప్రదాయ సమావేశంలో ప్రసంగించిన తర్వాత సీతారామన్ మీడియాతో మాట్లాడారు. పార్లమెంటరీ కమిటీ సిఫారసులు చేసిన తర్వాత బిల్లు మళ్లీ కేబినెట్‌కు వెళ్తుంది. కేబినెట్ ఆమోదం తర్వాత మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెడతారని మంత్రి చెప్పారు. బిల్లు విషయంలో తనకు ఇంకా మూడు క్లిష్ట దశలు ఉన్నాయని అన్నారు. 'రెండు సంవత్సరాల క్రితం కూడా కస్టమ్స్ డ్యూటీకి సంబంధించి కొన్ని హేతుబద్ధీకరించాం. భారత్‌ను మరింత పెట్టుబడిదారులు, వాణిజ్య స్నేహపూర్వకంగా మార్చాలనుకుంటున్నాం. అదే సమయంలో ఆత్మనిర్భర్ భారత్‌తో సమతుల్యం చేయాలనుకుంటున్నాం. పరిశ్రమకు అవసరమైన విధంగా సుంకాల రక్షణను అందిస్తాం' అని ఆర్థిక మంత్రి తెలిపారు.

సైన్స్ అండ్ టెక్నాలజీకి నిధులు



ఆర్‌అండ్‌డీకి రూ. 20,000 కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ: పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)పై దేశీ కార్పొరేట్లు మరింత దృష్టి సారించాలని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ తాజాగా పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయించిన రూ. 20,000 కోట్లు నాణ్యమైన ప్రతిపాదనకు వినియోగించుకోవాలని సూచించారు. ప్రయివేట్ రంగ ఆధారిత ఆర్‌అండ్‌డీకి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ. 20,000 కోట్లు కేటాయించిన విషయాన్ని బడ్జెట్ తదుపరి సీఐఐ సభ్యులతో ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టి సందర్భంగా ప్రస్తావించారు. ఏడాది చివరికల్లా మొత్తం నిధులను వినియోగించుకునేలా అత్యుత్తమ ప్రతిపాదనలతో తరలిరావలసిందిగా ఆహ్వానించారు. పర్యావరణహిత ఇంధనాల వైపు ప్రయాణంలో ప్రయివేట్ రంగం చేయూత నివ్వాలని కోరారు. ఇదేవిధంగా అణు విద్యుత్ విషయంలో ప్రభుత్వం పరిశ్రమతో కలసి పని చేయనున్నట్లు తెలియజేశారు.

ఐపీఓకు అడ్వాన్స్‌డ్ సిస్ టెక్



ముంబై: ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో ఉన్న అడ్వాన్స్‌డ్ సిస్–టెక్ పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ముసాయిదా పత్రాలు సెబీకి సమర్పించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ.115 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ పద్ధతి ద్వారా 15.27 లక్షల ఈక్విటీ షేర్లను అమ్మకానికి పెట్టింది. ప్రధాన ప్రమోటర్లు ముకేశ్ ఆర్ కపాడియా, ఉమేద్ అమర్ చంద్ ఫిఫాద్రాలు ఓఎఫ్ఎస్ ద్వారా 7.64 లక్షల షేర్లను విక్రయానికి పెట్టారు. సమీకరించిన నిధులను మూల ధన వ్యయాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని కంపెనీ తెలిపింది. ఇష్యూకు ఇంగా వెంచర్స్, సోవిలో క్యాపిటల్ అడ్వైజర్స్ బుక్ రన్నింగ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

9-2-2025

విశాఖ	460–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440–00
వరంగల్	442–00
రిటైల్ ధర	5.00

జీసీసీలతో 4.5 లక్షల కొత్త కొలువులు



- హైరింగ్ ప్రణాళికల్లో 35% సంస్థలు
- 2030 నాటికి పరిశ్రమలో 33 లక్షల మంది నిపుణులు
- ఎన్ఎల్‌బీ సర్వీసెస్ నివేదిక

న్యూఢిల్లీ: దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో కొత్త కొలువులు రానున్నాయి. ఈ ఏడాది (2025లో) 4.25–4.5 లక్షలు, వచ్చే ఆరేళ్లలో పది లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. 35 శాతం కంపెనీలు తమ సిబ్బంది సంఖ్యను 50–100 శాతం పెంచుకునే యోచనలో ఉన్నాయి. గ్లోబల్ టెక్నాలజీ, డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ రూపొందించిన ఇండియా జీసీసీ గ్రోత్ ఔట్‌లుక్ 2024 నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 6 ప్రధాన నగరాల్లో 10 రంగాలవ్యాప్తంగా 207 జీసీసీల నుంచి సేకరించిన వివరాలతో ఈ నివేదిక రూపొందింది. దీని ప్రకారం, నిపుణుల లభ్యత, పరిశ్రమకు అనువైన పాలసీల దన్నుతో జీసీసీలకు భారత్ ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారింది. 2030 నాటికి పరిశ్రమలో మొత్తం 33 లక్షల మంది ప్రొఫెషనల్స్ ఉంటారు.

2,100కు జీసీసీలు ..

'గ్లోబల్ జీసీసీ హబ్‌గా భారత్ స్థానం మరింతగా పటిష్టమవుతోంది. 2030 నాటికి వీటి సంఖ్య 2,100కి చేరనుంది. మార్కెట్ పరిమాణం 100 బిలియన్ డాలర్లకు చేరవచ్చు. జీసీసీ 4.0కి సన్నాహాలు జరుగుతున్న తరుణంలో దేశీయంగా టెక్, ఫైనాన్స్, తయారీ, సస్టైనబిలిటీ వంటి విభాగాల్లో నియామకాలు మరింతగా పెరగనున్నాయి. ఆర్థిక సేవలకు సంబంధించి నైపుణ్యాలకు గణనీయంగా డిమాండ్ (79 శాతం) ఉంటుంది. వ్యాపార సంస్థలు డిజిటల్ బాట పడుతుండటంతో మార్కెటింగ్.. డిజిటల్ అడ్వర్టైజింగ్ (73 శాతం) తర్వాత స్థానంలో నిలుస్తుంది. అలాగే ఇంజినీరింగ్, తయారీ (69 శాతం), మానవ వనరుల నైపుణ్యాలకు (68 శాతం) డిమాండ్ ఉంటుంది' అని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ సీఈవో సచిన్ అలగ్ తెలిపారు.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- ఫ్రెషర్స్ నియామకాల విషయంలో బెంగళూరు, ముంబై, పుణె, చెన్నై నగరాల్లోని జీసీసీలు ముందు వరుసలో ఉంటాయి. 2030 నాటికి 42% జీసీసీలు తమ సిబ్బందిని 50% మేర పెంచుకోనున్నాయి.
- 2026 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలతో ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రాంతాల్లో జీసీసీల వృద్ధి. కీలక విభాగాల్లో నిపుణులకు డిమాండ్ కొనసాగనుంది.
- 61 శాతం జీసీసీలు మహిళా ఉద్యోగుల నియామకాలు 50 శాతం పైగా పెరుగుతాయని అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం ఇది సుమారు 7 శాతంగా ఉంది.

స్కోడా ఈవీ వస్తోంది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ స్కోడా ఇండియా తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈ ఏడాదే వస్తోంది. సెప్టెంబర్ కల్లా భారతీయ రోడ్లపై స్కోడా ఎన్యాక్ పరుగు తీయనుంది. తొలుత పూర్తిగా తయారైన కారును భారత్‌కు దిగుమతి చేస్తారు. 63, 82 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్స్‌తో రూపుదిద్దుకుంది. ఒకసారి చార్జింగ్‌తో బ్యాటరీని బట్టి 439–597 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. టాప్ స్పీడ్ గంటకు 180 కిలోమీటర్లు. గంటకు 100 కి.మీ. వేగాన్ని 6.7 సెకన్లలో అందుకుంటుంది. 30 ని. చార్జింగ్ 10 నుంచి 80 శాతానికి చేరుతుంది.

వెస్ట్రర్న్ క్యారియర్స్‌కు వేదాంత కాంట్రాక్టు

ముంబై: లాజిస్టిక్స్ కంపెనీ వెస్ట్రర్న్ క్యారియర్స్ (ఇండియా) రూ.1,089 కోట్ల విలువైన కాంట్రాక్టును మైనింగ్ దిగ్గజం వేదాంత నుంచి దక్కించుకుంది. ఇందులో భాగంగా వేదాంతకు చెందిన అల్యూమినియం ఉత్పత్తులు, పిగ్ ఐరన్‌తో పాటు ఝార్సుగూడా ప్లాంటు నుంచి ఎగుమతి, దిగుమతులను అంతర్జాతీయ పోర్టులు, దేశీయ హబ్‌లకు చేరవేయాల్సి ఉంటుంది. నాలుగేళ్ల కాలవ్యవధి కలిగిన ఈ కాంట్రాక్టు సరుకు రవాణా రంగంలో అతి పెద్దది. వెస్ట్రర్న్ క్యారియర్స్ 23 రాష్ట్రాల్లో 50కి పైగా శాఖలు, 16 గిడ్డంగులు, 55కి పైగా రైల్ హ్యాండ్లింగ్ పాయింట్లు కలిగి ఉంది. కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో రూ.1,297 కోట్ల ఆదాయం, రూ.68 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.



బీహెచ్‌ఈఎల్‌కు రూ.8,000 కోట్ల ఆర్డర్లు

ముంబై: మహారాష్ట్ర స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ (మహాజెన్‌కో) నుంచి రూ.8,000 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకున్నట్లు ప్రభుత్వ రంగ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) శనివారం తెలిపింది. ఆర్డర్ కింద కోరాడీ థర్మల్ పవర్ స్టేషన్ ప్యాకేజీలో భాగంగా రెండు 660 మెగావాట్ల బాయిలర్ టర్బైన్ జనరేటర్ల సరఫరా, నిర్మాణ పనులు చేపట్టడంతోపాటు ఉత్పత్తి కార్యకలాపాలు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. 52–58 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంటుందని బీహెచ్‌ఈఎల్ వివరణ ఇచ్చింది.



ఏఐ స్వీకరణలో పెద్ద కంపెనీలే ముందంజ

న్యూఢిల్లీ: లాభాలను మెరుగుపరచుకోవడానికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, సైబర్‌సెక్యూరిటీ సొల్యూషన్స్ వంటి నూతన తరం సాంకేతికతను వినియోగించడంలో పెద్ద కార్పొరేట్‌లు ముందుంటాయని సీపీఏ ఆస్ట్రేలియా నివేదిక వివరించింది. 'కొత్త సాంకేతికతలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతుంది. వీటి వినియోగం వల్ల కంపెనీలకు సైబర్ భద్రత, కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచడంలో, ఉద్యో గుల నైపుణ్యాలు, సంతృప్తిని పెంపొందించడంలో దోహదం చేస్తుంది. సవాళ్లను ఎదుర్కోవడంలో సాయపడుతుంది. ఉద్గారాల పర్యవేక్షణ, సరఫరా వ్యవస్థ పారదర్శకతను మెరుగుపరచడానికి, వాటాదారులతో సమర్థవంతంగా నిమగ్నమవ్వడానికి సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించడంపై కంపెనీలు దృష్టి పెట్టాలి. ఇది కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడమే కాకుండా అభివృద్ధి చెందుతున్న నియంత్రణ అవసరాలకు అనుగుణంగా ప్రమాణాలను పాటించేందుకు కూడా సహాయపడుతుంది.



క్యూ3 ఫలితాలు

పీవీఆర్ ఐనాక్స్ లాభాల షో

క్యూ3లో రూ. 36 కోట్లు

న్యూఢిల్లీ: మల్టీప్లెక్స్ దిగ్గజం పీవీఆర్ ఐనాక్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు 3 రెట్లు జంప్‌చేసి రూ. 36 కోట్లను అధిగమించింది. రికార్డ్‌స్థాయికి చేరిన సగటు టికెట్ ధరలకుతోడు ఆహారం, పానీయాల(ఎఫ్‌అండ్‌బీ) విక్రయాలు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 13 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 10 శాతం ఎగసి రూ. 1,759 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 8 శాతం పెరిగి రూ. 1,713 కోట్లకు చేరాయి. సగటు టికెట్ ధర రూ. 281ను తాకడంతో సరికొత్త రికార్డ్ నమోదైనట్లు కంపెనీ పేర్కొంది. ఈ బాటలో ఒక్కో వ్యక్తి సగటు ఎఫ్‌అండ్‌బీ వినియోగం రూ. 140కు చేరింది. ఇతర ఆదాయంలో ప్రకటనల ద్వారా రూ. 149 కోట్లు లభించింది.

ఫలితాల నేపథ్యంలో పీవీఆర్ ఐనాక్స్ షేరు బీఎస్ఈలో 3% పతనమై రూ. 1,089 వద్ద ముగిసింది.



ఆయిల్ ఇండియా మధ్యంతర డివిడెండ్

ముంబై: ప్రభుత్వ రంగ ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఐఓఎల్) డిసెంబర్ త్రైమాసికంలో రూ.1,221.80 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే క్యూ3 నికర లాభం రూ.1,584.28 కోట్లతో పోలిస్తే ఇది 23% తక్కువ. క్రూడాయిల్ ఉత్పత్తి ధరలు తగ్గడం, అమ్మకాల క్షీణత ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. మూడో త్రైమాసికంలో సంస్థ ఉత్పత్తి చేసిన ముడి చమురును బ్యారెల్‌కు సరాసరి 73.82 డాలర్లకు విక్రయించింది. 2023 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో ఇది 84.14 డాలర్లుగా ఉండటం గమనార్హం. చమురు ధరలు తగ్గిన నేపథ్యంలో టర్నోవర్ రూ.5,815.02 కోట్ల నుంచి రూ.5,239.66 కోట్లకు దిగివచ్చింది. ఎబిటా మార్జిన్ సైతం రూ.2,613.75 కోట్ల నుంచి రూ.2,321.34 కోట్లకు తగ్గింది. చమురు ఉత్పత్తి 0.868 మిలియన్ టన్నులు, గ్యాస్ ఉత్పత్తి 0.829 క్యూబిక్ మీటర్లకు చేరింది. ఒక్కో షేరుకు మధ్యంతర డివిడెండ్ కింద రూ.7 చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు సిఫార్సు చేసింది. దీంతో 2025 ఆర్థిక సంవత్సరంలో మొత్తం మధ్యంతర డివిడెండ్ రూ.10కు చేరింది.



అమర రాజా నికరలాభం రూ.422 కోట్లు

హైదరాబాద్: అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ డిసెంబర్ త్రైమాసికానికి రూ.422 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో నికరలాభం రూ.330.7 కోట్లతో పోలిస్తే ఇది 27% అధికం. టర్నోవర్ 10% పెరిగి రూ.3,164.02 కోట్లకు చేరింది. ఈపీఎస్ రూ.17.04గా ఉంది. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ ఆమోదించిన ఇంధన సర్దుబాటు ఛార్జీల (ఎఫ్‌పీపీసీఏ) రికవరీ ఈ త్రైమాసికపు నిర్వహణ మార్జిన్లను ప్రభావితం చేసిందని కంపెనీ తెలిపింది. యూరప్ మార్కెట్లో వ్యాపారాన్ని మరింత విస్తరిస్తున్నట్టు వివరించింది. ఏడు దేశాలకు వాహన బ్యాటరీలను పరిచయం చేశామని, ఇండస్ట్రియల్, ఆటోమోటివ్ రంగాల్లో సంస్థ ఉత్పత్తులకు బలమైన డిమాండ్ ఉందని తెలిపింది.



ఆల్కెమ్ ల్యాబ్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 626 కోట్లు

న్యూఢిల్లీ: ఫార్మా రంగ దిగ్గజం ఆల్కెమ్ ల్యాబొరేటరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం ఎగసి రూ. 626 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో రూ. 595 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం నామమాత్ర వృద్ధితో రూ. 3,324 కోట్ల నుంచి రూ. 3,374 కోట్లకు చేరింది. పూర్తిస్థాయిలో ఆండ్రాయిట్ బయోమెడ్ కొనుగోలుకి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ పేర్కొంది. ఇందుకు రూ. 140 కోట్లు వెచ్చించనుంది.

ఫలితాల నేపథ్యంలో ఆల్కెమ్ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 5,155 వద్ద ముగిసింది.



షీఇన్‌లో రిలయన్స్ ఉత్పత్తులు



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ వేదిక అయిన షీఇన్ ఇండియా ఫాస్ట్ ఫ్యాషన్ యాప్‌లో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ అనుబంధ కంపెనీ నెక్స్ట్‌జెన్ ఫాస్ట్ ఫ్యాషన్ తయారు చేసిన ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. భారత్‌కు చెందిన రెడీమేడ్స్ తయారీ కంపెనీల నుంచి ఈ ఉత్పత్తులను నెక్స్ట్‌జెన్ కొనుగోలు చేస్తోందని పరిశ్రమ ప్రతినిధి ఒకరు తెలిపారు. ప్రధానంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు వీటిలో ఉన్నాయని చెప్పారు. అయిదేళ్ల నిషేధం తర్వాత రిలయన్స్ రిటైల్ ద్వారా షీఇన్ భారత మార్కెట్లోకి తిరిగి ప్రవేశించింది. 'కొత్త షీఇన్ ఇండియా ఫాస్ట్ ఫ్యాషన్ యాప్ భారత్‌లో రూపుదిద్దుకుంది. దీని యాజమాన్యం, నియంత్రణ ఎల్లప్పుడూ రిలయన్స్ రిటైల్ చేతుల్లోనే ఉంటుంది. భారత కంపెనీలో షీఇన్‌కు వాటా లేదు. భారత్ నుంచి అప్లికేషన్‌ను నడిపిస్తున్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన షీఇన్ ఇండియా ఫాస్ట్ ఫ్యాషన్ యాప్‌తో షీఇన్ గతంలో నిర్వహించిన షీఇన్.ఇన్ వెబ్‌సైట్‌తో సంబంధం లేదు' అని ఆయన చెప్పారు.

అయిదేళ్ల నిషేధం తర్వాత..

రిలయన్స్ రిటైల్ నుండి షీఇన్ ఇండియా ఫాస్ట్ ఫ్యాషన్ యాప్ ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్‌లో 10,000కి పైగా డౌన్‌లోడ్స్ నమోదయ్యాయి. యాపిల్ స్టోర్‌లో ఫ్యాషన్ ఈ–కామర్స్ కంపెనీల్లో టాప్ 10లో స్థానం పొందింది. చైనాతో ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత జూన్ 2020లో ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నిషేధించిన యాప్‌లలో షీఇన్ ఒకటి. భారత్‌లో దాదాపు మూడు సంవత్సరాల నిషేధం తర్వాత బిలియనీర్ ముఖేష్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ రిటైల్‌తో షీఇన్‌ను ప్రమోట్ చేస్తున్న రోడ్‌గెట్ బిజినెస్ 2023లో భాగస్వామ్యం కుదుర్చుకుంది. స్వదేశీ ఈ–కామర్స్ రిటైల్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయడానికి రోడ్‌గెట్ బిజినెస్‌తో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ సాంకేతిక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖను సంప్రదించిన అనంతరం ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ ప్రతిపాదనపై ఎటువంటి అభ్యంతరం చెప్పలేదని పరిశ్రమ ప్రతినిధి వివరించారు.

జీడీపీలో బీర్ పరిశ్రమ వాటా 0.3 శాతం

న్యూఢిల్లీ: దేశ జీడీపీలో బీర్ పరిశ్రమ వాటా 2023లో 0.3 శాతానికి చేరుకుంది. రూ.92,324 కోట్లు సమకూరినట్టు బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ నిర్వహించిన అధ్యయనాన్ని ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా బీర్ పరిశ్రమ పరిమాణం 2023లో రూ.76.45 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఆక్స్‌ఫర్డ్ నివేదిక పేర్కొంది. దేశ జీడీపీకి బీర్ పరిశ్రమ నుంచి నేరుగా రూ.40,050 కోట్లు వస్తుండగా, అనుబంధ వ్యాల్యూ చైన్ (లాజిస్టిక్స్, రెస్టారెంట్‌లు, రిటైలర్లు) ద్వారా మరో రూ.52,239 కోట్లు సమకూరుతోంది. ఎక్సైజ్, సేల్స్ ట్యాక్స్, ఇతర పన్నుల రూపంలో రూ.51,376 కోట్ల ఆదాయం 2023లో ప్రభుత్వ ఖజానాలకు చేరినట్టు పేర్కొంది. మొత్తం పన్నుల ఆదాయంలో 1.8 శాతానికి సమానమని తెలిపింది. బీర్ పరిశ్రమ, వ్యాల్యూ చైన్ సంయుక్తంగా 13 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు.. ఇందులో బీర్ పరిశ్రమ ఒక్కటే 5.4 లక్షల మందికి ఉపాధినిస్తున్నట్టు వివరించింది. ''బీర్ అన్నది పూర్తిగా స్థానిక తయారీ ఉత్పత్తి. అధిక పరిమాణంతో కూడినది. స్థానిక ఆర్థిక వ్యవస్థపై ఇది ఎన్నో అంచల ప్రభావం చూపిస్తుంటుంది. స్థానిక రైతుల నుంచి బార్లీ కొనుగోలు చేస్తుంది. స్థానిక సరఫరాదారుల నుంచి ప్యాకేజింగ్ మెటీరియల్ సమకూర్చుకుంటుంది. హ్యాండ్లింగ్‌లో ఎక్కువ మంది పాలు పంచుకుంటారు. పెద్ద స్థాయి గోదాములు, ఉత్పత్తుల రవాణాకు పెద్ద ఎత్తున రవాణా సదుపాయాలను వినియోగించుకుంటుంది'' అని బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి వివరించారు.



7% వాహన రిటైల్ అమ్మకాలు పెరిగాయ్



డీలర్ల సమాఖ్య 'ఫాడా' గణాంకాలు వెల్లడి

ముంబై: వాహన రిటైల్ అమ్మకాలు జనవరిలో 7% పెరిగాయని డీలర్ల సమాఖ్య (ఫాడా) వెల్లడించింది. ఈ ఏడాది తొలి (జనవరి) నెలలో మొత్తం 22,91,621 వాహనాలు అమ్ముడయ్యాయి. దేశవ్యాప్తంగా అన్ని వాహన విభాగాల్లో డిమాండ్ ఊపందుకోవడం ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. కాగా గతేడాది(2024) జనవరిలో ఈ సంఖ్య 21,49,117 యూనిట్లకు పరిమితమయ్యాయి. కొత్త మోడళ్ల ఆవిష్కరణ, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్, మెరుగైన ఫైనాన్సింగ్ తదితర కారణాలు కలిసొచ్చాయని డీలర్లు చెప్పుకొచ్చారు. ఈ ఫిబ్రవరిలో అమ్మకాల్లో వృద్ధి కొనసాగుతుందని 46%, నెమ్మదిస్తుందని 43%, మిగిలిన ఒకశాతం అమ్మకాల్లో క్షీణత ఉండొచ్చని డీలర్లు అంచనా వేస్తున్నారు.

''స్థిరమైన మార్కెట్ రికవరీ కారణంగా టూ వీలర్లు, త్రి చక్ర, ప్యాసింజర్, వాణిజ్య వాహనాలతో పాటు ట్రాక్టర్ల విక్రయాలు పెరిగాయి. మరోవైపు వడ్డీ రేట్ల పెంపు, గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్య సవాళ్లు, మార్కెట్‌లో అనిశ్చితి పరిస్థితులు ఇంకా పరిశ్రమను వెంటాడుతున్నాయి'' అని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు.

విభాగాల వారీగా జనవరిలో వాహన విక్రయాల సంఖ్య

వాహనవిభాగం	2025	2024	వృద్ధి/క్షీణత
టూ వీలర్స్	15,25,862	14,65,039	4%
ప్యాసింజర్	4,65,920	4,03,300	16%
త్రి చక్ర	1,07,033	1,00,160	7%
ట్రాక్టర్లు	93,381	88,741	5%
వాణిజ్య	99,425	91,877	8%
మొత్తం	22,91,621	21,49,117	7%

జూనియర్లకు ప్రోత్సాహకాల్లేవ్!

● సీనియర్ స్థాయిలోనే అవార్డులు, రివార్డులు
● ఇ-స్పోర్ట్స్, బ్రేక్ డాన్స్ విజేతలు ఇకపై అర్హులు

న్యూఢిల్లీ: జూనియర్ క్రీడాకారులకు నిరాశ కలిగించే వార్త ఇది! ఆసక్తి ఉన్న ఆటలో ప్రతిభ కనబరిచేందుకు, అంతర్జాతీయంగా ఎదిగేందుకు తహతహలాడే జూనియర్ ఆటగాళ్లకు ఇకపై భారత ప్రభుత్వం నుంచి అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు ఉండవు. కేంద్ర క్రీడాశాఖ సవరించిన క్రీడా పాలసీ జాబితాలో జూనియర్ ఆటగాళ్లకు మొండి చేయి చూపింది. ఇదే ఓ చిత్రమనుకుంటే... ఇంకో అడుగు ముందుకేసి ఇ-స్పోర్ట్స్ (ఎలక్ట్రానిక్ గేమింగ్) విజేతలను ఇప్పుడు భారత క్రీడా పురస్కారాలకు అర్హులను చేసింది. దీంతో పాటు కొత్తగా మల్లఖంబ్, బ్రేక్-డాన్సింగ్, ఖో ఖో క్రీడలను అవార్డులు, రివార్డుల జాబితాలో చేర్చింది. ఇటీవలే మొట్టమొదటి ప్రపంచకప్ జరిగిన గ్రామీణ క్రీడ ఖోఖోకు అందలం దక్కడం అభినందనీయమే అయినా... కేవలం సీనియర్ స్థాయిలోనే ఇక మీదట పారితోషికాలు, పురస్కారాలు అందజేస్తామనడమే రైజింగ్ స్టార్లను నష్టపరిచేదే. దీనికి సంబంధించిన 51 క్రీడలతో కేంద్ర క్రీడా శాఖ జాబితాను విడుదల చేసింది. ఇకపై ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, ప్రపంచ యూనివర్సిటీ క్రీడలు, పారా ఈవెంట్లలో భాగమైన ఆటలు, ఆటగాళ్లకే అవార్డులు దక్కుతాయి. ఒలింపిక్ క్రీడల్లో స్వర్ణం సాధించిన ఆటగాడికి అత్యధికంగా ప్రభుత్వం నుంచి రూ. 75 లక్షలు అందుతాయి. కానీ ఒలింపిక్ క్రీడాంశాలైనా సరే...జూనియర్ స్థాయి ఈవెంట్లను, జూనియర్లను ఇకపై అవార్డుల కోసం పరిగణలోకి తీసుకోరు. గతంలో జూనియర్ విజేతలకు రూ. 13 లక్షలు, సబ్-జూనియర్లకు రూ. 6.66 లక్షలు నజరానా ఇచ్చేది. కానీ ఇప్పుడు వీటిని పూర్తిగా రద్దు చేయడం జూనియర్ అథ్లెట్లకు శాపంగా మారనుంది. జూనియర్ స్థాయిలోనే ఏన్నో అష్టకష్టాలు పడితేగానీ సీనియర్ స్థాయికి చేరుకోలేం. అలాంటి స్థాయిని ఇప్పుడు క్రీడాశాఖ ప్రోత్సాహకాల నుంచి తొలగించడం క్రీడా వర్గాలను విస్మయపరుస్తోంది. పారా అథ్లెట్ల నగదు ప్రోత్సాహకాలను రెట్టింపు చేసింది. స్వర్ణం తెచ్చిన పారా అథ్లెట్లకు ఇన్నాళ్లు రూ. 10 లక్షలు ఇస్తుండగా... ఇక మీదట రూ. 20 లక్షలు ఇవ్వనున్నారు.


కరుణ్ నాయర్


తనుశ్ షమ్స్

మెరిసిన షమ్స్, తనుశ్

ముంబై తొలి ఇన్నింగ్స్ 278/8

● తమిళనాడుపై విదర్భ బ్యాటర్ కరుణ్ నాయర్ సెంచరీ
● హరియాణాతో రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్

కోల్‌కతా: దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు చక్కటి పోరాట పటిమ కనబర్చింది. ఒక దశలో 113 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును ఆల్‌రౌండర్లు షమ్స్ ములానీ (178 బంతుల్లో 91; 10 ఫోర్లు), తనుశ్ కొటియాన్ (154 బంతుల్లో 85 బ్యాటింగ్) ఆదుకున్నారు. శనివారం హరియాణాతో ప్రారంభమైన క్వార్టర్ ఫైనల్ పోరులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై జట్టు... తొలి రోజు ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 278 పరుగులు చేసింది. భారత ఆటగాళ్లు సూర్యకుమార్ యాదవ్ (9), శివమ్ దూబే (28) భారీ ఇన్నింగ్స్‌లు ఆడటంలో విఫలమయ్యారు. ఆయుశ్ మాత్రే (0), ఆకాశ్ ఆనంద్ (10), సిద్దేశ్ లాడ్ (4) ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ (15) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. కెప్టెన్ అజింక్య రహానే (31) మంచి ఆరంభాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయారు. అయితే చివర్లో షమ్స్ ములానీ, తనుశ్ కొటియాన్ జంట ఎనిమిదో వికెట్‌కు 165 పరుగులు జోడించి ముంబై జట్టును తిరిగి పోటీలోకి తెచ్చింది. హరియాణా బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న వీరిద్దరూ ఇన్నింగ్స్‌కు స్థిరత్వం తీసుకొచ్చారు. మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా... షమ్స్ ములానీ అవుట్ కాగా... తనుశ్‌తోపాటు మోహిత్ అవస్థి (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. హరియాణా బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 3, సుమిత్ కుమార్ 2 వికెట్లు పడగొట్టారు.

కరుణ్ నాయర్ మరో సెంచరీ

నాగ్‌పూర్: సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (180 బంతుల్లో 100 బ్యాటింగ్; 14 ఫోర్లు, 1 సిక్స్) మరో సెంచరీతో ఆకట్టుకున్నాడు. తాజా సీజన్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్న కరుణ్ నాయర్ అజేయ శతకంతో విజృంభించడంతో తమిళనాడుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో విదర్భ జట్టు మెరుగైన స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన విదర్భ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 89 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. అథర్వ తైడె (0), ధ్రువ్ షోరె (26), ఆదిత్య ఠాక్రే (5) విఫలమవడంతో ఒక దశలో 44 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన విదర్భ జట్టును దానిశ్ మాలేవార్ (75; 13 ఫోర్లు)తో కలిసి కరుణ్ నాయర్ ఆదుకున్నాడు. ఇటీవల దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో వరుసగా నాలుగు శతకాలు బాది రికార్డు సృష్టించిన 33 ఏళ్ల కరుణ్ నాయర్... ఈ సెంచరీ ద్వారా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 22వ శతకం తన పేరిట లిఖించుకున్నాడు. యశ్ రాథోడ్ (13), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (24) ఎక్కువసేపు నిలవలేకపోయారు. ఆట ముగిసే సమయానికి కరుణ్ నాయర్‌తో పాటు హర్ష్ దూబే (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. తమిళనాడు బౌలర్లలో విజయ్ శంకర్ రెండు వికెట్లు పడగొట్టాడు.

సౌరాష్ట్ర 216 ఆలౌట్

రాజ్‌కోట్: భారత సీనియర్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా (26) విఫలమవడంతో గుజరాత్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో సౌరాష్ట్ర ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 72.1 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. చిరాగ్ జానీ (148 బంతుల్లో 69; 11 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో రాణించగా, అర్పిత్ (39 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. పుజారా, హార్విక్ దేశాయ్ (22), షెల్డన్ జాక్సన్ (14), ప్రేరక్ మన్కడ్ (0), సమర్ గజ్జర్ (4) కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (14), ధర్మేంద్ర జడేజా (22) విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో కెప్టెన్ చింతన్ గాజా 4 వికెట్లు పడగొట్టగా... జైమీత్ పటేల్, సిద్ధార్థ్ దేశాయ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన గుజరాత్... ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసింది. చేతిలో 10 వికెట్లు ఉన్న గుజరాత్ జట్టు ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 195 పరుగులు వెనుకబడి ఉంది.

జమ్మూ కశ్మీర్ 228/8

పుణే: కేరళతో జరుగుతున్న మరో క్వార్టర్స్‌లో జమ్మూ కశ్మీర్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన జమ్మూ కశ్మీర్ బ్యాటర్లు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. గ్రూప్ దశలో చక్కటి ప్రదర్శన కనబర్చిన జమ్మూ కశ్మీర్ టాపార్డర్... నాకౌట్‌లో దాన్ని కొనసాగించడంలో విఫలమైంది. నసీర్ (44), సాహిల్ (35), కన్హయ్య (48) కాస్త పోరాడారు. కేరళ బౌలర్లలో నిధీశ్ 5 వికెట్లతో ఆకట్టుకున్నాడు.

ఫిలిప్స్ మెరుపు సెంచరీ

పాకిస్తాన్‌పై కివీస్ ఘన విజయం


ఫిలిప్స్

లాహోర్: స్వదేశంలో చాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి ముందు ఆడుతున్న ముక్కోణపు వన్డే టోర్నీని పాకిస్తాన్ పరాజయంతో ప్రారంభించింది. మూడు దేశాలు పాల్గొంటున్న ఈ టోర్నీ తొలి పోరులో శనివారం పాకిస్తాన్ 78 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓటమి పాలైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (74 బంతుల్లో 106 నాటౌట్; 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు శతకంతో విజృంభించగా... సీనియర్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (89 బంతుల్లో 58; 7 ఫోర్లు), డారిల్ మిషెల్ (84 బంతుల్లో 81; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకాలతో రాణించారు. విల్ యంగ్ (4), వికెట్ కీపర్ టామ్ లాథమ్ (0) విఫలం కాగా... రచిన్ రవీంద్ర (25), బ్రాస్‌వెల్ (31) ఫర్వాలేదనిపించారు. పాకిస్తాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది 3 వికెట్లు పడగొట్టగా... అబ్రార్ అహ్మద్ 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ 47.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫఖర్ జమాన్ (69 బంతుల్లో 84; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధశతకంతో మెరవగా... సల్మాన్ ఆఘా (40), తయ్యబ్ తాహిర్ (30) తలా కొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (3), మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (10), కమ్రాన్ గులామ్ (18) విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో కెప్టెన్ సాంట్నర్, మ్యాట్ హెన్రీ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఫిలిప్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. టోర్నీలో భాగంగా సోమవారం జరగనున్న తదుపరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో న్యూజిలాండ్ తలపడనుంది.

జింబాబ్వే లక్ష్యం 292

ఐర్లాండ్‌తో ఏకైక టెస్టు


బాల్బిర్నీ

బులవాయో: జింబాబ్వేతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఐర్లాండ్.. ఆతిథ్య జట్టు ముందు క్లిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. శనివారం మూడో రోజు 83/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఐర్లాండ్ 93.3 ఓవర్లలో 298 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ ఆండీ బాల్బిర్నీ (60; 2 ఫోర్లు), లార్కన్ టక్కర్ (58; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. జింబాబ్వే బౌలర్లలో ఎన్‌గరవ 4, ట్రెవర్ వాండు, వెస్లీ చెరో 2 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో 7 పరుగుల స్వల్ప ఆధిక్యం కలిపి 292 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే... మూడో రోజు ఆట నిలిచే సమయానికి 15 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 38 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు కైటానో (14; 3 ఫోర్లు), బెన్ కరన్ (4), నిక్ వెల్చ్ (5) వికెట్లను పారేసుకోగా... ఆట నిలిచే సమయానికి బ్రియాన్ బెన్నెట్ (15 బ్యాటింగ్, 1 ఫోర్), ట్రెవర్ వాండు (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడేర్, బారీ మెకార్తీ, మాథ్యూ హంఫ్రేస్ తలా ఒక వికెట్ తీశారు. ఇంకా రెండు రోజుల ఆట మిగిలున్నప్పటికీ జింబాబ్వే విజయానికి 254 పరుగుల దూరంలో ఉంది. చేతిలో 7 వికెట్లున్నాయి.

ముకుంద్, రామ్‌లకు వైల్డ్ కార్డ్


ముకుంద్


రామ్‌కుమార్

న్యూఢిల్లీ: భారత డేవిస్ కప్ ఆటగాళ్లు శశికుమార్ ముకుంద్, రామ్‌కుమార్ రామనాథన్‌లతో పాటు యువ ఆటగాడు కరణ్ సింగ్‌లకు ఢిల్లీ ఓపెన్ నిర్వాహకులు వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఇచ్చారు. ఢిల్లీ లాన్ టెన్నిస్ సంఘం (డీఎల్‌టీఏ) కాంప్లెక్స్‌లో రేపటి నుంచి 16వ తేదీ వరకు జరిగే ఈ ఏటీపీ చాలెంజర్ ఈవెంట్‌లో పలువురు భారత ఆటగాళ్లకు వైల్డ్‌కార్డ్‌తో సొంతగడ్డపై ఆడే అవకాశం కల్పించారు. డేవిస్ కప్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న యువ టెన్నిస్ ఆటగాళ్లు చిరాగ్ దుహన్, ఆర్యన్ షా, ఆదిత్య గొవిలా, సిద్ధార్థ్ రావత్‌లకు క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో తలపడేందుకు వైల్డ్‌కార్డ్ ఎంట్రీలిచ్చారు. దక్షిణాఫ్రికాకు చెందిన మాజీ ప్రపంచ 31వ ర్యాంకర్ లాయిడ్ హ్యారిస్‌కు నాలుగో సీడ్, 2019 జూనియర్ వింబుల్డన్ చాంపియన్ షింటారో మొచిజుకి (జపాన్)కి ఆరో సీడ్ కేటాయించారు. చెక్ రిపబ్లిక్ స్టార్ విట్ కొప్రివాకు టాప్ సీడింగ్ దక్కింది. బిల్లీ హ్యారిస్ (ఇంగ్లండ్) రెండో సీడ్‌గా, ట్రిస్టన్ స్కూలికేట్ (ఆస్ట్రేలియా) మూడో సీడ్‌గా బరిలోకి దిగుతున్నారు. ఇటీవల క్వీన్స్‌లాండ్‌లో జరిగిన ఏటీపీ చాలెంజర్ టైటిల్‌ను గెలిచిన ట్రిస్టన్ ఈ సీజన్‌లో మూడో టైటిల్‌పై కన్నేశాడు. 'ఢిల్లీ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నమెంట్ అనుభవజ్ఞులతో పాటు వర్ధమాన ఆటగాళ్లకు చక్కని వేదిక. పలువురు అంతర్జాతీయ ప్లేయర్లతో పోటీపడేందుకు ఈ టోర్నీ బాగా ఉపకరిస్తుంది' అని డీఎల్‌టీఏ అధ్యక్షుడు, డేవిస్ కప్ నాన్-ప్లేయింగ్ కెప్టెన్ కూడా అయిన రోహిత్ రాజ్‌పాల్ తెలిపారు. గతేడాది ఇక్కడ టైటిల్ నెగ్గిన ఫ్రాన్స్ ప్లేయర్ జెఫ్రే బ్లాంకనియాక్స్ ఈ సారి టోర్నీకి దూరమయ్యాడు.


గుకేశ్ కార్ల్‌సన్

ఫ్రీ స్టయిల్ చెస్ నాకౌట్‌కు గుకేశ్

హంబర్గ్ (జర్మనీ): భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్‌లో నాకౌట్‌కు అర్హత సాధించాడు. శనివారం క్వాలిఫయర్స్ చివరి మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్ మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో ఓటమి పాలైనప్పటికీ గుకేశ్ ముందంజ వేశాడు. ఈ టోర్నీ మొత్తంలో 9 మ్యాచ్‌లు ఆడిన గుకేశ్ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయాడు. ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించని భారత గ్రాండ్‌మాస్టర్... ఏడు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని... మరో రెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలయ్యాడు. ఫలితంగా గుకేశ్ ఖాతాలో 3.5 పాయింట్లు చేరాయి. పది మంది ప్లేయర్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో ఎనిమిదో స్థానంలో నిలవడం ద్వారా గుకేశ్ నాకౌట్‌లో అడుగుపెట్టాడు. క్వాలిఫయింగ్ దశ ముగిసే సరికి ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ అలిరెజా ఫిరౌజా, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జవోకిర్ సిందరోవ్ చెరో 6.5 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో నిలిచారు. అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువ (6 పాయింట్లు) మూడో స్థానం దక్కించుకోగా... మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), హికారు నకమురా (అమెరికా) చెరో 5.5 పాయింట్లతో వరుసగా నాలుగో, ఐదో స్థానాల్లో నిలిచారు. జర్మనీకి చెందిన విన్సెంట్ కైమెర్ 4 పాయింట్లతో ఆరో 'ప్లేస్' దక్కించుకున్నాడు. ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నొదిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్, గుకేశ్ చెరో 3.5 పాయింట్లతో వరుసగా ఏడు, ఎనిమిదో స్థానాల్లో నిలిచారు.

మొహమ్మదాన్‌పై హైదరాబాద్ ఘన విజయం

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) తాజా సీజన్ ఆరంభంలో వరుస పరాజయాలతో సతమతమైన హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తిరిగి పుంజుకుంది. చివరి మూడు మ్యాచ్‌ల్లో రెండో విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో హైదరాబాద్ జట్టు 3-1 గోల్స్ తేడాతో మొహమ్మదాన్ స్పోర్ట్స్ క్లబ్‌పై విజయం సాధించింది. హైదరాబాద్ జట్టు తరఫున అలన్ డిసౌజా (24వ నిమిషంలో), రాములున్‌చుంగా (45+1వ నిమిషంలో), జోసెఫ్ సన్నీ (90+6వ నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు. మొహమ్మదాన్ జట్టు తరఫున మకాన్ చోథె (78వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. ఈ సీజన్‌లో హైదరాబాద్‌కు ఇది నాలుగో విజయం. ఇప్పటి వరకు 19 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ జట్టు 4 విజయాలు, 11 పరాజయాలు, 4 'డ్రా'లతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో 12వ స్థానంలో ఉంది. తమ తదుపరి మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు... ఈ నెల 14న ఒడిశా ఫుట్‌బాల్ క్లబ్‌తో తలపడనుంది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో చెన్నైయిన్ 3-0తో ఈస్ట్ బెంగాల్‌పై విజయం సాధించింది. చెన్నైయిన్ జట్టు తరఫున నిశు కుమార్ (13వ నిమిషంలో), విల్మార్ జోర్డాన్ (21వ నిమిషంలో), డానియల్ చిమా చుక్వు (90+9 నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు.



విజయం దిశగా ఆస్ట్రేలియా...



● రాణించిన కునేమన్, లయన్
● శ్రీలంక రెండో ఇన్నింగ్స్ 211/8
● ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 414

గాలె: స్పిన్నర్లు విజృంభించడంతో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా విజయం దిశగా సాగుతోంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు గెలిచి ఆధిక్యంలో ఉన్న ఆసీస్... రెండో మ్యాచ్‌పై కూడా పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 330/3తో శనివారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా... చివరకు 106.4 ఓవర్లలో 414 పరుగులకు ఆలౌటైంది. అలెక్స్ కేరీ (188 బంతుల్లో 156; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టీవ్ స్మిత్ (254 బంతుల్లో 131; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలు చేయగా... ఆ తర్వాత వచ్చిన వాళ్లు ఆకట్టుకోలేకపోయారు. జోష్ ఇంగ్లిస్ (0), కూపర్ (4) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 5 వికెట్లు పడగొట్టగా... నిశాన్ పైరిస్ 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఫలితంగా ఆస్ట్రేలియాకు 157 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక... శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 62.1 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. సీనియర్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ (149 బంతుల్లో 76; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 48 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఈ మ్యాచ్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్న సీనియర్ బ్యాటర్ దిముత్ కరుణరత్నే (14) ఎక్కువసేపు నిలువలేకపోగా... పతుమ్ నిశాంక (8), దినేశ్ చండిమాల్ (12), కమిందు మెండిస్ (14), కెప్టెన్ ధనంజయ డిసిల్వ (23) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మాథ్యూ కునేమన్ 4, నాథన్ లయన్ మూడు వికెట్లు పడగొట్టారు. చేతిలో 2 వికెట్లు ఉన్న శ్రీలంక... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు కేవలం 54 పరుగుల ఆధిక్యంలో ఉంది. మెండిస్‌తో పాటు ప్రభాత్ జయసూర్య (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

జిల్లాకు రూ. 1 కోటి చొప్పన...

అభివృద్ధి నిధులు ఇవ్వనున్న హెచ్‌సీఏ ● అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ప్రతిభ గల యువ క్రికెటర్లను ప్రోత్సహించేందుకు త్వరలోనే తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్)ను నిర్వహిస్తామని... హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు వెల్లడించారు. శనివారం ఉప్పల్ స్టేడియంలో జగన్‌మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీఏ అధ్యక్షుడు మాట్లాడుతూ... 'క్రికెట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఐపీఎల్ అనంతరం యువ క్రికెటర్ల కోసం టీపీఎల్ నిర్వహిస్తాం. ఉమ్మడి 10 జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి కోటి రూపాయల చొప్పున ఖర్చు చేయనున్నాం. ప్రతి జిల్లాలో ఒక చోట 10 ఎకరాల స్థలం కొనుగోలు చేసి కొత్త మైదానాలను నిర్మిస్తాం. దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్న తెలంగాణ ప్లేయర్లను సత్కరించేందుకు వచ్చే నెలలో హెచ్‌సీఏ అవార్డులు అందిస్తాం. బీసీసీఐ నిబంధనలకు అనుగుణంగా ఉప్పల్ స్టేడియాన్ని ఆధునీకరిస్తాం. మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థను అభివృద్ధి పరుస్తాం' అని వెల్లడించారు. ఈ సమావేశంలో హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, కార్యదర్శి దేవ్‌రాజ్, కోశాధికారి శ్రీనివాస్, బసవరాజు, సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా మేనేజర్‌గా ఎంపికైన దేవ్‌రాజ్‌ను అపెక్స్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు.

మీమ్స్ వరద...

బీజేపీ విజయంతో ఆప్, కాంగ్రెస్‌లపై వెల్లువెత్తిన మీమ్స్

న్యూఢిల్లీ: కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ గత రెండు పర్యాయాలు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన సందర్భాల్లో బీజేపీని విమర్శిస్తూ మీమ్స్ వెల్లువెత్తగా ఈసారి మీమ్స్ సృష్టికర్తల దృష్టంతా ఆప్ మీదనే పడింది. దీనికి తగ్గట్లు ఆప్‌ను, కేజ్రీవాల్ నేతగణాన్ని విమర్శల జడివానలో ముంచేస్తూ కుప్పలు తెప్పలుగా మీమ్స్.. సామాజిక మాధ్యమ సంద్రంలోకి కొట్టుకొచ్చాయి. ముఖ్యంగా 2023లో ఆప్ చీఫ్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యల వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దానికి కాస్తంత హాస్యం జోడించి వాట్సాప్, ఇన్‌స్టా గ్రామ్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్‌లో జనం షేర్ చేసి ఆనందాన్ని పంచుకుంటున్నారు. ''ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేసేందుకు బీజేపీ పలు రకాల కుట్రలు పన్నుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ రాష్ట్రంలో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని తెగ కలలు కంటున్నారు. ఎన్ని కుట్రలు పన్నినా ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో ఆప్‌ను ఓడించలేరని బీజేపీ నేతలకు సైతం తెలుసు. ప్రధాని మోదీకి నేను ఒక విషయం చెప్పదల్చుకున్నా. ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల్లో ఆయన మా పార్టీని ఈ జన్మలో ఓడించలేరు. దానికోసం ప్రధాని మోదీ మరో జన్మ ఎత్తాల్సి ఉంటుంది''అని కేజ్రీవాల్ అన్నారు. 2017లోనూ కేజ్రీవాల్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ''ఢిల్లీ రాష్ట్రానికి రాజకీయ పెద్దలం అంటే మేమే. మీమిచ్చే ఆదేశాలనే ఇక్కడి ప్రజలు పాటిస్తారు. ఢిల్లీని మేమే పరిపాలిస్తాం''అని కేజ్రీవాల్ ఆనాడు అన్నారు. ఇంత బీరాలు పోయిన కేజ్రీవాల్‌నే బీజేపీ మట్టికరిపించిందంటూ కొత్త మీమ్స్ పుట్టుకొచ్చాయి.



ఓ నెటిజన్ షేర్ చేసిన మీమ్

ఆప్ అటు, కాంగ్రెస్ ఇటు

పరుగు పోటీలో అభ్యర్థులకు బీజేపీ, ఆప్, కాంగ్రెస్ ఎన్నికల గుర్తులు తగిలించి కొందరు నెటిజన్లు కొత్త మీమ్ సృష్టించారు. అందులో బీజేపీ, ఆప్ ముందుకు దూసుకుపోయేందుకు సిద్ధమైతే కాంగ్రెస్ వెనక్కు దూసుకుపోయేందుకు రెడీ అవుతున్నట్లు సరదా ఫొటోను సిద్ధంచేసి సామాజిక మాధ్యమాల్లోకి వదిలారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలు సున్నాగా నమోదవడం తెల్సిందే. దీనిని గుర్తుతెచ్చేలా పెట్రోల్ బంక్ వద్ద వాహనదారునికి సిబ్బంది ''పెట్రోల్ కొడుతున్నా. ముందు మీటర్ రీడింగ్ సున్నా వద్దే ఉంది. చెక్‌చేసుకోండి సర్''అన్నట్లు ఒక ఫొటోను రూపొందించారు. అయితే ఆ పెట్రోల్‌లో రాహుల్‌గాంధీ పనిచేస్తున్నట్లు సరదా మీమ్‌ను సృష్టించారు. ఆప్ వైఫల్యాలకు తగు కారణాలను పేర్కొంటూ ఇంకెన్నో మీమ్స్ వచ్చాయి. ఆప్ మాజీ నాయకురాలు, రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌ను కేజ్రీవాల్ సహాయకుడు చితకబాదగా ఓటర్లు ఆప్‌ను చావుదెబ్బ తీశారని మరో మీమ్ వచ్చింది.

ఐక్యత సున్నా

విపక్షాల 'ఇండియా'కూటమి అంటూ ఘనంగా ప్రకటించిన కాంగ్రెస్, ఆప్ తదితర పార్టీలు తీరా ఢిల్లీ ఎన్నికల్లో బాహాబాహీగా విమర్శలు చేసుకోవడంపైనా మీమ్స్ వచ్చాయి. రెజ్లింగ్ రింగ్‌లోకి కేజ్రీవాల్ యమా హుషారుగా దూసుకొచ్చి తొడ కొడుతుంటే ఒక్క దెబ్బతో మోదీ ఆయనను మట్టికరిపించి బరి అవలికి విసిరేసినట్లు చూపే మరో మీమ్ వీడియో ఇప్పుడు తెగ వైరల్‌గా మారింది. బీజేపీ గెలుపు సంబరాలు చేసుకుంటుంటే అక్కడే ఉన్న తనను ఎవరూ మెచ్చుకోవట్లేదని స్వాతి మలివాల్ బాధపడుతుంటే దూరంగా నిల్చుని చూస్తున్న మోదీ వెంటనే అభినందనలు తెలుపుతున్నట్లు ఒక మీమ్ వీడియోను సృష్టించారు. ఎన్నికల క్రీడలో బీజేపీ, ఆప్‌సహా అన్ని పార్టీలు గెలుపు కోసం ఆడుతుంటుంటే కాంగ్రెస్ మాత్రం తనకేం అక్కర్లేదన్నట్లు ఒక బెంచీపై కూర్చుని సరదాగా చూస్తున్నట్లు మరో మీమ్‌ను సృష్టించారు.

మాకే ఎక్కువ ఆనందం

ఈసారి గెలిచినందుకు మాకు ఆనందంగా ఉందని మోదీ, అమిత్‌షా ఇద్దరూ నవ్వుకుంటుంటే.. మీకంటే ఎక్కువ ఆనందం మాకే ఉందని అన్నా హజారే, స్వాతి మలివాల్, మరో మాజీ ఆప్ నేత కుమార్ విశ్వాస్ శర్మ చెబుతున్నట్లు ఉన్న మరో మీమ్ సైతం బాగా షేర్ అవుతోంది. ఇప్పటికే వేర్వేరు ఎన్నికల్లో ఓడిన ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్, శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోట్, ఆప్ నేత సంజయ్ సింగ్‌లు బాధతో బనియన్, టవల్ మీద ఉన్న కేజ్రీవాల్‌కు పర్లేదులే అంటూ ఆనందంగా తీసుకొస్తున్న మీమ్ తెగ నవ్వించేలా ఉంది. అనార్కలీలాగా ఆప్ నాయకురాలు అతిశీ సింగ్ నేలపై పడిపోతే సలీమ్‌లాగా కేజ్రీవాల్ వచ్చి లేపుతూ.. ''లే అనార్కలీ. ఇప్పుడు మనం మన ఓటమికి ఈవీఎంలో అక్రమాలే కారణం అని కొత్త పల్లవి అందుకోవాలి''అని ఆమెను తట్టిలేపుతున్నట్లు మరో మీమ్ ఇప్పుడు బాగా నవ్వు తెప్పిస్తోంది. గతంలో జనాన్ని కేజ్రీవాల్ తన చీపురుతో తరిమికొడితే, ఇప్పుడు జనం చీపురుకు నిప్పు పెట్టి కేజ్రీవాల్‌ను కొడుతున్నట్లు రూపొందించిన మరో మీమ్ ఇప్పుడు సోషల్‌మీడియాలో ఎక్కువగా షేర్ అవుతోంది. పార్టీ ఓటమితోపాటు ఆప్ అగ్రనేతలూ ఓటమిని చవిచూశారంటూ.. ''గుడిలో ప్రసాదంగా ఏమైనా పెడతారని లోపలికి వెళితే అప్పటికే పొంగళి అయిపోయింది. సర్లే అని బయటికొస్తే అప్పటికే చెప్పులూ పోయాయి''అంటూ ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ చెబుతున్నట్లు మరో వ్యంగ్య వీడియోను నెటిజన్లు సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేశారు.

అసత్యాలు, మోసానికి ముగింపు

ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై అమిత్ షా

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంపై ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. అసత్యాలు, మోసం, అవినీతికి ఇది ముగింపు, దేశ రాజధాని ఢిల్లీ అభివృద్ధిలో నూతన శకానికి నాందిగా అభివర్ణించారు. ఆప్ అరాచకం, అహంకారంపై ప్రజలిచ్చిన తీర్పని చెప్పారు. ఢిల్లీ ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించిన అమిత్ షా..మోదీ నాయకత్వంలో ఢిల్లీ అభివృద్ధిలో ఆదర్శప్రాయంగా ఉంటుందని తెలిపారు.

హామీలను నెరవేరుస్తాం: రాజ్‌నాథ్

అభివృద్ధి చెందిన భారత్ కల సాకారానికి ఢిల్లీ అభివృద్ధి అత్యంత కీలకమైనదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఢిల్లీలో అభివృద్ధి వేగాన్ని కొత్తపుంతలు తొక్కిస్తుందని శనివారం ఆయన 'ఎక్స్'లో తెలిపారు. ప్రపంచంలో నంబర్ వన్ రాజధానిగా ఢిల్లీని మారుస్తామన్న హామీని సాకారం చేసేందుకు బీజేపీ కట్టుబడి ఉంటుందన్నారు. తప్పుడు హామీలతో పదేపదే తప్పుదోవ పట్టించలేరనే విషయాన్ని ఢిల్లీ ప్రజలు రుజువు చేశారని ఆయన పేర్కొన్నారు.

ఢిల్లీ ప్రజల హృదయాల్లో ప్రధాని మోదీ: నడ్డా

ఢిల్లీ ప్రజల హృదయాల్లో ప్రధాని మోదీ కొలువై ఉన్నారని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా పేర్కొన్నారు. ప్రజాసేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం, అభివృద్ధికి మోదీ సమర్థ నాయకత్వంపై ప్రజలిచ్చిన తిరుగులేని మద్దతుకు సంకేతమే ఈ విజయమని నడ్డా తెలిపారు. అసత్యాలు, మోసం, అవినీత అనే శీష్ మహల్‌ను ప్రజలు బద్దలు కొట్టి, ఢిల్లీకి ఆప్‌ద నుంచి విముక్తి కల్పించారన్నారు.

కేజ్రీవాల్ అహంకారం వల్లే ఓటమి: స్వాతీ మలివాల్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి కేజ్రీవాల్ అహంకారానికి దక్కిన ఫలితమని రాజ్యసభ ఎంపీ స్వాతీ మలివాల్ విమర్శించారు. అహంకారం ఫలితాన్ని రావణుడు కూడా తప్పించుకోలేకపోయాడంటూ వ్యాఖ్యానించారు. మహాభారతంలోని 'ద్రౌపదీ వస్త్రాపహరణం'ఘట్టానికి సంబంధించిన ఫొటోను ఆమె 'ఎక్స్'లో షేర్ చేశారు. గతేడాది సీఎంగా కేజ్రీవాల్ ఉన్న సమయంలో అధికార నివాసంలో ఆయన సహాయకుడొకరు స్వాతీ మలివాల్‌పై దాడి చేసిన ఘటనను ఆమె ఈ ఫొటోతో స్ఫురణకు తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ సైతం పరాజయం పాలవడం తెలిసిందే.

ప్రజా తీర్పును గౌరవిస్తాం: ఖర్గే

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వంపై ప్రతికూల వాతావరణాన్ని సృష్టించడంలో కాంగ్రెస్ విజయవంతమైంది. అయితే, ఆశించిన విధంగా ప్రజలు మాకు అనుకూలంగా తీర్పు ఇవ్వలేదు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ మా కార్యకర్తలు, శ్రేణులు పనిచేశారు. వారు మరింత కష్టపడి పనిచేస్తే బాగుండేది. ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తాం. కాలుష్యం, యమునా జలాల శుద్ధి, విద్యుత్, రహదారులు, నీటి వసతి, అభివృద్ధి వంటి అంశాలపై ఢిల్లీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తాం. ప్రజల మధ్యనే ఉంటాం.

మా పోరాటం కొనసాగిస్తాం: రాహుల్ గాంధీ

ఢిల్లీ ప్రజలిచ్చిన తీర్పును వినమ్రంగా స్వీకరిస్తున్నాం. అంకిత భావంతో పనిచేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మద్దతుగా నిలిచిన ఓటర్లకు నా ధన్యవాదాలు. ఢిల్లీ అభివృద్ధి కోసం, ఢిల్లీ వాసుల హక్కుల కోసం, కాలుష్యం, పెరుగుతున్న ధరలు, అవినీతి వంటి అంశాలపై మా పోరాటం కొనసాగుతుంది.

ప్రజలు మార్పును కోరుకున్నారు: ప్రియాంకా గాంధీ

ఆప్ పాలనతో విసిగిపోయిన ఢిల్లీ ప్రజలు మార్పును కోరుకున్నారు. మా పార్టీ శ్రేణులు మరింత శ్రమిస్తే బాగుండేది. ఇకపైనా క్షేత్ర స్థాయిలో ఢిల్లీ ప్రజలతో మమేకమై ఉంటాం.

కేజ్రీవాల్‌పై రెఫరెండమిది: జైరాం రమేశ్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆప్ ఓటమి ఆప్, ఆ పార్టీ చీఫ్ కేజ్రీవాల్ విధానాలపై ప్రజల రెఫరెండమే తప్ప మరేమీ కాదు. బీజేపీ గెలుపునకు అర్థం ప్రధాని మోదీ విధానాలకు ఓటర్లు అనుకూలంగా ఉన్నట్లు కాదు. 2015, 2020, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలుచు కోలేకపోయినప్పటికీ మా ఓటు షేర్ మాత్రం పెరిగింది. 2030 అసెంబ్లీ ఎన్నికల్లో మేం అధికారంలోకి రావడం ఖాయం.

అవినీతే ఆప్‌ను ముంచింది

సామాజిక కార్యకర్త అన్నా హజారే వ్యాఖ్య



ముంబై/తిరువనంతపురం: ఢిల్లీలో మద్యం విధానంలో అవకతవకలు, ప్రభుత్వ నిర్వహణలో అవినీతి కారణంగానే కేజ్రీవాల్ పార్టీ ఓటమిని చవిచూసిందని సామాజిక కార్యకర్త అన్నా హజారే వ్యాఖ్యానించారు. హజారేను కేజ్రీవాల్ ఒకప్పుడు రాజకీయ గురువుగా భావించిన విషయం తెల్సిందే. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక శనివారం ముంబైలో హజారే మాట్లాడారు. ''లిక్కర్ పాలసీ విధానంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆప్ ప్రతిష్ట మసకబారింది. సచ్ఛీలుడిగా పేరు తెచ్చుకుని కేజ్రీవాల్ పాలిటిక్స్‌లోకి వచ్చారు. కానీ మద్యం పాలసీ ఉదంతం తర్వాత ఆయన హవా పడిపోయింది. నిస్వార్థంగా సేవ చేయాలంటే పార్టీని ఎలా నడపాలన్న విషయాన్ని ఆప్ గాలికొదిలేసింది. తప్పుడు మార్గాన్ని ఎంచుకుంది. ఆప్‌కు డబ్బు సంపాదనపై మక్కువ ఎక్కువైంది. అదే వాళ్ల ఓటమికి కారణమైంది''అన్నా హజారే వ్యాఖ్యానించారు. మద్యం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న హజారేతోపాటు ఉద్యమంలో పాల్గొన్న కేజ్రీవాల్ వెంటనే రాజకీయపార్టీ పెట్టి క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. దీంతో 2012లో కేజ్రీవాల్, హజారేలా లక్ష్యాలు, మార్గాలు మారిపోయాయి. ''నేను ఇది మొదట్నుంచీ చెప్తనే ఉన్నా. రాజకీయాల్లో ఉండాలనుకునే వ్యక్తి వ్యక్తిత్వం బాగుండాలి. ఎవరు అవమానించినా భరించగలగాలి, త్యాగాలు చేయగలగాలి. ఈ గుణాలున్న నేతలు మాత్రమే ప్రజల మనసుల్ని గెల్చుకోగలరు. ఈ విషయాన్ని ముందునుంచీ ఆప్ నేతలకు చెబుతున్నా పూర్తిగా పెడచెవిన పెట్టారు''అని హజారే వ్యాఖ్యానించారు.

నలుగురు ముస్లింల ఎన్నిక

ఈసారి ఎన్నికల్లో చీలిన ముస్లిం ఓట్లు • అయినా ఆరు సీట్లు దక్కించుకున్న ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ముస్లింల ఓట్లు చీలాయి. అయినప్పటికీ, ముస్లింల ప్రాబల్యమున్న ఏడు నియోజకవర్గాలకు గాను ఆరింట్లో ఆప్ విజయం సాధించగలిగింది. ప్రస్తుత అసెంబ్లీలో ముస్లిం వర్గం ఎమ్మెల్యేలు ఐదుగురుండగా ఈసారి నలుగురు అసెంబ్లీలోకి అడుగిడనున్నారు. విజేతలు ఆప్‌కు చెందిన ఇమ్రాన్ హుస్సేన్(బల్లిమారన్), ఆలె మహ్మద్ ఇక్బాల్(మటియా మహల్), అమానతుల్లా ఖాన్(ఓఖ్లా), చౌదరి జుబాయిర్ అహ్మద్(సీలంపూర్). 2020 ఎన్నికల్లో ముస్లింలు అధికంగా ఉన్న ఏడు స్థానాల్లో దాదాపు అందరూ ఆప్‌కే ఓటేయడంతో ఆ పార్టీ విజయకేతనం ఎగరేసింది. ఈదఫా ఆ పార్టీ ముస్తఫాబాద్ మినహా ఆరింట్లో గట్టెక్కింది. ఈ ఎన్నికల్లో ముస్లింల ఓట్లు చీలాయి. అయినప్పటికీ ఆప్ విజయావకాశాలను దెబ్బతీసే స్థాయిలో చీలిక సంభవించలేదు. ముస్తఫాబాద్‌లో ముక్కోణ పోటీ నెలకొంది. ఆప్, ఎంఐఎం, కాంగ్రెస్‌లకు చెందిన ముగ్గురు ముస్లిం అభ్యర్థుల మధ్య ఓట్లు చీలాయి. ఫలితంగా, బీజేపీకి లాభం కలిగింది. ఆ పార్టీకి చెందిన మోహన్ సింగ్ బిష్త్ ఇక్కడ 17,578 ఓట్ల తేడాతో విజయం సాధించగలిగారు. ముస్లిం అభ్యర్థులందరికీ కలిపి 1,12,874 ఓట్లు పోలయ్యాయి. ఇందులో, జైలులో నుంచి పోటీ చేసిన ఎంఐఎం అభ్యర్థికి 33,474 ఓట్లు పడ్డాయి. ముస్లింల ప్రాబల్యమున్న ఓఖ్లా నియోజకవర్గంలో ఎంఐఎం అభ్యర్థి 39,558 ఓట్లతో మూడో స్థానంలో నిలవడం గమనార్హం.

ఆ మూడు కారణాలు ఏమంటే..

ముస్లింల ఓట్లలో చీలిక రావడానికి ప్రధానంగా మూడు కారణాలను విశ్లేషకులు చూపుతున్నారు. అందులో ఒకటి..ఏదేమైనా బీజేపీని గెలవకుండా చేయాలి. ఇందుకోసం ఆప్‌కు ఓటేయడం ముఖ్యం. ఢిల్లీలో కాషాయ పార్టీ దూకుడును ఆప్ గలిగింది ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఒక్కడేనని కొందరు ముస్లింలు నమ్మారు. రెండోది..2020 అల్లర్ల సమయంలో ఆప్ తమను పట్టించుకోలేదని కొందరు ముస్లింలు భావిస్తున్నారు. అంతేకాకుండా, కోవిడ్ వ్యాప్తికి తబ్లిఘి జమాత్‌ను తప్పుబడుతూ ఆప్ అనుమానాస్పదంగా వ్యవహరించడం కొందరికి నచ్చలేదు. ప్రత్యామ్నాయంగా, లౌకికవాదాన్ని బలంగా వినిపిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని బలపరచడం మేలని కొందరు ముస్లింలు నిర్ణయించుకోవడం. మూడోది..ఆప్, కాంగ్రెస్ వెంట నడవడం మానేసి, అసదుద్దీన్ ఒవైసీ పార్టీ ఎంఐఎంను అనుసరించడం మేలని, ఆయనైతే ముస్లింలకు సంబంధించిన ప్రత్యేక అంశాలు, సమస్యలను బలంగా వినిపిస్తారని కొందరు విశ్వసించారు. ఈ కోణంలోనే, 2020 అల్లర్లలో నిందితులకు ఎంఐఎం టిక్కెట్లిచ్చి బరిలో నిలిపింది. ఏదేమైనప్పటికీ ఇవన్నీ కలిసి అంతిమంగా బీజేపీకే లాభం చేకూర్చాయి. ముస్లింల ఓట్లు చీలి ఆప్‌పై సునాయాస విజయానికి కాషాయ పార్టీకి బాటలు పరిచాయి.

శూన్య స్థితిలో క్రయోజనిక్ ఇంజన్ పరీక్ష సక్సెస్

తమిళనాడులో చేపట్టిన ఇస్రో

బెంగళూరు: 'నిల్వచేసిన గ్యాస్ వ్యవస్థ'లో కాకుండా బూట్‌స్ట్రాప్ విధానంలో శూన్యంలో క్రయోజనిక్ ఇంజన్(సీఈ20)ను విజయవంతంగా మండించి చూశామని ఇస్రో శనివారం ప్రకటించింది. అంతరిక్షంలో ఎలాంటి వాయువులు లేని శూన్య స్థితి మాత్రమే ఉంటుంది. లాంచ్ వెహికల్ మార్క్(ఎల్‌వీఎం3) వ్యోమనౌకలోని పైభాగాన్ని మరింత పైకి తీసుకెళ్లేందుకు దోహదపడే సీఈ20ను శుక్రవారం విజయవంతంగా పరీక్షించామని ఇస్రో పేర్కొంది. వ్యోమగాములతో చేపట్టనున్న ప్రతిష్టాత్మక గగన్‌యాన్ వంటి ప్రాజెక్టుల్లో ఈ కొత్త విధానంతో క్రయోజనిక్ ఇంజన్లను సమర్థవంతంగా మండించవచ్చని ఇస్రో వెల్లడించింది. తమిళనాడులోని మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఉన్న హై ఆల్టిట్యూడ్ పరీక్షా కేంద్రంలో ఈ పరీక్ష జరిపారు. మార్గమధ్యంలో ఉన్నప్పుడు క్రయోజనిక్ ఇంజన్‌ను ట్యాంక్ ఒత్తిడి పరిస్థితుల్లో రీస్టార్ట్ చేసేందుకు, శూన్యంలో విభిన్న మూలకాలతో తయారుచేసిన ఇగ్నైటర్‌తో ఇంజన్‌ను మండించి చూశామని ఇస్రో పేర్కొంది. పరీక్ష ఫలితాలు అనుకున్న రీతిలో సాధారణంగా వచ్చాయని వెల్లడించింది. క్రయోజనిక్ ఇంజన్‌ను రీస్టార్ట్‌చేయడం అనేది ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ. సంప్రదాయకమైన గ్యాస్ సిస్టమ్‌లో కాకుండా బూట్‌స్ట్రాప్ విధానంలో టర్బోపంప్‌లను ఉపయోగించి క్రయోజనిక్ ఇంజన్‌ను మళ్లీ మండించడం కష్టమైన పని. దీనిని ఇస్రో విజయవంతంగా చేసి చూపింది. ఈ ఇంజన్‌ను ఇస్రో వారి లిక్విడ్ ప్రొపల్షన్ సెంటర్ వారు అభివృద్ధిచేశారు.

ఇంజన్ పరీక్ష మేలిమి మలుపు

ఇంజన్ పరీక్ష విజయవంతం అనేది తదుపరి ప్రాజెక్టుల పురోగతికి ముందడుగు వేసేలా చేసిందని ఇస్రో ఛైర్మన్, అంతరిక్ష విభాగ కార్యదర్శి వి.నారాయణన్ వ్యాఖ్యానించారు. శనివారం బెంగళూరులో జరుగుతున్న ఏరో ఇండియా ఇంటర్నేషనల్ సెమినార్,2025 కార్యక్రమంలో నారాయణన్ మాట్లాడారు. ''ఇస్రో ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయని కొందరు యథాలాపంగా అనేస్తుంటారు. వాస్తవానికి ఇస్రో చేపట్టే ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఎంతో సంక్లిష్టత, శ్రమ, ఖర్చుతో కూడుకున్నవి. ఇప్పటికే క్రయోజనిక్ టెక్నాలజీని సముపార్జించిన దేశాలు దానికి భారత్‌కు ఇచ్చేందుకు నిరాకరించాయి. దీంతో భారత్ సొంతంగా జీఎస్ఎల్వీ మ్యాక్3 కోసం సీ25 క్రయోజనిక్ ప్రొపల్షన్ వ్యవస్థను, ఇంజన్‌ను తయారుచేసుకుంటోంది. ఇప్పుడు సీ25 ప్రాజెక్టుతో భారత్ ప్రపంచ రికార్డులు నెలకొల్పబోతోంది. ఇంజన్ డిజైన్ దశ నుంచి తయారీ, పరీక్ష స్థాయికి చేరుకోవడానికి ఇతర దేశాలకు 42 నెలల సమయంపడితే భారత్ కేవలం 28 నెలల్లో ఈ ఘనత సాధించింది. సాధారణంగా ఈ స్థాయికి చేరడానికి 10, 12 రకాల ఇంజన్లను తయారుచేస్తే మనం కేవలం మూడు ఇంజన్లతోనే ఈ స్థాయికి ఎదిగాం. ఈ విజయంలో గత ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ కృషి దాగి ఉంది. డిజిటల్ సిములేషన్ తర్వాత నేరుగా పరీక్షకు వెళ్లేలా ఆయనే నాడు మార్గదర్శకం చేశారు. గతంలో మేం విఫలమయ్యాం. దాదాపు రూ.1,200 కోట్లు వృథా అయ్యాయి. కానీ ఇప్పుడు మేం చరిత్ర సృష్టించాం''అని నారాయణన్ ఆనందం వ్యక్తంచేశారు.

రాజ్యాంగాన్ని బలహీనపరిచే యత్నం

కేంద్రంపై ప్రియాంకా గాంధీ ధ్వజం

వయనాడ్: భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలహీన పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ ధ్వజమెత్తారు. శనివారం వయనాడ్‌లోని మనంతవాడి అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతేడాది జులైలో కొండచరియలు విరిగి పడిన ఘటనలో బాధితులకు ఇప్పటికీ ఊరట కలగలేదన్నారు. వీరికి పరిహారం, గృహ వసతి కల్పిస్తామంటూ హామీ ఇచ్చిన కేంద్రం ఇప్పటికీ నెరవేర్చలేదని ఆరోపించారు. వయనాడ్ దుర్ఘటనను కేంద్రం తీవ్ర విపత్తుగా ప్రకటించినందున పునరావాసానికి మరిన్ని నిధులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తన వంతు కృషి చేస్తానన్నారు.

డోజ్‌కు ఫెడరల్ జడ్జి షాక్

వాషింగ్టన్: ఎలాన్ మస్క్ సారథ్యంలో నడిచే డోజ్(డిపార్టుమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ)కు ట్రెజరీ విభాగానికి సంబంధించిన సున్నిత వ్యక్తిగత డేటా అందివ్వరాదంటూ శనివారం ఫెడరల్ జడ్జి ఒకరు ఉత్తర్వులు జారీ చేశారు. డెమోక్రాటిక్ పార్టీకి చెందిన 19 మంది అటార్నీ జనరళ్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై వేసిన పిటిషన్‌పై న్యూయార్క్ సిటీలోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి పాల్ ఎంగెల్‌మేయర్ ఈ మేరకు ఆదేశాలిచ్చారు. ట్రెజరీ విభాగంలోని సెంట్రల్ పేమెంట్ వ్యవస్థలోకి ట్రంప్ ప్రభుత్వం మస్క్ బృందానికి అనుమతులివ్వడం ఫెడరల్ చట్టాలకు వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. ఇందులో లక్షలాది మంది అమెరికన్ల బ్యాంకు అక్కౌంట్ నంబర్లు, సోషల్ సెక్యూరిటీ వివరాలు, రిటైరైన ఆర్మీ ఉద్యోగులకు అందే నిధుల వివరాలు ఇందులో ఉంటాయన్నారు.

ఏఎఫ్‌డీకి వ్యతిరేకంగా భారీ ర్యాలీ

మ్యూనిక్: జర్మనీలో అతివాద భావాలు కలిగిన ఏఎఫ్‌డీ(ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ) పార్టీకి వ్యతిరేకంగా మ్యూనిక్ నగరంలో శనివారం భారీ ర్యాలీ జరిగింది. ఈ నెల 23వ తేదీన దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. దాదాపు 2 లక్షల మంది ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అయితే, ఈ ప్రదర్శనలో 3.20 లక్షల మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏఎఫ్‌డీ విధానాలైన జాత్యహంకారం, విద్వేషాలను ఖండిస్తూ పలువురు ప్లకార్డులు ప్రదర్శించారు. ఇటీవలి ప్రజాభిప్రాయసేకరణలో ఏఎఫ్‌డీ రెండో స్థానంలో నిలిచింది. ఏఎఫ్‌డీ విధానాలను ఖండిస్తూ శనివారం హనోవర్, రోస్టోక్ తదితర నగరాల్లో జరిగిన ర్యాలీల్లోనూ జనం భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దేశంలోకి వలసలను తీవ్రంగా వ్యతిరేకించే ఏఎఫ్‌డీకి ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సైతం ఇటీవల మద్దతుగా మాట్లాడటం విశేషం.

గల్లంతైన విమానం ఆచూకీ దొరికింది

పైలట్ సహా అందులోని పది మందీ మృతి

అలాస్కా: అమెరికాలోని అలాస్కాలో గల్లంతైన విమానం ఆచూకీ లభ్యమైంది. పైలట్ సహా అందులోని మొత్తం పది మందీ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం ఉనలక్లీట్ నుంచి టేకాఫ్ తీసుకున్న సింగిల్ ఇంజిన్ సెస్నా గ్రాండ్ కారవాన్ విమానం విమానం నోమ్ సమీపంలో గల్లంతైంది. అందులో పైలట్ సహా 10 మంది ప్రయాణికులున్నారు. మరో అర గంటలో ల్యాండవనుండగా రాడార్‌తో సంబంధం కోల్పోయింది. చిట్టచివరి లోకేషన్ ఆధారంగా హెలికాప్టర్‌తో అధికారులు గాలింపు చేపట్టి, గడ్డకట్టిన సముద్ర జలాల్లో శకలాలను కనుగొన్నారు. విమానంలో సాంకేతిక లోపం, ఇతర సమస్యలపై ప్రమాదానికి ముందు ఎలాంటి హెచ్చరికలు తమకు అందలేదని అధికారులు వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాష్ట్రపతి భవన్‌లో ఛేంజ్ ఆఫ్ గార్డ్‌కు కొత్త ఫార్మాట్

న్యూఢిల్లీ: రాష్ట్రపతి భవన్‌లో వారంవారం జరిగే ఛేంజ్ ఆఫ్‌గార్డ్ కొత్త ఫార్మాట్‌లో రానుంది. ఈ నెల 22 నుంచి అమలయ్యే కొత్త ఫార్మాట్‌లో సీటింగ్ సామర్థ్యం పెరగనుంది. ఇకపై ప్రజలు రాష్ట్రపతి భవన్ నేపథ్యంతో మరింత స్పష్టంగా సంగీత ప్రదర్శనను తిలకించవచ్చు. రాష్ట్రపతి వ్యక్తిగత భద్రతా సిబ్బంది, అశ్విక దళం, సెరిమోనియల్ గార్డ్ బెటాలియన్, మిలిటరీ బ్యాండ్‌తో పాటు సైనిక విన్యాసాలు ఛేంజ్ ఆఫ్ గార్డ్ వేడుకలో భాగంగా ఉంటాయని రాష్ట్రపతి భవన్ తెలిపింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కొత్త ఫార్మాట్‌లో ప్రారంభ ప్రదర్శనను ఈ నెల 16న తిలకించనున్నారని వివరించింది. ప్రతి వారం రాష్ట్రపతి వ్యక్తిగత భద్రతా సిబ్బంది విధులు మారే సమయంలో ఛేంజ్ ఆఫ్ గార్డ్ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. సైన్యంలోని అత్యంత సీనియర్ రెజిమెంట్‌తో 1773లో ప్రెసిడెంట్ బాడీగార్డ్(పీబీజీ) విభాగం ఏర్పాటైంది.



హమాస్ సాయుధ శ్రేణులు ముగ్గురు ఇజ్రాయెలీ బందీలను వేదికపైకి తీసుకొచ్చినప్పటి దృశ్యం

హమాస్ చెర నుంచి మరో ముగ్గురికి విముక్తి

183 మంది ఖైదీలను విడిచిపెట్టిన ఇజ్రాయెల్

డెయిర్ అల్-బలాహ్: కాల్పుల విరమణ ఒప్పందం మేరకు శనివారం హమాస్ మిలిటెంట్లు మరో ముగ్గురు ఇజ్రాయెల్ బందీలను విడుదల చేశారు. ప్రతిగా ఇజ్రాయెల్ తమ జైళ్లలో ఉన్న 183 మంది పాలస్తీనియన్లను వదిలేసింది. వందలాదిమంది సాయుధ హమాస్ శ్రేణులు ఎలి షరాబీ(52), బెన్ అమి(56), ఒర్ లెవీ(34) అనే బందీలను వేదికపైకి తీసుకువచ్చాయి. అనంతరం వారిని రెడ్‌క్రాస్‌కు అప్పగించాయి. ఎంతో బలహీన స్థితిలో ఉన్న వారిని మాట్లాడాలంటూ బలవంత పెడుతున్నట్లుగా ఉన్న దృశ్యాలు మీడియాలో రావడంపై ఇజ్రాయెల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒప్పందం షరతులను హమాస్ ఉల్లంఘిస్తోందని, మధ్యవర్తులకు ఈ విషయమై అభ్యంతర వ్యక్తం చేస్తామని తెలిపింది. 2023 అక్టోబర్ 7న హమాస్ శ్రేణులు అపహరించుకుపోయిన సుమారు 250 మంది పై ముగ్గురు కూడా ఉన్నారు. జనవరి 19న కుదిరిన ఒప్పందం అనంతరం హమాస్ 18 మంది బందీలకు విముక్తి కల్పించింది.

మరో ట్రంప్ ఉత్తర్వుకు చుక్కెదురు

యూఎస్ఎయిడ్ ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వును నిలుపుదలచేసిన జడ్జి

వాషింగ్టన్: అధికారంలోకి వచ్చినప్పట్నుంచీ డజన్లకొద్దీ కార్యనిర్వాహక ఉత్తర్వులిస్తూ అన్ని దేశాలను కలవరపరుస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో న్యాయస్థానం మొట్టికాయ వేసింది. వలస వచ్చిన వాళ్లకు పిల్లలు పుడితే వారికి దక్కే జన్మతః పౌరసత్వ హోదాను రద్దుచేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులు ఇచ్చిన ట్రంప్‌ను ఇప్పుడు అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ(యూఎస్ఎయిడ్) ఉద్యోగుల విషయంలోనూ మరో కోర్టు కట్టడిచేసింది. వేలాది మంది యూఎస్ఎయిడ్ ఉద్యోగులను ఉద్యోగాలు మానేసి 30 రోజుల్లోపు స్వదేశానికి తిరిగొచ్చేయాలని ట్రంప్ ఇచ్చిన ఆదేశాలను వారం రోజులపాటు నిలుపుదలచేస్తున్నట్లు యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్ట్ జడ్జి కార్ల్ నికోల్స్ శుక్రవారం రాత్రి మధ్యంతర తీర్పు వెలువరిచారు. యూఎస్ఎయిడ్‌ను శాశ్వతంగా మూసేస్తానంటూ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ పెట్టిన కొన్ని గంటలకే ఆయన నిర్ణయానికి వ్యతిరేకంగా తాత్కాలిక తీర్పు వెలువడటం విశేషం. విదేశాల్లో యూఎస్ఎయిడ్ ఉద్యోగులు, వారి జీవితభాగస్వాములు, చదువుకుంటున్న వారి పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైన వేళ కోర్టు ఉత్తర్వులతో తాజాగా వారికి భారీ ఊరట లభించింది. అయితే ఈ విభాగానికి నిధులు ఆపేయాలంటూ ట్రంప్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేయాలంటూ ది అమెరికన్ ఫారెన్ సర్వీస్ అసోసియేషన్, ది అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ సంస్థలు చేసిన విజ్ఞప్తిని జడ్జి తిరస్కరించారు. ట్రంప్ ప్రభుత్వం ఆదేశించడంతో యూఎస్ఎయిడ్‌లో ఇప్పటికే 500 మంది ఉద్యోగులు సెలవులపై వెళ్లగా మరో 2,200 మంది శనివారమే సెలవుపై వెళ్లాల్సి ఉంది. యూఎస్ఎయిడ్ అనేది ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో సహాయక, అభివృద్ధి, దాతృత్వకార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రతి ఏటా వందల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తున్నారు. 2016 గణాంకాల ప్రకారం యూఎస్ఎయిడ్ ప్రభుత్వ విభాగంలో 10,235 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మూడింట రెండొంతుల మంది విదేశాల్లో పనిచేస్తున్నారు. విదేశాలకు అపరిమిత సాయం అమెరికాకు గుదిబండగా మారిందని, ఉద్యోగుల్లో 90 శాతం మంది తీసేయాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే దశలవారీగా చాలా మంది సెలవుల మీదకు స్వదేశానికి తిరిగొచ్చేయాలని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరించింది. శాశ్వతంగా తిరిగొస్తున్నందున ప్రయాణఖర్చులు కూడా చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే విధులు నిర్వర్తిస్తున్న దేశంలోనే ఈ సిబ్బంది పిల్లలు చదువుకుంటున్నారు.

సాక్షి ప్లస్
ఆదివారం | 9-2-2025

రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరడం గురించి తెలిపే ఆర్టికల్?

భారత రాజ్యాంగ రచన - రాజ్యాంగ పరిషత్తు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

రాజ్యాంగ అమలు తేది

జనవరి 26ను రాజ్యాంగ అమలు తేదీగా నిర్ణయించడానికి చారిత్రక నేపథ్యం ఉంది. నెహ్రూ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ 'లాహోర్ సమావేశం'(1929 డిసెంబర్ 31) జనవరి 26ను పూర్ణ స్వరాజ్య దినోత్సవంగా ప్రకటించింది. ఆ సంఘటనకు గుర్తుగా జనవరి 26ను అమలు తేదీగా నిర్ణయించారు.

రాజ్యాంగ పరిషత్తు ఇతర విధులు

భారత రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగ రచనతోపాటు కొన్ని సాధారణ చట్టాలను కూడా రూపొందించి ఆమోదించింది. అందులోని ముఖ్యాంశాలు.

- 1947 జూలై 22న జాతీయ జెండాను ఆమోదించింది.
- రాజ్యాంగ పరిషత్తు కేంద్ర శాసనసభగా కూడా పనిచేసింది. స్వతంత్ర శాసనసభగా 1947 నవంబర్ 17న సమావేశమై మొదటి స్పీకర్‌గా జి.వి.మౌలాంకర్‌ను ఎన్నుకుంది.
- భారత రాజ్యాంగ పరిషత్తు చిహ్నంగా ఏనుగును గుర్తించింది.
- దేవనాగరి లిపిలో ఉన్న హిందీని కేంద్ర ప్రభుత్వ భాషగా 1949 సెప్టెంబర్ 14న ఆమోదించింది.
- కామన్‌వెల్త్‌లో భారత సభ్యత్వాన్ని 1949 మే నెలలో ధ్రువీకరించింది.
- తొలి రాష్ట్రపతిగా రాజేంద్రప్రసాద్‌ను 1950 జనవరి 24న ఎన్నుకుంది (అప్పటి వరకు ఎన్నికైన పార్లమెంటు ఏర్పడలేదు కాబట్టి).
- 1950 జనవరి 24న జాతీయ గీతాన్ని, జాతీయ గేయాన్ని ఆమోదించింది.

సబ్ కమిటీలు

కమిటీ పేరు	చైర్మన్
ప్రాథమిక హక్కుల ఉప కమిటీ	జె.బి. కృపలాని
మైనారిటీల సబ్ కమిటీ	హెచ్.సి.ముఖర్జీ
ఈశాన్య రాష్ట్రాల హక్కుల కమిటీ	గోపినాథ్ బోర్డోలాయ్
ప్రత్యేక ప్రాంతాల కమిటీ	ఎ.వి.టక్కర్

రాజ్యాంగ రచనకు అనుసరించిన పద్ధతి

రాజ్యాంగ రచనలో పరిషత్తు ఏ అంశాన్నీ ఓటింగ్ ద్వారా ఆమోదించలేదు. ప్రతి ప్రతిపాదనను, సమస్యను సుదీర్ఘంగా చర్చించి సర్దుబాటు, సమన్వయం లేదా ఏకాభిప్రాయ సాధన ద్వారా పరిష్కరించిందని ప్రఖ్యాత రాజ్యాంగ నిపుణులు 'గ్రాన్‌విలె ఆస్టిన్' పేర్కొన్నారు.

సమ్మతి పద్ధతి (Consensus)

ఒక సమస్య లేదా ప్రతిపాదన వచ్చినప్పుడు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, చర్చల ద్వారా దాదాపు అందరు సభ్యులు ఒప్పుకునేలా చేసే పద్ధతి. ఈ పద్ధతి ద్వారా సమాఖ్య వ్యవస్థ, ప్రాంతాల ప్రత్యేకత, భాషకు సంబంధించిన అంశాలను పరిష్కరించారు.

సమన్వయ పద్ధతి (Accommodation)

ఒక సమస్యపై మధ్యే మార్గాన్ని సాధించడం. పరస్పర వ్యతిరేక వాదనలు ఉన్నప్పుడు సుదీర్ఘంగా చర్చించి గుణ దోషాలపై వివేచనతో, తర్కబద్ధంగా ఒక అభిప్రాయానికి రావడం. భారత రాజ్యాంగంలోని చాలా అంశాలను ఈ పద్ధతి ద్వారానే అంగీకరించారు.

రాజ్యాంగం - ముఖ్య ఆధారాలు

భారత రాజ్యాంగ రచనపై ఆనాటి ప్రపంచ రాజ్యాంగాల ప్రభావం గణనీయంగా ఉంది. వివిధ దేశాల్లోని రాజ్యాంగాల్లో ఉన్న ఉత్తమ లక్షణాలను స్వల్ప మార్పులతో రాజ్యాంగంలో పొందుపరిచారు. అందుకే భారత రాజ్యాంగాన్ని 'అతుకుల బొంత' అంటారు. మన రాజ్యాంగానికి అత్యంత ముఖ్యమైన ఆధారం భారత ప్రభుత్వ చట్టం-1935. అందుకే రాజ్యాంగాన్ని '1935 చట్టానికి నకలు'గా అభివర్ణిస్తారు.

భారత రాజ్యాంగంలో మౌలికాంశాలు

భారత రాజ్యాంగంలో కింది లక్షణాలను స్వతహాగా ఏర్పాటు చేసుకున్నాం.

- రాష్ట్రపతిని ఎన్నుకునే నియోజక గణం
- పంచాయతీరాజ్ వ్యవస్థ
- అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక హక్కులు.
- రక్షిత వివక్షత
- ఆర్థిక సంఘం, కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, భాషా సంఘాలకు సంబంధించిన ప్రత్యేకాంశాలు.
- ఏకీకృత సమగ్ర న్యాయ వ్యవస్థ
- అఖిల భారత సర్వీసులు
- ఏక పౌరసత్వం



రాజ్యాంగ పరిషత్ సమావేశాలు

సమావేశాలు	కాలం	పని విధానం - దశలు
మొదటి సమావేశం	1946 డిసెంబర్ 09-23	I. ఈ దశలో రాజ్యాంగ రచన విధుల్ని నిర్వర్తించింది.
రెండో సమావేశం	1947 జనవరి 20-25	
మూడో సమావేశం	1947 ఏప్రిల్ 28-మే 02	
నాలుగో సమావేశం	1947 జూలై 14-31	
అయిదో సమావేశం	1947 ఆగస్టు 14-30	
ఆరో సమావేశం	1948 జనవరి 27	
ఏడో సమావేశం	1948 నవంబర్ 4 నుంచి 1949 జనవరి 08	II. రాజ్యాంగ రచన విధులతో పాటు తాత్కాలిక పార్లమెంటు విధులను కూడా నిర్వర్తించింది.
ఎనిమిదో సమావేశం	1949 మే 16 - జూన్ 16	
తొమ్మిదో సమావేశం	1949 జూలై 30 - సెప్టెంబర్ 18	
పదో సమావేశం	1949 అక్టోబర్ 6-17	
పదకొండో సమావేశం	1949 నవంబర్ 14-26	III. 1949 నుంచి 1952 వరకు కేవలం తాత్కాలిక పార్లమెంటు విధులను మాత్రమే నిర్వర్తించింది.

ముఖ్య ప్రపంచ రాజ్యాంగాల రచనా కాలం- తులనాత్మక పరిశీలన

దేశం	ప్రకరణల సంఖ్య	రచనకు పట్టిన కాల వ్యవధి
అమెరికా	7	నాలుగు నెలల కంటే తక్కువ కాలం
కెనడా	147	2 సంవత్సరాల 6 నెలలు
ఆస్ట్రేలియా	126	9 సంవత్సరాలు
దక్షిణాఫ్రికా	153	1 సంవత్సరం
భారతదేశం	395	2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు

ఆధారం	గ్రహించిన అంశాలు
1935 చట్టం	కేంద్ర, రాష్ట్రాలతో సమాఖ్య వ్యవస్థ, ఫెడరల్ కోర్టు, రాష్ట్రపతి పాలన (ఆర్టికల్ 356), గవర్నర్ పదవి, విచక్షణాధికారాలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, ఇతర పరిపాలన అంశాలు.
బ్రిటిష్ రాజ్యాంగం	పార్లమెంటు/కేబినెట్ తరహా పాలనా పద్ధతి, ద్విసభా పద్ధతి, సమన్యాయ పాలన, శాసన నిర్మాణ ప్రక్రియ, శాసన సభ్యుల స్వాధికారాలు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్, అటార్నీ జనరల్ మొదలైన పదవులు, రిట్లు జారీచేసే విధానం.
అమెరికా రాజ్యాంగం	ప్రాథమిక హక్కులు, న్యాయసమీక్ష, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న న్యాయశాఖ, ఉప రాష్ట్రపతి రాజ్యసభకు చైర్మన్‌గా వ్యవహరించడం, రాష్ట్రపతిని తొలగించే మహాభియోగ తీర్మానం, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రాలు ఆమోదం తెలపడం.
కెనడా	బలమైన కేంద్ర ప్రభుత్వం, గవర్నర్ నియామక పద్ధతి. రాజ్యాంగం అవశిష్ట అధికారాలను కేంద్రానికి ఇవ్వడం, ఆర్టికల్ 143 ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరడం.
ఐర్లాండ్ రాజ్యాంగం	ఆదేశిక సుత్రాలు, రాష్ట్రపతిని ఎన్నుకునే నైష్పత్తిక ప్రాతినిధ్యం, ఓటు బదిలీ పద్ధతి, రాజ్యసభకు విశిష్ట సభ్యుల నియామకం.
వైమార్ రిపబ్లిక్(జర్మనీ)	జాతీయ అత్యవసర పరిస్థితి, ప్రాథమిక హక్కులను రద్దుచేసే అధికారం మొదలైనవి. (వైమార్ అనేది జర్మనీ దేశ రాజ్యాంగ పరిషత్తు సమావేశమైన నగరం).
ఆస్ట్రేలియా	ఉమ్మడి జాబితా, పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశం (బిల్లు ఆమోదం విషయంలో వివాదం తలెత్తితే), వాణిజ్య, వ్యాపార లావాదేవీలు, అంతర్రాష్ట్ర వ్యాపారం.
దక్షిణాఫ్రికా	రాజ్యాంగ సవరణ విధానం, రాజ్యసభ సభ్యుల ఎన్నిక పద్ధతి.
ఫ్రాన్స్	గణతంత్ర విధానం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, తాత్కాలిక సభాధ్యక్షుల నియామకం.
రష్యా	ప్రాథమిక విధులు, దీర్ఘకాలిక ప్రణాళిక, సామ్యవాద సూత్రాలు.
జపాన్	నిబంధన 21లో పేర్కొన్న చట్టం నిర్దేశించిన పద్ధతి.
స్విట్జర్లాండ్	ప్రధాని, మంత్రిమండలి మధ్య సమష్టి బాధ్యత.

రాజ్యాంగ పరిషత్తు-అదనపు, విశిష్ట సమాచారం

- రాజ్యాంగ పరిషత్తు రచనకు అయిన ఖర్చు - రూ. 64 లక్షలు.
- భారత రాజ్యాంగానికి ఆధార రాజ్యాంగాల సంఖ్య - 60
- రాజ్యాంగ పరిషత్తులో నామినేటెడ్ సభ్యుల సంఖ్య - 15. ముఖ్య నామినేటెడ్ సభ్యులు.. సర్వేపల్లి రాధాకృష్ణన్, కె.టి.షా
- రాజ్యాంగ పరిషత్తులో సభ్యులు కానివారు - బి.యస్.రావు, ఎస్.వరదాచారియర్, హెచ్.వి.కామత్.
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అని అభివర్ణించింది- అనంత శయనం అయ్యంగార్
- బి.ఆర్.అంబేద్కర్‌ను 'నైపుణ్యం ఉన్న పైలెట్'గా పేర్కొంది- డాక్టర్ రాజేంద్రప్రసాద్
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, గోపాలస్వామి అయ్యంగార్, అల్లాడి క్రిష్ణస్వామి అయ్యర్, బి.ఎన్.రావును 'పెట్టీ ఫోరం' అంటారు.
- డాక్టర్ బి.ఎన్.రావును 'రాజ్యాంగ పరిషత్తుకు స్నేహితుడు, మార్గదర్శి, తత్వవేత్త'గా పేర్కొంటారు.
- రాజ్యాంగ పరిషత్తులో ఎక్కువ సవరణలు ప్రతిపాదించింది -హెచ్.వి.కామత్.
- రాజ్యాంగ పరిషత్తుకు కార్యదర్శిగా వ్యవహరించింది - హెచ్.బి.అయ్యంగార్
- రాజ్యాంగ పరిషత్తులో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించినవారు - సోమనాథ్ లహరి
- రాజ్యాంగ విధులను నిర్వర్తించే సమయంలో మాత్రమే డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షులుగా వ్యవహరించారు.
- రాజ్యాంగ పరిషత్తు తాత్కాలిక పార్లమెంటుగా శాసన విధులు నిర్వహించినప్పుడు జి.వి.మౌలాంకర్ స్పీకర్‌గా వ్యవహరించారు. అనంత శయనం అయ్యంగార్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు.
- రాజ్యాంగ పరిషత్తును ఉద్దేశించి చివరిగా బ్రిటిష్ గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ మాట్లాడారు.
- రాజ్యాంగ రచన కాలీగ్రాఫర్ - ప్రేమ్ బెహారి నారాయిణ్ రైజ్డా. రాజ్యాంగానికి, ప్రవేశికకు ఆర్ట్ వర్క్ చేసింది - నందన్ లాల్ బోస్.
- హన్సా మెహతా భారత జాతీయ పతాకాన్ని రాజ్యాంగ పరిషత్తులో సమర్పించారు.
- మౌలిక రాజ్యాంగ ప్రతిని పార్లమెంట్ గ్రంథాలయంలో భద్రపరిచారు. మౌలిక రాజ్యాంగంలో 230 పేజీలు ఉన్నాయి.

రాజ్యాంగ పరిషత్తు నిర్మాణం పనితీరుపై విమర్శ

- రాజ్యాంగ పరిషత్తు సార్వభౌమ సంస్థ కాదు. ప్రజలకు నేరుగా ప్రాతినిధ్యం వహించలేదు. కేవలం 28 శాతం జనాభాకు మాత్రమే ప్రాతినిధ్యం లభించింది.
- ప్రజలు తమను తాము వ్యక్తీకరించుకోవడానికి అవసరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అవరోధం కల్పించింది.
- స్వదేశీ సంస్థానాల ప్రతినిధులు నామినేషన్ పద్ధతి ద్వారా సభ్యత్వం పొందడం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం.
- రాజ్యాంగ పద్ధతిలో ఒక వర్గం (హిందువులు) ఆధిపత్యం ఉండేదని పాశ్చాత్య రచయితల అభిప్రాయం.

విద్యుత్ నిరోధాన్ని ఏ అంశాలు ప్రభావితం చేస్తాయి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భౌతిక శాస్త్రం

విద్యుత్

విద్యుత్ అనేది ఆవేశాల వల్ల జనించే శక్తి స్వరూపం. దీని గురించి మొదటిసారిగా క్రీ.పూ. 600 ఏళ్ల కిందట 'ఏథెన్స్' (గ్రీస్ రాజధాని) పట్టణంలో ఏడుగురు మేధావులు పరిశోధన చేశారు. పరిశోధనల్లో భాగంగా వీరు 'అంబర్' అనే ఒక రాయిని జంతు చర్మంతో కొంతసేపు రాపిడి చేసినప్పుడు (రుద్దడం) వాటి ఉపరితలాలపై వ్యతిరేక ఆవేశాలు ఏర్పడతాయని, అవి పరస్పరం ఆకర్షించుకుంటాయని తెలుసుకున్నారు.

విద్యుత్ గురించి తొలిసారిగా 16వ శతాబ్దంలో విలియం గిల్‌బర్ట్ శాస్త్రీయ పరిశోధన చేశాడు. ఆ తర్వాత అనేక మంది శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు.

విద్యుత్ ఆవేశం: విద్యుత్ ఆవేశాన్ని Q అనే అక్షరంతో సూచిస్తారు. దీన్ని 'కూలుంబ్' ప్రమాణాల్లో కొలుస్తారు.

$Q = ne$

n = ఎలక్ట్రాన్ల సంఖ్య

e = ఎలక్ట్రాన్ ఆవేశం


$= -1.602 \times 10^{-19}$ కూలుంబ్స్

- ధనావేశాలు, రుణావేశాలు సమానంగా ఉన్న ఏ వస్తువునైనా విద్యుత్ దృష్ట్యా 'తటస్థ ఆవేశ పదార్థం' అంటారు. ఇలాంటి పదార్థాలను తాకినప్పుడు ఎలాంటి 'షాక్' కలుగదు.
- బెంజిమన్ ఫ్రాంక్లిన్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా విద్యుత్ ఆవేశాలను ధనావేశాలు, రుణావేశాలుగా విభజించారు. వీటిలో సజాతి ఆవేశాలు వికర్షించుకుంటాయి, విజాతి ఆవేశాలు ఆకర్షించుకుంటాయి.

అనువర్తనాలు:

- ఒక సబ్బు బుడగ ఉపరితలంపై సజాతి ఆవేశాలను ఇచ్చినప్పుడు అవి పరస్పరం వికర్షించుకొని, ఒకదాని నుంచి మరొకటి దూరం వెళ్లడం వల్ల ఆ బుడగ పరిమాణం పెరుగుతుంది.
- ఒక వస్తువు ఉపరితలంపై కొంత ఆవేశాన్ని ఇచ్చినప్పుడు అది ఆ వస్తువు మూలలు లేదా శీర్ష భాగాల వద్ద కేంద్రీకృతమవుతుంది. ఈ ధర్మం ఆధారంగా బెంజిమన్ ఫ్రాంక్లిన్ పిడుగు బారి నుంచి ఇళ్లు, కట్టడాలను రక్షించడానికి కావాల్సిన 'లైటినింగ్ కండక్టర్స్' కనుగొన్నాడు.
- ఒక బోలు వస్తువు లోపల ఇచ్చిన ఆవేశం ఆ వస్తువు ఉపరితలం పైకిచేరి స్థిరత్వం పొందుతుంది. కాబట్టి పిడుగు పడే సమయంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి తనను తాను రక్షించుకోవడానికి ఆ కారు లోపలే ఉండాలి. కారు అనేది లోపల ఖాళీగా ఉన్న ఒక బోలు వస్తువు లాంటిది. దానిపై పతనమైన ఆవేశం ఆ కారు ఉపరితలంపై మాత్రమే స్థిరత్వం పొందుతుంది. కారు లోపలికి చొచ్చుకువెళ్లదు.

గమనిక: భూమిలో అనంత సంఖ్యలో ధన, రుణ ఆవేశాలు ఉంటాయి. కాబట్టి భూమి ఎన్ని ఆవేశాలనైనా ఇవ్వగలుగుతుంది లేదా తీసుకోగలుగుతుంది. అందువల్ల విద్యుత్ దృష్ట్యా భూమిని 'ఎలక్ట్రికల్ సింక్' అంటారు.



విద్యుత్‌లో రకాలు

సాధారణంగా విద్యుత్‌ను రెండు రకాలుగా విభజించవచ్చు.

1. **స్థిర (స్థావర) విద్యుత్:** ఒక వస్తువు ఉపరితలంపై స్థిరంగా ఉన్న ఆవేశాల వల్ల కలిగే విద్యుత్‌ను 'స్థిర లేదా స్థావర విద్యుత్' అంటారు. ఇలాంటి విద్యుత్‌ను జిరాక్స్ చేసే సాధనాల్లో ఉపయోగిస్తారు.
2. **ప్రవాహ విద్యుత్:** ఒక తీగ ద్వారా ప్రవహిస్తున్న ఆవేశాల ప్రవాహ రేటును 'ప్రవాహ విద్యుత్' అంటారు.

ప్రవాహ విద్యుత్ [I] =
ఆవేశాల సంఖ్య [Q] పట్టిన కాలం [T]
ప్రమాణం: ఆంపియర్.

ప్రవాహ విద్యుత్‌ను తిరిగి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

ఎ) **ఏకాంతర విద్యుత్ (ఆల్టర్‌నేట్ కరెంట్):** ఒక తీగ ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు.. ఆ ప్రవాహ దిశ ధనాత్మకం నుంచి రుణాత్మకం, రుణాత్మకం నుంచి ధనాత్మకానికి ఏకాంతరంగా మారుతూ ఉంటే దాన్ని 'ఏకాంతర విద్యుత్' అంటారు. ఇలాంటి విద్యుత్‌ను గృహావసరాలకు, వ్యవసాయ, పరిశ్రమల రంగాల్లో ఉపయోగిస్తారు.

బి) **ఏకముఖ విద్యుత్ (డైరెక్ట్ కరెంట్):** ఒక తీగ ద్వారా ప్రవహిస్తున్న విద్యుత్ ప్రవాహం ఎల్లప్పుడూ ఒకే దిశలో ఉంటే దాన్ని 'ఏకముఖ విద్యుత్' అంటారు. ఇలాంటి విద్యుత్‌ను మనం ఘటాల నుంచి పొందుతున్నాం.

ఏకాంతర విద్యుత్‌ను ఏకముఖ విద్యుత్‌గా మార్చడాన్ని ధిక్కారం అంటారు. దీని కోసం ఉపయోగించే పరికరాన్ని 'ధిక్కారి' అంటారు.

ఉదా: మొబైల్ ఫోన్ చార్జర్.

పదార్థాలు - రకాలు

ఆవేశాలను (విద్యుత్‌ను) తమ ద్వారా ప్రసారం చేసే ధర్మం ఆధారంగా మనకు లభిస్తున్న పదార్థాలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **విద్యుత్ వాహకాలు:** ఈ పదార్థంలో స్వేచ్ఛగా చలించగలిగే ఎలక్ట్రాన్లు ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. అందువల్ల ఇవి తమ ద్వారా విద్యుత్ ప్రవాహానికి అనుమతి ఇస్తాయి. మనకు లభిస్తున్న పదార్థాలన్నింటిలో.. ముఖ్యంగా లోహాలతో పోల్చినప్పుడు అత్యుత్తమ విద్యుత్ వాహక పదార్థం 'వెండి' (అత్యుత్తమ ఉష్ణ వాహక పదార్థం కూడా ఇదే). ఆ తర్వాత రాగి, అల్యూమినియం, ఇనుము, ఉప్పు మొదలైనవి ఉంటాయి.

- ద్రవ పదార్థాల్లో పాదరసం, సాధారణ నీరు మంచి విద్యుత్ వాహకాలుగా పని చేస్తాయి. సాధారణ నీరు విద్యుత్ విశ్లేషణం చెంది H^+, OH^- అయానులుగా మారడం వల్ల అది విద్యుత్ వాహకంగా పనిచేస్తుంది. ఈ నీటికి కొంత పరిమాణంలో ఉప్పు కలిపితే అది మరింత ఉత్తమమైన విద్యుత్ వాహక పదార్థంగా మారుతుంది.
- మంచు, మానవ శరీరం కూడా విద్యుత్ వాహకాలుగా పనిచేస్తాయి.

2. **విద్యుత్ బంధకాలు:** ఈ పదార్థాల్లో స్వేచ్ఛగా చలించే ఎలక్ట్రాన్ల సంఖ్య దాదాపు శూన్యం. కాబట్టి ఈ పదార్థాల ద్వారా విద్యుత్ ప్రవాహం జరగదు.

ఉదా: మనకు లభిస్తున్న పదార్థాల్లో అత్యుత్తమ విద్యుత్ బంధకం వజ్రం (అత్యుత్తమ ఉష్ణ బంధకం కూడా ఇదే). ఆ తర్వాత

- PVC (పాలీ వినైల్ క్లోరైడ్), ప్లాస్టిక్, రబ్బరు, పొడిగా ఉన్న చెక్కదిమ్మ, శుద్ధమైన నీరు, సాధారణ పీడనం వద్ద మన చుట్టూ ఉన్న గాలి విద్యుత్ బంధకాలుగా పని చేస్తాయి.
- స్వచ్ఛమైన నీటిలో ఉండే H_2O అణువులు విద్యుత్ విశ్లేషణం చెందవు. కాబట్టి ఈ నీటి విద్యుత్ నిరోధం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల స్వచ్ఛమైన నీటికి బంధక ధర్మం ఉంటుంది.

3. **అర్ధ వాహకాలు:** ఈ పదార్థాల్లో స్వేచ్ఛగా చలించే ఎలక్ట్రాన్ల సంఖ్య తక్కువగా ఉంటుంది. అందువల్ల అర్ధ వాహకాల విద్యుత్ వాహకత్వం విద్యుత్ వాహకాల కంటే తక్కువగా, బంధకాల కంటే ఎక్కువగా ఉంటుంది. అంటే ఈ విద్యుత్ వాహకాల వాహకత్వం వాహకాలకు, బంధకాలకు మధ్యస్థంగా ఉంటుంది.

ఉదా: మనకు లభిస్తున్న పదార్థాలన్నింటిలో సిలికాన్ అత్యుత్తమ అర్ధ వాహక పదార్థం. జెర్మేనియం, సెలీనియం కూడా అర్ధవాహకాలుగా పనిచేస్తాయి.

- **సిలికాన్:** భూమి ఉపరితలంపై సిలికాన్ (Si) అనేది ఇసుక, రాళ్లలో 'సిలికాన్ డై ఆక్సైడ్' (SiO_2) రూపంలో ఎక్కువగా లభిస్తుంది.
- కంప్యూటర్లలో ఉపయోగించే ఇంటిగ్రేటెడ్ చిప్ (IC)లను 'సిలికాన్'తో తయారు చేస్తారు. అందువల్ల దీన్ని 'సిలికాన్ చిప్' అని కూడా అంటారు. ఈ చిప్‌ను అమెరికాలోని 'బెల్ లేబొరేటరీ' అభివృద్ధి చేసింది.
- మనదేశంలో కంప్యూటర్లను ఎక్కువగా ఉపయోగిస్తున్న బెంగళూరు నగరాన్ని 'సిలికాన్ సిటీ' (లేదా) 'సిలికాన్ వ్యాలీ'గా పేర్కొంటారు.
- సౌరశక్తిని విద్యుత్ శక్తిగా మార్చే 'ఫొటో వోల్టాయిక్' (సౌర ఘటాలను) సిలికాన్‌తో తయారు చేస్తారు. ఈ పద్ధతిని 1954లో అమెరికాకు చెందిన బెక్వెరల్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారు.
- అంతరిక్షంలో పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకల్లో సిలికాన్ పలకలను అమర్చుతారు. ఈ పలకలు వాటికి కావాల్సిన విద్యుత్‌ను ఉత్పత్తి చేసి అందిస్తాయి.

గమనిక: ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్‌కు 75 కి.మీ. దూరంలో ఉన్న సాంబార్ సరస్సు వద్ద ప్రపంచంలో అతిపెద్ద 'సోలార్ ప్లాంట్'ను నిర్మిస్తున్నారు. దీని విద్యుత్ సామర్థ్యం 4000 MW.

- 1000 MW సామర్థ్యం ఉన్న సౌరవిద్యుత్ ప్లాంట్‌ను తెలంగాణలోనూ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎలక్ట్రిక్ పొటెన్షియల్

విద్యుత్ వలయంలో ఏదైనా ఒక బిందువు వద్ద ఉన్న ఆవేశాల సంఖ్య, వాటి స్థితి గురించి ఎలక్ట్రిక్ పొటెన్షియల్ తెలియజేస్తుంది. ఆవేశాల సంఖ్య తక్కువగా ఉంటే ఎలక్ట్రిక్ పొటెన్షియల్ తక్కువగా ఉంటుంది.

ప్రమాణం: ఎలక్ట్రిక్ పొటెన్షియల్‌లోని తేడాను కొలవడానికి ఉపయోగించే ప్రమాణం - వోల్ట్ (V).

- ధనావేశాలు ఎల్లప్పుడూ అధిక పొటెన్షియల్ నుంచి అల్ప పొటెన్షియల్ వైపు ప్రవహిస్తాయి. ఇవి ప్రవహించే దిశను విద్యుత్ ప్రవాహ దిశగా తీసుకుంటారు.
- రుణావేశితాలైన ఎలక్ట్రానులు అల్ప పొటెన్షియల్ నుంచి అధిక పొటెన్షియల్ వైపు ప్రవహిస్తాయి.
- మన దేశంలో గృహావసరాల కోసం వినియోగిస్తున్న విద్యుత్‌ను 220V వద్ద సరఫరా చేస్తున్నారు. ఈ వోల్టేజీ వద్ద గృహంలోని పరికరాలన్నీ (ట్యూబ్‌లైట్, ఫ్యాన్, రిఫ్రిజిరేటర్ మొదలైనవి) పని చేస్తున్నాయి. 220V కంటే ఎక్కువ వోల్టేజ్ ఉంటే దాన్ని 'హై వోల్టేజ్'గా, తక్కువగా ఉంటే 'లో వోల్టేజ్'గా పేర్కొంటారు.
- ఈ వోల్టేజ్‌ను ఎల్లప్పుడూ ఒక స్థిర బిందువు వద్ద స్థిరీకరించడానికి 'స్టెబిలైజర్' అనే సాధనాన్ని ఉపయోగిస్తారు.
- ఈ వోల్టేజ్ వద్ద ఏకాంతర విద్యుత్ పౌనఃపున్యం 50 Hz గా ఉంటుంది.
- భూమిలో అనంతమైన సంఖ్యలో ధన, రుణావేశాలు ఉంటాయి. కాబట్టి భూమికి అదనంగా ఆవేశాన్ని అందించినా లేదా భూమి నుంచి ఆవేశాలను సంగ్రహించినా దాని పొటెన్షియల్‌లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ కారణం వల్ల భూమి నికర పొటెన్షియల్ లేదా ఫలిత పొటెన్షియల్‌ను '0'గా పరిగణిస్తారు.

$V = 0$

ఓమ్ నియమం

స్థిర ఉష్ణోగ్రత వద్ద ఒక లోహపు తీగ ద్వారా ప్రవహిస్తున్న విద్యుత్ ప్రవాహం దానికి అనువర్తింపజేసిన విద్యుత్ పొటెన్షియల్‌కు అనులోమానుపాతంలో ఉంటుంది.

$$i \propto V$$

$$\Rightarrow i = \frac{1}{R} V$$

$$\Rightarrow V = iR \text{ లేదా } R = \frac{V}{i}$$

పై సమీకరణంలో Rను విద్యుత్ నిరోధం అంటారు.

విద్యుత్ నిరోధం: ఒక తీగ ద్వారా విద్యుత్ ప్రవాహాన్ని వ్యతిరేకించే పదార్థ స్వభావాన్నే 'విద్యుత్ నిరోధం' అంటారు.

ప్రమాణం: ఓమ్ Ω

నిరోధాల సంధానం

శ్రేణి సంధానం (Series Combination): ఒక తీగ రెండో చివరను దాని తర్వాతి తీగ మొదటి చివరకు కలిపే పద్ధతిని 'శ్రేణి సంధానం' అంటారు. ఈ సంధానంలో ఫలిత విద్యుత్ నిరోధం

$$R_s = R_1 + R_2 + \ldots$$

ఈ సంధానంలో ఫలిత విద్యుత్ నిరోధం పెరగటం వల్ల ఆ తీగల్లో ప్రవహిస్తున్న విద్యుత్ ప్రవాహం తగ్గుతుంది.

సమాంతర సంధానం: ఇచ్చిన తీగల మొదటి చివరలను ఒక బిందువుకు, రెండో చివరలను మరో బిందువుకు కలిపే పద్ధతిని 'సమాంతర సంధానం' అంటారు. ఈ సంధానంలో ఫలిత విద్యుత్ నిరోధం

$$\frac{1}{R_s} = \frac{1}{R_1} + \frac{1}{R_2} + \frac{1}{R_3} \ldots$$

ఈ సంధానంలో ఫలిత విద్యుత్ నిరోధం తగ్గటం వల్ల ఆ తీగల ద్వారా ప్రవహించే విద్యుత్ ప్రవాహం పెరుగుతుంది.

విద్యుత్ నిరోధాన్ని ప్రభావితం చేసే అంశాలు:

1. పదార్థాల స్వభావం
2. తీగ మితులు
3. ఉష్ణోగ్రత ప్రభావం
4. పదార్థంలో కలిపిన మలిన పదార్థం స్వభావం

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

బొకారో ఇనుము-ఉక్కు కర్మాగారం ఏ రాష్ట్రంలో ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం ఖనిజాధార పరిశ్రమలు

ఖనిజాలు, లోహాలను ముడి సరుకులుగా ఉపయోగించే పరిశ్రమలను ఖనిజాధార పరిశ్రమలు అంటారు.

ఇనుము-ఉక్కు పరిశ్రమ, అల్యూమినియం, సిమెంట్, ఎరువులు, భారీ ఇంజనీరింగ్ పరిశ్రమలు, రాగి పరిశ్రమ మొదలైనవి కొన్ని ముఖ్యమైన ఖనిజాధార పరిశ్రమలు.

ఇనుము - ఉక్కు పరిశ్రమ

ఏ దేశ ఆర్థికాభివృద్ధికైనా ఇనుము-ఉక్కు పరిశ్రమల అభివృద్ధి అతి ముఖ్యమైంది. అందువల్లే ఈ పరిశ్రమను 'మూల పరిశ్రమ' అంటారు. ఖనిజాధార పరిశ్రమల్లో ఇనుము-ఉక్కు పరిశ్రమ అత్యంత ప్రధాన, అతి పెద్ద పరిశ్రమ.

- భారతదేశంలో మొదటి ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని 1830లో తమిళనాడులోని పోర్టోనోవో వద్ద స్థాపించారు. 1866లో దీన్ని మూసేశారు.
- 1870లో పశ్చిమ బెంగాల్‌లోని కుల్టీ వద్ద 'బెంగాల్ ఐరన్ వర్క్స్' ఇనుము-ఉక్కు పరిశ్రమను నెలకొల్పారు. ఇది దేశంలో మొట్టమొదటి ఇనుము-ఉక్కు పరిశ్రమ. దీన్ని బర్న్‌పూర్‌లోని ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ(ఐఐఎస్‌సీవో)లో విలీనం చేశారు.

టాటా ఇనుము - ఉక్కు కర్మాగారం(టిస్కో): ఇది దేశంలోని మొదటి భారీ ఆధునిక ఇనుము-ఉక్కు కర్మాగారం. దీన్ని జార్ఖండ్‌లోని సక్చీ వద్ద 1907లో జంషెడ్‌జీ టాటా స్థాపించారు. ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన మొదటి కర్మాగారం ఇది. ప్రస్తుతం పనిచేస్తున్న అతి పురాతన ఇనుము-ఉక్కు కర్మాగారం. జంషెడ్‌జీ టాటా గౌరవార్థం సక్చీని 'జంషెడ్‌పూర్'గా వ్యవహరిస్తున్నారు.

- 1919లో పశ్చిమ బెంగాల్‌లోని 'బర్న్‌పూర్' వద్ద 'ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ'(ఐఐఎస్‌సీవో)ని స్థాపించారు. దీన్ని 1972లో కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
- 1923లో కర్ణాటకలో షిమోగా జిల్లాలోని భద్రావతి వద్ద 'మైసూర్ స్టీల్ వర్క్స్' (మిస్కో) అనే ఇనుము-ఉక్కు కర్మాగారాన్నినిర్మించారు. అనంతరం విశ్వేశ్వరయ్య గౌరవార్థం ఈ పరిశ్రమకు 'విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్'(వీఐఎస్ఎల్) గా పేరు మార్చారు.

భిలాయ్ ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలోని 'భిలాయ్' వద్ద రష్యా సహకారంతో నిర్మించారు. కోర్బా ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను ఇది వినియోగించుకుంటోంది. దీని ఉత్పత్తి 1959లో ప్రారంభమైంది.

రూర్కెలా ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని ఒడిశాలో సుందర్‌గఢ్ జిల్లాలోని 'రూర్కెలా' వద్ద బ్రాహ్మణీ నది ఒడ్డున నిర్మించారు. దీనికి 'పశ్చిమ జర్మనీ' సహకారం చేసింది. ఇది 1959 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

దుర్గాపూర్ ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని పశ్చిమ బెంగాల్‌లోని బురద్వాన్ జిల్లాలో దామోదర్ నదీ ప్రాంతంలో దుర్గాపూర్ వద్ద నిర్మించారు. దీనికి బ్రిటన్ సహకారం చేసింది. ఇది 1962 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్ ఇనుము-ఉక్కు కర్మాగారాలు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేశారు.

బొకారో ఇనుము - ఉక్కు కర్మాగారం: ఇది మూడో పంచవర్ష ప్రణాళిక కాలం (1964)లో ఏర్పాటైంది. దీన్ని జార్ఖండ్‌లో హజారీబాగ్ జిల్లాలోని బొకారో, దామోదర్ నదుల సంగమ ప్రాంత సమీపంలో నిర్మించారు. అత్యధికంగా స్వదేశీ పరిజ్ఞానంతో, కొంత రష్యా సహకారంతో స్థాపించిన నాలుగో ప్రభుత్వరంగ ఇనుము-ఉక్కు కర్మాగారం.

- ప్రస్తుతం ఇది భారతదేశంలో అతిపెద్ద ఇనుము-ఉక్కు కర్మాగారం. 1972 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

విశాఖ స్టీల్ ప్లాంట్: ఇది ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉంది. దీన్ని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్.. రష్యా సహాయంతో నిర్మించింది. 1992 ఆగస్టు 1న నాటి ప్రధాని పీవీ నరసింహారావు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేశారు. ఈ కర్మాగారం భారతదేశంలో అత్యాధునిక, తీరప్రాంతంలో ఉన్న ఏకైక ఇనుము-ఉక్కు కర్మాగారం.

- 1982లో తమిళనాడులోని 'సేలం' వద్ద ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. ఈ కర్మాగారం నాణేల తయారీకి, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తికి ప్రసిద్ధి. మరో కర్మాగారాన్ని కర్ణాటకలోని హోస్పేట్ సమీపంలోని విజయనగర్ వద్ద నిర్మించారు.

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్



(సెయిల్): దీన్ని 1973లో న్యూఢిల్లీలో స్థాపించారు. ఇది పూర్తిగా ప్రభుత్వాధీన సంస్థ. దీనికి మహారత్న హోదా ఉంది. భిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా, బొకారో, బర్న్‌పూర్, సమీకృత ఉక్కు కర్మాగారాలు మొదలైన వాటి నిర్వహణ బాధ్యత దీనిదే.

- భారతదేశంలో ఏర్పాటైన తొలి స్పాంజ్ ఐరన్ కర్మాగారం తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని పాల్వంచ (కొత్తగూడెం)లో ఉంది.

అల్యూమినియం పరిశ్రమ

భారతదేశంలో ఇనుము తర్వాత ఇది రెండో పెద్ద ఖనిజరంగ పరిశ్రమ. దీన్ని మన దేశంలో వార్‌బోర్న్ పరిశ్రమ అంటారు. 'అల్యూమినియం'ను విశ్వలోహం అంటారు. భారతదేశంలో 1937లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అసన్‌సోల్ సమీపంలో 'జాయక్‌నగర్' ప్రాంతంలో 'అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'ను స్థాపించారు.

- భారతదేశంలో 8 అల్యూమినియం శుద్ధి కర్మాగారాలు ఉన్నాయి. అవి..

1. ఇండాల్కో (ఇండియన్ అల్యూమినియం కంపెనీ): దీనికి అలువాపురం(కేరళ), హీరాకుడ్ (ఒడిశా), బెల్గాం (కర్ణాటక)లో యూనిట్లు ఉన్నాయి.
2. హిందాల్కో(హిందుస్తాన్ అల్యూమినియం కంపెనీ): ఇది రేణుకూట్ (ఉత్తరప్రదేశ్)లో ఉంది.
3. బాల్కో(భారత్ అల్యూమినియం కంపెనీ): దీనికి కోర్బా(ఛత్తీస్‌గఢ్), రత్నగిరి(మహారాష్ట్ర)లో యూనిట్లు ఉన్నాయి. బాల్కో మొదటిసారి లక్ష టన్నుల కెపాసిటీ సాధించింది.
4. నాల్కో(నేషనల్ అల్యూమినియం కంపెనీ): ఇది దామన్‌జోడి(ఒడిశా)లో ఉంది.
5. మాల్కో(మద్రాస్ అల్యూమినియం కంపెనీ): ఇది మెట్టూరు (తమిళనాడు)లో ఉంది.

సిమెంటు పరిశ్రమ

భారతదేశంలో మొదటి సిమెంటు పరిశ్రమ 1904లో చెన్నైలో ప్రారంభమైంది. ప్రస్తుతం దీన్ని మూసివేశారు. పూర్తి స్థాయిలో 1912లో గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేశారు.

- సిమెంటు ఉత్పత్తిలో భారత్‌ది రెండో స్థానం కాగా మొదటి స్థానంలో చైనా ఉంది.
- భారతదేశంలో తమిళనాడు, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సిమెంటు ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. సిమెంటు పరిశ్రమకు ప్రధాన ముడి సరుకు సున్నపురాయి.
- ప్రస్తుతం మనదేశంలో 128 భారీ, 322 చిన్న సిమెంటు కర్మాగారాలున్నాయి.
- ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ సిమెంటు కర్మాగారాలు ఉన్నాయి. ప్రైవేట్ కంపెనీలు దాదాపు 65 శాతం సిమెంటును ఉత్పత్తి చేస్తున్నాయి. అసోసియేట్ సిమెంటు కంపెనీ(ఏసీసీ) లిమిటెడ్ అతి పెద్ద సిమెంట్ తయారీ సంస్థ కాగా దాల్మియా గ్రూపు రెండోది.

ఎరువుల పరిశ్రమ

దేశంలో మొదటి ఎరువుల పరిశ్రమను 1906 లో తమిళనాడులోని రాణిపేటలో ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ రంగంలో మొదట 1951లో బిహార్‌లోని సింద్రీ (ప్రస్తుతం ఈ ప్రాంతం జార్ఖండ్‌లో ఉంది) వద్ద ఆధునిక ఎరువుల కర్మాగారాన్ని నిర్మించారు. చైనా, అమెరికా తర్వాత ప్రపంచంలో ఎరువుల ఉత్పత్తిలో భారతదేశం మూడో స్థానంలో ఉంది.

- 1961లో ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, 1974లో నేషనల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్‌ను స్థాపించడం ద్వారా ఎరువుల పరిశ్రమ అభివృద్ధి చెందింది.

గాజు పరిశ్రమ

భారతదేశంలో మొదటి గాజు పరిశ్రమను 1941 లో ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో స్థాపించారు. ఈ పరిశ్రమకు కావాల్సిన ముడి పదార్థాలు.. ఇసుక, సున్నపురాయి, సిలికా, సోడా యాష్. ఫిరోజాబాద్ పరిశ్రమ గాజులు, పూసలకు ప్రసిద్ధి.

ఇంజనీరింగ్ పరిశ్రమలు

మనదేశంలో 1958లో హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌ను రాంచీ(జార్ఖండ్)లో స్థాపించారు. దీని స్థాపనతో ఇంజనీరింగ్ పరిశ్రమ అభివృద్ధి ప్రారంభమైంది. ప్రస్తుతం దేశ అవసరాలకు కావాల్సిన అన్ని రకాల సామగ్రిని మన దేశం తయారు చేస్తోంది.

దేశంలోని ప్రధాన ఇంజనీరింగ్ పరిశ్రమలు

హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్: జార్ఖండ్‌లోని రాంచీలో ఉంది. ఇది ఉక్కు పరిశ్రమ. యంత్ర సామగ్రి, హెవీ క్రషింగ్, గ్రైండింగ్ యంత్రాలు, క్రేన్లు, రోలింగ్ యంత్రాలు, నూనె బావుల డ్రిల్లింగ్ రిగ్స్‌ను ఉత్పత్తి చేస్తోంది.

మైనింగ్ అండ్ అలైడ్ మిషనరీ కార్పొరేషన్ లిమిటెడ్: ఇది దుర్గాపూర్ (పశ్చిమ బెంగాల్) ఉంది. రకరకాల ఖనిజ యంత్రాలను తయారు చేస్తోంది.

భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్: ఇది విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)లో ఉంది. పెట్రో రసాయనాలు, ఎరువుల యంత్రాలను తయారు చేస్తోంది. దీన్ని 2009లో బీహెచ్ఈఎల్‌లో విలీనం చేశారు.

తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్: ఇది కర్ణాటకలో ఉంది. గేట్స్, ట్రాన్స్‌మిషన్ టవర్స్, పెన్‌స్టాక్ పైప్స్ తయారు చేస్తుంది.

ఇతర పరిశ్రమలు

1. **హిందుస్తాన్ మెషీన్ టూల్స్(హెచ్ఎంటీ):** దీన్ని 1953లో కర్ణాటకలోని బెంగళూరులో స్థాపించారు. దీనికి అయిదు యూనిట్లు ఉన్నాయి. శ్రీనగర్ (జమ్మూకశ్మీర్), బెంగళూరు (కర్ణాటక), హైదరాబాద్, కాలమస్సేరి (కేరళ) యూనిట్లలో హెచ్ఎంటీవాచ్‌లు, పింజోర్ (హర్యానా) యూనిట్‌లో ట్రాక్టర్లను తయారు చేస్తారు.
2. **భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్):** దీన్ని 1956లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో స్థాపించారు. దీనికి జగదీశ్‌పూర్, హరిద్వారా (ఉత్తరప్రదేశ్) తిరుచిరాపల్లి (తమిళనాడు), హైదరాబాద్‌లో యూనిట్లు ఉన్నాయి.
3. **ప్రాగా టూల్స్:** ఇది సికింద్రాబాద్ లో ఉంది. ఇక్కడ రక్షణ సామగ్రిని తయారు చేస్తారు.
4. **హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్):** దీనికి హైదరాబాద్, రూప్ నారాయణపూర్ (పశ్చిమబెంగాల్)లో యూనిట్లు ఉన్నాయి.
5. **హిందుస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీ:** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
6. **హెవీ వెహికల్ ఫ్యాక్టరీ:** ఇది ఆవడి (చెన్నై) లో ఉంది.
7. **హిందుస్తాన్ హౌజింగ్ ఫ్యాక్టరీ లిమిటెడ్:** ఇది న్యూఢిల్లీ ఉంది.
8. **భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్):** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
9. **హిందుస్తాన్ యాంటీబయాటిక్స్ లిమిటెడ్:** ఇది పింప్రీ(మహారాష్ట్ర)లో ఉంది.
10. **హిందుస్తాన్ ఫొటో ఫిల్మ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్:** దీన్ని 1960లో భారత ప్రభుత్వం తమిళనాడులోని ఊటీ వద్ద ఏర్పాటు చేసింది.
11. **ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (ఐడీపీఎల్):** దీని కేంద్ర కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మనదేశంలో మొదటి స్పాంజ్ ఐరన్ ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు? (కానిస్టేబుల్ -2012)
   1) కొత్తగూడెం 2) విశాఖపట్నం
   3) భోపాల్ 4) కోల్‌కతా
2. దేశంలోని అతిపెద్ద ఉక్కు కర్మాగారం ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) భిలాయ్ 2) బొకారో
   3) రూర్కెలా 4) దుర్గాపూర్
3. భారత్ హెవీ ఎలక్ట్రికల్ కర్మాగారం ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) విశాఖపట్నం 2) భువనేశ్వర్
   3) హైదరాబాద్ 4) ముంబై
4. దేశంలోని మొదటి ఉక్కు కర్మాగారమైన టాటా ఇనుము-ఉక్కు కంపెనీ ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) దుర్గాపూర్ 2) నాగపూర్
   3) బీజాపూర్ 4) జంషెడ్‌పూర్
5. బొకారో ఉక్కు కర్మాగారాన్ని ఏ దేశ సహాయంతో నిర్మించారు? (జైల్ వార్డెన్ - 2012)
   1) అమెరికా సంయుక్త రాష్ట్రాలు
   2) ఇంగ్లండ్ 3) జర్మనీ
   4) సోవియెట్ యూనియన్
6. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి. (జైల్ వార్డెన్ - 2012)
   1) విశాఖపట్నం - నౌకా నిర్మాణం
   2) టిటాఘర్ - రైల్వే సామగ్రి
   3) భద్రావతి - ఇనుము, ఉక్కు
   4) పింజోర్ - యంత్ర పరికరాలు

సమాధానాలు:

1) 1; 2) 2; 3) 3; 4) 4; 5) 4; 6) 2.

The mountain tops were hidden..

Model Questions

Directions (Q. No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Internet giant Google could be on the side of forces working towards thwarting net neutrality in India. The company has allegedly been trying to prevent the Internet and Mobile Association of India, a body that represents internet firms in India, from opposing Zero Rating, the practice of letting users access select applications/websites free of data charges by striking deals with telecom operators. It's worth pointing out that so far, Google has chosen to remain silent on the matter of net neutrality in India.

As pointed out by MediaNama, Google has not participated in the consultation process for net neutrality and has not submitted any comments to the TRAI. It opted out of **deposing** before the Parliamentary Standing Committee on IT looking into Net Neutrality, despite receiving a specific invite from the committee. In its report, the DoT had opposed Zero Rating plans from content providers like Facebook and had said that "content and application providers cannot be permitted to act as gatekeepers and use network operations to extract value in violation of core principles of Net Neutrality, even if it is for an **ostensible** public purpose." It had said that partnerships between telecom operators and content providers that enable gatekeeping should be actively discouraged, opposing Facebook's Internet.org.

It's worth mentioning that Google had put on hold plans to provide free data to end users in India by zero rating certain apps in May, following public backlash against Facebook's and Airtel's Zero rated offerings.

The internet giant, which was in early discussions with telecom operators and applications developers to launch a zero rating platform, had decided to take a wait and watch approach, as per sources close to the company.

BANK EXAMS
GENERAL ENGLISH

1. The central theme of the passage is about
   1) Net neutrality in India
   2) Rating plans from content providers
   3) Partnerships between telecom operators and content providers
   4) To launch a zero rating platform
   5) Proposing Zero Rating plans
2. DoT's report states that
   1) content and application providers can be permitted
   2) content and application providers cannot be opposed
   3) use network operations to enable gatekeeping
   4) content and application providers cannot be permitted
   5) gatekeeping should be actively encouraged
3. Google had put on hold plans to provide free data to end users because
   1) Public's hostile response against Facebook's and Airtel's Zero rated offerings
   2) public appreciation against Facebook's and Airtel's Zero rated offerings
   3) rise of Facebook's and Airtel's Zero rated offerings
   4) had decided to take a wait and watch approach
   5) has chosen to remain silent
4. The synonym of ostensible is
   1) professed 2) real
   3) genuine 4) valid
   5) authentic
5. The antonym of depose is
   1) overthrow 2) topple
   3) pressure 4) install
   5) conquer

Directions (Q. No. 6-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.



6. His resignation has created a ___ which cannot be easily filled.
   1) gap 2) space 3) room
   4) vacuum 5) ridge
7. The bank provides valuable information on recent ______.
   1) trends 2) method
   3) policy 4) bond 5) loan
8. Politics is _____ often concerned only with the personal _______ of politicians.
   1) to – attitude
   2) very – characters
   3) much – appearance
   4) many – approach
   5) too – vanities
9. New techniques ____ introduced with _____ degrees of success.
   1) are – many 2) is – shaded
   3) were – varying
   4) was – different
   5) have – various
10. The mountain tops were hidden _______ a veil of mist.
    1) Beside 2) under 3) because
    4) beneath 5) below
11. A ______ business venture ____ him thousands of dollars.
    1) prosperous – puts
    2) lucrative – loss
    3) good – bet
    4) disastrous – lost
    5) bad – debt
12. He's a ______ genius but he has ______ verbalizing his ideas.
    1) good – differences
    2) matured – symptoms
    3) true – similarities
    4) real – difficulty
    5) great – trouble
13. The English ____ of the novel is ____ for publication next year.
    1) part – suppose
    2) model – to be
    3) module – probably
    4) section – definite
    5) version – due
14. The conference spent days discussing the ____ question ____border controls.
    1) same – about 2) different – off
    3) vexed – of 4) vested – along
    5) similar – also
15. This evidence supports the ____ that there is too ____ violence on television.
    1) ideas – many
    2) principle – most
    3) rule – often 4) view – much
    5) statement – regular

Directions: (Q.No. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

16. The debate veered side from the main topic of discussion.
    1) Veer aside 2) Veered away
    3) Veered to 4) Veered along
    5) No correction required
17. Be there by six at the many latest.
    1) much 2) more 3) most
    4) very 5) No correction required
18. Thailand is at its very bright during the New Year celebrations.
    1) Many good 2) much light
    3) mostly brighter
    4) most vibrant
    5) No correction required
19. For years the family was been victimized by racist neighbours.
    1) were 2) was be
    3) had been 4) have being
    5) No correction required
20. Anti-nuclear protestors regarding the Chernobyl accident as a clear vindication of their campaign.
    1) is regards 2) are regarded
    3) were regards 4) regarded
    5) No correction required

Directions (Q. No. 21-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

21. She accused (1)/ the press photographers (2)/ of violence (3)/ her privacy. (4)/ No error. (5)
22. They could see (1)/ no virtue (2)/ in discussing it (3)/ farther. (4)/ No error. (5)
23. He was feeling virtuous (1)/ because (2)/ he had finished (3)/ and they haven't. (4)/ No error. (5)
24. The advertisements intention (1)/ to increase (2)/ the company's visibility (3)/ in the market. (4)/ No error. (5)
25. It is vital (1)/ that you keeping (2)/ accurate records (3)/ when you are self employed. (4)/ No error. (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. He **gave** (1) a **vived** (2) account of **his life** (3) as **a fighter** (4) pilot.
27. **The** (1) protestors **is** (2) a small **but** (3) **vocal** (4) minority.
28. The **void** (1) **leaved** (2) by his mother's death **was** (3) never **filled**. (4)
29. She **is** (1) a doctor **with** (2) a strong **sense** (3) of **vaccination**. (4)
30. New roads **are being** (1) built to **cope up with** (2) the **increased** (3) volume **of** (4) traffic.

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) In our modern world, many of the constellations have been redefined so now every star in the sky is in exactly one constellation.
B) On a really dark night, you can see about 1000 to 1500 stars. Trying to tell which is which is hard.
C) The constellations are totally imaginary things that poets, farmers and astronomers have made up over the past 6,000 years.
D) The real purpose for the constellations is to help us tell which stars are which, nothing more.
E) The constellations help by breaking up the sky into more managable bits. They are used as mnemonics, or memory aids.
F) The constellations have changed over time.

31. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
34. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) E 5) F
35. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Answers

1) 1 2) 2 3) 1 4) 1 5) 4
6) 4 7) 1 8) 5 9) 3 10) 4
11) 4 12) 4 13) 5 14) 4 15) 4
16) 2 17) 3 18) 4 19) 3 20) 4
21) 3 22) 4 23) 4 24) 2 25) 2
26) 2 27) 2 28) 2 29) 4 30) 2
31) 1 32) 2 33) 4 34) 3 35) 3